వనిత
గత వారంలోజుల పై విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital
Published from Srikakulam ,Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem
10-8-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 191 పేజీలు: 16 వెల: 6.50

**జెన్‌జడ్‌ను తప్పుదారి పట్టించారు: ధర్మేంద్ర ప్రధాన్**

**పాక్‌లో లష్కర్ కమాండర్ అనుమానాస్పద మృతి**

5లో

# ఆదివాసీల అభ్యున్నతే లక్ష్యం

## వారి సమగ్రాభివృద్ధికి 5 అంశాలతో ప్రణాళిక

## స్వర్ణాంధ్రకోసం అంతా కలిసి పనిచేద్దాం

## పనిచేసే ప్రతి వ్యక్తి సమాజానికి మంచి ఆస్తి

## అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో సిఎం చంద్రబాబు


ఆదివారం విజయవాడలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశానికి, రాష్ట్రానికి విజన్ ఉన్నట్టే ప్రతీ పౌరుడికి ఓ విజన్ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశం, రాష్ట్రం, గ్రామం, కుటుంబం అభివృద్ధికోసం అంతా సంకల్పం తీసుకోవాలని ఆయన అన్నారు. 2047 స్వర్ణాంధ్ర కోసం తాను సంకల్పం తీసుకున్నానని ముఖ్యమంత్రి అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని అంబేద్కర్ కళా వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి సిఎం హాజరయ్యారు. గిరిజన సంప్రదాయ నృత్యం ధింసా, డప్పు, వివిధ వాయిద్యాలతో గిరిజన మహిళలు, మంత్రి సంధ్యారాణి, ఇతర ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ధింసా నృత్యం చేస్తున్న మహిళలతో ఆయన కూడా అడుగులు వేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి సిఎం నివాళిఅర్పించారు. అనంతరం ముఖ్య మంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "ప్రకృతిని ఆరా ధిస్తూ, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడు కుంటూ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు చేయగల సామర్థం ఆదివాసీలకు ఉంది. ఓ సామాన్య ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్ము ఒడిశాలో మంత్రిగా, గవర్నర్‌గా పనిచేసి నేడు రాష్ట్రపతిగా అత్యున్నత స్థానంలో ఉన్నారు. మన సంకల్పమే మనకు ఆత్మవిశ్వాసం కల్పించి అందలాలు ఎక్కిస్తుంది.

అబ్దుల్ కలాం, ఎన్టీఆర్, ప్రధాని మోడీ ఇలా ప్రతి ఒక్కరూ సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వారే. సంకల్పం ఒక్కటే మార్పు తెస్తుందని అంతా గుర్తించాలి. దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేలా అంతా సంకల్పం తీసుకోవాలి. నేను, నా దేశం, నా రాష్ట్రం, నా ఊరు నా కుటుంబం అనే భావనతో సంకల్పం చేస్తేనే అభివృద్ధి సాధించ గలం. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజానికి, దేశానికి నేను ఏమివ్వాలనే లక్ష్యంతో పనిచేద్దాం. గిరిజన రైతులు తన పంటను మెరుగ్గా పండించి దేశంకోసం కృషి చేశారు. స్వయం ఉపాధితో సంపాదిస్తున్న మహిళ దేశం కోసం పనిచేసినట్టే. ఓ విద్యార్థి, ఓ ఉద్యోగి, ఓ వ్యాపారి, ఓ కూలి ఇలా ఎవరైనా నిష్టతో అత్యుత్తమ సామర్థ్యంతో పనిచేస్తే దేశంకోసం పనిచేసి

>>2

దుశ్చర్యకు బలి..

# మృత్యువుతో పోరాడి ఓడిన మెడికో ప్రియాంక



## రాజమండ్రిలో కొందరు మద్యం మత్తులో కారుతో ఢీకొన్న ఘటన..

## హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ప్రియాంక మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు9,ప్రభాతవార్త:** అభంశుభంతెలియని ఓ యువవైద్యురాలు దుర్మార్గపు దుశ్చర్యకు బలైంది. మద్యం మత్తులో ఇరువురు యువకులు కారుతో ఢీ కొట్టి ఆమె ఉసురు తీసుకున్నారు. తీవ్ర గాయాలతో సికింద్రాబాద్ కిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రియాంక. బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించిన వైద్యులు. ఏడు రోజులు మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడిచింది. ఆ కుటుంబం, తల్లిదండ్రుల ఆశలు అర్థాంతరంగా ముగిసిపోయాయి.ఏ విధంగానూ సంబంధం లేని వైద్యురాలి పట్ల కర్కశంగా వ్యవహరించి మూడుసార్లు కారుతో ఢీకొట్టిన ఆ మత్తు దుర్మార్గులను కఠినంగా శిక్షి ంచాలని సర్వత్రా నిరసన వ్యక్తం అవుతుంది.
ఈ నెలమూడవ తేదీన రాజమండ్రిలో కారు ఢీ కొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ డాక్టర్ ప్రియాంక(28) ఆదివారం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో మృతి చెందారు. ఏడు రోజులుగా వైద్యం అందిస్తున్నా ఫలితంలేకపోయింది. ప్రమాదం జరిగిన రోజునే ప్రియాంక బ్రెయిన్‌డెడ్‌గా

>>2



# 13 నుంచి 15 దాకా ప్రతి ఇంటిపై జాతీయ జెండా

## వికసిత్ భారత్ స్ఫూర్తి ప్రతిబింబించాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు9, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆగస్టు 15 నుంచి పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇంటింటా జాతీయ జెండా, ప్రతి ఇంటా జాతీయ స్ఫూర్తి నింపాలని సిఎం పిలుపునిచ్చారు. ఆగస్టు 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని సిఎం స్పష్టం చేశారు. 'మై నేషన్‌నేషన్ ఫస్ట్' అనే భావన ప్రతి ఇంటికీ చేరాలని ఆకాంక్షించారు. 2047 లక్ష్యాల సాధనలో ప్రతి పౌరుడినీ భాగస్వామిని చేయాలన్నారు. వికసిత్ భారత్‌స్వర్ణాంధ్ర లక్ష్యాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛంధ సేవా స్ఫూర్తిని పునరుద్ధరించాలని చంద్రబాబు నొక్కి చెప్పారు.



# 'త్రివర్ణ పతాకం మన గర్వకారణం'

## 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనండి

## దేశ ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు

2లో

# నేడు కలిదిండిలో సిఎం పర్యటన

**ఏలూరు, ఆగస్టు 9, ప్రభాత వార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 10వతేదీన ఏలూరు జిల్లాలోని కలిదిండిలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఎదురు జిల్లా కలెక్టర్ సెల్వీ సీఎం పర్యటన షెడ్యూల్ విడుదల చేశారు. సిఎం చంద్రబాబు సోమవారం ఉదయం 10.30 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు కలిదిండిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. ఉదయం 11 గంటలకు కలిదిండి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని రైతులతో మాట్లాడతారు. అనంతరం 11.45 గంటలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి బయలుదేరి పాత పోస్టాఫీసు వెనుక ఏర్పాటు చేసిన ప్రజా వేదిక కార్యక్రమానికిచేరుకుంటారు. మధ్యాహ్నం 2.05 గంటల వరకు ప్రజావేదికలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.55 గంటలకు కలిదిండి వ్యవసాయ మార్కెట్ యార్డుకు చేరుకుని పార్టీ క్యాడర్ సమావేశంలోపాల్గొంటారు. సాయంత్రం 4.25 గంటలకు మార్కెట్ యార్డు నుంచి బయలుదేరి 4.35 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. సాయంత్రం 4.40 గంటలకు కలిదిండి నుంచి హెలికాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరి వెళతారు.


ఆదివారం ప్రకాశం బ్యారేజీ వద్ద పట్టిసీమ నుంచి వచ్చిన నీటిని పరిశీలిస్తున్న చంద్రబాబు

# ఎంత నీరు! ఎంత జోరు!

## ప్రకాశం బ్యారేజ్‌వద్ద నీటి ఉధృతిని పరిశీలించిన సిఎం చంద్రబాబు

## పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు 17 టిఎంసిల నీరు తరలింపు

**విజయవాడ,ఆగస్టు9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రకాశం బ్యారేజ్‌లో గోదారమ్మ నీటి పరవళ్లను ముఖ్య మంత్రి చంద్రబాబు పరిశీలించారు. పట్టి సీమ ద్వారా కృష్ణమ్మకు వస్తున్న గోదావరి నీటిని ముఖ్యమంత్రి తిలకించారు. విజయవాడలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొని తిరిగి నివాసానికి వెళుతున్న సమయంలో బ్యారేజ్‌పై కొద్దిసేపు తన వాహన కాన్వాయ్ నిలిపిన ముఖ్యమంత్రి గోదావరి నీటితో నిండు కుండలా ఉన్న బ్యారేజ్‌ను పరిశీలించారు. గోదావరి నీటితో బ్యారేజ్ నిండుగా ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తోందని సిఎం ఈ సందర్భంగా అన్నారు. పట్టిసీమ ద్వారా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 17.52 టిఎంసిల నీటిని కృష్ణా నదికి తరలించినట్లు అధికారులు వివరించారు. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాల కారణంగా గోదావరి నది నుంచి ఇప్పటి వరకు 521 టిఎంసిల నీరు సముద్రంలో కలిసినట్లు అధికారులు తెలిపారు. పట్టి సీమ ప్రాజెక్టు ద్వారా సమృద్ధిగా గోదావరి జలాలు వస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజి దిగువన వివిధ కాలువల ద్వారా డెల్టాలోని పంటలకు నీటిని విడుదల చేస్తున్నామని సిఎం అన్నారు.
కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి 3928 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ నుంచి 3115 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌నుంచి 115 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డెల్టాకు నీటి సరఫరా కోసం మొత్తం కాలువలకు 7,158 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. ఎల్ నినో కారణంగా తీవ్ర వర్షాబావ పరిస్థితుల్లో పట్టిసీమ నీరు పంటలకు జీవం పోస్తోందని ఈ సందర్భంగా సిఎం అభిప్రాయ పడ్డారు. సమర్థ నీటి నిర్వహణ ద్వారా ఎల్ నినో పరిస్థితుల్లో సాగునీటి ఇబ్బందుల్ని అధిగమించేందుకు అన్ని విధాలా పనిచేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

# ఇక అంతరిక్షంలో వ్యవసాయం!

## • వరి పంట పండించి కోత కోసిన చైనా • చంద్రుడు, అంగారకుడిపై ధాన్యం సాగు

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త :** రాబోయే రోజుల్లో అంతరిక్ష కేంద్రాల్లోనే పంటలు పండించి, వ్యోమగాములు అక్కడే భోజనం తయారు చేసుకునే రోజులు రాబోతున్నాయి. ఇందుకు ఊతమిచ్చేలా చైనా చేపట్టిన ప్రయోగం విజయవంతం అయింది. భూమికి వందల కిలోమీటర్ల ఎత్తులో ఉన్న చైనా తియాంగాంగ్ అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములు వరి పంటను తొలిసారి విజయవంతంగా పండించారు. విత్తనం వేసి ధాన్యాన్ని నూర్చే వరకు జీవిత చక్రాన్ని పూర్తిచేసి ప్రతిష్టాత్మక మైలురాయిని దాటారు. చైనా చేపట్టిన షెంఝౌ23 మిషన్‌లో భాగంగా మే 24న వరి విత్తనాలను టియాంగాంగ్ స్పేస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. రెండు నెలలకు పైగా సూక్ష్మ గురుత్వాకర్షణ పరిస్థితుల్లో వాటిని పెంచిన అనంతరం వ్యోమగాములు జూ యాంగ్జు, జాంగ్ జియువాన్, లై క్సియింగ్ తొలి వరి నమూనాలను సేకరించారు. అంతరిక్ష ఇక్యూబేటర్లలో ప్రత్యేక ఎల్ఈడీ కాంతి, ద్రవ పోషకాల ద్వారా నీరు, ఎరువులను అందించి వరి పంట పండించారు. సాధారణంగా భూమిపై గురుత్వాకర్షణ ప్రభావంతో మొక్కల వేళ్లు కిందికి, కాండం పైకి పెరుగుతాయి. అయితే, అంతరిక్షంలోని మైక్రోగ్రావిటీ (శూన్య గురుత్వాకర్షణ శక్తి)లో వాతావరణంలో మొక్కల పెరుగుదల శైలి మారినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. చైనా శాస్త్రవేత్తలు ఈ ప్రయోగంలో రెండు రకాల జపోనికా వరి విత్తనాలను ఉపయోగించారు. ఒకటి అంతరిక్షానికి ఎప్పుడూ వెళ్లని సాధారణ విత్తనాలు కాగా, మరొకటి 2022లో టియాంగాంగ్‌లో పండించిన వరి నుంచి వచ్చిన విత్తనాలు. అంతరిక్ష వాతావరణానికి గతంలో అలవాటు పడిన విత్తనాలు తరువాతి తరాల్లో ఎలా స్పందిస్తాయో శాస్త్రవేత్తలు పరిశీలిస్తున్నారు. 2022లో చైనా అంతరిక్షంలో తొలిసారిగా వరి పూర్తి జీవచక్ర ప్రయోగాన్ని నిర్వహించింది.



ఆ సమయంలో ఆరు వరి విత్తనాలను 120 రోజులపాటు కక్ష్యలో పెంచగా, 59 కొత్త విత్తనాలు లభించాయి. వాటిని భూమికి తీసుకువచ్చి తదుపరి పరిశోధనలు చేశారు. తాజా సంచలన ప్రయోగం ద్వారా రోదసీలోనే ఆహారాన్ని పండించటమే కాకుండా, వ్యోమగాములు విడుదల చేసే కార్బన్ డై అక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్ ను విడుదల చేయటానికి కూడా అవకాశం

>>2

# అమరావతిలో భూగర్భ విద్యుత్ లైన్లు

## తాళ్లాయిపాలెం సబ్ స్టేషన్ నుంచి భారీ డక్ట్ ఏర్పాటు

## తుది దశలో టవర్ల నిర్మాణం

**విజయవాడ.ఆగస్టు9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపి రాజధాని అమరావతి ప్రాంతంలో భవిష్యత్తులో విద్యుత్ సరఫరా మొత్తం భూగర్భం ద్వారా జరిగేలా అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఇందుకు భారీ డక్ట్‌లు నిర్మిస్తున్నారు. రాజధానిలో క్వాంటమ్ వ్యాలీ, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ప్రముఖ విద్యా సంస్థలు, కీలక భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వాటన్నింటికీ విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా భూగర్భం ద్వారా విద్యుత్ లైన్లు మొత్తం వెళ్లేలా డిజైన్లు రూపొందించారు. అందుకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టారు.తాళ్లాయిపాలెం సబ్‌స్టేషన్ నుంచి భారీ డక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు 220 కేవీ విద్యుత్ సరఫరాకు వీలుగా సుమారు 24 లైన్లు వెళ్లే అవకాశముంది. 55 కి.మీ.మేర భూగర్భం నుంచే విద్యుత్

>>2

# భారత్ చట్టాలను పాటించాల్సిందే

## మెటాకు కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** మెటా ప్లాట్‌ఫారమ్‌లు భారత చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని ప్రభుత్వం ఆదివారం స్పష్టం చేసినట్లు సమాచారం. సోషల్ మీడియా దిగ్గజంతో ఇటీవల జరిగిన చర్చల ముఖ్య ఉద్దేశ్యం, కేవలం ఆ సంస్థ ప్రపంచ ప్రమాణాలను అనుసరించడం కాదని, దాని విధానాలు, కంటెంట్ నియంత్రణ పద్ధతులు దేశ చట్టపరమైన చట్రానికి అనుగుణంగా ఉండేలా చూడటమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. మెటా తన సిఫార్సు అల్గారిథమ్‌లను పూర్తిగా మార్చాలని అధికారులు ఆదేశించారని చెప్పడం వాస్తవానికి తప్పు అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దానికి బదులుగా, సంస్థ కంటెంట్ విధానాలు, అమలు యంత్రాంగాలు, ప్లాట్‌ఫారమ్ పాలన భారత చట్టపరమైన అవసరాలను తగినంతగా ప్రతిబింబించేలా చూడటమే కొనసాగుతున్న చర్చల ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొంది.

>>2



# డిఎస్సీ అక్రమాల్లో నిజమెంత?

## • నిరసన కార్యక్రమాల్లో కనిపించని నిరుద్యోగులు • ఆరోపణలు, కోర్టు కేసులు, ప్రభుత్వ వివరణల మధ్య కొనసాగుతున్న వివాదం • స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్లపై హైకోర్టు విచారణకు ఆదేశం • పేపర్ లీక్ ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం

**ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో, ఆగస్టు 9:** ఆంధ్రప్రదేశ్‌లో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డిఎస్సీ-2025 నియామక ప్రక్రియపై వివాదంకొనసాగుతోంది. డిఎస్సీ నియామకాల్లో అక్రమాలు, మెరిట్ జాబితాలో అవకతవకలు, రిజర్వేషన్ అమలులో లోపాలు, స్పోర్ట్స్ కోటాకింద నకిలీ ధ్రువపత్రాల వినియోగం, ప్రశ్నపత్రం లీక్‌వంటి పలుఆరోపణలు రాజకీయంగానూ, న్యాయపరంగానూ చర్చకు వచ్చాయి. అయితే వీటిలో ప్రతి ఆరోపణ నిజమని ఇప్పటివరకు న్యాయస్థానం తుది నిర్ధారణ చేయలేదు. అదే సమయంలో వివాదాలకు సంబంధించి పలు కేసులు కోర్టుల ముందుకు వెళ్లడం మాత్రం వాస్తవం.

**335కు పైగా పిటిషన్లు.. అభ్యర్థుల అసంతృప్తి**

మెగా డిఎస్సీ నియామకాలకు సంబంధించి వివిధ అంశాలపై అభ్యర్థులు పెద్ద సంఖ్యలో న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఇటీవల హైకోర్టు విచారణలో 335 పిటిషన్లు దాఖలైనట్లు ప్రస్తావన వచ్చింది. వ్యక్తిగతంగా నష్టపోయామని భావిస్తున్న అభ్యర్థులు నేరుగా న్యాయపరమైన పరిష్కారం కోరుతున్న నేపథ్యంలో, మొత్తం డిఎస్సీ ప్రక్రియను ఒకే మాటతో అక్రమమనితేల్చడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డిఎస్సీలో కొంతమంది అభ్యర్థులు తమకు ఎక్కువ

>>2

# పిడుగుపాటు: ఇద్దరు మహిళా కూలీలు మృతి

## మరో నలుగురికి తీవ్ర గాయాలు

**కాశీబుగ్గ (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 9 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా మందస మండలం బుడార్సింగి గ్రామ పంచాయితీ పాత కోట పెదంగో గిరిజన గ్రామాలకు చెందిన కె.సోముద్రి, సవర జొరలపై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటనలో మరో నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలు పాలైన గిరిజన మహిళల్లో మజ్జి దేవకి, బియా పోరోమి, కుమారో నీలా, కట్టువ సుస్మితలను చికిత్సకై 108 వాహనంలో హరిపురం ప్రభుత్వ సామా

>>2

10-8pg2exHMNWJQE.qxd:10-8pg2exHMNWJQE.qxd 1/1/02 7:08 AM Page 1





ఆదివారం భోపాల్‌లో తిరంగా యాత్రలో పాల్గొన్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్

# 'త్రివర్ణ పతాకం మన గర్వకారణం'

## 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనండి: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడానికి సిద్ధమవుతున్న తరుణంలో, ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం నాడు పౌరులకు ఒక పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకాన్ని 'గర్వకారణం', 'స్ఫూర్తిదాయకం'గా అభివర్ణిస్తూ, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ యేడాది ఈ కార్యక్రమాన్ని 'వందేమాతరం' ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ప్రధాని మోడీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'మన త్రివర్ణ పతాకం మన గర్వకారణం, అలాగే దేశం కోసం ఎల్లప్పుడూ మన అత్యుత్తమ సేవలను అందించేలా ప్రేరేపించే నిరంతర శక్తి వనరు' అని ఆయన పేర్కొన్నారు. జాతీయ గీతం 'వందేమాతరం' స్ఫూర్తితో ఈ కార్యక్రమం జరుగుతున్నందున, 'హర్ ఘర్ తిరంగా' ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొందాం. అలాగే 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్) నిర్మాణంలో మనవంతు కృషి చేసేందుకు సామూహిక సంకల్పాన్ని పునరుద్ధరించుకుందాం' అని ఆయన అన్నారు. "ఈ ఏడాది కార్యక్రమాలు 'వందేమాతరం'కు అంకితం కావడం, పైగా ఆ గీతం 150వ వార్షికోత్సవ వేళ ఇలా జరగడం సంతోషకరం' అని ప్రధాని పేర్కొన్నారు.



ఆదివారం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వారితో కలిసి డప్పు వాయిస్తున్న సిఎం చంద్రబాబు

# డా.ప్రియాంక మరణం బాధించింది: డి.సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,ఆగస్టు 9.ప్రభాతవార్తప్రతినిధి:**రాజమహేంద్రవరంలో మద్యం మత్తులో యువకులు కారును నిర్లక్ష్యంగా నడిపి ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన పీజీ వైద్య విద్యార్థిని డా.ప్రియాంక మృతి కలచివేసిందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.ఈ మేరకు డసిఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది.భవిష్యత్తులో వైద్యురాలిగా ఎంతో మందికి సేవలు అందించాల్సిన ఆమె ఇలా అర్థాంతరంగా కన్నుమూయడం బాధాకరం. నిర్లక్ష్యంగా కారు నడిపి ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న నిందితులకు కఠిన శిక్షలు పడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. డా.ప్రియాంక ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

# మహిళా కూలీలు మృతి

>> జిక ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన ఇద్దరు గిరిజన మహిళల కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు. ఈ సంఘటన ఈ రెండు గ్రామాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి. ఈ గిరిజన మహిళాకూలీలంతా పొలంలో వరినారు ఊడుపులుకోసం వెళ్లారు. పొలంలో పూర్పులు చేస్తుండగా హఠాత్తుగా పిడుగు పడి ఇద్దరు గిరిజన మహిళ కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు విడిచిపెట్టగా మిగతా నలుగురు తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్నారు.

# మెడికో ప్రియాంక

>> వైద్యులు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు.

ప్రసాదిత్య మాల్ వద్ద మద్యం మత్తులో ఇద్దరు యువకులు స్కూటీని వెనకరించి రెండుసార్లు ఢీ కొట్టి మరల మూడోసారి కూడా ఢీకొట్టడంతో కిందపడ్డ ప్రియాంక తీవ్రంగా గాయపడింది. ప్రియాంక స్నేహితుడు ఉమేష్‌తో కలిసి స్కూటీపై వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. ప్రియాంక జిఎస్‌ఎల్ మెడికల్ కళాశాలలో డెర్మటాలజీలో పీజీ ఫస్ట్ ఇయర్ చదువుతుంది.

ప్రియాంక సొంత ఊరు కర్నూలు కాగా ప్రస్తుతం కుటుంబ సభ్యులు హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. ముద్దాయిలు సూరవరపు దస్వంత్, ఆంద్రు జోసెఫ్ ఎడ్వర్డ్స్‌పై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. ఈనెల ఆరవ తేదీన ఈ ఇద్దరినీ అరెస్ట్ చేసి ఏడవ తేదీన రాజమండ్రి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.

**ప్రియాంకకు న్యాయం చేయాలని నిరసనలు:**

వైద్య విద్యార్థినికి న్యాయం చేయాలని కోరుతూ రాజమహేంద్రవరంలో విద్యార్థులు నిరసన ర్యాలీలు చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షి ంచాలని డిమాండ్ చేశారు. రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి నిందితులను కఠినంగా శిక్షి ంచాలని ప్రియాంకకు న్యాయం జరిగే విధంగా అండగా నిలబడతానని చెప్పారు. సోమవారం ప్రియాంక మృతి సంతాపంగా విద్యాసంస్థలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ప్రియాంకకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు.

**'మెడికో ప్రియాంకపై హత్యాయత్నం..'**

మరింత లోతుగా విచారణకు కస్టడీ కి పిటీషన్: ఎస్పీ నరసింహ కిషోర్.. వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రియాంక కేసులో ముద్దాయిలపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. రాజమండ్రిలో ప్రియాంక కేసుపై ఎస్పీ డి నరసింహ కిశోర్ మాట్లాడుతూ కావాలనే ఆమెను కారుతో ఢీకొట్టినట్లు వీడియోలు చూస్తే అర్థమవుతుందని నిందితులపై కఠిన సెక్షన్ల కింద కేసు పెట్టాం అని వెల్లడించారు.

అలాగే డాక్టర్ ప్రియాంక కేసులో ముద్దాయిలను కోర్టు అనుమతితో కస్టడికి తీసుకుని మరింత లోతుగా విచారిస్తామని ఎస్పీ నరసింహ కిషోర్ చెప్పారు. ముద్దాయిలు వెనక ఎవరైనా ఉన్నారా అనే కోణంలో కూడా విచారిస్తున్నామని ఈ కేసులో ఎవరు ప్రమేయం ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదని చట్టపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముద్దాయిలు ప్రియాంకను ఉద్దేశం పూర్వకంగా చేసారా అని మరింత లోతుగా విచారణ చేయడం జరుగుతుందన్నారు.

యాక్సిడెంట్ జరిగిందని ఎస్ఐకి సమాచారం రావడంతో ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ సిఐ ఎస్ఐ సిబ్బంది వెంటనే ఘటన ప్రాంతానికి వెళ్లడం జరిగిందని అక్కడ యాక్సిడెంట్ అయిన ప్రియాంకను ఒక వ్యక్తి కారులో జిఎస్ఎల్ స్వతంత్ర హాస్పిటల్ కి తీసుకెళ్లారు. మాల్ వద్ద సిసి పుటేజీలు పరిశీలించి కార్ నెంబర్ను ఐడెంటిఫై చేశారని వెంటనే పోలీస్ టీమ్స్ ఏర్పాటు చేసి ముద్దాయిలను కారు గురించి వెతకడం మొదలుపెట్టారు. నాలుగో తేదీన ప్రియాంక స్నేహితులు ఉమేష్ ఎంఎల్ సి స్టేట్మెంట్ ప్రకారం బి.ఎన్.ఎస్ గా వెంటనే కేసు నమోదు చేయడం జరిగింది. అదే రోజు ప్రత్యక్ష సాక్షులను స్థానికులను విచారించి బి ఎన్ ఎస్ సెక్షన్ నుండి 110 గా అటెంప్ట్ టు కమిట్ కల్పిబుల్ హోమీసైడ్ గా కేసు నమోదు చేయడం జరిగింది అన్నారు.

ఈనెల ఆరవ తేదీన బి ఎన్ ఎస్ కేసులో ముద్దాయిలు ఏ 1 సూరవరపు దస్వంత్, ఏ2 ఆంద్రు జోసెఫ్ ఎడ్వర్డ్స్ లను అరెస్టు చేసినట్లు వివరించారు. ఇద్దరు ముద్దాయిలను ఏడవ తేదీన రాజమండ్రి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించడం జరిగిందని అనంతరం వారిని సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. దస్వంత్ చెన్నైలో బీటెక్ పూర్తి చేసి ఎంఎస్ వెళ్లడానికి ప్రిపేర్ అవుతున్నాడని ఆంద్రు జోసెఫ్ ఎడ్వర్డ్స్ లాలాచెరువులోని లారీ ఆఫీస్‌లో పనిచేస్తున్నాడని తెలిపారు.

# ఇక అంతరిక్షంలో వ్యవసాయం!

>> దొరికింది. నీటి వ్యవస్థ సహజ సిద్ధంగా శుద్ధి చేయటం కూడా సాధ్యమవుతుంది. అంతరిక్షంలో క్లోజ్డ్ లూప్ ఎకో సిస్టమ్ రూపుదిద్దుకోవడానికి ఇది ప్రాథమిక అడుగుగా భావిస్తున్నారు. భవిష్యత్తులో మార్స్, చంద్రుడిపై కాలనీలు నిర్మించే క్రమంలో భూమి నుంచి ప్రతీసారి ఆహారాన్ని మోసుకెళ్లే అవసరం లేకుండా, అక్కడే స్వయం పంటలు పండించేందుకు ఇక మీదట 100 శాతం సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంతేకాదు.. ఈ అంతరిక్ష వరి విత్తనాల్లోని జన్యుపరమైన మార్పులను అధ్యయనం చేయడం ద్వారా భూమిపై తీవ్ర ప్రతికూల వాతావరణ మార్పులను ఎదుర్కొనే నూతన వరి రకాలను అభివృద్ధి చేయడానికి కూడా ఈ పరిశోధన దోహదపడుతుందని చెబుతున్నారు.

# డిఎస్సీ అక్రమాల్లో నిజమెంత?

>> మార్కులు వచ్చినప్పటికీ తక్కువ మార్కులు సాధించిన వారికి అవకాశం లభించిందని, ప్రాధాన్యతలు, రిజర్వేషన్ అమలుపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం మాత్రం మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్ని, నిబంధనల ప్రకారం రిజర్వేషన్ల అమలును సమర్థిస్తోంది. హైకోర్టులో దాఖలైన కేసుల్లో కూడా అభ్యర్థుల ఎంపిక, నియామకం, రోస్టర్, ప్రాధాన్యతల అమలుకు సంబంధించిన ప్రశ్నలు పరిశీలనకు వచ్చాయి. కోర్టు ఇప్పటికే వ్యక్తిగత అభ్యంతరాలను పరిశీలించేందుకు గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేయడం వంటి చర్యలకు ఆదేశాలు ఇచ్చింది.

**కీలకంగా మారిన స్పోర్ట్స్ కోటా**

డిఎస్సీ వివాదంలో ప్రస్తుతం అత్యంత కీలకంగామారిన అంశాల్లో స్పోర్ట్స్ కోటాఒకటి. మెగా డిఎస్సీ- 2025లో మెరిటోరియస్ స్పోర్ట్స్ పర్సన్స్‌కోసం 3 శాతం హారిజాంటల్ రిజర్వేషన్ కింద 421 ఉపాధ్యాయ పోస్టులకు ప్రత్యేక ప్రక్రియ చేపట్టారు. ఈ కోటాలో నకిలీ లేదా అనుమానాస్పద క్రీడా ధ్రువపత్రాలను ఉపయోగించి ఉద్యోగాలు లేదా ఇతర ప్రయోజనాలు పొందారనే ఆరోపణలు తెరపైకివచ్చాయి. ఈ వ్యవ హారంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జులై 2026లో విచారణకు ఆదేశిస్తూ, నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్ల ఆరోపణలపై ప్రభుత్వం దర్యాప్తు చేసి నాలుగు నెలల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ముఖ్యంగా జూడో విభాగానికి సంబంధించిన సర్టిఫికెట్లపై ఆరోపణలు ప్రస్తావనకు వచ్చాయి. ఈవ్యవహారంలో హైకోర్టు దర్యా ప్తుకు ఆదేశించింది. సరిగ్గా ఇక్కడే ప్రతిపక్షమైన వైసీపీ పార్టీ ఈఅంశాన్ని తనకు అనుకూలంగా మలుచు కుంది. డిఎస్సీ నియామకాలను కోర్టు కూడా తప్పు పట్టిందని వారి శైలిలో ప్రచారం చేస్తూ నిరసన కార్యక్రమాలు ప్రారంభించారు. దీనికి కౌంటర్‌గా అన్ని ప్రాంతాలలోనూ ఎమ్మెల్యే స్థాయి నుంచి మంత్రుల వరకు కోర్టు దర్యాప్తుకి ఆదేశించడం అంటే నకిలీ సర్టిఫికెట్లు ఉపయోగించినట్లు కోర్టు నిర్ధారించినట్లు కాదని వైసిపి ఆరోపణలను తిప్పికొడుతున్నారు. అయితే ఈ ఆరోపణలు నిజమా? ఎవరు బాధ్యులు? ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే అంశాలు విచారణ అనంతరం తేలాల్సి ఉంది.

**పేపర్ లీక్ జరిగిందా?**

ఇదిలా ఉండగా విద్యాశాఖలో ఉన్న కొందరు ఉన్నతాధికారుల ద్వారా డిఎస్సీ పరీక్షల్లో ప్రశ్నపత్రం లీక్, డేటా మానిప్యులేషన్ జరిగిందని ప్రతిపక్షాలు, కొందరు అభ్యర్థులు ఆరోపించారు. కొందరు దీనిపై సిబిఐ విచారణకు కూడా డిమాండ్ చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. పరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో, భద్రతా ప్రమాణాలతో నిర్వహించామని, ప్రశ్నపత్రం లీక్ లేదా డేటా మానిప్యులేషన్‌కు అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈక్రమంలో పేపర్ లీక్ ఆరోపణ గానే మిగిలిపోయింది. దానికి సంబంధించి ఆధారాలు కోసం దర్యాప్తు కొనసాగుతోంది. రాష్ట్రమంతా వైసిపి నేతలు డిఎస్సీ అక్రమాలు అంటూ నిరసన కార్యక్రమాలు జోరుగా సాగుతున్న సమయంలో మరి అసలు నిజం ఏమిటనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. పేపర్ లీక్, పోస్టుల అమ్మకం, డేటా మానిప్యులేషన్ వంటి తీవ్రమైన ఆరోపణలు ప్రస్తుతం రాజకీయ, ప్రజా చర్చలో ఉన్నాయి. కానీ ఇవి న్యాయపరంగా తుది నిర్ధారణ కాలేదు. అయితే కొన్నిచోట్ల మెరిట్, రోస్టర్, రిజర్వేషన్, పోస్టుల కేటాయింపు, అభ్యర్థుల అర్హత వంటి అంశాలపై వాస్తవంగా కోర్టు కేసులుఉన్నాయి. ఏదిఏమైనా లక్షలాది మంది నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్న ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో చిన్న అనుమానం కూడా అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుంది. అందువల్ల డిఎస్సీ మొత్తం అక్రమమని ముందుగానే తీర్పు ఇవ్వడం ఎంత తప్పో.. ఎలాంటి అక్రమాలు జరగలేదని దర్యాప్తు పూర్తికాకముందే క్లీన్‌చిట్ ఇవ్వడం కూడా అంతే తప్పు అనే భావన ఉపాధ్యాయ విద్యార్థుల వర్గాల్లో ఉంది. డిఎస్సీ అక్రమాలు అంటూ వైసీపీ మాత్రమే నిరసనలు చేస్తుంది కానీ వామపక్షాలు తగినంత మద్దతు ఇవ్వలేదని వాస్తవాన్ని ఒప్పుకుని తీరాలి.

# అమరావతిలో భూగర్భ విద్యుత్ లైన్లు

>> తీగలు తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా కోసం వినియోగిస్తున్న లైన్లు, స్తంభాలు, తీగలను దశల వారీగా తొలగిస్తారు. రాజధాని ప్రాంతం మొత్తానికి 33 కేవీ/415 వోల్టుల లైన్లు ఏర్పాటు చేయనున్నారు. తుళ్లూరు, తాడేపల్లి, లింగాయపాలెం, నేలపాడు ప్రాంతాల్లో 220 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్లతో (జీఐఎస్) విద్యుత్ నెట్‌వర్క్‌ను అనుసంధానించనున్నారు. ఇప్పటికే నేలపాడు, లింగాయపాలెం వద్ద సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తాడేపల్లిలోని 132 కేవీ సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని పెంచుతున్నారు. తర్వాతి దశలో తుళ్లూరు సబ్‌స్టేషన్ నిర్మాణం ప్రారంభించనున్నారు. ఇవన్నీ అందుబాటులోకి వస్తే సుమారు 500 మెగావాట్ల విద్యుత్ సరఫరా సామర్థ్యం ఉన్న నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తుంది.400 కేవీ విటిపిఎస్‌సత్తెనపల్లి, పిజీసీఐఎల్‌నున్న నెల్లూరు మధ్య లైన్ల రీ రూటింగ్ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. రాజధానిలో నిర్మాణాలకు అడ్డుగా ఉన్న ట్రాన్స్‌కో, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌కు చెందిన లైన్లను కలిపి ఒకే టవర్ నుంచి తీసుకెళ్లేలా డిజైన్ చేశారు. ప్రస్తుతం టవర్ల నిర్మాణం చివరి అంకానికి చేరుకుంది. దీంతో రాజధాని ప్రాంతంలో భవిష్యత్తులో రోడ్లకు అడ్డంగా విద్యుత్ తీగలు వెళ్లే అవకాశం ఉండదు.

# సుప్రీం సిజెఐ రావొద్దు..

## హైదరాబాద్ 'నల్సార్' విద్యార్థుల నిరసన

### 450 మంది సంతకాలు చేసి యాజమాన్యానికి లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు9:** హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సిజెఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జులై 22న జరిగిన విచారణ సందర్భంగా సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిరసనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సిజెఐ, 'వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు, మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సిజెఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకోత్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సిజెఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్‌లో ఒక సంప్రదాయంగా వస్తోంది. కాగా, సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిఐఎస్ఎస్)లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదావేశారు. ఇప్పుడు నల్సార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.

### సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పార్థసారథి

**ఏలూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 10న సోమవారం కలిదిండి మండలంలో నిర్వహించనున్న 'మీ భూమి - మీ హక్కు' పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి సిఎం చంద్రబాబు హాజరుకానున్నారు. ఈనేపథ్యంలో సిఎంఏర్పాట్లనుమంత్రి కొలుసు పార్థసారథి పరిశీలించారు. హెలిప్యాడ్, ప్రజావేదిక, క్యాడర్ సమావేశం, ట్రాన్స్‌పోర్ట్, భోజనాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గారు, ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షుడు, ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ ఎమ్మెల్యే గంటా మురళి, ముఖ్యమంత్రి కార్యక్రమం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొత్త నాగబాబు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

10-08-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
తి.ద్వాదశి రా.8.01, తి.త్రయోదశి తె.4.54
న.ఆరుద్ర మ.12.27,
వ.రా.11.18-రా.12.45
దు.1. మ.12.38-మ.1.29
దు.2. మ.3.11-సా.4.02
రాహు.ఉ.7.30-ఉ.9.00 శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** స్థిరాస్తులను కొనుగోలు చేసే ఆలోచనలు ఫలిస్తాయి. వచ్చిన ధనమును పొదుపు చేయుటకు ప్రయత్నిస్తారు.

**వృషభం :** ఖర్చులను తగ్గించు విషయములో పూర్తిగా వైఫల్యమును పొందుతారు. సోదరి కలయిక. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**మిథునం :** కొన్ని దుబారా ఖర్చులు రహస్య ఋణములు, దానములు తప్పవు. విలువైన సమాచారం వింటారు. కాంట్రాక్ట్‌లు లాభిస్తాయి.

**కర్కాటకం :** కరస్పాండెన్స్‌లు, సాంస్కృతిక కార్యక్రమములు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మందుల వ్యాపారము అనుకూలం.

**సింహం :** ఆర్థికపరమైన అంశాలు కొంత మేర ఆశాజనకంగా ఉంటాయి. వివాహ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**కన్య :** మీకు న్యాయం చేయవలసిన వాళ్ళు సంపూర్ణంగా న్యాయం చేయరు. వృత్తిలో అనుకోని మార్పులు వుంటాయి .

**తుల :** కోర్ట్ సంబంధించిన భూవివాదాలు, స్థిరాస్తులకు సంబంధించిన వివాదాలు ఒక పరిష్కార దశకు చేరుకుంటాయి.

**వృశ్చికం :** కళా, సాంస్కృతిక, ఉద్యోగ రంగాలలోని వారికి పోటీ ఎదురవుతుంది. కళాత్మక వస్తువులను కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు :** ఒకరి జీవితానికి ఆధారం కల్పించి మనశ్శాంతి పొందుతారు. ఆరోగ్య పరంగా జాగ్రత్తలు పాటించాలి.

**మకరం :** ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైల్ మీద అధికార ఆమోద ముద్రలు పడుతాయి. క్రయ విక్రయాలలో లాభాలు.

**కుంభం :** వస్తు భద్రతకు ప్రాముఖ్యం ఇస్తారు. ఇతర భాష పట్ల విదేశాల పట్ల ఆకర్షణ కలుగుతుంది. వస్త్ర లాభం.

**మీనం :** వృత్తి విషయములో కొంత ఓర్పును పాటించుట అవసరం. కార్యాచరణ కోసం యోచన చేస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆదివాసీల అభ్యున్నతే లక్ష్యం

>> నట్టే. సమాజానికి ఏమిచ్చాం, దేశానికి ఏం చేశాం అన్నదే లక్ష్యంగా పనిచేయాలి. ఒకరు ప్రకృతి కోసం, మరొకరు పర్యావరణం కోసం, ఇంకొకరు నీటి సంరక్షణ కోసం పనిచేయాలి. రాష్ట్రానికి, దేశానికి విజన్ ఉన్నట్టే వ్యక్తిగతం గానూ ప్రతి ఒక్కరికీ ఓ విజన్ ఉండాలి. వికసిత్ భారత్ విజన్‌ను ప్రధాని మోడీ చేస్తే, నేను 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపకల్పన చేశాను. జాతీయ జెండా స్ఫూర్తితో కలసికట్టుగా ముందుకు అడుగేద్దాం. వ్యక్తిగతంగా విజయం సాధించటమూ నేషన్ బిల్డింగ్‌లో భాగమే. పనిచేసే ప్రతీ వ్యక్తీ సమాజానికి ఆస్తి. సమాజం కోసం పనిచేయటమే గొప్ప దేశభక్తి, అందరి గెలుపే దేశం గెలుపు' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**అరకు కాఫీని గ్లోబల్ బ్రాండ్‌గా మారుస్తాం**

"భోగాపురంలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం. విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గిరిజన బిడ్డలు థింసా నృత్యం ఇప్పుడు గిన్నీస్ బుక్ రికార్డు సాధించింది. ఈ రికార్డు సాధించి మన సంస్కృతీ సంప్రదాయాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. పోడు వ్యవసాయం కాదు ఆర్గానిక్ వ్యవసాయంతో గిరిజనులు విలువైన పంటల్ని ఉత్పత్తి చేస్తున్నారు. రాష్ట్రంలోని 27.39 లక్షల మంది గిరిజనుల సమగ్రాభివృద్ధికి రూ.4764 కోట్లను కేటాయించాం. ఐటిడిఎలతో గిరిజన అభివృద్ధి కోసం జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రత్యేకంగా దృష్టి సారించాం. మౌలిక వసతుల కల్పన, ఉపాధి, ఉద్యోగాలు, నైపుణ్య కల్పనపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాం. 2336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్‌లో రోడ్డు కనెక్టివిటీ కల్పిస్తున్నాం. 2027 నాటికి ప్రతీ గిరిజన కుటుంబానికీ సురక్షితమైన తాగునీరు, ఆవాసం కల్పిస్తాం, సోలార్ రూఫ్ టాప్ కూడా ఏర్పాటు చేస్తాం. అడవి తల్లి బాట పేరుతో వెయ్యి కోట్లతో 905 కిలోమీటర్ల రోడ్లు వేశాం. డోలీ మోతలు లేకుండా ఫీడర్ అంబులెన్సులు, 108,104 మొబైల్ మెడికల్ యూనిట్లు ఏర్పాటు చేశాం. అలాగే డిజిటల్ కనెక్టివిటీ కోసం సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నాం. 25 యేళ్ల క్రితమే అరకు కాఫీకి నాంది పలికాం, ఇప్పుడు ప్రపంచ బ్రాండ్‌గా అరకు కాఫీ ఎదిగింది. మరో లక్ష ఎకరాల్లో కాఫీ సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. కాఫీ, మిరియాలు, పసుపు లాంటి వాణిజ్య పంటలకు బ్రాండ్‌గా ఏజెన్సీ ప్రాంతం మారాలి. ప్రధాని మోడీ కూడా ఆస్ట్రేలియా ప్రధానికి అరకు కాఫీనే బహుమతిగా ఇచ్చి ప్రమోట్ చేస్తున్నారు. రాష్ట్రానికి వచ్చిన ప్రతీ అతిథికి అరకు కాఫీని బహుమతిగా ఇస్తూ ప్రోత్సాహం కల్పిస్తున్నాం పార్లమెంటులోనూ అరకు కాఫీ స్టాల్‌ఏర్పాటు చేయించాం. బెస్ట్ గ్లోబల్ బ్రాండ్‌గా దీనిని మారుస్తాం. గిరిజనప్రాంతాల్లోని అటవీ ఉత్పత్తులకు విలువజోడించటం ద్వారా మంచిమార్కెటింగ్ కల్పిస్తాం. సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనా పిల్, తేనె, తాటి బెల్లం ఇలా ఉత్పత్తి నుంచి ప్రాసెసింగ్, బ్రాండింగ్ వరకూ ప్రభుత్వం అండగా ఉంటుంది' అని ముఖ్యమంత్రి వివరించారు.

**ఆదివాసీల సమగ్రాభివృద్ధికి కార్యాచరణ**

"రహదారులు, సురక్షితమైన తాగునీరు లాంటి మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఆదాయ వనరుల పెంపు, నైపుణ్య శిక్షణ లాంటి ఐదు అంశాల్లో ఆదివాసీల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఒక్క ఆదివాసీల కోసమే 3 ప్రత్యేక జిల్లాలు ఏర్పాటు చేసి వారికి ప్రాధాన్యత కల్పించాం. ఎటు చూసినా పచ్చదనం కలిగిన ఈ ప్రాంతాల్లో పర్యాటకాన్ని కూడా గణనీయంగా ప్రోత్సహిస్తాం. నేడు చేసుకున్న 19 ఎంఓయుల ద్వారా 60 వేల మందికి లబ్ది కలుగుతుంది. గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా 1.5 లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందిస్తాం. ఐఐటి, నీట్ లాంటి పోటీ పరీక్షలకు కూడా వారిని సిద్ధం చేసి అందరితో పోటీ పడేలా ప్రోత్సహిస్తాం. జిఒ నెంబరు 3 ద్వారా గిరిజన ప్రాంతాల్లో స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా చేశాం. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ జీవోను కొట్టివేశారు. ప్రత్యామ్నాయం గురించి ఆలోచన చేస్తున్నాం. ఆదివాసీల హక్కులు కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. నాణ్యమైన వైద్య సేవలు అందేలా రూ.250 కోట్లతో పార్వతీపురం, సీతంపేట, రంపచోడవరం, చింతూరు, కేఆర్ పురం, శ్రీశైలం లాంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మాణం పూర్తి చేస్తాం' అని సిఎం చంద్రబాబు వివరించారు.

**స్వర్ణాంధ్ర కోసం కలిసి పని చేద్దాం**

"2047 నాటికి స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధన కోసం మనం అంతా పనిచేయాలి. ఆర్థిక అసమానతలు తగ్గి అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందేలా ప్రణాళికలు చేశాం. సూపర్ సిక్స్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. పి4తో పాటు వివిధ కార్యక్రమాల ద్వారా పేదల్ని ఆదుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నాం. చంద్రబాబు అనే నేను ప్రజల జీవితాలను మార్చి, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తే లక్ష్యం నెరవేరినట్టే. దేశం, రాష్ట్ర అభివృద్ధిలో ప్రతీ పౌరుడూ భాగస్వామి కావాలి. విద్యార్థులకు ఇది అలవాటు చేసేలా ఓ మొక్కను నాటి సంరక్షించేలా గ్రీన్ పాస్‌పోర్టు కార్యక్రమం తెచ్చాం. మన పర్యావరణం కోసం మొక్కలు నాటటంతో పాటు వాటిని సంరక్షిం చటం కూడా మన బాధ్యత. 80 స్వతంత్ర దినోత్సవంలోగా ప్రతీ పౌరుడూ ఓ సంకల్పం తీసుకోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నా. వచ్చే 21 యేళ్లలో దేశం, రాష్ట్రం అభివృద్ధికి చిరునామాగా మారతాయి'అని పిఎం అన్నారు. అనంతరం అంబేద్కర్ కళావేదికవద్ద ఏర్పాటు చేసిన గిరిజన ఉత్పత్తుల స్టాళ్లను సిఎం పరిశీలిం చారు. పాడేరు, రంపచోడవరం, నల్లమల, అరకు, చింతపల్లి, పార్వతీపురం మన్యం తదితర ప్రాంతాల నుంచి ఉత్పత్తులు తయారు చేసి ప్రదర్శించిన గిరిజన మహిళల్ని సిఎం అభినందించారు. గిరిజన ప్రాంతాల్లో తయారు చేస్తున్న ఉత్పత్తులకు బ్రాండ్ రూపొందించి మార్కెటింగ్ చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుమ్మిడిసంధ్యారాణి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# భారత్ చట్టాలను పాటించాల్సిందే

>> అధికార వర్గాల ప్రకారం, ప్రభుత్వం లేవనెత్తిన ప్రధాన ఆందోళనలలో ఒకటి, దేశం వెలుపల ఉన్న బృందాలకు భారతదేశ సాంస్కృతిక, భాషా వైవిధ్యంపై పరిమిత అవగాహన ఉండటం. కంటెంట్ నియంత్రణ నిర్ణయాల సామర్థ్యాన్ని, కచ్చితత్వాన్ని మెరుగుపరచడానికి, భారతీయ భాషలు, సాంస్కృతిక సూ నైపుణ్యాలపై మెరుగైన అవగాహనతో సహా, మెటాకు బలమైన స్థానిక నైపుణ్యం అవసరమని అధికారులు తెలిపారు.

డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లపై బాలల లైంగిక వేధింపుల కంటెంట్ (సిఎస్ఎఎం)ను ఏమాత్రం సహించబోమని ప్రభుత్వం పునరుద్ఘాటిస్తూ, దానిపై కూడా గట్టి వైఖరిని అవలంబించింది. సిఎస్ఎఎం ఉనికి అనేది వర్తించే నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని, అటువంటి కంటెంట్‌ను గుర్తించి తొలగించడానికి మెటా మరింత పటిష్టమైన, చురుకైన భద్రతా చర్యలను అమలు చేస్తుందని భావిస్తున్నట్లు వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో కేవలం హామీలు కాకుండా, కచ్చితమైన చర్యలు అవసరమవుతాయని అధికారులు స్పష్టం చేశారు. చర్చలలో డీప్‌ఫేక్‌కంటెంట్ కూడా ప్రముఖంగా ప్రస్తావనకువచ్చింది. అధీకృత లేదా ధ్రువీకరించబడిన ఖాతాల నుండి ప్రచురించబడిన కంటెంట్‌ను ఆటోమేటెడ్ సిస్టమ్‌ల ద్వారా తప్పుగా డీప్‌ఫేక్‌లుగా వర్గీకరించకూడదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇలాంటి కేసుల సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకుని, కంటెంట్‌ను తొలగించే నిర్ణయం తీసుకునే ముందు దానిని సరిగ్గా పరిశీలించేలా చూసేందుకు "మానవ ప్రమేయం"తో కూడిన సమీక్షా ప్రక్రియను అధికారులు సమర్థించారు. డీప్‌ఫేక్‌గా గుర్తించి, తొలగించిన తర్వాత కూడా ప్లాట్‌ఫారమ్‌పై తిరిగి కనిపించే కృత్రిమంగా రూపొందించిన కంటెంట్ గురించి కూడా ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. తొలగించిన తర్వాత అటువంటి కంటెంట్ పునరావృతం కాకుండా, పునఃపంపిణీ కాకుండా నిరోధించడానికి తీసుకుంటున్న చర్యలను వివరించాలని కోరినట్లు వర్గాలు తెలిపాయి.

# మెడికో ప్రియాంక మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు

## బాధిత కుటుంబానికి రూ. 20 లక్షల ఆర్థిక సాయం

### జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడిన సిఎం

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజమండ్రిలో ఈ నెల 3వ తేదీన యువకులు కారుతో ఢీ కొట్టిన ఘటనలో మెడికో ప్రియాంక ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నాటి ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి చెందిందనే వార్త తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న ఒక వైద్య విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రియాంక ప్రాణాలు కోల్పోయిన ఘటనపై జిల్లా అధికారులతో గతంలోనే ఓసారి జిల్లా అధికారులతో సమీక్షి ంచిన ముఖ్యమంత్రి, ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మరోసారి సిఎం చంద్రబాబు మాట్లాడారు. ప్రియాంక మృతికి కారణమైన నిందితులు ఇప్పటికే అరెస్టై జైల్లో ఉన్నారని ఎస్పీ వివరించగా, నిర్లక్ష్యంతో నిండు ప్రాణం తీసిన వారిపై కఠిన సెక్షన్లతో శిక్షలు పడేలా చూడాలని సిఎం ఆదేశించారు. ప్రియాంకకు ప్రమాదం జరిగిన అనంతరం రాజమండ్రిలో చికిత్స అందించడం, తరువాత కుటుంబ సభ్యులు ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించిన విషయాన్ని అధికారులు వివరించారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం అందించాలని సిఎం అధికారులను ఆదేశించారు.

10-8Pg3exHMNWJQE.qxd:10-8Pg3exHMNWJQE.qxd 1/1/02 7:07 AM Page 1



# ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనులకు సిఎం శుభాకాంక్షలు

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన సోదర సోదరీమణులందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అడవితో, ప్రకృతితో ముడిపడి ఉన్న గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, వారి విశిష్టమైన జీవన విధానం మన సమాజానికి ఎంతో గర్వకారణమన్నారు. అందుకే ఆదివాసీల విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాలు మెరుగుపరిచి వారి సమగ్ర అభివృద్ధే లక్ష ్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తూ, వారి స్వయం సమృద్ధి, ప్రగతే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందన్నారు.

### గిరిజనుల సంస్కృతిని అందరూ గౌరవించాలి: పవన్ కళ్యాణ్

అంతర్జాతీయ గిరిజన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గిరిజనులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. తరతరాలుగా అడవులను ఆవాసంగా చేసుకుని, వాటిని కాపాడుతున్న గిరిజనుల సంస్కృతిని అందరూ గౌరవించాలని కోరారు. ముఖ్యంగా సమాజ సంక్షేమంలో, సంప్రదాయ వైద్యంలో గిరిజన మహిళల సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ గిరిజన దినోత్సవ ఇతివృత్తం ప్రాచీన వైద్య విధానాలు, సంప్రదాయ జ్ఞానం కలిగిన గిరిజన మహిళల ప్రాముఖ్యతను గుర్తుచేస్తోందన్నారు. మాతా శిశు ఆరోగ్యం, సమాజ సంక్షేమంలో గిరిజన మహిళల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. గిరిజన సమాజంతో తనకు ఉన్న బంధం చాలా ప్రత్యేకమైనదని, వారి ప్రేమ, నమ్మకమే తనను వారి సంక్షేమం వైపు మరింత బాధ్యతగా నడిపిస్తున్నాయని పవన్ కళ్యాణ్ తెలిపారు. రిజనుల వికాసానికి 'అడవి తల్లి బాట్ల వంటి కార్యక్రమాల ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు రోడ్డు వసతి పెంచడం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించామన్నారు. గిరిజనుల ప్రత్యేక జీవన విధానం, సంస్కృతి దెబ్బతినకుండానే అభివృద్ధి ఫలాలు ప్రతి గిరిజన కుటుంబానికి అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు.

### ఆదివాసీల హక్కుల రక్షణ మన బాధ్యత: మంత్రి లోకేష్

ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనులకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి అంటే ప్రకృతితో కలిసి జీవించే ఒక జీవన తత్వమని లోకేశ్ అన్నారు. పరస్పర సహకారం, మంచితనం, మానవత్వ రూపాలు ఆదివాసీలని లోకేష్ కొనియాడారు. ఆదివాసీల సమగ్ర అభ్యున్నతి తోపాటు వారి సంస్కృతి, హక్కులను పరిరక్షించడం మనందరి బాధ్యతన్నారు.

### నీరు, అడవి, భూమి ఆదివాసీలకు దేవాలయంతో సమానం: మంత్రి సంధ్యారాణి

భూమిపై ఆది నుంచి జీవిస్తున్నది ఆదివాసీలేనని, వారి హక్కులు, విశిష్ట సంస్కృతిని గుర్తుచేసుకునే రోజు ఆగస్టు 9 అని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్స వం సందర్భంగా ఆమె గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీల జీవిత సూత్రం 'జల్, జంగల్, జమీన్' అని ఆమె అభివర్ణించారు. గిరిజను లకు లబ్ధి చేకూర్చేందుకే నాడు చంద్రబాబు జిఒ 3 తీసుకువచ్చారని మంత్రి గుర్తుచేశారు. వైఎస్సార్సీపీ హయాంలో ఆ జిఒ రద్దయితే, గిరిజనుల ప్రయోజనాల కోసం కనీసం రివ్యూ పిటిషన్ కూడా వేయలేదని మండి పడ్డారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే గిరిజన యువకులను గొడ్డలి పార్టీ రెచ్చగొడుతోందని సంధ్యారాణి ధ్వజమెత్తారు. నీరు, అడవి, భూమి ఆదివాసీ లకు దేవాలయంతో సమానమని, అడవిని కాపాడే ఆదివాసీల అభివృద్ధే దేశ అభివృద్ధని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. గిరిజనుల విద్య, ఉద్యోగ వికాసానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

# మహేశ్ బాబుకు సిఎం, డి.సిఎం బర్త్‌డే విషెస్



**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** చలనచిత్ర కథానాయకుడు మహేశ్ బాబు 51వ పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని, ఆయన చేపట్టే అన్ని కార్యక్రమాల్లో విజయం సాధించాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఈ ఏడాది ఆయనకు అద్భుతంగా సాగాలని కోరుకుంటు న్నట్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. డిసిఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్ అందిస్తున్న సేవా కార్యక్రమాలు, ముఖ్యంగా పిల్లలకు సహాయం చేయడం స్ఫూర్తిదాయకమని పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ ప్రశంసించింది. టాలీవుడ్ సినీ ప్రముఖుల నుంచి కూడా మహేశ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేశ్ వంటి అగ్ర తారలు ఆయనకు విషెస్ తెలియజేశారు. భారతీయ సినిమాలో అత్యంత అభిమానం పొందిన నటులలో ఒకరిగా మహేశ్ ఎదగడం గర్వంగా ఉందని చిరంజీవి అన్నారు. వెంకటేశ్ అయితే నా చిన్నోడు మహేశ అంటూ ఆప్యాయంగా సంబోధిస్తూ, రాబోయే 'వారణాస్తి చిత్రంలోని 'రుద్ర లుక్‌లో మహేశ్ అదరగొడుతున్నాడని కితాబిచ్చారు. ఈ సినిమాతో మహేశ్ వచ్చే ఏడాది ప్రపంచాన్ని ఏలడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

మహేష్ బాబుకు మంత్రి లోకేష్ బర్త్‌డే విషెస్: సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదినం సందర్భంగా మంత్రి లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఖిశ్రీఖి వేదికగా స్పందించిన మంత్రి లోకేష్, 'సూపర్ స్టార్ మహేష్ బాబుకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీకు ఆనందం, మంచి ఆరోగ్యం, కొనసాగే విజయాలు ఉండాలని కోరుకుంటున్నా అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహేష్ బాబు నవ్వుతున్న ఫోటోను కూడా లోకేష్ షేర్ చేశారు.

# గిరిజనుల ఆత్మగౌరవం, అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం

- 18గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరిచాం
- ఐటిడిఎలను బలోపేతం చేస్తున్నాం
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి



**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ డా. బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో ఆదివారం గిరిజన సంక్షేమశాఖ నిర్వహించిన కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ గిరిజనులు ఆత్మగౌరవంతో జీవించేలా వారి సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఒక పండుగలా నిర్వహిస్తున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి కల్పించేందుకు బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు, కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. సుమారు రెండు లక్షల మంది గిరిజన విద్యార్థులకు వసతి గృహాల ద్వారా ఉచిత విద్య అందిస్తున్నామని, మెగా డీఎస్సీ ద్వారా పెద్ద సంఖ్యలో గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభించాయని చెప్పారు. గత ప్రభుత్వం రద్దు చేసిన 18 గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరించి ఐటిడిఎలను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, వైద్య సదుపాయాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో భారీగా నిధులు ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. డోలీ మోతల సమస్యను నివారించేందుకు రహదారులు, ఫీడర్ అంబులెన్సులు, గర్భిణుల వసతి సదుపాయాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతో పాటు గిరిజనుల సంస్కృతి, కళలకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు రావడానికి ప్రభుత్వం చేస్తున్న కృషి ఎంతో ఉందన్నారు.

గిరిజన కళ అయిన థింసా నృత్యానికి గిన్నిస్ వరల్డ్ రికార్డు ద్వారా అంతర్జాతీయ గుర్తింపు లభించిందని తెలిపారు. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే నిజమైన స్వర్ణాంధ్ర సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

విజయవాడ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులకు గురుకులాలు, నాణ్యమైన భోజనం, నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఐఏఎస్, గ్రూప్1, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ, వైద్య సదుపాయాలు, మొబైల్ ఆస్పత్రులు, టూవీలర్ అంబులెన్సులు, ఉచిత రేషన్ వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. భవిష్యత్తులో లక్ష ఎకరాల్లో కాఫీ సాగును విస్తరించి గిరిజనుల ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ, గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, వైద్య సదుపాయాలను మెరుగుపరిచినట్లు తెలిపారు. గిరిజన యువత ఉద్యోగ అవకాశాలకు సంబంధించి ప్రభుత్వం న్యాయ నిపుణులతో చర్చించి చట్టబద్ధమైన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం. మల్లికార్జున నాయక్ మాట్లాడుతూ, గిరిజన విద్య కోసం రూ.1,353 కోట్లు కేటాయించి 1.63 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తున్నామని తెలిపారు. డీఎస్సీ ద్వారా 1,916 మంది కొత్త ఉపాధ్యాయులను నియమించి గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తున్నా మన్నారు. గిరిజన యువతకు ఉచిత సివిల్స్ కోచింగ్, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందిస్తున్నామని, రాబోయే ఐదేళ్లలో లక్ష ఎకరాల్లో కాఫీ సాగు విస్తరణతో పాటు పసుపు, రబ్బర్ హబ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ముందుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇతర ప్రజా ప్రతినిధులు కలిసి అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గిరిజనుల అభివృద్ధికి, గిరిజన ప్రాంతాల్లో చేపట్టే పలు అభివృద్ధి పనులకు అనేక కార్యక్రమాలు నిర్వహించేలా పలు ఒప్పందాలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో కుదుర్చుకున్నారు. కాఫీ పంటను పండిస్తున్న గిరిజన రైతు కొర్రా రాంబాబు, డ్వాక్రా గిరిజన మహిళ రావూరి గాయత్రి ముఖ్యమంత్రి సమక్షంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. భార్గవి, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్, ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్ల సునీత, జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీ ్మశ, గిరిజన నాయకులు ఇద్దేశ్రీ, ధన్ను దొర, దారా నాయక్, శ్రీనివాసరెడ్డి, మోజోరి తేజావతి, గంగులయ్య, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

# 163 ఎకరాలలో గిరిజనులకు పట్టాలు పంపిణీ

- గిరిజన ఆశ్రమ పాఠశాలలో 94శాతం ఉత్తీర్ణత
- శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్
- గిరిజన గ్రామాలను అభివృద్ధి చేశాం: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాలు



**కాశీబుగ్గ (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 9 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తుందని, 163 ఎకరాలలో గిరిజనులకు పట్టాలు పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కాశీబుగ్గ రైల్వే గ్రౌండ్‌లో ఆదివారం ఐటిడిఎ సీతంపేట ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని ప్రకృతి వనరులను పర్యాటకంగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడు తున్నట్లు తెలిపారు. జిల్లాలో 20 మండలాలు ఐటిడిఎ పరిధిలో ఉండగా 291 గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రూ. 179 కోట్లు వ్యయంతో 249 గ్రామాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఐటిడిఎ పరిధిలో 268 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, సుమారు 20 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నా రని, ఇటీవల పరీక్షా ఫలితాల్లో ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలు 94.77 శాతం ఉత్తీర్ణత సాధించారని ఇది గొప్ప విషయమన్నారు. అటవీ హక్కుల చట్టం కింద సుమారు 163 ఎకరాల భూమిని గిరిజనులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచిన గిరిజనుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డి.సిఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధికి చర్యలు చేపడుతున్నా రన్నారు. గిరిజన హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. టెక్కలి జిల్లా ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. యువతను అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు విఠల్ రావు, సీతంపేట ఐటిడిఎ ఎపిఓ చిన్నబాబు, పలాస ఆర్‌డిఓ ఆర్.అప్పలరాజు, డిఆర్‌డిఎ సంచాలకులు ఎన్.కిరణ్‌కుమార్, డిడి. అన్నా దొర, డిప్యూటీ విద్యాశాఖాధికారి పి.నాయుడు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అమెరికాలో మంత్రి లోకేష్.. ఎన్ఆర్ఐ డాక్టర్ రాజా కుమారుడి వివాహానికి హాజరు

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, తన అర్ధాంగి నారా బ్రహ్మణితో కలిసి అమెరికాలో జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరయ్యారు. గ్లోబల్ ఎన్నారై చీఫ్ డాక్టర్ రాజా కుమారుడి వివాహం అమెరికాలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్ర మానికి లోకేశ్ దంపతులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా నూతన వధూవరుల వద్దకు వెళ్లి మంత్రి లోకేశ్, నారా బ్రహ్మణి వారిని మనసారా ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ వేడుకలో లోకేశ్ దంపతులు సంప్రదాయ దుస్తులలో కనిపించా రు. కార్యక్రమానికి వచ్చిన పలువురితో వారు కాసేపు ముచ్చటించారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# విఆర్ఎల సమస్యలపై స్పందించకుంటే ఉద్యమిస్తాం

- ఎపి విఆర్ఎ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ సహాయకులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను సెప్టెంబర్ 15 లోపల పరిష్కారానికి చొరవ చూపాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని ఎపి విఆర్ఎ వెల్ఫేర్ అండ్ సర్వీసెస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య ప్రభుత్వానికి అల్టిమేట్ జారీ చేసారు. ఆదివారం దాసరిభవన్‌లో విఆర్ఎ అసోసియేషన్ రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకమునుపు విఆర్ఎలకు అనేక హామీలు ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీలను పట్టించుకునే స్థితి లేదని అన్నారు. విఆర్ఏలకు తక్షణం పేస్కేల్ అమలు చేయాలని, అర్హులైన విఆర్ఎలకే విఆర్ఓలుగా ప్రమోషన్ ఇవ్వాలని, నామినీ విఆర్ఎలను రెగ్యులర్ చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. గ్రామాలలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే చిరుద్యోగులను ఆదుకోకపోవడం అన్యాయం అన్నారు. దాదాపు 54 శాఖలకు సంబంధించి విధులను ఫుల్ టైం నిర్వహిస్తూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'వేతనం ఇచ్చేది తక్కువ.. పని భారం ఎక్కువ' అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించక పోతే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మిది ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శి నెల్లూరు అంకయ్య, భోగేశ్వరయ్య, కోడూరు పుల్లయ్య, బోట్ల నాగసుబ్బయ్య యాదవ్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు పోలీసుల కృషి



**తిరుపతి, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన 'మాన్సూన్ ప్లాంటేషన్ ప్రోగ్రామ్–2026'లో భాగంగా తిరుపతి జిల్లా పోలీసులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆదేశాలతో తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని జీవకోన జీవలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం మార్గదర్శకత్వంలో అలిపిరి సిఐ పివిఎస్ రామకిశోర్ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీవాణి, పోలీసు సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజల సమన్వయంతో 250 మొక్కలను నాటారు. ఇకఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతలచేను రోడ్డులో పోలీసు సిబ్బంది వంద మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం లక్ష ్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో మొత్తం 350 మొక్కలను నాటారు. నాటిన మొక్కలను స్థానిక ప్రజలు, పోలీసు సిబ్బంది సమన్వయంతో సంరక్షి స్తూ, వాటి ఎదుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# 'తిరంగ్గా మన గౌరవం.. దేశభక్తికి ప్రతీక

- ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపు



**గుంటూరు(విద్య), ఆగస్టు 9 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా గుంటూరులో బిజెపి జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్ర 200 మీటర్ల జాతీయ జెండాతో విజ్ఞాన్ మందిరం దగ్గర నుంచి మార్కెట్ సెంటర్ మీదగా లిబర్టీ, కృష్ణమహల్ థియేటర్ రోడ్డులో నుంచి నాజ్ సెంటర్ వరకు జాతీయ జెండాలతో 'భారత్ మాతాకీ జై, వందేమాతర్నం నినాదలతో శోభయాత్ర సాగింది. ఈ తిరంగా ర్యాలీలో ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడుతూ జాతీయ జెండా ప్రతి భారతీయుడి ఆత్మగౌరవానికి, దేశభక్తికి, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను గౌరవించాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని తెలిపారు. తిరంగా కేవలం ఒక జెండా కాదు ఇది మన స్వాతంత్ర్య పోరాటానికి, మన సైనికుల త్యాగాలకు ప్రతీక, 140 కోట్ల భారతీయుల ఐక్యతకు ప్రతీక అని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి 'హర్ ఘర్ తిరంగా – హర్ దిల్ తిరంగా' స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు.

రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ తిరంగా కేవలం ఒక జెండా కాదు ఇది భారతదేశ ఆత్మగౌరవానికి ప్రతీక అని ఈ జెండా కోసం లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను అర్పించారు. ప్రతి భారతీయుడి ఇంటిపై తిరంగా ఎగరాలి, ప్రతి గుండెలో దేశభక్తి వెలగాలి. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా, ప్రతి పౌరుడి జాతీయ బాధ్యతగా స్వీకరించాలి. మన మధ్య భాషలు వేరు కావచ్చు, ప్రాంతాలు వేరు కావచ్చు, సంప్రదాయాలు వేరు కావచ్చు కానీ మనందరినీ కలిపేది జాతీయ పతాకం మాత్రమే అని కులం, మతం, ప్రాంతం, రాజకీయ భేదాలకు అతీతంగా దేశం కోసం ఒక్కటిగా నిలబడాలి అని అన్నారు. తూర్పు ఎమ్మెల్యే నజీర్ మహమ్మద్ మాట్లాడుతూ యువత చేతిలో జాతీయ పతాకం ఉంటే దేశ భవిష్యత్తు భద్రంగా ఉంటుంది. సోషల్ మీడియాలో దేశభక్తి సందేశాలు పంచుకోవడం మాత్రమే కాదు, సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, విద్యా ప్రోత్సాహం, అవినీతి వ్యతిరేక పోరాటం వంటి కార్యక్రమాల్లోనూ యువత ముందుండాలి అని అన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ దేశాన్ని విమర్శించడం సులభం దేశాన్ని నిర్మించడం కష్టం అని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించినప్పుడే నిజమైన దేశభక్తి నిరూపిత మవుతుంది. మన ఇల్లు శుభ్రంగా ఉంచడం నుంచి, ప్రజా ఆస్తులను కాపాడటం వరకు ప్రతి మంచి పని కూడా దేశ సేవే అని అన్నారు. ఈతిరంగా ర్యాలీలో ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ షేక్ సజీల, తిరంగా ర్యాలీ రాష్ట్ర కన్వీనర్ గుడిసె దేవానంద్, కో కన్వీనర్లు శివారెడ్డి, సాయి లోకేష్, డాక్టర్ మండూరి వెంకటరమణ, బిత్ర శివన్నారాయణ, కొత్తూరు వెంకట సుబ్బారావు, ఈదర శ్రీనివాసరెడ్డి, వెలగలేటి గంగాధర్, పాలపాటి రవికుమార్, ఆవుల నాగేంద్ర యాదవ్, డాక్టర్.గి.జు. రావు తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ డాక్టర్ చరక కుమార్ గౌడ్, కో కన్వీనర్లు క్రిష్టిపాటి నారాయణరెడ్డి, మేడూరి యశ్వంత్, నాయకులు వై.వి.సుబ్బారావు, షేక్ ఫైరోజ్, నడ్డి నాగమల్లేశ్వరి, హరి పావని, భజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, సాధు రామకృష్ణ, కఠారి వాసుదేవ నాయుడు, సురేష్ జైన్, మంత్రి సుగుణ, మేరీ సరోజిని, విమలాదేవి, విజయలక్ష్మి ్మ, దానబోయిన శివయ్య, వీర మణింద్ర, ఆమతి వెంకట రమణ, డాక్టర్ రాధా మాధవి, తుంగ యశ్వంత్, తురక రామారావు, షేక్ రఫీ, అబ్దుల్ ఖుద్దుస్, గౌస్ పీరా, షేక్ ఫర్హానా, అబ్దుల్ రషీద్, కాయితీ ప్రదీప్, కంతేటి బ్రహ్మయ్య, మేకల లక్ష ్మణ్, రావుల రాజశేఖర్, మొవ్వ నరేష్, మల్లాల లక్ష ్మణ్, చింతల పూడి సురేష్, మలిశెట్టి పవన్, పెసల వెంకటేష్, బెహర గాయత్రి, గొర్ల నాగమల్లేశ్వరి, చిరతన గండ్ల భూలక్ష్మి ్మ, లంక రవి, గాలేటి బాబు, సిద్దే సురేష్, నంద కిషోర్, కనసాని శ్రీనివాస రావు, రాజేష్ నాయుడు, అప్పిశెట్టి రంగా, రాచముల్లు భాస్కర్, పోతురాజు వేంకటేశ్వర్లు, శేషగిరి, కామేపల్లి వెంకటేశ్వర్లు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తిరుపతిలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగ్గా



**తిరుపతి, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తిరుపతిలో 'హర్ ఘర్ తిరంగ్గా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుపతిలోని టాటానగర్, పీకే లేఔట్‌తో పాటు పలు ప్రాంతాల్లో బిజెపి సీనియర్ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు జాతీయ జెండాలను అందజేసి, తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయించారు. ఈ సందర్భంగా గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ, జాతీయ జెండా దేశ సమైక్యతకు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అని అన్నారు. ప్రతి భారతీయుడు త్రివర్ణ పతాకాన్ని అత్యంత గౌరవంతో ఎగురవేసి, స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశభక్తి భావనతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో 'హర్ ఘర్ తిరంగ్గా కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడేలా ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ అభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుండాల గోపినాథ్, పెరియస్వామి రామ్‌కుమార్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, బిజెపి నాయకులు, స్థానికులు విగ్రహాల కళ్యాణి, సిద్ధమ్మ, కవిత, శారదా, లక్ష ్మయ్య, లోకనాథం, వాసు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విజయం సాధించగలమనే విశ్వాసం ఉన్నవాళ్లు
విజయం సాధించి తీరుతారు.

న- డబ్ల్యు. ఎమర్సన్

# సాగీ సాగని 'సాగు'!

కాస్త ఆలస్యంగానైనా వర్షాలు పడ్డాయి కానీ ఖరీఫ్ సాగుకు అవసరమైన తరుణంలో వానలు కురవకపోవడమొక్కటే తెలుగు రాష్ట్రాల రైతాంగాన్ని వేధిస్తున్న ఒకే ఒక బెంగ. ఎల్‌నినో, దానివెంట సూపర్ ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్‌లో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలో హెచ్చరించి, ఎలా ఎదుర్కోవాలో చెప్పి రైతును ముందస్తు సన్నద్ధ చేయడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ముందు చూపుతోనే వ్యవహరించారని చెప్పాలి. అంతేకాదు రైతాంగాన్ని ఆదుకునే విషయంలో ప్రభుత్వాలు ఏ ఆప్షన్‌ను వదులుకోలేదు. దేవాలయాల్లో వరుణ యాగాలు కూడా మొదలెట్టేశాయి. ఏమైతేనేం ఈసారి వర్షాలు కురిసాయి. వీటితో పంటలు నిలబడతాయానే అనుకోవాలి. 'వరి'కి తగినంత నీరు అందించలేమనే ఉద్దేశంతో ఉభయ రాష్ట్రాలు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారించాలని హితబోధ కూడా చేసింది. మార్కెటింగ్‌లో కూడా వీలైన పరిస్థితులు ప్రత్యామ్నాయపంటకే సానుకూలమని నచ్చచెప్పినా సాంప్రదాయ రైతు 'వరి'కే మొగ్గుచూపాడు. తాజా గణాంకాల ప్రకారం 'వరి' విషయంలో రైతు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. దేవుని మీద భారం పెట్టేసి విత్తునాటేసాడు. ఇప్పుడు కొనసాగుతున్న వానలువరదలై రైతును ఆనందోత్సాహాల మధ్య ముంచుతున్నా, పంటల యాజమాన్యంలో ఎన్నిసమస్యలు ఎదురు చూస్తారో ఇప్పుడిప్పుడే అంచనా వేయలేం. ప్రస్తుతానికైతే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రైతులు వర్షానందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడొస్తున్న వర్షాలతో పూర్తిస్థాయి సాగు నడుస్తుందో లేదో పంట ఉత్పత్తులు సజావుగా బయటపడతాయో లేదో చెప్పేందుకు ఎదురు చూడాల్సిందే. ఈ వర్షాలు ప్రస్తుతానికైతే ఊరటనిస్తున్నాయి. అలా అని 'ఎల్‌నినో' ముప్పు ఉండదని, గట్టెక్కేసినట్లేనని చెప్పే పరిస్థితులు మృగ్యం. వచ్చే రబీ సీజన్‌లో కూడా ఎల్‌నినో ముప్పు ఉంటుందని ఏనాడో శాస్త్రజ్ఞులు విశ్లేషించి చెప్పారు. సకాలంలో నీరు రాక ఎండిపోయిన నేలలు తడిసి ముద్దయ్యాయి. ప్రస్తుతం కళ్లెదుట కనిపిస్తున్న వాన పరిస్థితులతో తెలుగు రాష్ట్రాల రైతుల్లో ఖరీఫ్‌పై ఆశలు చిగురించాయి. అయినా వర్షాల అనిశ్చితితో ఎదుర్కోవాల్సిన కష్టాలు ముందున్నాయి. 2026లో దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలపై ఎల్‌నినో ప్రభావం చెప్పుకోదగినట్లుగానే ఉంటుందని భారత్ వాతావరణ సంస్థ ముందుగానే హెచ్చరించినందున రైతు వర్షాల కోసం ఎదురు చూశాడు. అవి రానే వచ్చాయి. అన్ని చోట్లా సరిపడే వర్షాలు కురిసినట్లు చెప్పుకుంటున్నా నీటి పంపిణీలో ఎగుడుదిగుడుల కారణంగా సాగు పరిస్థితులపై అప్పుడే ఓ నిర్ణయానికి రాలేం. అంటే ఓ ప్రాంతానికి వానవెల్లువ, అదే ప్రాంతంలోని మరో చోట వర్షాభావం ఉంటే సాగు బహుకష్టమే. ఆంధ్రప్రదేశ్‌లో జలాశయాల్లో నీటి నిల్వలను బట్టి ఖరీఫ్‌సాగు పురోగతి ఉంటుంది. జులై చివరి నాటికి ఈ రాష్ట్రంలో వర్షపాత లోటు గణనీయంగా ఉంది. అదే సమయంలో తెలంగాణలో వర్షపాతం లోటుతో సాగు ఆలస్యమైంది. తాజాగా గోదావరి పరివాహక ప్రాంతాల్లో వర్షాల పరిస్థితిని బట్టే తెలంగాణ జలవనరులు దాదాపు అందుబాటులోకి వచ్చాయి. ఉభయ రాష్ట్రాలలో తక్కువ నీటితో సాగయ్యే పంటల మీద కూడా రైతాంగం శ్రద్ధ పెట్టినందుననేలలో తేమను కాపాడుకోవడం, వాననీటిని పొలాల్లో నిల్వ చేసుకోవడంలో రైతు అప్రమత్తంగా ఉండడం అవసరం. ఎన్ని హెచ్చరికలు చేసినా పంటల వైవిధ్యీకరణ నేపథ్యంలో పంటల సాగులో 10శాతంరైతులు అధిక విస్తీర్ణంలో విత్తారు. వరి సేద్యాన్ని ఎవరూ వదిలిపెట్టలేదు. ఉభయ రాష్ట్రాల్లోనూ ప్రస్తుతం ఖరీఫ్ నాట్లు బాగానే పడ్డాయి. కాస్త అటూఇటూగా నాటినా పంటల పెరుగుదలలో ఉన్నాయి. తాజా వర్షాలలో ఉభయ రాష్ట్రాలో సాగులోటు బాగా తగ్గింది. తెలంగాణలో గత ఖరీఫ్ సీజన్ కంటే ఈసారి రాష్ట్రంలో సాగు విస్తీర్ణమైతే పెరిగింది. ఇప్పటి వరకు సాగు విస్తీర్ణంలో అధిక భాగం వరి,పత్తి, మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గుచూపారు. గతంతో పోల్చిచూస్తే పప్పుధాన్యాలు, నూనెగింజలు పంటల విస్తీర్ణం పెరుగుదల చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం సాగు 32.05 లక్షల హెక్టార్లు తెలంగాణ ఖరీఫ్ సాగు సాధారణ విస్తీర్ణం 31.16 లక్షలు. దీర్ఘకాలిక పంట నమూనాలో పత్తి, వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు,వేరుసెనగ, ప్రధానంగా ఉన్నాయి. ఇకపై సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు పంట ఉత్పత్తులు మార్కెట్‌కి చేరే వరకు జాగ్రత్తగా కంటికిరెప్పలా చూసుకోవాలి. ఈసారి నైరుతి రుతుపవనాలు ఉభయ తెలుగు రాష్ట్రాలలో సాధారణం కంటే 8శాతం నుంచి 12 శాతం అధిక వర్షాలు పడినట్లే. ఉద్యాన పంటలకు అతివృష్టి దెబ్బ తగ్గింది.తొలుత ఎల్‌నినో ప్రభావంతో కరవువస్తుందని కంగారు పడ్డాం.కానీ జులైనెలలో అతివృష్టితోఆంధ్రప్రదేశ్‌లో గోదావరి కృష్ణా డెల్టా సాగు సంతృప్తికరమే. రాయలసీమలో చెరువులు నిండక 30 శాతం ఆయకట్టు తగ్గింది. మిర్చికి తొలిరోజుల్లో పూతరాలిపోయి 25శాతం దిగుబడి తగ్గే అవకాశం ఉంది. కోస్తా జిల్లాల్లో విరివిగా పండే అరటి, మామిడి ఈదురుగాలలు కారణంగా చెట్లు నేల కొరిగాయి. ఇక తెలంగాణలో కూరగాయల తోటలు నీట మునిగాయి. ఇవన్నీ అనుకోకుండా వచ్చిన నష్టాలే. వీటన్నిటి నుండి రైతుతేరుకోవడం ఎంతో కష్టం.వర్షాధార పంటలకు భూగర్భజలాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు ఈ వర్షాలు ఏమూలకీ సరిపోవు.నీటి వినియోగ అవసరాలను గుర్తించి నీటి మళ్లింపు ప్రక్రియకు వ్యవసాయ శాఖ మార్గదర్శనం చేయాలి. ప్రస్తుతం నడుస్తున్న పంటల భీమా పథకాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి. అప్పుడే రైతు మనసు తేలికపడుతుంది.

విద్య అనేది శాస్త్రాలను
వివరించేందుకే పరిమితం కారాదు.
ఒక పరిపూర్ణమైన మానవుని
తీర్చిదిద్దే అసలైన విద్య.



రవీంద్రనాథ్ ఠాగూర్

శారీరక సామర్థ్యం ద్వారా
మనకు బలం రాదు.
అణచిపెట్టలేనంతటి ఆత్మబలం
ద్వారానే అది లభిస్తుంది.



మహాత్మా గాంధీ

# పేరు మారితే మహిళల 'దిశ' మారుతుందా?

**చట్టాలను మార్చడం కంటే అమలు వ్యవస్థను మార్చడం కష్టమైనపని. అందుకే ప్రభుత్వాలు వాస్తవాలను పక్కనపెట్టి చట్టాల పేర్లు మాత్రమే మార్చడంసమస్యకు మూలపరిష్కారం కాదు. దిశబిల్లు వెనక్కి వెళ్లింది. రేపు మరో ప్రభుత్వం మరో పేరుతో ఇంకోచట్టం తీసుకురావచ్చు. కానీ మహిళల జీవితాల్లో భయం తగ్గకపోతే, పోలీస్‌స్టేషన్‌లో అవమానం ఆగకపోతే, కోర్టుల్లో న్యాయం సంవత్సరాల తరబడి నిరీక్షి ంచాల్సి వస్తే, దళిత,ఆదివాసీ, బీసీ,మైనారిటీ, పేదమహిళలపై జరిగేహింస జాతీయ చర్చగా మారకపోతే,ఈ దేశానికి సమస్య చట్టాల కొరత కాదు. రాజకీయ చిత్తశుద్ధి కొరత. పరిపాలనా సంకల్పం కొరత. సామాజిక న్యాయం కొరత. దిశబిల్లు వెనక్కి వెళ్లిందా లేదా అనేది రేపు ఒక పరిపాలనా నమోదుగా మాత్రమే మిగిలిపోవచ్చు. కానీ మహిళల దశ మారిందా లేదా అనేదే ఈ కాలానికి చరిత్ర తీర్పు చెబుతుంది.**



పాపని
నాగరాజు

ప్రతి అత్యాచారం తర్వాత ఒక కొత్త చట్టం వస్తోంది. ప్రతికొత్త చట్టం తర్వాత మరో అత్యాచారం కూడా జరుగుతోంది. మారేది చట్టాల పేర్లు మాత్రమే. మహిళల జీవితం కాదు. ప్రజల్లో ఆగ్రహం చెలరేగితే ప్రభుత్వాలు కొత్త చట్టాలను ప్రకటిస్తాయి. మీడియా వాటిని సంచలనంగా చూపిస్తుంది. రాజకీయ పార్టీలుమహిళల భద్రతపై పోటీగా ప్రకటనలు చేస్తాయి. కొద్దిరోజులకు ఆ ఆగ్రహం చల్లారిపోతుంది. చట్టం ఫైళ్లలో పడిపోతుంది. ఇదే చక్రం మళ్లీ తిరుగుతుంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దిశ బిల్లును ఉపసంహరించుకుంది. ఇది ఒక పరిపాలనా నిర్ణయంగా కనిపించవచ్చు. కానీ లోతుగా చూస్తే, అధికార కేంద్రీకరణ, పితృస్వామిక, నిర్లక్ష్యం సామాజిక అసమానతలు ఒకే చోట కలిసిన నిర్ణయంగా కనిపిస్తుంది. అసలు ప్రశ్న దిశ బిల్లు గురించికాదు. దిశ బిల్లు వెనక్కి వెళ్లింది. మహిళల దశ మారిందా? 2019లో హైదరాబాద్‌లో ఒక యువ పశువైద్యురాలిపై జరిగిన సామూహిక అత్యాచారం, హత్య దేశాన్ని కుదిపేసింది. ఆ ఘటనపై వెల్లువెత్తిన ప్రజాఆగ్రహానికి రాజకీయ ప్రతిస్పందనగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దిశ చట్టాన్ని తీసుకొచ్చింది.అత్యాచార కేసులదర్యాప్తు, విచారణను వేగవంతం చేయడం, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడం, కఠిన శిక్షలు అమలు చేయడం వంటి లక్ష్యాలతో ఈ చట్టాన్ని రూపొందించింది. అయితే ఇది ఒక్కసారిగా పుట్టిన ఆలోచన కాదు. 2012లో ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటన తర్వాత దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. దాని ఫలితంగా 2013లో నేరచట్టాల్లో కీలక సవరణలుజరిగాయి. చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టేందుకు పోక్సో చట్టం అమల్లోకి వచ్చింది. ప్రతి దారుణ ఘటన తర్వాత ఒక కొత్త చట్టం వచ్చింది. కానీ ఒక్కసారి కూడా మనం ఒక ప్రశ్నను గంభీరంగా అడగలేదు. ఇప్పటికే ఉన్న చట్టాలు ఎందుకు విఫలమయ్యాయి? చట్టాలు మారాయి. శిక్షలు కఠినమయ్యాయి. నేరాల నిర్వచనాలు విస్తరించాయి.అయినప్పటికీ మహిళలపై హింస తగ్గలేదు. దీనర్థం సమస్య చట్టాల కొరతలో లేదని, చట్టాలను అమలు చేసే వ్యవస్థలోనే ఉందని స్పష్టమవుతోంది. ఇక్కడ మరో వాస్తవాన్ని కూడా గుర్తించాలి. ప్రతి మహిళపై జరిగిన దారుణం ఒకేస్థాయిలో ప్రజాస్పందన పొందదు. ప్రతి బాధితురాలికి ఒకే స్థాయిలో రాజకీయ అండ, మీడియా దృష్టి, సామాజిక సంఘీభావం దక్కదు. నిర్భయ ఘటన దేశ రాజధానిలో జరిగింది.కానీ గ్రామాల్లో, అట్టడుగు వర్గాల్లో, శ్రామిక కుటుంబాల్లో, దళిత, ఆదివాసీ, బీసీ, మైనారిటీ మహిళలపై నిత్యం జరిగే హింసలో ఎక్కువ భాగం జాతీయ చర్చగామారదు. చట్టాలు ప్రజాఆగ్రహం నుంచి పుడతాయి. కానీ ఏఆగ్రహం చట్టంగా మారుతుంది? ఏ బాధ మౌనంగా మిగిలిపోతుంది? అనే ప్రశ్నకు సమాధానం మన సామాజిక నిర్మాణంలోనే దాగి ఉంది. ప్రియాంక రెడ్డి ఒక మహిళ కనుక దేశమంతా స్పందించింది. అదే తీవ్రతతో, అదే వేగంతో, అదే రాజకీయ సంకల్పంతో దళిత,ఆదివాసీ, బీసీ, మైనారిటీ,పేద మహిళలపై జరిగే అత్యాచారాల విషయంలో ఎందుకు స్పందించరు? ఈప్రశ్న తర్వాత అనేక దళిత, బహుజన సంఘాలుకూడా ఇదే అంశాన్ని బహిరంగంగా చర్చించాయి. హత్రాస్‌లో దళిత యువతిపై జరిగిన అత్యాచారం, బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన నిందితుల విడుదల చుట్టూచెలరేగిన వివాదం, మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన ఒకే విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. చట్టం అంద రికీ ఒకటే కావచ్చు. కానీ న్యాయం అందరికీ ఒకే వేగంతో, ఒకే తీవ్రతతో అందడం లేదు. బాధితురాలి కులం, వర్గం, ప్రాంతం, రాజకీయ పరిస్థితి కూడా న్యాయవ్యవస్థ స్పంద నను ప్రభావితం చేస్తున్నాయనే విమర్శలు యాదృచ్ఛికంగా రావడం లేదు. 2019



డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన దిశ చట్టం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపబడింది. అక్కడే అది ఐదేళ్లకు పైగా నిలిచిపోయింది. నేర చట్టాలు ఉమ్మడి జాబితాకు చెందిన అంశం కావడంతో రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి. కేంద్ర హోంశాఖ పలు నిబంధనలపై వివరణలుకోరింది. ఫైళ్లు కదిలాయి.కానీ చట్టం ముందుకు కదల్లేదు. ఈ ఐదేళ్లలో ఎంతమంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు?ఎన్ని కుటుంబాలు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగాయి? ఎంతమంది బాధితులు పోలీస్ స్టేషన్ గుమ్మం దాటలేకపోయారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పే ప్రభుత్వాలు లేవు. చట్టం పెండింగ్‌లో ఉన్నంతకాలం ప్రజలకు ఇచ్చినహామీ కూడా పెండింగ్‌లోనే ఉంది.వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం చేయడం వరకు తన బాధ్యతను నిర్వర్తించింది. కానీ రాష్ట్రపతి ఆమోదం కోసం అవసరమైన రాజకీయ, న్యాయ పోరాటాన్ని కొనసాగించ లేకపోయింది. మరోవైపు కేంద్రప్రభుత్వం వివరణల పేరుతో ఫైల్లను నిలిపి వేసింది. ఫలితంగా రాజకీయాలు సాగాయి. పరిపాలనా ప్రక్రియ కొనసాగింది.కానీ న్యాయం మాత్రం వేచిచూసింది. ఇప్పుడు ఎందుకు ఉపసంహరించుకున్నారు? భారతీయ శిక్షాస్మృతి, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత అమల్లోకి వచ్చాయని, మహిళలు, చిన్నారుల రక్షణకు అవసరమైన అనేక నిబంధనలు కొత్త కేంద్ర చట్టాల్లోనే ఉన్నాయని చెబుతూ దిశ బిల్లును ఉపసంహరించుకుంది. కానీ ఇక్కడితో చర్చముగియదు. అదే మంత్రివర్గ సమావేశంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చట్టం, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానం, అమరావతి ఐ ప్రాజెక్టు వంటి పెట్టుబడులకు సంబంధించిన నిర్ణయాలు వేగంగా ఆమోదం పొందాయి. మహిళల భద్రతకు సంబంధించిన చట్టంమాత్రం ఐదేళ్లు ఫైళ్లలో తిరిగి చివరకు ఉప సంహరణకు గురైంది. మహిళల భద్రతకు సంబంధించిన చట్టం సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంటుంది. కానీ పెట్టుబడిదారులకు సంబంధించిన నిర్ణయాలు ఒకే సమావేశంలో ఆమోదం పొందుతాయి. ఇది యాదృచ్ఛికం కాదు. పాలక వ్యవస్థకు ఏఅంశాలు అత్యవసరమో, ఏ అంశాలు వేచి ఉండవచ్చో తెలిపే రాజకీయ ప్రాధాన్యతల క్రమం.అభివృద్ధి అంటే పెట్టుబడుల ప్రవాహమేనా? లేక మహిళలు భయం లేకుండా జీవించగల సమాజాన్ని నిర్మించడమూ అభివృద్ధేనా? అనే ప్రశ్నకు ప్రభుత్వం తన నిర్ణయాలతోనే సమాధానం చెబుతోంది. దిశబిల్లును ఉపసంహరించుకున్న ప్రభుత్వం, రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా మరింత సమగ్రంగా రూపొందించిన ప్రత్యామ్నాయ చట్టాన్ని ఇప్పటివరకు తీసుకురాలేదు. 'కొత్త కేంద్ర చట్టాలే సరిపోతాయి' అనడం పరిపాలనా సమాధా నం కావచ్చు. కానీ మహిళల భద్రత విషయంలో రాష్ట్రానికి ఉన్న రాజ్యాంగబద్ధమైన బాధ్యత అక్కడితో ముగిసిపోదు. ప్రతిదారుణ ఘటన తర్వాత చట్టాలను మరింత కఠినత రం చేయాలనే డిమాండ్ వస్తుంది. ప్రతి ప్రభుత్వం కూడా అదే మార్గాన్ని ఎంచుకుంటుంది. కానీ చరిత్రమరో వాస్తవాన్ని చెబుతోంది. నేరాలను ఆపేది శిక్ష తీవ్రతకాదు. నేరం చేసినవాడు తప్పకుండా పట్టుబడతాడనే భయం. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరుగుతుందనే విశ్వాసం. విచారణఆలస్యం కాదనే నమ్మకం.శిక్ష తప్పదనే పరిపాలనా సామర్థ్యం. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడానికే రోజులు పట్టినా, ఫోరెన్సిక్ నివేదికలు నెలలతరబడి ఆలస్యమైనా, ప్రత్యేక కోర్టులు తగినంత లేక కేసులు సంవత్సరాల పాటు పెండింగ్‌లో ఉన్నా, అత్యంత కఠినమైన చట్టం కూడా పుస్తకాలకే పరిమితమవుతుంది. చట్టాలను మార్చడం కంటే అమలు వ్యవస్థను మార్చడం కష్టమైనపని. అందుకే ప్రభుత్వాలు వాస్తవాలను పక్కనపెట్టి చట్టాల పేర్లు మాత్రమే మార్చడం సమస్యకు మూలపరిష్కారం కాదు. దిశ బిల్లు వెనక్కివెళ్లింది. రేపుమరో ప్రభుత్వం మరోపేరుతో ఇంకోచట్టం తీసుకురావచ్చు.కానీ మహిళల జీవితాల్లోభయం తగ్గకపోతే, పోలీస్‌స్టేషన్‌లో అవమానం ఆగకపోతే, కోర్టుల్లో న్యాయం సంవత్సరాల తరబడి నిరీక్షి ంచాల్సి వస్తే, దళిత, ఆదివాసీ, బీసీ, మైనారిటీ, పేద మహిళలపై జరిగే హింస జాతీయ చర్చగా మారకపోతే, ఈ దేశానికి సమస్య చట్టాల కొరతకాదు.రాజకీయ చిత్తశుద్ధి కొరత, పరిపాలనా సంకల్పం కొరత, సామాజిక న్యాయం కొరత. దిశ బిల్లు వెనక్కి వెళ్లిందా లేదాఅనేది రేపు ఒక పరిపాలనా నమోదుగా మాత్రమే మిగిలిపోవచ్చు. కానీ మహిళల దశ మారిందా

# మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలకు అంతం లేదా?

కామిడి సతీష్ రెడ్డి

ఉభయ తెలుగు రాష్ట్రాలలో మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలు శృతి మించిపోతున్నాయి. గతంలో పలువురు పేద మహిళల ప్రాణాలు బలిగొన్న మైక్రో ఫైనాన్స్‌లు మళ్లీ విజృంభిస్తున్నాయి. పేద కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా పతనం చేస్తూ వారి పాలిట శాపంగా మారిన మైక్రో ఫైనాన్స్‌లను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం నిషేధించింది. తిరిగి పుంజుకున్న మైక్రో ఫైనాన్స్‌లు ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుంటూ పడగ విప్పుతున్నాయి. తీసుకున్న రుణాన్ని ప్రతీవారం చెల్లించాల్సిన మైక్రోఫైనాన్స్‌ల ఊబిలో పేదవర్గాలు కూరుకుపోతున్నాయి. మరోసారి పాత దుర్ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు. సమభావన సంఘాలు, స్త్రీనిధి, ముద్ర తదితర రూపకాలలో ప్రభుత్వం రుణాలను అందిస్తున్నప్పటికీ పలువురు మహిళలు తక్షణ ఆర్థిక అవసరాల కోసం మైక్రో ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. కానీ తిరిగి చెల్లింపులో ఇబ్బందులకు గురవుతూ మానసిక, ఆర్థిక క్షోభకు గురవుతుండగా నెలవారీగా చెల్లించాల్సిన బ్యాంకు లింకేజీ రుణాలను చెల్లించలేకపోతున్నారు. దీంతో మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలను ప్రారంభంలోనే నియంత్రించాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. భారత బ్యాంకింగ్ వ్యవస్థలో రుణాల చెల్లింపులో మహిళా సంఘాలే అగ్రగామిగాఉంటున్నాయి. ఏ ఒక్క సభ్యురాలు రుణ వాయిదాల చెల్లింపులో ఆలస్యం చేసినా మిగతా సభ్యులు బాధ్యత వహిస్తూ ఆ మహిళతో రుణ వాయిదా చెల్లింపచేయడమో లేదా తామే భరించడమో చేస్తున్నారు. దీంతో మహిళా సంఘాల రికవరి సుమారు 100 శాతంగా ఉంటోంది. దీంతో మహిళల ఆర్థిక అవసరాలు, రుణాల చెల్లింపులో నిజాయితీని ఆసరాగా చేసుకుంటూ పలు మైక్రోఫైనాన్స్‌లు విజృంభిస్తున్నాయి. ఆర్‌బీఐ అనుమతులు, నిబంధనల మేరకే మైక్రో రుణాల మంజూరు ప్రక్రియను నిర్వహిస్తున్నామంటూ మైక్రోఫైనాన్స్‌ల ఏజెంట్లు పట్టణాలలోని బస్తీలు, గ్రామాల్లో ఇల్లిల్లు తిరుగుతున్నారు. 10మందితో సంఘాలు ఏర్పాటు చేయిం చి రుణ మంజూరు తంతును పూర్తిచేసి వారంవారం రుణ వాయిదాలను వసూలు చేస్తున్నారు. మొదటి విడతగా ఒక్కో సభ్యురాలికి రూ.30వేల మైక్రోరుణం మంజూరు చేస్తూ క్రమేపీ రుణ పరపతిని పెంచుతున్నారు. అంతేకాక ఆస్తులపై మార్టిగేజీ లోన్‌లు కూడా ఇస్తున్నారు.దీంతోపలు వురు మహిళలు సంఘాలుగా ఏర్పడిన స్తోమతకు మించి మైక్రో రుణాలను స్వీకరిస్తూ చెల్లించలేక చతికిలా పడుతున్నారు. రుణ వాయిదా చెల్లించే రోజున ఇంటికి తాళం పెట్టి వెళ్తున్న సందర్భాలు, ఫోన్‌లో అందుబాటులోఉండని పరిస్థితులు పెరుగుతున్నాయి. దీంతో సంఘం మిగతా సభ్యులు, మైక్రో ఫైనాన్స ప్రతినిధులు సభ్యురాళ్ల ఇంటి ముందు గొడవలు చేస్తున్నారు. గతంలో రుణగ్రహితలు అయిన సభ్యురాళ్లు మరణిస్తే రుణచెల్లింపు జరిపే వరకు అంత్యక్రియలు నిర్వహించకుండా అడ్డుకున్న పరిస్థితులు ఉండేవి. మహిళలతో పాటు పురుషులు కూడా సంఘాలుగా ఏర్పడి మైక్రోరుణాలు పొందుతుండటంతో ఆయా కుటుంబాలపై ఆర్థికభారం మరింత పెరుగుతోంది. ప్రభుత్వం మైక్రో ఫైనాన్స్‌లపై చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో లింకేజీ రుణాల బకాయిలు పెరగడంతో పాటు పలువురు మహిళల జీవితాల్లో మైక్రో రుణాలు తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు వీని మీద ఆంక్షలు విధించాలి.

# పాదచారుల భద్రత అభివృద్ధికి సంకేతం



డాక్టర్ ఎ.
భాగ్యరాజ్

ఒక దేశం, ఒక నాగరిక సమాజం, ఒక నగరం ఎంత వెడల్పైన రోడ్లు కలిగి ఉందో కాదు, పాదచారులు ఎంత సురక్షి తంగా, గౌరవంగా నడవగలుగుతున్నారో అదే నిజమైన అభివృద్ధికి కొలమానం. దానిలో భాగంగా పాదచారులభద్రత అనేది ఒక అభివృద్ధి చెందిన దేశానికి అత్యంత ముఖ్యమైన ప్రమాణాల్లో ఒకటి. రహదారులు కేవలం వాహనాల కోసం కాదు, నడిచే ప్రజల కోసం కూడా సమానంగా ఉండాలి. సుప్రీంకోర్టు కూడా సురక్షి తమైన ఫుట్పాత్పై నడవడం అనేది జీవించే హక్కు (ఆర్టికల్ 21)లో భాగమని పేర్కొంటూ కేంద్ర, రాష్ట్రాలు పాదచారుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పాదచారుల మార్గం లేని ప్రాంతంలో పాఠశాలకు నడు చుకుంటూ వెళ్తుండగా ట్యాంకర్ ఢీకొని మరణించిన ఐదేళ్ల బాలుడికి సంబంధించిన ఒక కేసులో జూన్ 19, 2026 న తీర్పు నుండి ఉద్భవించింది. ఆగస్టు 3న, 2026, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం, అదనపు సొలిసిటర్‌జనరల్ ఆదేశాలను పాటించేలా చూడాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు ఒక ఉత్తర్వు జారీచేసింది. ఆక్రమణలకు గురికాని, పూర్తిగా వేరుచేసిన స్థలాన్ని ప్రతి రహదారి ప్రక్కన పాదచారుల కోసం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. రహదారి ఉందంటే పాదచారుల నడకదారి కూడా అందులో ఉన్నట్టే కదా, దీనికోసం పెద్దఎత్తున డబ్బులు ఖర్చుపెట్టి, భారీగా నిర్మాణాలు ఏమి చేయనక్కర్లేదు కదా, రహదారి నుంచి నడకస్థలాన్ని వేరుచేసే ఏర్పాటు ఉంటేసరిపోతుంది, ఆ స్థలం దురాక్రమణకు గురి కాలేదని చెప్పడానికి చిన్న తాడు అక్కడ కట్టినా సరిపోతుంది కదా అని బెంచ్ (జస్టిస్‌పి.ఎస్. నరసింహ,జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం) వ్యాఖ్యానించడం శుభపరిమాణం. పాదచారులు కదిలేవాహనాల మధ్య చిక్కుకుపోతామనే భయం లేకుండా నిర్భయంగా నడిచేందుకు అన్ని చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో పట్టణాభివృద్ధి విభాగాలు, మునిసిపల్ కార్పొరేషన్లు,మునిసిపాలిటీలు,పంచాయతీల యంత్రాంగాలదే బాధ్యత అని,బాధితులకు ఈ వ్యవస్థల నుంచి పరిహారం కోరే పూర్తి హక్కు ఉందని స్పష్టం చేసింది. పాదచారుల మార్గాలపై నడిచే ప్రాథమిక హక్కు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు,వ్యక్తిగత స్వేచ్ఛ) ఆర్టికల్ 19(1)(డి) (భారతదేశ భూభాగం అంతటా స్వేచ్ఛగాసంచరించే హక్కు) లో అంతర్లీనంగా ఉంది.నడవడం అనేది ఈ స్వేచ్ఛలలో అంతర్భాగం కాబట్టి, ఈ హక్కు ఆర్టికల్ 19(1)(ఎ) (భావ ప్రకటనా స్వేచ్ఛ), ఆర్టికల్ 19(1)(బి) (సమావేశం),ఆర్టికల్ 19(1)(సి) (సంఘం ఏర్పాటు) అంశాలను కూడా తనలో ఇముడ్చుకుంది అని వెలువరించింది. ఈ తీర్పు పట్టణాభివృద్ధి సంస్థలు, పురపాలక సంఘాలు,పురపాలక సంఘాలు



పంచాయతీలపై పాదచారుల మౌలిక సదుపాయాలను సృష్టించడం, నిర్వహించడం పరిరక్షి ంచడం అనే అనుబంధ బాధ్యతను విధిస్తుంది. పాదచారుల హక్కులను పరిరక్షి ంచ డానికి, జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి ఒక నిర్దిష్ట చట్టాన్ని రూపొందించాలని, అలాగే ఒక నియంత్రణ సంస్థ ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని కోరింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాదాచారుల భద్రత, సార్వత్రిక ప్రాప్యత పాలసీ2026 అనే విధానంతో రోడ్లపై నడిచే ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కులను రక్షి ంచ డానికి వారి భద్రతను నిర్ధారించడానికి తీసుకువచ్చిన ఒక చారిత్రాత్మక పాలసీకి ఆమోదం తెలిపింది. ఈ పాలసీ ముఖ్య ప్రాముఖ్యత, ఉద్దేశాలు భారతదేశంలో ఏటా వేలాది మంది పాదాచారులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పో తున్నారు. ఈ పాలసీ ద్వారా వాహనదారుల కంటే రోడ్డుపై నడిచే వారికే మొదటి ప్రాధాన్యత లభిస్తుంది.రోడ్డు ప్రమా దాల నివారణ భద్రతకు ప్రాధాన్యతనిస్తుంది. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించడానికి రోడ్లపై శాస్త్రీయంగా భద్రతా తనిఖీలు నిర్వహిస్తారు. ఆక్రమణలు లేని ఫుట్పాత్లు స్పష్టమైన విభజనకు అవకాశముంటుంది. ఫుట్పాత్లను ఆక్రమించి దుకాణాలు పెట్టడం, వాహనాలు పార్కింగ్ చేయడం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటారు. నడిచే దారి ఎల్లప్పుడూ ఖాళీగా ఉండేలా చూస్తారు.ఈ పాలసీ కేవలం సాధారణ ప్రజలకే కాకుండా దివ్యాంగులు, వృద్ధులు గర్భిణీ స్త్రీలకు కూడా సురక్షి తంగా నడిచేలా అందరికీ వీలు కల్పి స్తుంది. ఫుట్పాత్లపై వీల్చైర్లు వెళ్లేందుకు వీలుగా రాంప్లు, అంధులు నడవడానికి వీలుగా స్పర్శ మార్గాలు ఏర్పాటు చేయబడతాయి. స్థానిక మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలు తమ పరిధిలోని ఫుట్పాత్లను సంరక్షి ంచాల్సి ఉంటుంది. ఒకవేళ నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగితే పౌరు లు కోర్టుల ద్వారా నష్టపరిహారం పొందే హక్కు ఉంటుంది. కాబట్టి నిఘా, జవాబుదారీతనం అధికారులదే బాధ్యత. పాదాచారుల మార్గాల్లో భద్రత కోసం నిఘా కెమెరాలు, స్మార్ట్ క్రాసింగ్లను ఏర్పాటు చేస్తారు. సురక్షి తమైన దారులు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలు స్వల్ప దూరాలకు నడవడానికి ఇష్టపడతారు. నడక పెరగడం వల్ల వాహనాల వాడకం తగ్గి, పట్టణాలలో వాయుకాలుష్యం,ట్రాఫిక్ జాములు తగ్గుతాయి. మొత్తంగా చెప్పాలంటే, పాదాచారుల పాలసీ 2026 అనేది కేవలం రోడ్ల నిర్మాణానికి సంబంధించింది కాదు, ఇది నగరాలను యంత్రాల కోసం కాకుండా, మనుషుల కోసంమార్చే ఒక గొప్ప సంస్కరణ. నియమాలు ఉన్నప్పటికీ ప్రజలు, స్థానిక సంస్థలు, ట్రాఫిక్‌శాఖ,రోడ్లుభవనాల శాఖల మధ్య సమన్వయం లోపం ఎక్కువగా, అమలు లోపం ఉంది.యూరప్లో చాలాదేశాలు (నెదర్లాండ్స్,డెన్మార్క్, జర్మనీ, స్వీడన్, ఫ్రాన్స్ మొదలైనవి) పాదచారులకు ప్రాధాన్యం ఇచ్చే నగర రూపకల్పనను అనుసరిస్తున్నాయి. మన దేశంలో కూడా ప్రతి 200-300 మీటర్లకు సురక్షి త క్రాసింగ్ ఏర్పాటు చేయాలి. పాఠశాలలు, ఆసుపత్రుల వద్ద వేగ పరిమితిని 30కి.మీ./గం.కు పరిమితంచేయాలి. పట్టణ స్థానిక సంస్థల పనితీరును 'పాదచారుల భద్రత' ఆధారంగా కూడా అంచనా

# ప్రజావాక్కు



### సమగ్ర కార్యాచరణ అవసరం

**భారత్‌లో** సైబర్ నేరాలు రోజురోజుకూ ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. సుప్రీంకోర్టు ఇటీవల సైబర్ నేరాలనియంత్రణ ప్రభుత్వాలరాజ్యాంగబద్ధమైన బాధ్యత అని స్పష్టంగా పేర్కొనడం అత్యంత సమయోచితమైన పరిణామం. 2024లో దేశవ్యాప్తంగా 65.9లక్షల సైబర్ ఫిర్యా దులు, సుమారు రూ.55,493 కోట్ల ఆర్థిక నష్టం నమోదవడంసమస్య తీవ్రతను తెలియజేస్తోంది. డిజిటల్ పేమెంట్లు, ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు విస్తరిస్తున్న వేళ, భద్రతావ్యవస్థలు కూడా అదే స్థాయిలో బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం మోసగాళ్లు ఫేక్ లింకులు, ఫిషింగ్ సందేశాలు, నకిలీ ఫోన్ కాల్స్, వాట్సాప్ మోసాలు, డిజిటల్ అరెస్ట్, పెట్టుబడి ఆఫర్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు. బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీడబ్బు తిరిగిపొందడం,కేసుల దర్యాప్తు పూర్తవడం చాలా సందర్భాల్లో ఆలస్యమవుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వరుణ యాగాలు సిగ్గుచేటు!

**తెలంగాణలో** వర్షాభావం ఏర్పడిందనీ ఈ నెల పదవ తేదీ నాగర్జున సాగర్ వద్ద వరుణ యాగం తల పెట్టడం రేవంత్ రెడ్డి ఇజ్జత్‌ను తగ్గిస్తుంది. పోరాట యోధుడిగా రేవంత్‌కు మంచి పేరుంది. వర్షం పడకపోవటానికి శాస్త్రీయ కారణం చూడాలి.మేఘ మదనం వలన మేఘాలను రప్పించి వాటికి చల్లదనం కలిగిస్తే వర్షం పడుతుంది. అది శాస్త్రీయం.ఈ యాగాలు అన్ని కొంతమంది పూజారులు,పురోహితులకు జీవనాధారమైపోయింది.వాళ్ళుఏది చెబితే దాన్ని నమ్మి ప్రజాధనం దుర్వినియోగం చేయటం తగదు.ఆర్టికల్ 51 హెచ్‌లో వ్రాసుకున్నట్లుగా శాస్త్రీయ భావాలను ప్రభుత్వాలు పెంచాలి. అనాగరికమైన యజ్ఞాలు, యాగాలు చేయటం ప్రభుత్వాలు మానుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం

### తస్మాత్ జాగ్రత్త

రెండున్నరేళ్ల క్రితం తెలంగాణలో కెసిఆర్ ఆ వెంటనే ఎపిలో జగన్ ఢిల్లీలో కేజ్రీవాల్, ఈ మధ్య పినరయి విజయ్,మమత,స్టాలిన్‌ఎన్నికల్లో పరాజయంపాలై పదవీచ్యుతులు అయ్యారు.వారుచేసిన అవినీతిపనులు, అహంకార ప్రవర్తనే వారి ఈ ఘోర పరాజయానికి కారణం. ఇప్పుడుపాలన చేస్తున్నముఖ్యమంత్రులు తమకి అలాంటి పరాజయ పరిస్థితులు రాకుండా చూసుకోవాలి.

-మిథునం, హైదరాబాద్

### ఉత్తర్వులు సమంజసంగా లేవు!

**దశాబ్దాలుగా** మనం కావేరీ సంక్షోభాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వేసవిలో, తమిళనాడులో పంటలకు నీరు లేదని చెబుతూ, కావేరీ జలనిర్వహణ అథారిటీ లేదా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నీటిని విడుదల చేస్తున్నారు. మా మూడో పంట కూడా ఎండిపోతోంది,నీటిని విడుదల చేయమని చెప్పే తమిళనాడు ప్రభుత్వానికి, కర్ణాటకలో రెండే పంటలు పండినా అవి ఎండిపోయినా పర్వాలేదనే మనస్తత్వంలా కనిపిస్తుంది. ప్రస్తుతం, వర్షాలు లేకపోవడం వల్ల కర్ణాటక పై కరవు నీడ పడింది.రాబోయేరోజుల్లో ప్రజలు,పశువులు తాగునీటి కొరతను ఎదుర్కొనే అవకాశం ఉంది. ముఖ్యంగా బెంగుళూరు నగరం కూడా రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి ఎదురుక్కునే పరిస్థితులురావచ్చు అనేకథనాలు పత్రికల్లో వస్తున్నాయి. రెండు రాష్ట్రాల జలవనరుల పరిస్థితి గురించి అథారిటీ కి తెలుసు. అయినప్పటికీ, జలాశయాలలో ఉన్న కొద్దిపాటి నీటి నుండి తమిళనాడుకు నీటిని విడుదలచేయమని ఆదేశించడం సమంజసం కాదు. ఈ ఉత్తర్వులను పునః పరిశీలించాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### భారత్, బంగ్లా స్నేహసంబంధం

**ఫ్రాన్స్** మీడియా సంస్థతో ఇచ్చిన ఇంటర్వ్యూ లో బంగ్లా మాజీ ప్రధానిషేక్ హసీనాతిరిగి వెళ్లడం ఒక చర్చనీయాంశం. ఆశ్రీత పక్షపాతం ఉండడం, అవినీతి ఆరోపణలు మూలంగా విద్యార్థుల నిరసన ఎదుర్కోవడం వల్ల భారత్‌కు ఆశ్రయానికి వచ్చిన హసీనాకు భారత్ ఆపన్న హస్తం చాచింది. అయితే దీనివెనుక భారత్, బంగ్లా మధ్య ఉన్న స్నేహ సంబంధాలతో పాటు పాకిస్థాన్ దాష్టికాలకు వ్యతిరేకంగా భారత్ బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం సంపాదించడంలో 1971లో పాకిస్థాన్‌కి వ్యతిరేకంగా యుద్ధం కూడా చేసింది మర్చిపోకూడదు. భారత్ బంగ్లామధ్య స్నేహ సంబంధాలను ఎంతమాత్రం చెడగొట్టా లేకపోయాయి.భారత్,బంగ్లాదేశ్ మధ్యఉన్నది కేవలం స్నేహ సంబంధాలు మాత్రమే కాదు. ఈ రెండుదేశాల మధ్య ఉన్నది మిశ్రమ సంస్కృతి, లౌకికసంస్కృతి, అని గుర్తుపెట్టుకోవాలి.

- భారత అవినాష్, జనగామ

### మార్పులు జరగటం సహజం

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు, చట్టసభ సభ్యులు ఎప్పుడూ ఒకరే ఉండరు. ఐదు సంవత్సరాలు కాకపోతే 10 సంవత్సరాలు. అదికాకపోతే 20సంవత్సరాలు. మరి కొందరు 30 సంవత్సరాలు కూడా పదవుల్లో ఉంటారు. ఆ తరువాత మరొకరు వారి స్థానంలోకి వస్తారు. తప్పదు. దీన్ని అర్థం చేసుకుని హుందాగా వ్యవహరించాలి.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# 'జెన్‌జెడ్'ను తప్పదారిపట్టించారు..

## నీట్ లీకేజీలపై తొలిసారి గళం విప్పిన కేంద్ర మాజీ మంత్రి ధర్మేంద్రప్రధాన్

### భారత్‌ను 'విశ్వగురు'గా నిలబెట్టేది యువతే



**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన అంశంపై సీనియర్ బీజేపీ నాయకుడు, సంబల్‌పూర్ ఎంపి ధర్మేంద్ర ప్రధాన్ ఎట్టకేలకు నోరు విప్పారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో జరిగిన నిరసనల సందర్భంగా జెన్‌జెడ్ యువతను కొందరు తప్పుదోవ పట్టించారని, ఆ పరిణామాల వల్లే తాను పదవిని వీడాల్సి వచ్చిందని వెల్లడించారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవడంతో గతనెల 25న ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజీనామా తర్వాత దాదాపు రెండువారాలకు జీఎం యూనివర్సిటీలో విద్యార్థులు,అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆయన తొలిసారిగా ఈ బహిరంగ ప్రకటన చేశారు. జెన్‌జెడ్ యువత మన పిల్లలలాంటి వారని, కొందరు వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రధాన్ ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశంలో ఏటా కనీసం రెండు కోట్ల మంది పిల్లలు జన్మిస్తున్నారని, గత పదేళ్లలో 20 కోట్ల మంది పురుడు పోసుకున్నారని పేర్కొన్నారు. వారి అంచనాలు, ఆకాంక్షలు వేరని, రాబోయే రోజుల్లో వారే భారత్‌ను విశ్వగురుగా నిలబెడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తనకు పదవి ముఖ్యంకాదని, అందుకే స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీని కలిసి రాజీనామా సమర్పించినట్లు వివరించారు.మరొక సభలో మాట్లాడుతూ ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతా దళ్ అధినేత నవీన్ పట్నాయక్‌పై ధర్మేంద్ర ప్రధాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేడీ కార్యకర్తలు చేపట్టిన నిరసనలు, ధర్మేంద్ర ప్రధాన్ గో బ్యాక్‌నినాదాలకు తాను భయపడేది లేదని స్పష్టం చేశారు.ఎయిర్‌పోర్టు వద్ద బీజేడీ యువజన విభాగం చేసిన ఆందోళనలను ప్రస్తావిస్తూ తాను ఒక రైతు బిడ్డనని, వెనక్కి పొమ్మన్నా మళ్లీ వస్తూనే ఉంటానని వ్యాఖ్యానించారు. నవీన్ పట్నాయక్ యువతను రెచ్చగొట్టి తనపైకి పంపుతున్నారని, తనను ఒడిశా ప్రజలకు ఒక అవమానంగా, చెడు వ్యక్తిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎప్పుడైనా ఒడిశా ప్రజలు తలదించుకునే పనిచేశానా అని సభను ప్రశ్నించగా, ప్రజలనుంచి లేదని పెద్ద ఎత్తున స్పందన వచ్చింది.రాష్ట్రానికి పెద్దగా గౌరవం తేలేకపోయినా, తన ప్రవర్తనతో ఎప్పుడూ ఒడిశా ప్రతిష్టను దిగజార్చలేదని ప్రధాన్ స్పష్టం చేశారు. పన్నెండేళ్ల క్రితం జగన్నాథ స్వామి, సంబల్‌పూర్ ఆరాధ్య దైవం మా సమలేశ్వరి దేవి ఆశీస్సులతోనే తాను కేంద్ర మంత్రిని అయ్యానని గుర్తు చేసుకున్నారు. విచిత్ర మేమిటంటే బీజేడీ ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ లీడర్ ప్రసన్న ఆచార్య సమక్షంలోనే ప్రధాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.



# పేపర్ లీక్ ఆందోళనపై దిగివచ్చిన జార్ఖండ్ సర్కార్

## పరీక్షల రద్దుకు సుముఖమని తెలిపిన మంత్రి

**రాంచి, ఆగస్టు 9:** పేపర్ లీక్‌పై విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి జార్ఖండ్ సర్కార్ దిగొచ్చింది. సోమవారం జార్ఖండ్ అసెంబ్లీ ముట్టడికి విద్యార్థులు పిలుపునిచ్చారు. ఆదివారం మరోసారి విద్యార్థులు, ప్రభుత్వం మధ్య జరిగిన చర్చలు కొలిక్కి రాలేదు. అయినప్పటికీ జెపిఎస్‌సి జెఎస్ఎస్‌సిజడ్ పరీక్షల రద్దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, సీబీఐ దర్యాప్తుపై హామీ ఇచ్చేంత వరకు రాజీ ప్రసక్తే లేదని విద్యార్థి నాయకులు తేల్చి చెప్పారు. విద్యార్థులతో జరిగిన చర్చల నేపథ్యంలో ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. 14వ జెపిఎస్‌సి పరీక్షను రద్దు చేయడం, పరీక్షల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై దర్యాప్తు చేయడం, నియామక ప్రక్రియలో సంస్కరణలు తీసుకురావడం వంటి ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుకు తెచ్చింది. ఈ ప్రతిపాదనల్ని విద్యార్థులు పట్టించుకోవడం లేదు. సీబీఐ దర్యాప్తు లేకుండా చేసే ఇతర దర్యాప్తులు చేయడం, సీజీఎల్ పరీక్షను రద్దు చేయకపోవడం తమ ప్రధాన సమస్యల్ని పరిష్కరించవని విద్యార్థులు స్పష్టం చేశారు. విద్యార్థులు చేస్తు డిమాండ్లలో 99 శాతం అంశాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు మంత్రి సుదివ్య కుమార్ సోను తెలిపారు. మూడు రోజుల చర్చల తర్వాత 14వ జెపిఎస్‌సిపరీక్షతో పాటు 202325 బ్యాక్‌లాగ్ నియామకాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై రెండు దిశల్లో దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్రిమినల్ అంశాలను రాష్ట్ర సీఐడీ దర్యాప్తు చేస్తుందని, అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై ఈడీ దర్యాప్తు కోరుతామని మంత్రి తెలిపారు. నిందితులపై 90 రోజుల్లో ఛార్జిషీట్ దాఖలు చేసేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది. భవిష్యత్ నియామకాలపై నిపుణులతో కూడిన కమిటీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది.

# వెస్ట్‌బ్యాంక్‌తో పాలస్తీనా ఏర్పాటును తిరస్కరించిన నెతన్యాహు



**జెరూసలెం, ఆగస్టు 9:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికను ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ తిరస్కరించారు. ఆయన గాజా లేదా వెస్ట్ బ్యాంక్‌తో పాలస్తీనా దేశం ఏర్పాటును తోసిపుచ్చారు. 15 అంశాల గాజా పీస్ ప్లాన్‌ను ఆదివారం తిరస్కరించారు. ట్రంపునకు ఇది ఎదురుదెబ్బగా మారింది. తాను ప్రధానిగా ఉన్నంత కాలం, పాలస్తీనా దేశం ఉండదు అని నెతన్యాహూ అన్నట్లు ఇజ్రాయిల్ మీడియా నివేదించింది. గాజా ప్లాన్‌ను తిరస్కరించడంతో పాటు హమాస్ పూర్తిగా నిరాయుధమయ్యే వరకు ఇజ్రాయిల్ గాజా నుంచి వెళ్లేదే లేదని తేల్చి చెప్పారు. ఈ రోడ్ మ్యాప్‌ను ట్రంప్ కీలక మైలురాయి, గొప్ప పురోగతిగా అభివర్ణించిన వారం రోజుల తర్వాత నెతన్యాహూ నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. ఇదిలా ఉంటే, ఈ ప్రణాళికకు హమాస్ అంగీకరించింది. శాంతి ప్రణాళిక అమలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావాలని హమాస్ కోరింది. ఈ ప్రణాళికలో భాగంగా తదుపరి దశకు వెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ట్రంప్ బోర్డ్ ఆఫ్ పీస్‌కు హమాస్ సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు, ఇజ్రాయిల్ తీరుపై ముస్లిం దేశాలు విమర్శలు చేస్తున్నాయి. వారం రోజుల క్రితం యూఏఈతో పాటు ఏడు ముస్లిం దేశాలు సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ సైనిక చర్యను తీవ్రంగా విమర్శించాయి. ఇజ్రాయిల్ చర్యలు గాజా యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ రూపొందించిన శాంతి ప్రణాళికకు విఘాతం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి.



## రాహుల్ ప్రయాగరాజ్ పర్యటనపై కేంద్రమంత్రి ఫైర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రయాగ్‌రాజ్ పర్యటనపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ ప్రయాగ్‌రాజ్ వెళ్లే బదులు రాంచీకి వెళ్లి ఉండాల్సిందని ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. రాహుల్ ఓపెద్ద తప్పు చేశారని, అయితే మనుషులన్నాక తప్పులు చేయడం సహజమే నంటూ వ్యాఖ్యానించారు. అంతకుముందు మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంపై సోషల్ మీడియాలో వీరిద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది.ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్)తో మహిళా రిజర్వేషన్లను ముడిపెట్టడంపై కేంద్రం, విపక్షాల మధ్య నడుస్తున్న వివాదం నేపథ్యంలో ఈ చర్చ జరిగింది.మహిళల భావ ప్రకటన స్వేచ్ఛపై రాహుల్ గాంధీ షేర్‌చేసిన ఒక వీడియోపై రిజిజు స్పందిస్తూ,ఆయన మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరడంతో ఈ రగడ మొదలైంది.దీనికి ప్రతిగా, అసలు మహిళా రిజర్వేషన్ చట్టాన్ని నియోజకవర్గాల పునర్విభజనతో ఎందుకు లంకె పెడుతున్నారంటూ రాహుల్ గాంధీ నిలదీశారు. ప్రయాగ్‌రాజ్ చేరుకున్న రాహుల్ గాంధీ అక్కడి ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వంపై,దాని విధానాలపై విరుచుకుపడ్డారు.కేంద్రం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్లే దేశంలో నేడు యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆరోపించారు. తన ప్రసంగంలో ప్రధానంగా మూడు అంశాలపై మాట్లాడాలనుకుంటున్నట్లు రాహుల్ తెలిపారు. అవి - బాధ, డేటా, సంపద. యువత పడుతున్న బాధలు, వారు ఉత్పత్తి చేస్తున్న డేటా గురించి తాను మాట్లాడుతున్నానని, అయితే అసలు సమస్య ఏమిటంటే.. యువతకు చెందాల్సిన సంపద ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల కారణంగా వారికి అందడం లేదని అన్నారు.

# జేడీ వాన్స్‌తో ప్రధాని మోడీ ఫోన్ చర్చలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** భారత ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భారత్‌అమెరికా మధ్య ఉన్న సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా జేడీ వాన్స్, ఆయన భార్య ఉషా వాన్స్‌కు ఇటీవల కుమారుడు జన్మించినందుకు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. వాన్స్ కుటుంబ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఫోన్ సంభాషణ అనంతరం ప్రధాని మోడీ సోషల్ మీడియా వేదికఎక్స్‌లో స్పందించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నుంచి ఫోన్ కాల్ అందుకుంది. భారత్‌అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కీలక రంగాల్లో మరింత లోతుగా తీసుకెళ్లే మార్గాలపై చర్చించాం. ఆయనకు, సెకండ్ లేడీ ఉషా వాన్స్‌కు కుమారుడు జన్మించిన సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలియజేశాను. మొత్తం కుటుంబానికి శుభాకాంక్షలని మోడీ పేర్కొన్నారు. ఈ ఫోన్ సంభాషణకు కొద్ది రోజుల ముందు భారత్‌లో విదేశీ విరాళాలకు సంబంధించిన ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ చట్టంలో ప్రతిపాదిత సవరణలపై అమెరికా చట్టసభ్యుడు రైలీ మూర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్‌జీవోలు, ట్రస్టులు, విద్యా సంస్థలు, మత సంస్థలు విదేశాల నుంచి స్వీకరించే విరాళాలకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు తీసుకురావడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మార్పులు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతిపాదిత మార్పుల ద్వారా భారత ప్రభుత్వం చర్చిలు, మతపరమైన స్వచ్ఛంద సంస్థలపై నియంత్రణ సాధించే అవకాశం ఉందని రైలీ మూర్ ఆరోపించారు. దీనిని క్రైస్తవులపై స్పష్ట మైన దాడిగా అభివర్ణించారు. మరోవైపు భారత్‌అమెరికా ఆర్థిక సంబంధాలు కూడా కీలక దశలో ఉన్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కల్పించే రష్యా ఆంక్షల బిల్లును అమెరికా సెనేట్ శుక్రవారం ఆమోదిం చింది. ఈ బిల్లులో రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం ఉంది. రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో భారత్ కూడా ఉండటంతో ఈ పరిణామం న్యూఢిల్లీకి ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ బిల్లు చట్టంగా మారాలంటే అమెరికా ప్రతినిధుల సభలో కూడా ఆమోదం పొందాల్సి ఉంది. ఇదే సమయంలో భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయి.



# చైనాను వణికిస్తున్న 'డాల్ఫిన్' తుఫాన్

## షాంఘైలో జనజీవనం అస్తవ్యస్తం

### 1,300కు పైగా విమాన సర్వీసులు రద్దు

**బీజింగ్, ఆగస్టు 9:** పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన అత్యంత తీవ్రమైన 'డాల్ఫిన్' తుఫాన్ చైనా తూర్పు తీరాన్ని అతలాకుతలం చేస్తోంది. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులతో దూసుకొస్తున్న ఈ తుపాను దెబ్బకు దేశ వాణిజ్య రాజధాని షాంఘై సహా పలు ప్రధాన నగరాలు స్తంభించిపోయాయి. చైనా ప్రభుత్వం ఇప్పటికే బ్లూ అలర్ట్ జారీ చేసి, సహాయక చర్యలను ముమ్మరం చేసింది. తుఫాన్ ప్రభావం షాంఘై, జెజియాంగ్ ప్రావిన్సులపై తీవ్రంగా పడింది. ముందుజాగ్రత్త చర్యగా షాంఘైలోని హాంకియావో, పుడాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఆదివారం నాటికి 1,300కు పైగా విమాన సర్వీసులను రద్దు చేశారు. ఇది మొత్తం రాకపోకల్లో 60 శాతానికి సమానం. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు, జెజియాంగ్, షాంఘై ఓడరేవులను పూర్తిగా ఖాళీ చేయించడంతో పాటు యాంగ్జీ నదీ పరీవాహక ప్రాంతంలో నడిచే పలు రైళ్లు, పడవల సేవలను కూడా నిలిపివేశారు. భారీ వర్షాలు, వరదల ముప్పు పొంచి ఉండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. జెజియాంగ్ ప్రావిన్స్‌లోని తైజౌ నగరం, షాంఘై పరిసర లోతట్టు ప్రాంతాల నుంచి సుమారు 3.90 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తీర ప్రాంతాల్లోని పాఠశాలలు, వ్యాపార సంస్థలు, పర్యాటక కేంద్రాలకు సెలవులు ప్రకటించారు. చైనా తీరాన్ని తాకడానికి ముందే ఈ డాల్ఫిన్ తుఫాన్ జపాన్‌లోని ఒకినావా దీవులు, తైవాన్ ఉత్తర ప్రాంతాల్లో కుండపోత వర్షాలతో బీభత్సం సృష్టించింది. రానున్న రోజుల్లో ప్రభావిత ప్రాంతాల్లో 200 నుంచి 400 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఈ దశాబ్దంలోనే ఇది అత్యంత ప్రమాదకరమైన తుపానుల్లో ఒకటిగా పరిణమించే ప్రమాదం ఉందని చైనా వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

# పాక్‌లో లష్కర్ కమాండర్ అనుమానాస్పద మృతి

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** పాకిస్తాన్‌లో ఐఎస్ఐ ప్రేరేపిత ఉగ్రవాదుల హత్యలు, అనుమానాస్పద మరణాలు కొనసాగుతూనే వున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో దారుణాలకు పాల్పడుతూ పాక్‌లో తలదాచు కుంటున్న లష్కర్ ఏ తయ్యిబా, హిజ్బుల్ ముజహిద్దీన్ వంటి సంస్థల ఉగ్రవాదులు గడచిన నాటుగేళ్ల కాలంలో 30 మందికి పైగా హత్యకు గురవడం పాక్‌లో సంచలనం రేపింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇస్లామాబాద్‌లోని కుబా మసీదు వద్ద లష్కర్ ఓ తయ్యిబా ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా వున్న జమాత్ ఉద్ దవా సీనియర్ కమాండర్ ఖారీ సయ్యిద్ అబ్దుల్ అజీజ్ వున్నట్లుండి కుప్పకూలి పోయాడు. అంతకు ముందు సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో ఇతను భోజనం చేసినట్లు సన్నిహితులు చెబుతున్నారు. కుప్పకూలగానే అజీజ్‌ను సహచరులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను చనిపోయాడు. అజీజ్ విష ప్రయోగంవల్ల మరణించి వుంటాడని అనుమానిస్తున్నారు. 30ఏళ్ల అజీజ్ ఇస్లామాబాద్‌కు చెందిన వాడుగా పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఇతనిపై జమ్మూ కాశ్మీర్‌లో అనేక కేసులున్నాయి. కాగా జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడులకు పాల్పడే ఉగ్రవాదుల కు అజీజ్ అటు ఆక్రమిత పాక్ ఇటు కాశ్మీర్‌లోని అటవీ ప్రాంతంలో షెల్టర్లు అందించే వాడు. తప్పుడు పత్రాలతో ఉగ్రవాదులను భారత్‌లో పంపించేవాడు. ఇందుకోసం నీలం వ్యాలీ, ముజఫరాబాద్ మార్గాన్ని ఎంచుకునే వాడు. ఇదే సమయంలో ఎన్‌కౌంటర్లలో మరణించిన ఉగ్రవాదుల కుటుంబాలకు ఆర్థిక సహాయం కూడా అజీజ్ అందించేవాడు.

## పెళ్లయిన ఏడేళ్లలోపు వేధింపులతో భార్య మరణిస్తే

# అది వరకట్న హత్యే: అలహాబాద్ హైకోర్టు తీర్పు



**లక్నో, ఆగస్టు 9:** వివాహితల అనుమానాస్పద మరణాలు, వరకట్న వేధింపుల కేసులకు సంబంధించి అలహాబాద్ హైకోర్టు అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. పెళ్లయిన ఏడేళ్లలోపు ఎవరైనా మహిళ అత్తగారింట్లో అసహజ రీతిలో మరణిస్తే ఆమెపై కట్నం కోసం వేధింపులు జరిగినట్లు ఆధారాలు ఉన్నట్లయితే దానిని 'వరకట్న హత్య'గానే పరిగణించవచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇలాంటి తీవ్రమైన కేసుల్లో సదరు మహిళ మృతికి భర్త లేదా అత్తింటి వారి ప్రమేయానికి సంబంధించి ప్రత్యక్ష సాక్ష్యాలు గానీ, ఆధారాలు గానీ ప్రత్యేకంగా చూపించాల్సిన అవసరం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వరకట్న హత్యకు సంబంధించిన ఒక అప్పీలు పిటిషన్‌పై విచారణ జరుపుతున్న సందర్భంగా అలహాబాద్ హైకోర్టు ఈ కీలకమైన విషయాలను వెల్లడించింది. 2010లో ఓ మహిళ అత్తగారింట్లోనే అనుమానాస్పద స్థితిలో మరణించింది. అయితే అది పూర్తిగా వరకట్న హత్యేనంటూ పుట్టింటి వాళ్లు ఆమె భర్త సందీప్ సింగ్ హోరాపై కేసు పెట్టారు. ఈక్రమంలోనే విచారణ జరిపిన దిగువ కోర్టు అతడిని దోషిగా తేలుస్తూ 2018లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దీనిని సవాలు చేస్తూ అతడు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాడు. అయితే బాధితురాలు తన అత్తగారింట్లోనే అనుమానాస్పద స్థితిలో అసహజ మరణానికి గురైందని, ఆమె మృతి వెనుక వరకట్న వేధింపుల కోణం ఉందని హైకోర్టు కూడా ప్రాథమికంగా అంగీకరించింది. అయితే ఈ కేసులో దిగువ కోర్టు విధించిన జీవిత ఖైదు శిక్షపై హైకోర్టు జడ్జి కీలకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దోషిగా తేలిన భర్త సందీప్ సింగ్ హోరాకు ఏకంగా యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించడానికి గల బలమైన కారణాలను లేదా ప్రత్యేకమైన పరిస్థితులను దిగువ కోర్టు తన తీర్పులో సహేతుకంగా పేర్కొన లేకపోయిందని జడ్జి అభిప్రాయపడ్డారు. చట్ట ప్రకారం అత్యంత అరుదైన కేసుల్లో మాత్రమే జీవిత ఖైదు లేదా యావజ్జీవ కఠిన కారాగారాన్ని విధించాల్సి ఉంటుందని కోర్టు తెలిపింది. అం తేకాకుండా ఈ ఘటన జరిగి 16యేళ్లు కావడం, నిందితుడి వయస్సు ప్రస్తుతం దాదాపు 40 యేళ్లకు చేరడం, గడచిన 7యేళ్లకు పైగా అతడు జైలులోనే గడపడం, అలాగే అతడి ప్రవర్తనపై ఎలాంటి ప్రతికూల నివేదికలు లేకపోవడాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ క్రమంలోనే హైకోర్టు నిందితుడి జీవిత ఖైదు ను 10యేళ్లకు తగ్గిస్తూ ఇప్పటికే అనుభవించిన జైలు కాలాన్ని అందులో మినహాయించాలని ఆదే శించింది. అయితే ఐపిసి సెక్షన్లు 498ఎ, 406, వరకట్న నిరోధక చట్టంలోని సెక్షన్లు 3, 4 కింద అతడిపై ఉన్న దోష నిర్ధారణను హైకోర్టు మార్చ కుండా యథాతథంగా ఉంచింది.

# బెయిల్ కోసం క్షుద్రపూజలు

## ఛత్తీస్‌గఢ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఫొటోతో 'తంత్ర పూజ'

### నిందితుడు అరెస్ట్, ఫొటో, నిమ్మకాయలు, కుంకుమ, చేప స్వాధీనం



**రాయ్‌పూర్, ఆగస్టు 9:** ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఫొటోను ఉపయోగించి 'తంత్ర పూజ' నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని బిలాస్‌పూర్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తన బంధువుకు బెయిల్ ఇప్పించే ప్రయత్నంలో భాగంగా అతను ఈ పని చేసినట్లు అధికారులు తెలిపారు. శనివారం మధ్య రాత్రి వేళ సిపాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవ్రి గ్రామంలోని శ్మశానవాటికలో ఈ ఘటన జరిగింది. నిందితుడిని రిషికేశ్ కుమార్‌గా గుర్తించారు. అతను మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి ఈ పూజ నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి వేళ నలుగురు వ్యక్తులు అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడటం గమనించిన గ్రామస్తులు వారిని నిలదీశారు. ఆ తర్వాత ముగ్గురు వ్యక్తులు పారిపోగా, కుమార్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు బిలాస్‌పూర్ ఎస్పీ రజనీష్ సింగ్ తెలిపారు. విచారణలో, కత్తిపోట్ల కేసులో తన బంధువు ప్రియాన్షు బోలే మరికొందరితో కలిసి పోలీసుల అదుపులో ఉన్నాడని నిందితుడు పోలీసులకు చెప్పాడు. విచారణ కోసం కుమార్‌ను అదుపులోకి తీసుకున్న తర్వాత, పోలీ సులు శ్మశాన వాటిక నుండి పూజకు సంబంధించిన కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో చేప, నిమ్మకాయలు, కుంకుమ, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రమేష్ సిన్హా, మరో ఇద్దరు వ్యక్తుల ఫొటోలు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఫొటోలలో ఒకటి ప్రియాన్షు బోలేది కాగా, మరొకటి కత్తిపోట్ల కేసులోని బాధి తుడిది. శ్మశానవాటికకు వెళ్లే ముందు, బెయిల్ పొందడానికి పూజ చేయవచ్చని చెప్పిన ఒక 'తంత్రిక' వీడియోను తాము చూశామని కుమార్ పోలీసులకు చెప్పాడు. ఈ వ్యవహారంలో తదుపరి విచారణ జరుగుతోందని ఎస్పీ పేర్కొన్నారు.

## రూ.40,185 కోట్ల పిఎంఎల్ఎ కేసులో

# ఆర్‌కామ్‌పై ఇడి చార్జిషీట్ దాఖలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:**మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద రిలయన్స్ కమ్యూ నికేషన్స్ లిమిటెడ్‌పై ఇడి అనుబంధ చార్జిషీట్‌ను ప్రత్యేక కోర్టులో దాఖలు చేసినట్లు ఆదివారం విడుదల చేసిన అధికారిక ప్రకటనలో పేర్కొంది. మార్చి 27నాటి మొదటి ప్రాసిక్యూషన్ ఫిర్యాదుకు కొనసాగింపుగా శనివారం ఈ అనుబంధ ప్రాసిక్యూషన్ ఫిర్యాదును దాఖలు చేశారు. రిల యన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్), రిలయన్స్ టెలికాం లిమిటెడ్ (ఆర్‌టిఎల్), గౌతమ్ భైలాల్ దోషి, సతీష్ సేథ్, అమితాబ్ ఝున్‌ఝున్‌వాలా, మరియు ఇతరులను పిఎంఎల్ఎ, 2002లోని సెక్షన్ 4 కింద శిక్షార్హమైన సెక్షన్ 3, సెక్షన్ 3తో కలిపి సెక్షన్ 70 కింద నేరాలకు నిందితులుగా చేర్చినట్లు ఆ ప్రకటన తెలిపింది. నేర కార్యకలాపాల ద్వారా వచ్చిన సొమ్మును రూ. 40,185.55కోట్లుగా నిర్ధారించారు. ఇది, రుణగ్రహీత సంస్థలు కన్సార్టియం బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, బాండ్‌హోల్డర్లకు చెల్లించడంలో విఫలమైన మొత్తం బకాయి. నిధుల సమీకరణ, వినియోగం, దాచిపెట్టడం, ప్రదర్శించడంలో నిందితుల విభిన్న పాత్రలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో భాగంగా, 1 బిలియన్ డాలర్ల ఫారిన్ కరెన్సీ కన్వర్టిబుల్ బాండ్ల (ఎఫ్‌సిసిబి) ద్వారా వచ్చిన సొమ్మును తుది వినియోగానికి సంబంధించి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం కూడా ఉంది.

న్యాయ నిర్ణయాధికార సంస్థ జప్తు చేసి, ధ్రువీకరించిన రూ. 8,078.06 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేయాలని కోరారు. ఈ ఆస్తులలో న్యూఢిల్లీ, నవీ ముంబై, భువనేశ్వర్, చెన్నై, పుణెలలోని లీజు, స్థిరాస్తులు ఉన్నాయి.

# సంక్షిప్త వార్తలు

## సౌదీ అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి



**రియాద్, ఆగస్టు 9:** సౌదీ అరేబియాలోని జజాన్‌లో ఉన్న అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి చేసినట్లు హౌతీలు ప్రకటించారు. ఈ దాడికి తామే కారణమని హౌతీ సైనిక ప్రతినిధి బ్రిగేడి యర్ జనరల్ యహ్యా సరీ తెలిపారు. తమ గగనతలంలో సౌదీడ్రోన్ల చొరబాటుకు ప్రతిస్పం దనగానే దాడి చేసినట్లు వెల్లడించారు. సౌదీ 'మినిస్ట్రీ ఆఫ్ ఎనర్జీ' కూడా ఆదివారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం జరిగినట్లు ధ్రువీకరించింది. అయితే అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది.

## మమత కారుపై రాళ్లు రువ్విన నిరసనకారులు



**కోల్‌కత్తా, ఆగస్టు 9:** పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో మాజీ సీఎం, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రికి నిరసనసెగ ఎదురైంది. ఆమె ప్రయాణిస్తున్న కారుపై ఆందోళనకారులు దాడిచేశారు. తమపై గుర్తుతెలియని దుండగులు ఇటుకలు, రాళ్లతో దాడిచేశారని, ఈ దాడిలో ప్రాణాలు పోయేవే అని మమత ఆరోపించారు. ఈ దాడిని రాష్ట్ర బీజేపీ ఖండించింది. ఈ హింసాకాండలో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. పోలీస్ కస్టడీలో టీఎంసీ పార్టీ కార్యకర్త మరణించాడని ఆ పార్టీ బెంగాల్‌లో తీవ్ర నిరసన తెలుపుతోంది.

## బారామతి ఎయిర్‌ఫీల్డ్‌లోనే కుప్పకూలిన మరో విమానం



**బారామతి, ఆగస్టు 9:** మహారాష్ట్ర బారామతి ఎయిర్ ఫీల్డ్‌లో మరో విమానం కుప్పకూలింది. ఆది వారం ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన ట్రైనింగ్ విమానం రన్‌వే దాటి వెళ్లింది. మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్య మంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదం జరిగిన 7 నెలల తర్వాత మరో ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనలో విమానం దెబ్బతిన్నప్పటికీ, పైలట్ సురక్షితంగా బయట పడ్డాడు. ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

## బియ్యం స్కాంలో బిజెపి సర్కార్: సౌరభ్ భరద్వాజ్




**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వంపై ఆమ్ ఆద్మీ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. రూ.22,000 కోట్ల విలువైన రైస్ స్కాంకు బీజేపీ ప్రభుత్వం సిద్ధమైందని ఆరోపించింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ ఈ మేరకు ఎక్స్ ఖాతాలో ఆదివారం దీనికి సంబంధించిన ఆరోపణలు చేశారు. పేదప్రజలకు అందించాల్సిన బియ్యాన్ని, దారి మళ్లించి, భారీ స్కాంకు బీజేపీ సర్కార్ తెరతీసిందని విమర్శించారు.

## నకిలీ గుర్తింపులతో 25 పెళ్లిళ్లు: బిజెపి ఎమ్మెల్యే ఆక్రోశం



**లక్నో,ఆగస్టు 9:** నకిలీ గుర్తింపులతో 25 వివాహాలు చేసుకుని అనేక మంది మహిళలను మోసం చేసిన ఒక వ్యక్తికి తన కుమార్తెను ఇచ్చి వివాహం చేసేలా తమను మోసగించారని బీజేపీ ఎమ్మెల్యే ఆరోపించారు. ఆయన ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. కేసు నమోదు చేయడంతో పాటు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని సేవత నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే జ్ఞాన్ తివారీ ఆగస్ట్ 6న సోషల్ మీడియాలో ఒక వీడియోను పోస్ట్ చేశారు. 2024లో మిశ్రిఖ్‌లోని చంద్రవాల్ ప్రాంతానికి చెందిన అనుజ్ త్రివేది కుమారుడు ప్రఖర్ త్రివేదితో తన కుమార్తె ప్రజ్ఞ పెళ్లి జరిగినట్లు తెలిపారు.



## ఉధృతమవుతున్న కెనడా కార్చిచ్చు

**టొరంటో, ఆగస్టు 9:** కెనడాలో కార్చిచ్చు విజృంభిస్తోంది. దీంతో కెనడా ప్రభుత్వం బ్రిటీష్ కొలంబియాలో ఎమర్జెన్సీ ప్రకటించింది. ఈ ప్రాంతంలోని 20వేల మందిని సురక్షిత ప్రాంతాలకు వెంటనే తరలివెళ్లాలని ఆదేశించింది. బాధితుల్ని రక్షించే సహాయక చర్యల్ని కొనసాగిస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 100 అడుగులు ఎత్తులో మంటలు ఎగసిపడుతున్నాయి.

10-8Pg6exHMNWJQE.qxd:10-8Pg6exHMNWJQE.qxd 1/1/02 7:18 AM Page 1



# ఒంగోలు కూటమిలో ముదిరిన విభేదాలు

- జనసేన నేత మాజీ మంత్రి బాలినేని, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల సవాళ్లు
- నేతల ఆరోపణలు ప్రత్యారోపణలతో ప్రకాశంలో వేడెక్కిన రాజకీయం



**ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 9 ప్రభాతవార్త:** ఒంగోలు నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, జనసేన నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య రాజకీయ విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఇసుక, గ్రావెల్, మైనింగ్, మద్యం వ్యాపారాల్లో అక్రమాలు జరుగుతున్నాయని, ఎమ్మెల్యేకు వాటాలు ఉన్నాయని, రోజూ లక్షల్లో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని బాలినేని ఆరోపించగా, ఈ ఆరోపణలను దామచర్ల తీవ్రంగా ఖండించారు. తనపై చేసిన ఆరోపణలకు బాలినేని ఆధారాలు చూపాలని, అవి నిజమని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని దామచర్ల సవాల్ విసిరారు. అంతేకాకుండా తనపై వచ్చిన ఆరోపణలు నిజం కాదని కాణిపాకం వినాయకుడి వద్ద ప్రమాణం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, బాలినేని కూడా అందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. జనసేనను అడ్డుపెట్టుకుని కూటమి ప్రభుత్వంలో విభేదాలు సృష్టించేందుకు బాలినేని ప్రయత్నిస్తున్నారని, వైసిపి కోవర్టుగా వ్యవహరిస్తున్నారని దామచర్ల ఆరోపించారు. అప్పుడప్పుడు ఒంగోలుకు వచ్చి తనపై ఆరోపణలు చేసి వెళ్లడం కాకుండా ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. తన అనుచరులతో కరపత్రాలు పంపిణీ చేయించి రాజకీయంగా తన ప్రతిష్టను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో బాలినేని, ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డికి సంబంధించిన పలు వ్యవహారాలపై తాను మాట్లాడితే పెద్ద పుస్తకమే రాయాల్సి వస్తుందని దామచర్ల వ్యాఖ్యానించారు. మరోవైపు దామచర్ల తానే రాజు, తానే మంత్రి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని బాలినేని మండిపడ్డారు. తమ వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. తప్పు చేయని కార్యకర్తలను కాపాడు కోలేని పరిస్థితి ఉంటే తాను రాజకీయాల్లో ఉండి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పొత్తు ధర్మాన్ని గౌరవిస్తూ అనేక అంశాలపై ఇంతకాలం మౌనం వహించామని, అయితే తమ సహనానికి హద్దులు ఉన్నాయని బాలినేని స్పష్టం చేశారు. తమ కార్యకర్తలకు అన్యాయం జరిగితే ఇకపై చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఇసుక, మైనింగ్, మద్యం వ్యాపారాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపించాలని బాలినేని డిమాండ్ చేశారు. అయితే తన ఆరోపణలకు ఆధారాలు ఉంటే బహిర్గతం చేయాలని దామచర్ల ప్రతిసవాల్ చేశారు. గతంలో బాలినేని ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై తాను మాట్లాడితే అనేక అంశాలు వెలుగులోకి వస్తాయని ఆయన ఆరోపించారు. నగరంలో గంజాయి బ్యాచ్‌లు, భూ ఆక్రమణలు, రియల్ ఎస్టేట్ వ్యవహారాలపై కూడా ఇరువర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. కూటమిలో భాగస్వామ్య పార్టీల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని దామచర్ల ఆరోపించగా, కూటమి ధర్మాన్ని పాటిస్తూ పరస్పర గౌరవంతో వ్యవహరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని బాలినేని పేర్కొన్నారు. ఇరువురు నేతలు పరస్పరం తీవ్ర ఆరోపణలు, సవాళ్లు చేసుకోవడంతో ఒంగోలు రాజకీయాల్లో నెలకొన్న విభేదాలు రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. ఎమ్మెల్యేపై బాలినేని చేసిన ఆరోపణలపై ప్రభుత్వం లేదా పార్టీ అధిష్ఠానం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది, అదే సమయంలో దామచర్ల చేసిన ప్రతిఆరోపణలపై బాలినేని స్పందన ఎలా ఉంటుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. కూటమిలోని రెండు భాగస్వామ్య పార్టీల నేతల మధ్య వివాదం మరింత పెరిగితే దాని ప్రభావం రాష్ట్ర రాజకీయాలపై పడే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది.

ఇప్పటికే ఇరువర్గాల మధ్య కొనసాగుతున్న రాజకీయ విభేదాలు బహిరంగ సవాళ్లు, ప్రతివిమర్శల వరకు చేరుకోవడం కూటమి రాజకీయాల్లో చర్చకు దారితీసింది. ఆరోపణలు, ప్రత్యారోపణల నేపథ్యంలో టిడిపి, జనసేన అధిష్ఠానాలు ఈ వ్యవహారంపై ఏ విధంగా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ఇరువురు నేతలు తమ తమ వాదనలకు కట్టుబడి ఉండటంతో వివాదానికి ఇప్పట్లో తెరపడే పరిస్థితి కనిపించడం లేదు. కూటమి సమన్వయం దెబ్బతినకుండా పార్టీ పెద్దలు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఒంగోలులో మొదలైన ఈ వివాదం రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశం కావడంతో కూటమి నేతల తదుపరి అడుగులపై ఉత్కంఠ నెలకొంది.



పి.రాజేశ్వరరావు మృతికి సంతాపం తెలియజేస్తున్న అరసం నేతలు

## విశాలాంధ్ర మాజీ మేనేజర్ పి.రాజేశ్వరరావు మృతికి అరసం సంతాపం

**అనంతపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త బ్యూరో:** విశాలాంధ్ర ప్రచురణాలయం మాజీ మేనేజర్, విశిష్ట ప్రచురణ కర్త అవార్డు గ్రహీత, అరసం నేత కామ్రేడ్ పి.రాజేశ్వరరావు మృతి దిగ్భ్రాంతి కలిగించిందని అరసం రాష్ట్ర అధ్యక్షుడు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, కార్యదర్శులు ఏ.ఎం.ఆర్ ఆనంద్, కె.శరత్‌చంద్ర, జ్యోతిశ్రీ పేర్కొన్నారు. అనంతపురంలో జరుగుతున్న అరసం సాహిత్య విమర్శ పాఠశాలలో పి.రాజేశ్వరరావుకు నివాళి అర్పించారు. తమతో నాలుగు దశాబ్దాల అనుబంధం ఉన్న మిత్రుడిని కోల్పోయామని వారు పేర్కొన్నారు. సభలో విరసం నేత, వీక్షణం పత్రిక సంపాదకులు ఎన్ వేణుగోపాల్, విశాలాంధ్ర మాజీ మేనేజర్ బి.ఈశ్వర్ రెడ్డి, ప్రముఖ విమర్శకులు తూముచర్ల రాజారామ్, జయరామ్, కె.నాగేశ్వరాచారి, ఈరన్న, తన్నీరు నాగేంద్ర, గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, పలువురు సాహితీ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సంతాప సూచకంగా రెండు నిముషాలు మౌనం పాటించారు.

## రోడ్డు ప్రమాదంలో డిసిపి కుమార్తె మృతి





**గుంటూరు(క్రైమ్), ఆగస్టు 9 ప్రభాతవార్త:** గుంటూరు సమీపంలోని ఏటుకూరు బైపాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో విజయవాడ ట్రాఫిక్ డిసిపి షిరీన్ బేగం కుమార్తె షేక్ అసిఫా(24) మృతి చెందారు. మృతురాలు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎంఎస్‌సి సైకాలజీ కోర్స్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. విజయవాడ నుంచి చీరాల బీచ్‌కు వెళ్తుండగా కారు ప్రమాదానికి గురైంది. కారులో ఐదుగురు ప్రయాణిస్తుండగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. కుమార్తె మృతి వార్త విని షిరీన్ బేగం తీవ్ర దిగ్భ్రాంతికి గురై స్పృహ కోల్పోయినట్లు సమాచారం.

## సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు
# కీలక నిందితులను విచారిస్తున్న సిట్

విజయవాడ కృష్ణలంకలో సృష్టించిన సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో కీలకంగా భావిస్తున్న నిందితులను ఆధారాలతో ఎదుర్కొంటూ సిట్ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఇప్పటికే సేకరించిన సిసి కెమెరా ఫుటేజీలు, ఫొటోలు, వీడియోలు, సాంకేతిక ఆధారాలను ముందుపెట్టి నిందితుల నుంచి వాస్తవాలను రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా మార్కాపురం నుంచి విజయవాడలోని కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు సాయికృష్ణను తరలించిన సమయంలో చోటుచేసుకున్న పరిణామాలపై సిట్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మే 6న మార్కాపురం నుంచి సాయికృష్ణను కృష్ణలంక పిఎస్‌కు తీసుకొచ్చినట్లు సిట్ దర్యాప్తులో నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో సాయికృష్ణ తరలింపు సమయంలోని మార్గానికి సంబంధించిన సిసి కెమెరా ఫుటేజీలను అధికారులు సేకరించారు. అలాగే ఆ సమయంలో సాయికృష్ణకు సంబంధించిన ఫొటోలను టాస్క్‌ఫోర్స్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ తీసినట్లు కూడా సిట్ సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. సేకరించిన ఫొటోలు, వీడియో ఫుటేజీలను నిందితులకు చూపిస్తూ, ఆయా సమయాల్లో ఎవరు ఎక్కడ ఉన్నారు? మార్గమధ్యలో ఏం జరిగింది? ఏఏ అంశాలపై అధికారులు ప్రశ్నలు సంధిస్తున్నట్లు సమాచారం. విచారణలో భాగంగా సిట్ అధికారులు ఆధారాలను ఒక్కొక్కటిగా ముందు పెట్టడంతో తమకు ఏమీ తెలియదని, మొత్తం వ్యవహారం సిఐ నాగరాజుకే తెలుసని కొందరు కానిస్టేబుళ్లు చెబుతున్నట్లు సమాచారం.

సాయికృష్ణను మార్కాపురం నుంచి విజయవాడకు తరలించి నప్పటి నుంచి కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చే వరకు జరిగిన ప్రతి పరిణామాన్ని పునర్నిర్మించే దిశగా దర్యాప్తు సాగుతున్నట్లు తెలుస్తోంది. నిందితుల నుంచి మరింత కీలక సమాచారాన్ని రాబట్టి కేసులో వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా సిట్ అధికారులు ప్రశ్నలు కొనసాగిస్తున్నారు. నలుగురు నిందితుల కస్టడీ నేటితో ముగియనున్న నేపథ్యంలో వారిని న్యాయాధికారి శ్రీకాంత్ ఎదుట హాజరుపరిచిన అనంతరం తిరిగి జైలుకు తరలించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే కస్టడీలో సిట్ అధికారులు సేకరించిన వివరాలు, సాంకేతిక ఆధారాల విశ్లేషణతో కేసు దర్యాప్తులో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం.

## సాహిత్య విమర్శను శాస్త్రీయ స్థాయికి తీసుకుపోవాలి

**అనంతపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త బ్యూరో:** సాహిత్య విమర్శ ఒక మేధోప్రక్రియ, చర్చ, సంవాదం లాంటిదని, అభ్యుదయవాదులు సమిష్టికృషితో విమర్శను శాస్త్రీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రముఖ సాహితీవేత్త నెల్లుట్ల వేణుగోపాల్ అన్నారు. సమాజాన్ని పరావర్తనం చెందించేదే సాహిత్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'సాహిత్య విమర్శ– పాఠశాల్ల రెండు రోజులపాటు ఘనంగా సాగింది. ఆర్డీటి ఎకాలజీ సెంటర్లో ఆదివారం జరిగిన తరగతులకు, సభలకు, అరసం జిల్లా అధ్యక్షుడు భీమిరెడ్డి ఈశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. "సాహిత్య విమర్శ విభిన్న ధోరణులు", "మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ" అనే అంశాలపై ఎన్.వేణుగోపాల్ సుదీర్ఘంగా ఉపన్యసించారు. "సాహిత్య విమర్శ వికాసం" అనే అంశంపై అరసం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. ప్రముఖ కవి, విమర్శకులు తూముచర్ల రాజారామ్ "విమర్శకుని అనుభవాలు" చక్కగా వివరించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ సాహిత్య విమర్శకులు విస్తృత అధ్యయనం, నిరంతర సాధన కొనసాగించాలన్నారు. ప్రపంచీకరణ తర్వాత, అసహన రాజ్యం మొదలయ్యాక ప్రజాస్వామిక చర్చకు అవకాశం లేకుండా పోయిందన్నారు. సృజనకారుల్లో కూడా కీర్తికాంక్ష పెరిగి, విమర్శను, సవరణను అంగీకరించలేని ఒక స్థితి నెలకొందన్నారు. విమర్శకులకు సాహిత్య చరిత్ర మీద స్థూలమైన అవగాహన ఉండాలని, సృజనకారుల కన్నా ఎక్కువ అధ్యయనం చేయాలని సూచించారు. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అవగాహనను పెంచుకోవాలన్నారు. భిన్నరంగాల పట్ల విహంగ వీక్షణం చేసి మేధావిగా ఉండాలన్నారు. ఉపపత్తులతో గుణ, దోష విచారణ చేసినప్పుడే శాస్త్ర ప్రతిపత్తి సంతరించుకుంటుందన్నారు. ఆధునిక సాహిత్య విమర్శలో వైజ్ఞానిక వాదం, అస్తిత్వ, వాచక కేంద్ర, రూపవాద ప్రక్రియవాద, ఆధునికానంతర, పర్యావరణ వాద, సత్యానంతర, సామాజిక శాస్త్ర సాహిత్య విమర్శ, ఉపాంత వర్గాల వాద విభిన్న ధోరణులున్నాయన్నారు. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా సిద్ధాంత పత్రం, సదస్సు పత్రాలు ప్రామాణికంగా వుండాలని సూచించారు. సాహిత్య విమర్శకులు మరింత విరివిగా రావాలని, తర్క వితర్కాలు, వాద వివాదాల ద్వారా కూడా సాహిత్య విమర్శ అభివృద్ధి చెందిందన్నారు. తెలుగులో 8 దశాబ్దాల చరిత్ర గల మార్క్సిస్టు సాహిత్య విమర్శ మీద మరింతగా పరిశోధించాల్సి ఉందన్నారు. కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డుగ్రహీత, ఏపీ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు, సుప్రసిద్ధ సాహితీ విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మానవ సంబంధాల చిత్రణే సాహిత్యమన్నారు. ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యదర్శులు శరత్ చంద్ర జ్యోతిశ్రీ, ఏఎంఆర్ ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి డా.తన్నీరు నాగేంద్ర, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ శాంతి నారాయణ, గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, మానవహక్కుల వేదిక నాయకులు ఎస్ఎం భాష, ఏ చంద్రశేఖర్, ఎస్వీ యూనివర్సిటీ తెలుగు విభాగ అతిథి అధ్యాపకులు డాక్టర్ ఎం. ఆదిశేషయ్య, కవులు అశేరా, మధుర శ్రీ, డాక్టర్ జూటూరి షరీఫ్, డాక్టర్ అనితమ్మ, ద్రాక్షాయణి, హేమలత, స్వర్ణలత, పుల్లా రామాంజనేయులు, గంగిరెడ్డి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 11 కిలోలు గంజాయి స్వాధీనం



**పుత్తూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా పుత్తూరు మండలంలోని టి.ఆర్.కండ్రిగ గ్రామ చెరువు సమీపంలో నిర్వహించిన దాడిలో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 11 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు డిఎస్పీ రవికుమార్ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. కె.నవీన్‌కుమార్ (36), వి.జయప్రకాష్ (25), బి.బాబు అలియాస్ బాబునాయుడు (50), ఎం.ఆర్.దేవరాజ్ (24), సి.ఎస్.మూర్తి (24), ఇ.రోహిత్ (23)లను అరెస్ట్ చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 1,67,550 లక్షలు వుంటుందని తెలిపారు. అలాగే గంజాయి అక్రమ రవాణాకు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు రాజేష్ అలియాస్ ఆర్కె, శ్రీనివాసులు పరారీలో వున్నారని వారి కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలిస్తున్నామని తెలిపారు. నిందితులపై మాదక ద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. దాడిలో పాల్గొన్న సిబ్బందిని ఆయన అభినందించారు. సమావేశంలో సిఐ నెట్టి కంఠయ్య, ఎస్ఐ నాగేంద్ర పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## అనూహ్యంగా పెరిగిన రద్దీ

- వెంకన్న సర్వదర్శనానికి 30గంటలు

**తిరుమల, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** వరుససెలవులు... వారాంతంతో భక్తులు వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు చేరుకోవడంతో కొండపై రద్దీ పెరిగింది. వరుస సెలవులతో ఆదివారం ఉదయం 6గంటలకే తిరుమలలో వైకుంఠం–2 క్యూకాంప్లెక్స్ నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపల ఐదు కిలోమీటర్లు గోగర్భం డ్యామ్‌వరకు చేరాయి. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో 10గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు 43వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 25వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. భారీ రద్దీ నేపథ్యంలో, తిరుమలకు వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని టిటిడి సూచించింది.

## నవంబర్‌లో శ్రీవారి పుష్పయాగం

- ఒక్క టికెట్‌తో ఒకే రోజు రెండుసార్లు శ్రీవారి దర్శనం



**తిరుమల, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** సహజంగానే తిరుమలకు వచ్చిన భక్తులు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దివ్యమనోహర రూపాన్ని క్షణకాలంపాటు దర్శించుకుంటేనే ఆత్మసంతృప్తి చెందుతుంటారు. అలాంటిది మళ్ళీమళ్ళీ చూడాలనిపించి మనసు ఉవ్విళ్ళూరుతుంది. ఇప్పుడు దీన్ని నిజంచేస్తూ టిటిడి అధికారులు భక్తులకు ఒక మహదవకాశం కల్పించారు. నవంబర్‌లో శ్రీవారి ఉత్సవ మూర్తులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్ప స్వామికి జరిగే పుష్పయాగం రోజు ఒక్క టికెట్ పొందితే ఒకే రోజు తమ ఇష్టదైవమ్ తిరుమలేశుని రెండుసార్లు దర్శించుకునే అద్భుత అవకాశాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం కల్పించింది. శ్రీవారి ఆలయంలో నవంబరు 16న పుష్పయాగం జరగనుంది. ఈ పుష్పయాగానికి సంబంధించిన ఆర్జితసేవా టికెట్లను టిటిడి ఈ నెలలోనే విడుదల చేయనుంది. ఈ టికెట్ 700 రూపాయలు చెల్లించి ఇద్దరు గృహస్థ భక్తులకు బుక్ చేసుకునే అవకాశం ఉంది. పుష్పయాగం టికెట్ పొందినవారు నవంబర్ 16న ఉదయం ఆరు గంటలకు తిరుమలలోని సుపథం మార్గం ద్వారా ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపంలో నిర్వహించే స్నపనతిరుమంజనం అభిషేకసేవలో పాల్గొనవచ్చు. ఆ తర్వాత తిరుమల శ్రీవారిని దర్శించుకునే అవకాశాన్ని కల్పిస్తారు. మళ్ళీ అదే రోజు రెండోసారి మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ టికెట్ ఉన్న భక్తులు సుపథం మార్గం క్యూలైన్‌లో ప్రవేశించి మలయప్ప స్వామికి నిర్వహించే పుష్పయాగ మహోత్సవంలో పాల్గొంటారు. ఆలయంలోపల మరోసారి శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. ఇలా ఒకే టికెట్ పై ఒకేరోజు రెండుసార్లు శ్రీవారిని దర్శించుకునే అవకాశాన్ని టిటిడి బోర్డు భక్తులకు కల్పిస్తోంది.

# భక్తుల మధ్య భగవంతుడి బ్రహ్మోత్సవాలు

- సెప్టెంబర్ 15 నుండి 23వరకు మాఢవీధుల్లో వాహనసేవలు
- సామాన్యభక్తుల దర్శనాలకే ప్రాధాన్యత



**తిరుమల, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామికి తిరుమలలో ఈ ఏడాది జరగనున్న రెండు బ్రహ్మోత్సవాల్లో సెప్టెంబర్ 15నుండి 23వ తేదీ వరకు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు కొండ ముస్తాబవుతోంది. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, అలంకరణలు, భక్తులకు సకల సౌకర్యాల కల్పన పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది వాహన సేవలను ఆలయ మాఢవీధుల్లో భక్తుల మధ్య వేడుకగా నిర్వహించనున్నారు. ఆపదమొక్కుల వాడికి ప్రతిరోజూ ఎన్నో రకాల సేవలు, కైంకర్యాలు తిరుమలలో జరుగుతుంటాయి. బ్రహ్మోత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత వుంది. సాక్షాత్తు బ్రహ్మదేవుడే కలియుగానికి విచ్చేసి దేవదేవునికి ఉత్సవాలు నిర్వహిస్తాడని ప్రతీతి. భక్తులు కూడా లక్షలాదిమంది ఈ తొమ్మిది రోజులు తిరుమలలోనే వుండి తమ ఇష్టదైవం వాహనసేవల్లో పాల్గొంటూ ముక్తికోసం తపిస్తుంటారు. ఈ ఏడాది అధికమాసం రావడంతో తిరుమలేశునికి రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని తిరుపతి జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని విజయవంతంగా భక్తుల నడుమ బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపించేలా ప్రణాళికలు రూపొందించారు. పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశముంది. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేశారు. సామాన్యభక్తులకు ఎక్కువగా దర్శనసమయం కల్పించేందుకు ఆ తొమ్మిదిరోజులు బ్రేక్ దర్శనాలు రద్దుచేశారు. సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తొలిరోజు సెప్టెంబర్ 15వ తేదీ మంగళవారం సాయంత్రం ధ్వజారోహణం రోజునే ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమలకు చేరుకుంటారు. అదేరోజు సాయంత్రం ప్రభుత్వం తరపున వెంకన్నకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాల్లో పూర్తిగా సర్వదర్శనం మాత్రమే ఉంటుంది. శ్రీవాణి ట్రస్టు దాతలకు, ఇతర ట్రస్టుల దాతలకు దర్శన టిక్కెట్లు రద్దుచేశారు. భక్తుల రద్దీకి తగ్గట్లు లడ్డూలు బఫర్ స్టాక్ ఉంచుతున్నారు. భద్రత పరంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, వాహనాల పార్కింగ్‌కు అసౌకర్యం కలగకుండా పోలీసులతో సమన్వయంతో ఏర్పాట్లు చేపడుతున్నారు. అలాగే అక్టోబర్ 11 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఆ తొమ్మిదిరోజులు సెప్టెంబర్ 15నుండి 23 వరకు, అక్టోబర్ 11నుండి 20వరకు అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, సహస్ర దీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది.

**సెప్టెంబర్ 19నుండి పెరటాసి శనివారాలు:** ఏడుకొండలవాడికి అత్యంత పవిత్రమైన పెరటాసి మాసం కూడా సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరిగే సెప్టెంబర్‌నెలలోనే రావడంతో తమిళ భక్తులతోబాటు తెలుగు రాష్ట్రాలు, కర్నాటక, ఉత్తర భారతదేశం నుండి భక్తులు భారీగా తిరుమలకు చేరుకునే అవకాశం ఉంది. బ్రహ్మోత్సవాల్లో సెప్టెంబర్ 15వతేదీ రాత్రి తొలివాహనంగా పెద్దశేషవాహనం, సెప్టెంబర్ 19న గరుడసేవ, 20న స్వర్ణరథం, 23న చక్రస్నానం జరుగుతాయి. పోలీసులతో సమన్వయం చేసుకుని పటిష్టమైన భద్రత కల్పించేలా చూడనున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో మాఢవీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటుచేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తారు.

## ఎస్‌విబిసి ఛైర్మన్‌గా శ్రీధర్‌వర్మ

### యువకుడికి టిడిపి అద్భుత అవకాశం



**తిరుమల, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటేశ్వర భక్తి ఛానల్ (ఎన్‌విబిసికి) నూతన ఛైర్మన్‌గా తిరుపతికి చెందిన యువనేత, టిడిపి నాయకుడు బి.శ్రీధర్‌వర్మకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించి అధికారికంగా రెండు మూడు రోజుల్లో ఉత్తర్వులు వెలువడనున్నాయి. టిడిపికి తొలి నుండి శ్రీధర్‌వర్మ కుటుంబం అంకితభావంతో సేవలందిస్తోంది. ఆయన తండ్రి ఎన్టీఆర్‌రాజు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుండి దివంగత ఎన్టీఆర్‌తో మంచి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. తిరుమలకు వచ్చిన ప్రతిసారి ఎన్టీఆర్ ఎన్టీఆర్‌రాజును పలకరించి చర్చించేవారు. ఇదే సాన్నిహిత్యంతో శ్రీధర్‌వర్మ కూడా తొలినుండి టిడిపిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

ప్రస్తుతం టిడిపి రాయలసీమ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన సేవలను గమనించిన సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ శ్రీధర్‌వర్మకు ఎస్‌విబిసి ఛైర్మన్ పగ్గాలు అప్పగించేందుకు సుముఖత చూపిందని తెలిసింది.

## నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి

**తిరుపతి, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమాన్ని ఎస్‌పిడిసిఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. కాగా డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమంతో బాటు సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 గంటల నుండి నుంచి 9:30 గంటల వరకు 'డయల్ యువర్ ఎస్ఇ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను ఎస్ఇల దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 99637 07847 నంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయాలి.



## క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్‌పో సక్సెస్

- తుడా ఛైర్మన్ సి.దివాకర్ రెడ్డి




**తిరుపతి, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** క్రెడాయ్ సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీకన్వెన్షన్ హాల్లో మూడు రోజుల పాటు ప్రదర్శించిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రదర్శన ఆదివారం సాయంత్రంతో విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి తుడా ఛైర్మన్ సి.దివాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో తుడా పరిధిలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని శెట్టిపల్లి భూములు అందరికీ ఇచ్చిన ఘనత తనకే తన ప్రభుత్వానికి చెందుతుందన్నారు. రోడ్ల అభివృద్ధి చేయడంతో పాటు తిరుచానూరు బైపాస్ అభివృద్ధికి ఎన్నో పనులు చేపట్టామని తెలిపారు. తిరుపతిలో మరిన్ని స్టార్ హోటల్‌లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని, అలాగే మంచి స్టార్ హోటల్ వచ్చి తిరుపతి మరింత వేగంగా అభివృద్ధి చెందుతున్న వేళ ఇలాంటి ప్రాపర్టీ ఎక్స్‌పో నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడం మంచిదన్నారు.ఈ మూడు రోజులు నిర్వహించిన క్రీడాయి ప్రాపర్టీ ఎక్స్పో ద్వారా ప్రజలకు తిరుపతిలో సొంతిల్లు కల నెరవేర్చుకోవడంతోపాటుతో వివిధ రకాలైన అపార్ట్మెంట్లు ఫ్లాట్స్, గృహాలకు సంబంధించిన రుణ సదుపాయాలు బ్యాంకులతోపాటు గృహపకరణాలకు సంబంధించి అన్ని రకాల స్టాల్స్‌ను అందుబాటులోకి తీసుకురావడం చాలా శుభదాయకమన్నారు. నిర్మాణ రంగంలో ఆధునిక టెక్నాలజీతో కూడిన ఉత్పత్తులు, వివిధ గృహ సుందరీకరణ వస్తువులు, ప్లాట్లు, అపార్ట్మెంట్, రుణ సదుపాయాలు, ఆధునాతన వంటి వాటిని ఒకే వేదికపైకి తెచ్చి సుమారు 60 స్టాల్స్‌తో ప్రజల కలలు సాకారం చేసే దిశగా కృషి చేసిన క్రెడాయ్ ప్రతినిధులను వారు అభినందించారు. అనంతరం క్రెడాయ్ ఛైర్మన్ గోపినాథ్, అధ్యక్షుడు రాంప్రసాద్ ఇదే స్ఫూర్తితో భవిషత్తులో మరిన్ని ప్రదర్శనల ద్వారా ప్రజల ఆశయాల సాధనకు తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయి రాష్ట్ర అధ్యక్షుడు భయాన శ్రీనివాసులు, క్రెడాయ్ కార్యదర్శి నరసింహులు, ఉపాధ్యక్షుడు రాజేష్ బాబు, కోశాధికారి హరికృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



## మెగా హీరోలు ప్రయాణించిన
# కారు ఎవరిది!

**సోషల్ మీడియాలో వైరల్**



**విశాఖపట్నం, ఆగస్టు 9, ప్రభాతవార్త :**

టాలీవుడ్ అగ్రశ్రేణి నటులు రాంచరణ్ తేజ్, అల్లు అర్జున్‌లు వినియోగించిన కారు గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో, అభిమానుల్లో విస్తృత చర్చ జరుగుతోంది. మంగళగిరి స్టేడియంలో జూన్ నెలలో జరిగిన ఏపీఎల్ మ్యాచ్‌లో రాంచరణ్ ప్రయాణించిన ఏపీ 40 ఎల్‌ఈ 1 ల్యాండ్ క్రూయిజర్ కారు లోనే ఆదివారం అల్లు అర్జున్ విశాఖ ఇన్ ఆర్బిట్ మాల్ లోని ఏఏఏ థియేటర్ల ప్రారంభోత్సవానికి (తరువాయి 8వ పేజీలో)

# వైజాగ్‌లో బన్నీ సందడి..

## ఇనార్బిట్ మాల్‌లో ఏఏఏ మల్టీప్లెక్స్ గ్రాండ్ ఓపెనింగ్





**విశాఖపట్నం, ఆగస్టు 9, ప్రభాతవార్త :**

కైలాసపురం సాలిగ్రామపురంలోని ఇనార్బిట్ మాల్‌లో ఏర్పాటు చేసిన ఏఏఏ మల్టీప్లెక్స్‌ను ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ ఆదివారం ఘనంగా ప్రారంభించారు. 8 స్క్రీన్లతో ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఈ మల్టీప్లెక్స్ విశాఖ సినీ ప్రేక్షకులకు కొత్త వినోద అనుభూతిని అందించనుంది. బన్నీ రాకతో ఇనార్బిట్ మాల్ వద్ద అభిమానులు భారీగా తరలివచ్చి సందడి చేశారు. విశాఖతో తనకు ఎంతోకాలంగా అనుబంధం ఉందని అల్లు అర్జున్ తెలిపారు. నగరం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అభిమానుల అభ్యర్థన మేరకు కొందరితో ఫొటోలు దిగడంతో సందడి నెలకొంది. అల్లు అర్జున్ రాక నేపథ్యంలో విశాఖ (తరువాయి 8వ పేజీలో)



## విశాఖలో
# తాగునీటి కష్టాలు..!

### అడుగంటుతున్న రిజర్వాయర్లు
### వర్షాలు లేక తగ్గుతున్న నీటి నిల్వలు..
### భూగర్భ జలాలూ అడుగంటడంతో ట్యాంకర్లపైనే ఆధారం..

**(ప్రభాతవార్త-విశాఖపట్నం)**

విశాఖ మహానగరాన్ని తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో నగరానికి ప్రధాన ఆధారంగా ఉన్న రిజర్వాయర్లలో నీటి నిల్వలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. ఏలేరు, రైవాడ, తాటిపూడి, గంభీరం, మేఘాద్రిగెడ్డ తదితర రిజర్వాయర్లలో నీటి మట్టాలు పడిపోతుండటంతో రానున్న రోజుల్లో పరిస్థితి మరింత తీవ్రం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు భూగర్భ జలాలు సైతం అడుగంటిపోవడంతో బోర్లు, బావులపై ఆధారపడే పరిస్థితి లేకుండా పోతోంది. సుమారు 25 లక్షల మంది జనాభా ఉన్న మహా విశాఖ నగరానికి ప్రతిరోజూ భారీ మొత్తంలో తాగునీరు అవసరం. అయితే నగర జనాభా పెరుగుతున్నా, అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ నీటి వనరులు, దీర్ఘకాలిక నీటి నిల్వ వ్యవస్థలను సమకూర్చడంలో గత ప్రభుత్వాలు, జీవీఎంసీ విఫలమయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నప్పటికీ నగర అవసరాలకు అనుగుణంగా తాగునీటి స్టోరేజ్ పాయింట్లను విస్తృతంగా ఏర్పాటు చేయకపోవడం ప్రస్తుతం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది.

ప్రస్తుతం నగరానికి ప్రధాన నీటి వనరులుగా ఉన్న రిజర్వాయర్లపైనే అధికంగా ఆధారపడాల్సి వస్తోంది. వర్షాలు కురవకపోతే ఈ రిజర్వాయర్లలోకి కొత్తగా నీరు చేరే అవకాశం తక్కువగా ఉంటుంది. దీంతో ఉన్న నీటినే పొదుపుగా వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు వేసవి తరహా వాతావరణం కొనసాగితే తాగునీటి వినియోగం మరింత పెరిగే



అవకాశం ఉండటంతో అధికారుల్లోనూ ఆందోళన నెలకొంది. భూగర్భ జలాలు కూడా హ్యాండ్ ఇస్తున్నాయి. నగర శివారు ప్రాంతాలతో పాటు పలు నివాస ప్రాంతాల్లో బోర్లు, బావులపై ఆధారపడుతున్న కుటుంబాలకు ప్రస్తుతం నీటి లభ్యత తగ్గిపోయింది. భూగర్భ జలాలు పడిపోవడంతో గతంలో కొంత మేరకు నీటి అవసరాలను తీర్చిన బోర్లు సైతం ఇప్పుడు పూర్తిస్థాయిలో పనిచేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రజలు నేరుగా జీవీఎంసీ నీటి సరఫరాపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**తెరపైకి గత ప్రతిపాదనలు..**

విశాఖకు దీర్ఘకాలికంగా నీటి సమస్య లేకుండా చేసేందుకు గతంలో పలు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఏలేశ్వరం ప్రాంతం



నుంచి విశాఖకు నేరుగా పైపులైన్ ద్వారా నీటిని తీసుకురావాలనే ఆలోచన కూడా ఒక దశలో ముందుకు వచ్చింది. పైపులైన్ ద్వారా నీటిని తీసుకురావడం వల్ల నీటి సరఫరాలో నష్టాలు, లీకేజీలు తగ్గించవచ్చనే ఉద్దేశంతో గతంలో సుమారు రూ.4 వేల కోట్లతో డీపీఆర్ రూపొందించారు. అయితే ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చకపోవడంతో ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. అదేవిధంగా (తరువాయి 8వ పేజీలో)

## విశాఖలో కిమ్స్ ఫెర్టిలిటీ ఐవీఎఫ్ సెంటర్‌ను
# ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా

**ఉత్తరాంధ్రలో అందుబాటులోకి అత్యాధునిక సంతాన సాఫల్య వైద్య సేవలు**
**ప్రతి దంపతులకు వ్యక్తిగత వైద్య ప్రణాళికతో చికిత్స**



**విశాఖపట్నం, ఆగస్టు 9,ప్రభాతవార్త :**

ఉత్తరాంధ్రలో సంతానలేమి సమస్యలను ఎదుర్కొంటున్న దంపతులకు అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు విశాఖపట్నంలోని ఎంవీపీ కాలనీలో కిమ్స్ ఫెర్టిలిటీ ఐవీఎఫ్ సెంటర్ ప్రారంభమైంది. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లో కిమ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇది ఐదో ఫెర్టిలిటీ సెంటర్. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫెర్టిలిటీ సెంటర్ (తరువాయి 8వ పేజీలో)

## ఎలమంచిలి మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న
# ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్





**ఎలమంచిలి, ఆగస్టు 9, ప్రభాతవార్త:**

మున్సిపాలిటీలోని అమృత్ వాటర్ ప్రాజెక్ట్ 128 కోట్ల ఇంటింటికి నీటి కొళాయి పథకానికి శంకుస్థాపన చేసిన ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పట్టణంలోని ఆదివారం కూటమి ఆధ్వర్యంలో ఫైర్ ఆఫీస్ జంక్షన్ వద్ద నుండి కల్కి పెట్రోల్ బంక్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీలో ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పాల్గొన్నారు. అనంతరం మున్సిపాలిటీ ప్రజలకు దాహార్తిని తీర్చడానికి అమృత్ వాటర్ ప్రాజెక్ట్ సుమారు 128 కోట్ల వ్యయంతో నిర్మించబోతున్న వాటర్ ప్రాజెక్టుకు శిలాఫలకం వద్ద కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసిన సీఎం రమేష్, సుందరపు విజయ్ కుమార్ కూటమి

- 128 కోట్ల భారీ తాగునీటి ప్రాజెక్టు శంకుస్థాపన
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కోటి రూపాయలతో అదనపు తరగతి గదుల భూమి పూజ

నాయకులు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మున్సిపాలిటీలోని నియోజకవర్గంలోని అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని, ప్రస్తుతం మున్సిపాలిటీలో కొద్దిరోజుల క్రితమే సుమారు 7 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని, నేడు ప్రతి ఇంటికి మంచి నీటిని సరఫరా చేసే విధంగా సుమారు 128 కోట్లతో (తరువాయి 8వ పేజీలో)

## న్యాయవాద వృత్తిలో రాణించేందుకు
# దగ్గరి దారేది లేదు

**గురువులను గౌరవిస్తూనే కష్టపడి వృత్తిలో ముందుకు సాగాలి**
**నేటి పరిస్థితుల్లో మధ్యవర్తిత్వంలోనూ నిపుణత సాధించాలి**
**దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వ విద్యాలయం విద్యార్థులతో భారత అదనపు సొలిసిటర్ జనరల్, బ్రిజేష్ బన్సల్**






**విశాఖపట్నం, ఆగస్టు 9, ప్రభాత వార్త లీగల్ :**

న్యాయవాద వృత్తిలో రాణించాలంటే దగ్గర దారి ఏది లేదని ఎంత కష్టపడితే అంత వృద్ధిలోకి చేరుకుంటామని భారత అడిషనల్ సొలిసిటర్ జనరల్, సీనియర్ అడ్వకేట్ బ్రిజేష్ బన్సల్ అన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం న్యాయ విద్యార్థులను ఉద్దేశించి అయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ప్రవేశించిన తర్వాత మొదటి ఐదు సంవత్సరాలు కష్టపడి పని చేయవలసిన అవసరం ఉంటుందని, ఒకసారి మనల్ని మనం నిరూపించుకున్న తర్వాత అంచలంచలుగా (తరువాయి 8వ పేజీలో)

## ఆదివాసీ జల్-జంగిల్-జమీన్
# ఏనాటికి సాధ్యం..?

### పునరావృత స్థానభ్రంశం.. ప్రగతికి అవరోధం
### ఆరు దశాబ్దాల్లో ఆరు కోట్ల మంది స్థానభ్రంశంలో 40 శాతం ఆదివాసులే

**పాడేరు, ఆగస్టు 9, ప్రభాతవార్త;**

దేశ జనాభాలో 10.45 కోట్లు 8.6 శాతంగా మాత్రమే ఉన్న ఆదివాసీ జనాభా వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో ఆరు దశాబ్దాల్లో ఆరు కోట్ల మంది స్థానభ్రంశం అయితే అందులో 40 శాతం ఆదివాసిలే ఉన్నారు. కనీస విద్యకు నోచుకున్న వారు కేవలం 29 శాతం మాత్రమే ఉన్నారు. పేదరికం, అంతరిస్తున్న సంస్కృతి, భాష, ఖాళీగా ఉన్న ఆదివాసీ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ జరగకపోవడం వంటివి ఆదివాసీల అభివృద్ధికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయని దానికి సందేహం లేదు. భారత దేశంలో ఆంధ్రప్రదేశ్ తో పాటు ఒరిస్సా, ఛత్తీస్గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఆదివాసీలు ఎక్కువ శాతం ఉన్నారు.



1994 ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా సమస్యలపై, అభివృద్ధికి అవసరమైన చర్యలపై గోడు వినిపించినా.. నాటి నుండి నేటి వరకు ఆశించిన ప్రగతి ఆచరణ సాధ్యం కాలేదనేడు నగ్న సత్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, సంక్షేమ అభివృద్ధి చర్యలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి . అభివృద్ధి పేరుతో ఆదివాసి రక్షణ చట్టాలు, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరుగుతూనే వస్తూ ఉన్నాయి.పర్యాటకం, గనులు, డ్యాంలు,, విద్యుత్ ప్రాజెక్ట్, పరిశ్రమలు, వన్యజీవి రక్షణ పార్కులు పేరుతో ఎటువంటి అభివృద్ధి జరిగినా..ఆదివాసులకు పెద్దగా ఉపయోగపడలేదు కానీ వారి మనుగడే పెద్ద సవాలుగా మారుతోంది (తరువాయి 8వ పేజీలో)

## నేడు డయల్ యువర్
# ఏపీఈపీడీసీఎల్ సీఎండీ

**విశాఖపట్నం, ఆగస్టు 9, ప్రభాతవార్త :**

ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ కార్యక్రమం విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించబడుతుంది. సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు 8688400499 ఫోన్ నంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సరఫరా అంతరాయాలు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, కొత్త కనెక్షన్ల జారీలో జాప్యం, సరఫరా పునరుద్ధరణలో ఆలస్యం, ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి, రూఫ్‌టాప్ సోలార్ వంటి వివిధ సమస్యలపై ఫిర్యాదులను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకురావచ్చు. ఈ అవకాశాన్ని సంస్థ పరిధిలోని 11 జిల్లాల విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.



## మెగా హీరోలు ప్రయాణించిన కారు ఎవరిది!

(7వ పేజీ తరువాయి)

రావడంతో ఆ కారు గురించి అనేకమంది ఇప్పుడు ఆరా తీస్తున్నారు. ఈ కారు మెగాస్టార్ చిరంజీవికి, ఆయన కుటుంబానికి అత్యంత సన్ని హితుడైన భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ది. మెగా కుటుంబ సభ్యులెవరు విశాఖ వచ్చినా గంటా వారికి ఆత్మీయ ఏర్పాట్లు చేస్తుంటారు. 'ఇద్దరు హీరోలు ఒకే కారులో ప్రయాణించారు. అనుబంధం అంతర్గతంగా ఎప్పుడూ ఉంటుంది. అభిమానులు ఫ్యాన్ వార్‌లు పక్కన పెట్టాలి" అని సోషల్ మీడియాలో ఇద్దరు హీరోలు ప్రయాణించిన కారు ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

## వైజాగ్‌లో బన్నీ సందడి..

(7వ పేజీ తరువాయి)

నగర పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సీపీ ఆధ్వర్యంలో డీసీపీ-1, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఇతర పోలీసు సిబ్బంది భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు, ఇనార్బిట్ మాల్ యాజమాన్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పోలీసుల పటిష్ట భద్రత మధ్య కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

### న్యాయవాద వృత్తిలో రాణించేందుకు

## దగ్గరి దారేది లేదు

(7వ పేజీ తరువాయి)

ఎదుగుతామని అదే సమయంలో న్యాయ మూర్తులుగా ఎదగి ఉన్నత స్థానాలను కూడా అధిరోహిస్తామని అంటూ అనేక మంది సీనియర్ న్యాయవాదులు ,న్యాయమూర్తులుగా నియామకం పొందారని అందుకు నేను కూడా ఒక ఉదాహరణ అంటూ ఆయన తెలియజేశారు. న్యాయవాది మొదటి రెండు సంవత్సరాలు ట్రయిల్ కోర్టులో పని చేసినట్లయితే కావలసినంత అనుభవం వస్తుందని తరువాత హైకోర్టులకు సుప్రీంకోర్టులలో రిజిస్టర్ చేసుకోవచ్చని అన్నారు. నేటి పరిస్థితుల్లో మధ్యవర్తిత్వం ఎంతగానో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని విద్యార్థులు మధ్య వర్తిత్వంలో కూడా నిపుణత సాధించాలని తెలియజేసారు. సీనియర్ న్యాయవాదులు కేసులు వాదించే విధానాన్ని నిశితం గా గమనించి వారి నుంచి ఎంతో నేర్చుకోవచ్చని అన్నారు. ప్రసంగం అనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు లేవనెత్తిన అనేక ప్రశ్నలకు ఆయన ఎంతో ఉత్సాహంగా సమాధానం ఇచ్చారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ విద్యార్థులు చదువుకున్న విశ్వవిద్యాలయాన్ని గురువులను గౌరవించే ముందుకు కొనసాగుతూ ఉండాలని తెలియజేస్తూ, విద్యార్థులతో ఇలా రెండు మూడు గంటలు గడపడం ఎంతో ఆనందంగా ఉందని తనకున్న అనుభవాన్ని న్యాయవాద వృత్తి లోకి భవిష్యత్తులో రాబోయే నేటితరంతో పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలియజేస్తూ విశాఖపట్నం ఎంతో అందమైన పట్టణమని అలాగే దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం కూడా ఎంతో పచ్చదనంతో ఎంతో ఆనందకరంగా ఉందని తరచుగా ఇక్కడికి వచ్చి విద్యార్థులతో సంభాషించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను తెలియచేస్తూ విశ్వవిద్యాలయమును ఉన్నత స్థానంలో నిలుపుతున్న విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ సూర్యప్రకాశరావు ని అభినందించారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విశ్వవి ద్యాలయ ఇంచార్జి రిజిస్టార్ విశ్వచంద్రనాద్ మాదాసు అకడమిక్ డైరెక్టర్ సోమభట్ల ఆచార్య ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

### అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఉమ్మడి జిల్లాల

## జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర

**రూ. 90 లక్షల జడ్పీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు**

**రూ. 25 లక్షలతో గిరిజన ఉద్యోగుల సంఘ భవనం**

**రూ. 40 లక్షలతో అల్లూరి సీతారామరాజు చెరువు సుందరీకరణ, వాకింగ్ ట్రాక్**

**రూ. 20 లక్షలతో అంబేద్కర్ పార్కు ప్రహరీ**

**రూ. 5 లక్షలతో అంబేద్కర్ పార్క్ వద్ద కళావేదిక**



ముంచంగిపుట్టు ఆగష్టు 9 (ప్రభాతవార్త):

పార్టీలకు ప్రాంతాలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రత్యేక చొరవతో అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండల కేంద్రంలో రూ.90 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రారంభించారు. అందులో రూ.40లక్షలతో సుందరీకరించిన అల్లూరి సీతారామరాజు చెరువు, వాకింగ్ ట్రాక్ ను, రూ. 25 లక్షలతో నిర్మించిన గిరిజన ఉద్యోగుల సంఘ భవనం, రూ.20 లక్షలతో అంబేద్కర్ పార్క్ ప్రహరీ, మరో రూ . 5లక్షలతో నిర్మించిన అంబేద్కర్ పార్క్ వద్ద కళావేదికలను ఆదివారం వేడుకగా ప్రారంభించారు. తన హయాంలో ముంచంగిపుట్టు కేంద్రంలో ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్న సంకల్పం జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర గారు ఆదివాసి దినోత్సవం నాడు నెరవేర్చారు. గిరిజన ఉద్యోగులు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆదివాసి ప్రజలు ప్రముఖుల సమక్షంలో ఈ ప్రారంభోత్సవాలు జరిగాయి. రూ. 40 లక్షలతో సుందరీకరించిన అల్లూరి సీతారామరాజు చెరువు, ఆ చెరువులో వాకింగ్ ట్రాక్ ను అరకు శాసనసభ్యులు రేగం మత్స్యలింగం గారు ప్రారంభించారు. గిరిజన ఉద్యోగుల సంఘ భవనాన్ని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రారంభించారు. అంబేద్కర్ పార్కులో కళావేదికను, ప్రహరీని జడ్పీ చైర్ పర్సన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు చెరువు వద్ద కొమరం భీమ్ బిర్సా ముండా, మహాత్మ జ్యోతిరావు పూలే , సావిత్రిబాయి పూలే విగ్రహాలను జడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర తన సొంత నిధులను వెచ్చించి నిర్మించారు. వాటిని కూడా ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రారంభించారు. కొమరం భీమ్ విగ్రహాన్ని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, బిర్సా ముండా విగ్రహాన్ని గిరిజన ఉద్యోగులు సంఘం , మహాత్మ జ్యోతిరావు పూలే, విగ్రహాన్ని మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యే కొత్తగుల్లి భాగ్యలక్ష్మి జిసిసి మాజీ చైర్మన్ సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని మాతా సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కమిటీ ఆవిష్కరించింది. ఈ సందర్భంగా గిరిజన ఉద్యోగులు ఎన్నో ఏళ్ల నాటి తమకల నెరవేర్చిన జడ్పీ చైర్పర్సన్ సుభద్ర గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తన పేరును చిరస్థాయిగా గుర్తుంచుకుంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిరిజన ఉద్యోగులు అక్కడికి వచ్చిన ప్రముఖులు ప్రజలంతా జల్లిపల్లి సుభద్ర మూర్తి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసి దినోత్సవాన్ని కూడా అత్యంత వైభవంగా నిర్వహించారు మహిళా ప్రజాప్రతినిధులు గిరిజనలు అందరితో కలిసి చేసిన ధింసా నృత్యం అలరించింది.

## విశాఖలో తాగునీటి కష్టాలు..

(7వ పేజీ తరువాయి)

పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖకు నీటిని తీసుకువచ్చి నగర తాగునీటి అవసరాలను తీర్చాలనే ప్రతిపాదన కూడా ముందుకు వచ్చింది. పోలవరం నీటిని వినియోగించుకోవడం ద్వారా విశాఖకు దీర్ఘకాలికంగా నీటి భద్రత కల్పించవచ్చనే అంచనాలు వ్యక్తమయ్యాయి. అయితే ఈ ప్రతిపాదన కూడా పూర్తిస్థాయిలో అమలులోకి రాకపోవడంతో నగరం ప్రస్తుతం ఉన్న నీటి వనరులపైనే ఆధారపడాల్సి వస్తోంది.

**ట్యాంకర్లకు పెరుగుతున్న డిమాండ్..**

ట్యాంకర్లకు పెరుగుతున్న డిమాండ్.. అయినా సరిపోని సరఫరా ప్రస్తుతం పలు ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం జీవీఎంసీని ఆశ్రయిస్తున్నారు. నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ట్యాంకర్లు అందుబాటులో లేకపోవడం ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. ఒక ప్రాంతానికి ట్యాంకర్ చేరుకునేలోపు మరో ప్రాంతం నుంచి డిమాండ్ రావడంతో అధికారులకు కూడా ఒత్తిడి పెరుగుతోంది. మహానగరంలో నీటి అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో తాత్కాలికంగా ట్యాంకర్లతో సమస్యను పరిష్కరించడం కంటే, దీర్ఘకాలిక నీటి భద్రతకు శాశ్వత ప్రణాళిక అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నగరానికి అదనపు నీటి వనరులను సమకూర్చడం, భారీ స్థాయిలో నీటి నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయడం, ఉన్న రిజర్వాయర్ల సామర్థ్యాన్ని పెంచడం, వర్షపు నీటి సంరక్షణను విస్తృతం చేయడం, భూగర్భ జలాల పునఃభర్తీకి చర్యలు చేపట్టడం అత్యవసరంగా మారింది.

**ఇప్పటికైనా మేల్కొనకపోతే?**

వర్షాలు మరింత ఆలస్యమై రిజర్వాయర్లలో నిల్వలు గణనీయంగా తగ్గితే నగర తాగునీటి పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారే ప్రమాదం ఉంది. 25 లక్షల జనాభా ఉన్న మహా విశాఖకు ప్రతిసారీ అత్యవసర పరిస్థితుల్లో ట్యాంకర్లను ఆశ్రయించడం ఎంతవరకు సాధ్యమనే ప్రశ్న తలెత్తుతోంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని శాశ్వత నీటి వనరులు, నిల్వ సామర్థ్యం, ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. నీటి ఎద్దడి వచ్చిన తర్వాత చర్యలు చేపట్టడం కంటే.. నీటి కొరత రాకముందే ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయాలి. లేదంటే రిజర్వాయర్లు అడుగంటిన కొద్దీ విశాఖలో తాగునీటి కష్టాలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

### మున్సిపాలిటీలోని అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న

## ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

(7వ పేజీ తరువాయి)

నిర్మాణం ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యువ నాయకులు మంత్రి నారా లోకేష్ నియోజవర్గ అభివృద్ధికి ఎంతో తోడ్పాటు ఇస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో మున్సిపాలిటీని ఏ విధమైన అభివృద్ధి సంక్షేమ పథకాలు నిర్వహించలేదని తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మున్సిపాలిటీలో అనేక అభివృద్ధి పనులను చేపట్టామని వాటిని మీద ప్రతిపక్ష వైసిపి నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సమంజసం కాదని ఏదైనా మాట్లాడాలంటే పూర్తి అవగాహనతో మాట్లాడాలని హేతుపలికారు. గత వైసీపీ ప్రభుత్వంలో దేవాలయాల మీద దాడులు జరిగినప్పుడు మీరందరూ ఎక్కడ ఏమైపోయారు అంటూ వైసీపీ నాయకులను ప్రశ్నించారు. అనంతరం అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ మాట్లాడుతూ తాను ఎంపీగా మీ ముందు ఉండడానికి అవకాశం ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తన దృష్టికి రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారని ఆ పనులను వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు చేపడతామని అన్నారు. అనకాపల్లి జిల్లాలో రాష్ట్రంలోని ఎక్కడా లేని విధంగా ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయని ప్రస్తుతానికి కొన్ని పరిశ్రమలు శంకుస్థాపన కూడా జరిగాయని ఇంకా పరిశ్రమంలో వస్తాయని దీనికి కారణం ఎన్డీఏ ప్రభుత్వ కృషి అని అన్నారు. అనంతరం పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతులు నిర్మాణం కోసం కోటి రూపాయలు ఎంపీ ఫండ్స్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసిన సీఎం రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ ఎన్ని అభివృద్ధి సంక్షేమాలు పనులను చేసిన విద్యకు చేస్తున్న ఎప్పటికీ మరువలేనదిని అన్నారు. ప్రస్తుతం జిల్లాలోనే ఎంతో పేరు ప్రఖ్యాతలో తెచ్చుకున్న ప్రభుత్వ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అదనపు తరగతులు నిర్మాణం ఎంపీ నిధులనుండి జరగడం తన అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాతయ్య బాబు, ఎంపీపీ రాజాన శేషు, జనసేన నాయకులు ఊటకూటి రమేష్ నాయుడు, పిట్టా శ్రీనివాసరావు, కొటారు శ్రీనివాసరావు లాలం సోమినాయుడు, కర్రీ ఝాన్సీ, లంక ఉదయ్, గంధం శివ, నాలుగు మండలాలకు చెందిన కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## సన్మార్గంలో నడిస్తే షీట్ల తొలగింపు.. లేదంటే ఊరి బహిష్కరణ!

### రౌడీషీటర్లకు సీఐ నరసింహారావు హెచ్చరిక

గాజువాక,ఆగష్టు 9,ప్రభాతవార్త :

నేర ప్రవృత్తిని వదిలి సన్మార్గంలో పయనిస్తే రౌడీ షీట్లు తొలగిస్తామని, అలా కాకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే నగరం నుంచి బహిష్కరిస్తామని మల్కాపురం సీఐ ఇ నరసింహారావు స్పష్టం చేశారు. ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి ప్రస్తుత జీవనోపాధి, ప్రవర్తన, కదలికలపై సుదీర్ఘంగా ఆరా తీశారు.

అనంతరం సీఐ మాట్లాడుతూ.. పద్ధతి మార్చుకుని బాధ్యతాయుత పౌరులుగా



జీవించే వారికి పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. గతాన్ని మరిచి సత్ప్రవర్తనతో మెలిగే వారి వివరాలను సేకరించి, ఉన్నతాధికారుల అనుమతితో రౌడీ షీట్లను ఎత్తివేసేందుకు సిఫారసు చేస్తామని చెప్పారు. అయితే, ఇప్పటికీ కొంతమంది దందాలు, ఆక్రమణలు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు పాల్పడుతున్నట్లు దృష్టికి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెడు మార్గాన్ని వీడకపోతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా నగర/ఊరి బహిష్కరణ (ఎక్స్‌టర్న్‌మెంట్) ఉత్తర్వులు జారీ చేస్తామని తేల్చిచెప్పారు. ప్రశాంతమైన వాతావరణానికి విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కష్టపడి జీవిస్తూ కుటుంబాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా హితవు పలికారు.

### జలధార-జలహారతి కార్యక్రమంలో మూడు విభాగాల్లోనూ

## రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఏఎస్ఆర్ జిల్లా

**కలెక్టర్ టి. నిశాంతి అంకితభావంతో కూడిన నాయకత్వం, నిరంతర పర్యవేక్షణకు ఘన ఫలితం**

పాడేరు, ఆగస్టు 9, ప్రభాతవార్త:



జల సంరక్షణ, నీటి వనరుల అభివృద్ధి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో అమలు చేస్తున్న జలధార--జలహారతి కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు (ఏఎస్ఆర్) జిల్లా మూడు కీలక విభాగాల్లోనూ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించింది.ఏఎస్ఆర్ జిల్లా కింది మూడు విభాగాల్లో రాష్ట్రంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. అత్యధిక సంఖ్యలో పనులు చేపట్టడం, అత్యధిక నూతన నీటి నిల్వ సామర్థ్యాన్ని సృష్టించడం, జలధార--జలహారతి కార్యక్రమం ద్వారా అత్యధిక ఆశించిన ఫలితాలను సాధించడం జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిశాంతి నాయకత్వంలో జిల్లా యంత్రాంగం అనుసరించిన సమర్థవంతమైన సమన్వయం, నిరంతర పర్యవేక్షణ, క్షేత్రస్థాయిలో ఫలితాల ఆధారిత అమలు విధానం ఈ విజయానికి దోహదపడింది. కార్యక్రమం అమలును కలెక్టర్ నిరంతరం పర్యవేక్షిస్తూ, పనులను సకాలంలో పూర్తి చేయడం, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించడం, క్షేత్రస్థాయిలో స్పష్టమైన ఫలితాలను సాధించడంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వివిధ శాఖల మధ్య సమన్వయం, నిరంతర సమీక్ష, అధికారులకు మార్గనిర్దేశం చేయడం ద్వారా మూడు విభాగాల్లోనూ జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించేందుకు ఆమె నాయకత్వం కీలకంగా నిలిచింది.

ఈ సందర్భంగా జిల్లా స్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది కలెక్టర్ టి. నిశాంతి ని అభినందించారు. కార్యక్రమం విజయవంతంగా అమలయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తూ, అధికారులకు మార్గనిర్దేశం చేసినందుకు ఆమెను ప్రశంసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ విజయం అన్ని శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, సంబంధిత భాగస్వాముల సమిష్టి కృషి ఫలితమని తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా అమలయ్యేందుకు అంకితభావంతో పనిచేసిన అధికారులు, సిబ్బందిని ఆమె అభినందించారు.

జలధార--జలహారతి కార్యక్రమం ద్వారా నీటి భద్రతను బలోపేతం చేయడంతో పాటు, సాగునీటి సామర్థ్యాన్ని పెంపొందించడం, నీటి నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, స్థిరమైన నీటి వనరులను అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఏఎస్ఆర్ జిల్లాలోని గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు.

నీటి సంరక్షణ, నీటి వనరుల అభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తూ, సమన్వయంతో కూడిన, వినూత్నమైన, ఫలితాల ఆధారిత పాలన ద్వారా జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ నిశాంతి స్పష్టం చేశారు.

## నెరవేరిన ఏళ్ల నాటి గిరిజన ఉద్యోగుల సంఘం కల

**రూ.25 లక్షల జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన ముంచంగిపుట్టు గిరిజన ఉద్యోగుల సంఘ భవనం ప్రారంభం**

ముంచంగిపుట్టు ఆగష్టు 9 (ప్రభాతవార్త)



ఎన్నో ఏళ్లనాటి గిరిజన ఉద్యోగుల సంఘం కలను ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్పర్సన్ జల్లిపల్లి. సుభద్ర నెరవేర్చారు. ప్రత్యేక చొరవ తీసుకొని రూ. 25 లక్షలు కేటాయించి ముంచంగిపుట్టు కేంద్రంలో గిరిజన ఉద్యోగులకు ఓ భవనాన్ని నిర్మించారు. ఆ గిరిజన ఉద్యోగుల సంఘం భవనం ఆదివాసి దినోత్సవాన్ని ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సుభద్ర స్వయంగా ప్రారంభించారు. ఈ వేడుకకు గిరిజన ప్రజాప్రతినిధులు ప్రముఖులు హాజరయ్యారు. అరకు శాసనసభ్యులు రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీ కుంభారావు, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి గిరిజన సహకార సంస్థ మాజీ చైర్మన్ శోభా స్వాతిరాణి, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ కలను నెరవేర్చిన జడ్పీ చైర్పర్సన్ ను గిరిజన ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. తమకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు భవన నిర్మాణానికి హామీ ఇవ్వకపోయినా ఉద్యోగుల వినతి మేరకు సుభద్ర తమ కలను నెరవేర్చారని ఇది తమ జీవితంలో ఒక మధుర ఘట్టంగా మిగిలిపోతుందని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆదివాసి దినోత్సవ వేడుక కూడా అలరించాయి. గిరిజన మహిళలంతా ఆదివాసి సాంప్రదాయ దుస్తులలో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

## ఆదివాసీ జల్-జంగిల్-జమీన్ ఏనాటికి సాధ్యం.?

(7వ పేజీ తరువాయి)

వివిధ అధికారిక లెక్కల ప్రకారం1947 నుండి ఇప్పటికి దేశంలో ఆరు కోట్ల మంది అభివృద్ధి పేరుతో స్థానభ్రంశం జరిగితే అందులో 40 శాతం గిరిజనులే ఉన్నారు. నీటి ప్రాజెక్టు, విద్యుత్ ప్రాజెక్టు పేరుతో మొత్తం1.63 కోట్ల మంది నిర్వాసితులు కాగా అందులో ఆదివాసీలు 63.21 లక్షలు. గనుల, ఖనిజాలు వెలికితీత పేరుతో 25.5 లక్షలు నిర్వాసితులు కాగా అందులో 19.20 లక్షలుగా ఉన్న ఆదివాసులు దాదాపు 75 శాతంగా ఉన్నారు . వివిధ పరిశ్రమల పేరుతో 12.5 లక్షల మంది స్థానభ్రంశం చెందగా అందులో 8.75 లక్షల మంది ఆదివాసులు 70 శాతంగా ఉన్నారు. వివిధ వన్యజీవి రక్షణ పార్కుల పేరుతో దాదాపు పది లక్షల మంది గిరిజనులే అభివృద్ధి పేరుతో భూములు కోల్పోయారు. తరతరాలుగా శతాబ్దాలుగా ఆదివాసీలు నివసిస్తున్నా చట్టాలు ఉన్న వారికి సరైనటువంటి పట్టాలు లేకపోవడంతో చట్టపరమైన హక్కులు లేకపోవడంతో నష్టపరిహారం గానీ, పునరావాసం గానీ దక్కడం లేదు .

అటవీ హక్కుల చట్టం 2006,పీసా చట్టం -1996 ఆదివాసులకు రక్షణగా ఉన్నప్పటికీ చట్టం అమల్లో జాప్యం, అమలు చేయడంలో చిత్తశుద్ధి లోపం, పైగా చట్టం ఉల్లంఘన జరుగుతూనే ఉంది .

2005 డిసెంబర్ 13వ తేదీ నాటికి తమ భూమిలో ఆక్రమనలో ఉన్నట్టు రుజువు చేసుకోలేకపోవడం వారికి శాపంగా మారింది. 1955లో ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంస్థ ( జీసీసీ )అడవుల నుంచి ఆదివాసీలు సేకరించే తేనె, చింతపండు, నల్లజీడి, చీపుర్లు, తుమ్మ బంక, ఉసిరి, అలాగే వ్యవసాయం చేసి పండించే కాఫీ, కొర్రలు, వరి, రాగి, రాజ్మా, పసుపు, చిక్కుళ్ళు లాంటివి వ్యాపారం చేసి కోట్ల లాభాలు గడిస్తుంది. ఈ లాభాలన్నీ గిరిజనుల కష్టానికి ప్రతిఫలమే కదా.. కానీ పండించిన గిరిజన రైతులకు గిట్టుబాటు ధర దక్కకపోవడం దయనీయం. టూరిజం శాఖ 2028-29 నాటికి దాదాపు రూ.74 వేలకోట్లు నుండి రూ 2.4 లక్షల కోట్ల పర్యాటక ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్న పర్యాటక శాఖ వలన కూడా ఆదివాసీలకు దక్కుతున్న ప్రయోజనం అంతంత మాత్రమే. ఆదివాసీ ప్రాంతాల్లోనే ఎక్కువగా పర్యాటక ప్రాజెక్టులు చేపడుతున్నా.. స్థానికంగా ఉన్నవారికి ఉపాధి అవకాశాలు మొక్కుబడిగానే కల్పిస్తున్నారు. అరకు, బొర్రాగుహలు, లంబసంగి, వంజంగి తదితర ఇతర ప్రాంతాలు,ఆదివాసి ప్రాంతాల్లో పర్యాటక పరంగా పొందుతున్న కాస్త జీవనోపాధి కూడా భయం భయంగా పొందే పరిస్థితి. ఒకపక్క అటవీశాఖ, మరో పక్క టూరిజం ఆదాయాలు తమకే రావాలని చూస్తున్నాయి తప్ప ఆదివాసీల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఉత్తరాంధ్రలోనే ఆదివాసీ ప్రాంతాల్లో నాలుగు భారీ జల విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. గనుల తవ్వకాల పేరుతో 2025-26 సంవత్సరం లో రూ 3320 కోట్లు లక్ష్యం ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ప్రాంతాలలో ఇదే ఒరిస్సా ప్రభుత్వ తరహాలో "వ్యాల్యూ యాడెడ్" విధానాన్ని ఆంధ్ర రాష్ట్రంలో అమలు చేస్తే దాదాపు 20 వేల కోట్ల రూపాయల ఆదాయం వనరులుగా ఆదివాసీ ప్రాంతాలు ఉంటాయి. గిరిజనుల సంక్షేమం కోసం ఏర్పాటైన సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలు ఐటిడిఏ) తొమ్మిది ఉన్నాయి. సకాలంలో నిధులు రాకపోవడంతో పారిశుద్ధ్యం, వైద్యం, విద్యా, ప్రజారోగ్య పనులు నత్త నడకన జరుగుతున్నాయి. ఫలితాలే లక్ష్యంగా పారదర్శకతతో ఐటీడీఏలో ఆదివాసీలను భాగం చేస్తే ఆచరణాత్మక కార్యాచరణ ప్రణాళికతో ఫలితాలు. ఇవ్వనున్నాయి. మన్యంలో అనారోగ్యంతో ఉన్న వారిని, చనిపోయిన వారిని తరలించడానికి నేటికీ మోటార్ సైకిల్, ఆటోలు, డోలీలు పైనే ఆధారపడే పరిస్థితి అక్కడక్కడా మన్యంలో దర్శనం ఇస్తున్నాయి.

ఆదివాసీ ప్రాంతాల్లో గిరిజన హక్కుల కోసం పోరాడిన అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్, బిర్సా ముండా లాంటి పోరాటయోధుల నేతృత్వంలో జరిగిన ఆదివాసీ పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తి కావాలి. ప్రపంచంలోనే లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల్లో హక్కుల తో కూడిన ఆదివాసీల చట్టాల అమలు సమర్థవంతంగా జరుగుతున్నాయి. భారత దేశంలో ఈ తరహాలో చర్యలు ఉండాలని, నేడు కేవలం ఆదివాసీ అవసరల కోసమే చట్టలు నామ మాత్రమే ఉన్నాయి అని, హక్కులతో కూడిన చట్టాలు సమర్థవంతంగా నిర్ణీత కాలం లో అమలు కావాలని సామాజికవేత్తలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివాసీల హక్కుల కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలించాలని, మన అడవి, మనభూమి, మన పాలన అనే నినాదం ఆచరణకు ఆదివాసీ దినోత్సవం స్ఫూర్తి కావాలని ఆశిద్దాం. .!

## విశాఖలో కిమ్స్ ఫెర్టిలిటీ ఐవీఎఫ్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా

(7వ పేజీ తరువాయి)

విశాఖలో ఏర్పాటవడం ఉత్తరాంధ్ర ప్రజలకు గర్వకారణమన్నారు. గతంలో అత్యాధునిక సంతాన సాఫల్య వైద్య సేవలు ప్రధానంగా మెట్రో నగరాలకే పరిమితమయ్యేవని, ఇప్పుడు ఇలాంటి సేవలు విశాఖలోనే అందుబాటులోకి రావడం ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. సంతానలేమి సమస్యలను ఎదుర్కొంటున్న దంపతులు అందుబాటులో ఉన్న ప్రత్యేక వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కిమ్స్ ఫెర్టిలిటీ ఐవీఎఫ్ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శ్వేత బొల్లినేని మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో సంతానోత్పత్తి రేటు 2.1 అనే ప్రత్యామ్నాయ స్థాయి కంటే గణనీయంగా తక్కువగా ఉండటం భవిష్యత్తులో వృద్ధుల జనాభా పెరగడం, పని చేసే వయసు జనాభా తగ్గడం వంటి సమస్యలకు దారితీసే అవకాశముందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూపొందించిన జనాభా నిర్వహణ విధానం కూడా దీనిని వ్యూహాత్మక సవాలుగా గుర్తించిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షిస్తున్న ఆరోగ్యవంతమైన, యువతతో కూడిన, అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో పునరుత్పత్తి ఆరోగ్యం, సంతాన సాఫల్య వైద్యం కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఆధునిక ఫెర్టిలిటీ చికిత్సలు, సంతానోత్పత్తి పరిరక్షణ, పునరుత్పత్తికి సంబంధించిన నిర్ణయాలపై సరైన అవగాహన కల్పించడం ద్వారా దంపతులకు అండగా నిలవడమే కిమ్స్ ఫెర్టిలిటీ లక్ష్యమన్నారు.

కిమ్స్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధాకర్ జాదవ్ మాట్లాడుతూ.. సంతానలేమికి ప్రతి దంపతుల విషయంలో ఒకే రకమైన చికిత్స విధానం సరిపోదన్నారు. ఒక్కో జంటకు ఒక్కో రకమైన వైద్య పరిస్థితి ఉంటుందని, అందువల్ల సమగ్ర వైద్య పరీక్షల అనంతరం వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుందని తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో పాటు మానవీయ దృక్పథం, వ్యక్తిగత శ్రద్ధతో సేవలు అందించడమే కేంద్రం లక్ష్యమన్నారు.

సీనియర్ కన్సల్టెంట్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ జ్యోత్స్న మాట్లాడుతూ.. సంతానలేమికి కారణాలు దంపతులను బట్టి మారుతాయని, అందుకే ప్రతి ఒక్కరికీ ప్రత్యేకమైన చికిత్స అవసరమవుతుందని తెలిపారు. మహిళ వయసు, అండాశయ నిల్వ సామర్థ్యం, వీర్యకణాల నాణ్యత, గత వైద్య చరిత్ర, ఇతర ఆరోగ్య సమస్యలను సమగ్రంగా పరిశీలించిన అనంతరమే చికిత్సను సూచిస్తామని చెప్పారు.

కేంద్రంలో అత్యాధునిక ఐవీఎఫ్, ఐసీఎస్ఐ చికిత్సలు అందుబాటులో ఉంటాయి. ఆధునిక ఎంబ్రియాలజీ ల్యాబ్‌లో అధునాతన ఎంబ్రియో కల్చర్ వ్యవస్థలు, విట్రిఫికేషన్, క్రయోప్రిజర్వేషన్ సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఎంపిక చేసిన రోగులకు ప్రీ-ఇంప్లాంటేషన్ జెనెటిక్ టెస్టింగ్ కోసం ఎంబ్రియో బయాప్సీ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. మహిళలు, పురుషుల్లో సంతానలేమి, అండాశయ నిల్వ సామర్థ్యం తగ్గడం, పదేపదే గర్భస్రావాలు, సంతానోత్పత్తి పరిరక్షణతో పాటు వివిధ పునరుత్పత్తి ఆరోగ్య సమస్యలకు కేంద్రంలో సమగ్ర వైద్య సేవలు అందించనున్నారు.

కార్యక్రమంలో విశాఖపట్నం బోర్డు డైరెక్టర్ బి. అద్విక్, డాక్టర్ ఆర్. గీతా వందన (ఎండీ-ఓబీజీ), కిమ్స్ హాస్పిటల్స్‌కు చెందిన ఫెర్టిలిటీ కన్సల్టెంట్ డాక్టర్ దీప్తి తదితర వైద్యులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రపంచస్థాయి ఫెర్టిలిటీ వైద్య సేవలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, నాణ్యమైన పునరుత్పత్తి వైద్యం ద్వారా దంపతులు తల్లిదండ్రులుగా మారాలన్న వారి ఆశయానికి అండగా నిలవడమే కిమ్స్ ఫెర్టిలిటీ లక్ష్యమని కిమ్స్ హాస్పిటల్స్ తెలిపింది.

**కిమ్స్ ఫెర్టిలిటీ ఐవీఎఫ్ సెంటర్ గురించి**

కిమ్స్ హాస్పిటల్స్ విశ్వసనీయ వారసత్వంతో ఆధునిక సంతాన సాఫల్య, పునరుత్పత్తి వైద్య సేవలను అందించే ప్రత్యేక కేంద్రంగా కిమ్స్ ఫెర్టిలిటీ ఐవీఎఫ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఐవీఎఫ్, ఐసీఎస్ఐ, ఐయూఐ, ఫెర్టిలిటీ పరిరక్షణ, అధునాతన ఎంబ్రియాలజీ, పునరుత్పత్తి శస్త్రచికిత్సలు, పురుషులు, మహిళల్లో సంతానలేమికి చికిత్స వంటి సమగ్ర సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన ఫెర్టిలిటీ నిపుణులు, రోగి కేంద్రంగా పనిచేసే విధానంతో తల్లిదండ్రులు కావాలన్న దంపతుల కలను సాకారం చేయడమే కిమ్స్ ఫెర్టిలిటీ లక్ష్యం.

## పెద్దగదిలిలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**రికార్డులు లేని నాలుగు వాహనాలు స్వాధీనం**



ఆరిలోవ,ఆగస్టు9, ప్రభాతవార్త

ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోగల పెదగదిలి పోలమాంబ గుడి సమీప ప్రాంతంలో శనివారం రాత్రి పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బాగ్చి ఆదేశాల మేరకు అదనపు సిపి ఎస్. శ్రీనివాస్ సూచనలతో ఎస్పై వై. కృష్ణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కాలనీలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో సరైన రికార్డులు లేని నాలుగు వాహనాలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై పోలీసులు ఆరా తీశారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇటువంటి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పై వై. కృష్ణ మాట్లాడుతూ..కాలనీల్లో అపరిచిత వ్యక్తుల కదలికలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఏదైనా కార్యకలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## ఘనంగా మెగా రక్తదాన శిబిరం



గాజువాక,ఆగస్టు 9,ప్రభాతవార్త :

జనసేన పార్టీ 65వ వార్డు అధ్యక్షులు రెయ్యి రత్నం జన్మదినాన్ని పురస్కరించుకుని గాజువాక బీసీ రోడ్డులోని కాకతీయ ఆర్మ్స్ వద్ద ఆదివారం మెగా రక్తదాన, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భాజపా రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్, గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) ముఖ్యఅతిథిగా హాజరై రేయి రత్నంకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, రక్తదానం చేసిన దాతలకు కేఎన్ఆర్, రేయి రత్నం చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. గాజువాక వందే భారత్ బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ వినోద్ బాబు ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. కార్యక్రమంలో భాజపా వార్డు అధ్యక్షుడు రంజిత్ కుమార్, మాజీ కౌన్సిలర్ పేర్ల సత్యారావు, బొత్స దిలీప్ కుమార్, అనురాగ్ సింగ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడ సేవలు చిరస్మరణీయం: కేఎన్ఆర్



గాజువాక,ఆగస్టు 9,ప్రభాతవార్త:

కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సేవలు చిరస్మరణీయమని భాజపా రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) కొనియాడారు. ఆదివారం విశాఖ వుడా చిల్డ్రన్ ఎరీనాలో కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముద్రగడ సంతాప సభలో ఆయన పాల్గొని, చిత్రపటానికి పూలమాల వేసి నివాళ లర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు, వర్రి లలిత, బొత్స దిలీప్ కుమార్, బొత్స సురేష్, ముమ్మన దేముడు, బండ్రెడ్డి రామజోగి తదితరులు పాల్గొన్నారు.

## 9వ వార్డులో తెదేపా శ్రేణులు ఇంటింటా ప్రచారం



ఆరిలోవ, ఆగస్టు 9, ప్రభాతవార్త

తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు పిలుపు మేరకు స్థానిక 9వ వార్డు ఇంచార్జి బుదుమూరి గోవింద్ ఆధ్వర్యంలో బూత్ నెంబర్ 80, 81, 49, 51లో ఆదివారం పార్టీ శ్రేణులు ఇంటింటికి తెలుగుదేశం పార్టీ ప్రచారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు ఏళ్ల కాలంలో చేసిన అభివృద్ధి, సాధించిన ప్రగతి, సంక్షేమ పథకాలు తెలియజేస్తూ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఐటీడీపీ ఇంచార్జ్ బాదరు బాలరాజు, సీనియర్ నాయకులు కందుల దుర్గా, సీరా అనంత్ కుమార్,సూరిబాబు, నక్క శ్రీను, అనుగుపల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

## భీమన్నదొరపాలెంలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**రూ.40,300 నగదు స్వాధీనం... తొమ్మిది మంది అరెస్ట్**

ఆనందపురం, ఆగస్టు 9, ప్రభాతవార్త:

ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమన్నదొరపాలెం గ్రామంలో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు, సీటీఎఫ్ బృందం సంయుక్తంగా దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఆదివారం భీమన్నదొరపాలెం గ్రామంలో బహిరంగ ప్రదేశంలో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఆనందపురం ఎస్ఐ ఎ.హరీష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, సీటీఎఫ్ బృందం అక్కడికి చేరుకుని దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.40,300 నగదు, 52 పేకముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు, పేకముక్కలతో పాటు తొమ్మిది మంది నిందితులను ఆనందపురం పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓకు అప్పగించారు. ఆనందపురం ఎస్ఐ పి. శివ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## పెదపాటి రమేష్ అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు కోరుతూ ఫిర్యాదు



విశాఖపట్నం, ఆగస్టు 9ప్రభాత వార్త :

పెందుర్తి రాతిచెరువు ప్రాంతానికి చెందిన పెదపాటి లక్ష్మి తన కుమారుడు పెదపాటి రమేష్ అనుమానాస్పద మృతిపై పెందుర్తి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.ప్రేమ వివాహం చేసుకున్న రమేష్ మృతిపై కుటుంబానికి అనేక అనుమానాలు ఉన్నాయని, గతంలో తన భార్య కుటుంబ సభ్యులతో విభేదాలు, ఘర్షణలు జరిగినట్లు తెలిపారు. ఆగస్టు 8 అర్ధరాత్రి మృతికి కొద్దిసేపటి ముందు రమేష్ తన అన్న సాయితో ఫోన్‌లో మాట్లాడిన విషయాన్ని కూడా పోలీసులకు వివరించినట్లు పేర్కొన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం, ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించడంతో పాటు ఫోన్ కాల్స్, సీసీటీవీ, డిజిటల్ ఆధారాలను పరిశీలించి, సహజ మరణమా, ప్రమాదమా, ఆత్మహత్యా లేదా హత్యా అన్నది తేల్చాలని ఆమె కోరారు. హత్య జరిగినట్లు ఆధారాలు లభిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రౌడీ షీటర్లకు సీఐ ఎస్.శ్రీనివాస్ కౌన్సిలింగ్



ఆరిలోవ, ఆగస్టు 9, ప్రభాతవార్త

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలు మేరకు ఆదివారం ఆరిలోవ సిఐ ఎస్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ లు ఎలాంటి నేర కార్యకలాపాలకు పాల్పడవద్దని,రౌడీషీటర్లు తమ తీరు మార్చుకోక పోయినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదని సిఐ హెచ్చరించారు. ప్రతి రౌడీషీటర్ల కదలికలపై పోలీస్ సర్వైలెన్స్ ఉందని, నేరాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు, అక్రమ కార్యకలాపాలకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని, నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కౌన్సిలింగ్లో సిఐతో పాటు శాంతి భద్రత ఎస్ఐ వై. కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి...ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- 57 మంది బాధితులకు రూ 47 లక్షల సి ఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ



గాజువాక, ఆగస్టు 9, ప్రభాతవార్త :

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ వార్డులకు చెందిన 57 మంది నిరుపేద, తీవ్ర అనారోగ్య బాధితులకు రూ.47 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల వ్యవధి లోనే గాజువాక నియోజకవర్గంలో సుమారు 300 మంది లబ్ధిదారులకు రూ.3 కోట్ల మేర ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. ఆపద లో ఉన్న ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, 66వ వార్డు టీడీపీ అధ్యక్షులు మాజీ కార్పొరేటర్ మొహ్మద్ రఫీ,వివిధ వార్డ్ ల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### నీటి ఎద్దడి ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన

# జీవీఎంసీ మంచినీటి సరఫరా

- తెల్లవారుజాము 4 గంటల నుంచే క్షేత్రస్థాయిలో జీవీఎంసీ అధికారుల ప్రత్యేక పర్యవేక్షణ
- 'డయల్-ఏ-ట్యాంకర్', ఆన్‌లైన్ బుకింగ్‌లకు ప్రాధాన్యతతో నీటి సరఫరా
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



ఆరిలోవ, ఆగస్టు 9, ప్రభాతవార్త :

నగరంలో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ మంచినీటి ఇబ్బందులు కలగకుండా యుద్ధప్రాతిపదికన ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజాము 4 గంటల నుంచే అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ, ప్రధాన ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజు, తూర్పు జోన్ జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్, నీటి సరఫరా పర్యవేక్షక ఇంజనీర్ పల్లంరాజు, సంబంధిత కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

**"ఆరిలోవపై ప్రత్యేక దృష్టి"**

ముడసర్లోవ వాటర్ వర్క్స్ నుంచి జీవీఎంసీ, ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి ఆరిలోవతో పాటు అవసరమైన ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆరిలోవలో నీటి సరఫరాను ప్రధాన ఇంజనీర్, నీటి సరఫరా పర్యవేక్షక ఇంజనీర్ తదితరులు పరిశీలించడంతో పాటు ప్రజలకు సరఫరా చేస్తున్న నీటి నాణ్యతను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.

**"డయల్-ఏ-ట్యాంకర్" - ఆన్‌లైన్ బుకింగ్‌లకు ప్రాధాన్యత.**

జీవీఎంసీ "డయల్-ఏ-ట్యాంకర్" సేవ, ఆన్‌లైన్ ద్వారా ట్యాంకర్లను బుక్ చేసుకున్న ప్రజలకు ప్రాధాన్యతనిస్తూ, సంబంధిత ప్రాంతాలకు ట్యాంకర్లను పంపించి నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్లతో పాటు అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ నీటి వనరులు, అనుసంధానాల ద్వారా సరఫరాను మెరుగుపరిచే చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



**"ఎత్తైన ప్రాంతాల్లోనూ నీటి సరఫరా"**

అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ, తూర్పు జోన్ జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు కైలాసనగర్, శ్రీహరినగర్ ప్రాంతాల్లో నీటి సరఫరాను పరిశీలించారు. ఎత్తైన ప్రాంతాలైనప్పటికీ తగిన ఒత్తిడితో నీటి సరఫరా జరుగుతున్నట్లు గుర్తించారని, స్థానికులతో మాట్లాడగా నీటి సరఫరాపై సానుకూల స్పందన వ్యక్తమైనట్లు కమిషనర్ తెలిపారు. ఆరిలోవ 13వ వార్డుకు యా= నీటిని అనుసంధానం చేసి సరఫరాను మరింత మెరుగుపరిచే ప్రత్యామ్నాయంపై కూడా అధికారులు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నీటి అవసరమున్న ప్రతి ప్రాంతానికి సకాలంలో నీటిని అందిస్తూ, నీటి సరఫరా సాధారణ స్థితికి వచ్చే వరకు క్షేత్రస్థాయి ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగిస్తూ, వృథాను నివారించి జీవీఎంసీకి సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ విజ్ఞప్తి చేశారు.

# కన్యాకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణమాస పూజలు

విశాఖపట్నం, ఆగస్టు 9 ప్రభాతవార్త

శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని ఈనెల 13 నుంచి సెప్టెంబర్ 11వ తేది వరకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సంఘ అధ్యక్షులు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ వెంకట కామరాజు ఒక ప్రకటన లో తెలిపారు. కన్యకాపరమేశ్వరి అలయం పునర్నిర్మాణంలో వున్నందున నూతనంగా నిర్మించి ప్రతిష్టించిన బాలాలయంలో శ్రావణ మాసంలో వచ్చే ఐదు శుక్రవారాల్లో అమ్మవారికి ప్రాతఃకాల ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, మహిళలచే సామూహిక లలితాసహశ్రనామ స్తోత్రపారాయణములు, సామూహిక లక్ష సహశ్ర కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు తెలియజే శారు.

ఆదివారం నాడు ఆలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ప్రముఖ వర్తకులు బద్రినారాయణ-ఉమామహేశ్వరి దంపతు లు కార్యక్రమ కరపత్రం విడుదల జేశారు.



ఈ సందర్భంగా దేవాలయ నిర్వాహకులు మాట్లాడుతూ శ్రావణమాసం మొదటి శుక్రవారం 14వ తేది నాడు అమ్మవారికి రజిత వస్త్రాలంకరణ, 108 స్వర్ణపుష్పార్చన, మహిళలచే సామూహిక లలితా సహస్రనామ పారాయణం, సామూహిక లక్ష కుంకుమార్చన, రెండవ శుక్ర వారం ఆగష్టు 21వ తేది నాడు అమ్మవారికి పట్టువస్త్రాలంకరణ మరియు మహిళలచే సామూహికంగా లలితా సహశ్రనామ పారాయణ, లక్ష కుంకుమార్చన, మూడవ శుక్రవారం ఆగష్టు 28వ తేది నాడు అమ్మవారికి పుష్పవస్త్రాలంకరణ, మహిళలచే సామూహికంగా లలితాసహశ్ర నామ పారాయణ, సామూహిక లక్ష కుంకు



మార్చన, నాల్గవ శుక్రవారం సెప్టెంబర్ 4వ తేది నాడు అమ్మవారికి హరిద్రవస్త్రాలం కరణ, మహిళలచే సామూహిక పారాయణ ములు, లక్షకుంకుమార్చన, ఐదవ శుక్ర వారం సెప్టెంబర్ 11వ తేది నాడు శ్రీమహాలక్ష్మి దేవికి పసుపునీళ్ళతో అభిషేకం మరియు సెప్టెంబర్ 4వ తేదినాడు భారీ స్థాయిలో నారాయణ సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రావణమాసంలో వచ్చే ఐదు శుక్రవారాల లోనూ నిర్వహించే సామూహిక కుంకుమ పూజలకు సంబంధించి పూజా సామగ్రి యావత్తూ దేవస్థానం వారు ఉచితంగా ఏ విధమైన రుసుం తీసుకోకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ఆర్య వైశ్యులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కమ్మని కోరారు.

# పద్మనాభం మండలంలో అలుముకుంటున్న కరువు ఛాయలు

**తేలికపాటి వర్షాలు తప్ప, మస్తుగా కురవని వర్షాలు... వెలవెలబోతున్న చెరువులు, నదులు**

**వరినాట్లు లేక బీడువారుతున్న పంట పొలాలు.**

పద్మనాభం, ఆగస్టు 9, ప్రభాతవార్త:

ఎల్ నినో ప్రభావం వల్ల నెలకొన్న తీవ్ర వర్షాబావ పరిస్థితులతో పద్మనాభం మండలంలో కరువు చాయలు అమ్ముకుంటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరినాట్లే వేసే సమయం మించిపోతున్న వానదేవుడు కరుణించలేదు. దీంతో ఖరీఫ్ సాగు ముందుకు సాగలేదు. గత నాలుగు రోజుల క్రితం వరకు చినుకు జాడ కోసం ఎదురుచూసిన రైతన్నలకు ఇటీవల కురిసిన అడపాదప వర్షాలుతో కొంత ఊరట లభించింది. అయితే మస్తుగా వర్షాల కురవకపోవడంతో నీతితో కళకళలాడాల్సిన చెరువులు, కోనేరులు, నదులు వెలవెలబోతున్నాయి. అలాగే వరి నాట్లతో



పచ్చగా ఉండాల్సిన పంట పొలాలు బీడు వారూ తున్నాయి. దీంతో పంట పొలాల్లో పశువులు గొర్రెలు, మేకలు దర్శనమిస్తున్నాయి. వర్షబావ పరిస్థితులతో ఈ సంవత్సరం ఇటు తిండిగింజలు, అటు పశువులకు వరిగడ్డి కరువవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు లెక్కల ప్రకారం మండలంలో



22 పంచాయితీల్లో 7000 ఎకరాల్లో వరినాట్లు వేయాల్సి ఉండగా, పలు గ్రామాల్లో ఉన్న వ్యవసాయ మోటార్ల వద్ద సుమారు 400 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పద్మనాభ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# తాటిపళ్ళతో తాటితోపులను పెంచుదాం

- సామాజికవణాలు పెంచడం మానవాళి బాధ్యత
- మనం తినే పళ్ళ లోని విత్తనాలతో వనాలు పెంచుదాం
- ప్రతి విద్యార్థికి పర్యావరణం పట్ల అవగాహన కల్పించాలి
- విశాఖ జిల్లా విశ్రాంత పంచాయతీ అధికారి నాగరాజు



విశాఖపట్నం, ఆగస్టు 9ప్రభాత వార్త :

తాటిపళ్ళతో తాటితోపులను పెంచుదాం అని విశాఖ జిల్లా విశ్రాంత పంచాయతీ అధికారి నాగరాజు అన్నారు . ఆదివారం ఉదయం గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో, ధాత్రి ఫౌండేషన్ ల నేతృత్వంలో తాటి పళ్ళు, విత్తనాల బంతు లును మధురవాడ లోని ఎన్ వి పి లా కాలేజీ ఎదురుగా ఉన్న కొండల మీద విద్యార్థులతో చల్లిన తర్వాత ఆయన మాట్లాడారు. విద్యార్థులతో ఈ విధంగా విత్తనాల బంతులు తయారు చేయడం కొండల మీద వేయడం ఆరోగ్యకరమైన అలవాటని అన్నారు. అందుకే తాను సైతం తన కొడుకు, మనమరాళ్లతో వచ్చి విత్తన పంతులు చల్లానని అన్నారు. సామాజిక వనాలు పెంచడం మానవాళి బాధ్యత అని పేర్కొ న్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జే.వి.రత్నం మాట్లాడు తూ మనం తినే పళ్ళ లోని విత్తనాలతో వనాలు పెంచుదాం అన్నారు. ప్రతి విద్యార్థి కనీసం 100 విత్తనాల బంతులు తయారు చేసి కొండల మీద, మైదాన ప్రాంతాల్లో చల్లాలని కోరారు. శీతోష్ణస్థితి వేడెక్కుతున్న తరుణంలో అత్యధికంగా మొక్కలు పెంచా లని, వృక్ష సంపదను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి పల్లెలో, పట్టణంలో తాటితోపులు అత్యధికంగా పెంచాలని కోరారు. తాటి తోపులు అధికంగా ఉంటే పిడుగులు వల్ల జీవావరణానికి నష్టం ఉండదు అన్నారు. ధాత్రి ఫౌండేషన్ అధ్యక్షులు విశాలాక్షి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పర్యావరణం పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనదే అని వివరించారు. విద్యార్థి దశలో అవగాహన కలిగితే వాళ్ళు పర్యావరణ హితంగా జీవించే అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్థులతో ఒక హరిత సైన్యాన్ని తయారు చేసే బాధ్యత మన మీదే ఉందన్నారు. ఇందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 50 మందికి పైగా విద్యార్థులు, యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ.కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ హోమియో వైద్య మహా సదస్సు



విశాఖపట్నం, ఆగస్టు 9, ప్రభాతవార్త :

ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ హోమియోపతిక్ ఫిజీసియన్స్ - విశాఖజిల్లా శాఖ, ఈరోజు నగరంలో సిరిపురం నందలి హోటల్ ట్రైకూన్ బిల్డింగ్ హాలు నందు జరిగిన సమావేశమునకు సంస్థ అధ్యక్షులు డాక్టర్ పి.రాఘ వేంద్ర రావు నిర్వహణలో వైద్యులకు నిరంతర వైద్య విద్యా కార్యక్రమం లో భాగంగా "రెమెడీ -రిఫ్రెష్" అనే అంశంపై డా.కె.ప్రీతి వివరించారు. తరువాత "ప్రైమ్ హోమియో ఇన్సైట్స్" గురించి డా. వాకా సునీత అత్యవసర పరిస్థితుల్లో హోమియో చికిత్సల గూర్చి వివరించారు. ఇక డా. చంద్రశేఖర్ గారు "హోమియో లాక్ రెమిడీస్ - వాటి విశిష్ట" గూర్చి విశదీకరించారు. డా జగదాత్రి, డా. ఆర్. శ్రీదేవి కలిసి హోమియో మెడి క్విజ్ నిర్వహించారు. తర్వాత నవంబర్ లో హైదరాబాద్ లో జరగబోయే అంతర్జాతీయ హోమియోపతిక్ సదస్సు యొక్క బ్రోచర్ ను జాతీయ సలహాదారులు డా. కే శర్మ, డా జి. రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి డా పి బి కే సతీష్, రాష్ట్ర ఉప కార్యదర్శి డా. పి చంద్రశేఖర్ మరియు విశాఖ జిల్లా అధ్యక్షులు డా. పి. రాఘవేంద్ర రావు ఆవిష్కరించారు. విశాఖ మరియు ఉత్తరాంధ్ర జిల్లాల హోమియో వైద్యులందరూ సదస్సుకు హాజరు కావాలని అధ్యక్షుడు డాక్టర్ పి.రాఘవేంద్ర రావు,కార్యనిర్వహక కార్యదర్శి వాకా సునీత తెలిపారు. సభలో డా.రాజా శ్రీకాంత్, డా.శివకాంతి, డా.రాధిక తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పాస్టర్ సుందర్ దంపతులకు సన్మానం



విశాఖపట్నం, ఆగస్టు 9, ప్రభాత వార్త :

సీతమ్మదార ఎంఎంటీసీ కాలనీలో ఉన్న ట్రినిటీ లూథరన్ చర్చ్ నార్త్ పారిస్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ వీరవల్లి రాజేంద్ర సుందర్ ఐదేళ్ల కు పైగా సేవలందించి బదిలీపై వెళ్తున్న సందర్భంగా ట్రినిటీ లూథరన్ చర్చి నార్త్ ప్యారిస్ సంఘం ఆదివారం ఆయనకు, ఘనంగా వీడ్కోలు పలికింది. చర్చి ప్రాంగణంలో ఆదివారం జరిగిన ఈ వీడ్కోలు సభలో ఫౌండర్ జి.పాల్ ప్రభాకర్ రావు, ఆచార్యరత్నప్రభాకర్, సంఘం సభ్యులు పాస్టర్ సుందర్, ఆయన సతీమణి ప్రిసిల్లా సూజన్ ను ఘనంగా సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు . ఈ ట్రినిటీ చర్చ్ నూతన పాస్టర్ గా నియమితులైన రెవరెండ్ జేమ్స్ ఆర్ ఆర్ కె కి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం చర్చి ప్రాంగణంలో జరిగిన విందు భోజనం కార్యక్రమంలో విశేష సంఖ్యలో క్రైస్తవులందరూ పాల్గొన్నారు.

## రోబోటిక్స్ పోటీల్లో నేత్ర విద్యాలయ విద్యార్థుల ప్రతిభ

**జాతీయ స్థాయి పోటీలకు రెండు బృందాలు ఎంపిక**



విశాఖపట్నం, ఆగస్టు 9, ప్రభాతవార్త:

శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి ఆశీస్సులతో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భీమిలి రోడ్డు మంగమరిపేట వారిజ ఆశ్రమ నేత్ర విద్యాలయ విద్యార్థులు పుణేలో జరిగిన (డబ్ల్యుఎస్ఆర్ఒ) రోబోటిక్స్ పోటీ ల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా సుమారు 1,000 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో నేత్ర విద్యాలయం నుంచి ఐదు బృందాలు పోటీ పడగా, రెండు బృందాలు తమ విభాగాల్లో విజయం సాధించాయి. యంగ్ సైంటిస్ట్ ఫర్ అగ్రికల్చర్ ఫర్ బ్లైండ్ విభాగంలో శివశంకర్ సాయి, రాధిక, బ్లిక్స్ స్ప్రింట్ విభాగంలో చిన్నారావు, ప్రియాంక విజయం సాధించారు. విజేత బృందాలు సెప్టెంబర్ 24, 25 తేదీల్లో గోవాలో జరిగే జాతీయ స్థాయి (డబ్ల్యుఎస్ఆర్ఒ) రోబోటిక్స్ పోటీల్లో పాల్గొననున్నాయి. దృష్టిలోపం ఉన్న విద్యార్థులు సాధారణ పాఠశాలల విద్యార్థులతో పోటీపడి రోబోటిక్స్, సాంకేతికత, సృజనాత్మకతలో ప్రతిభ చాటడం అభినందనీయమని నేత్ర విద్యాలయ కమిటీ అధ్యక్షుడు పీఎస్ఎన్ రాజు తెలిపారు. విద్యార్థులతో పాటు వారికి శిక్షణ అందించిన ఉపాధ్యాయులు, మెంటర్లను యాజమాన్యం అభినందించింది. జాతీయ స్థాయిలోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి సంస్థకు, విశాఖపట్నానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించింది.

## ఘనంగా నిరంకారి మహిళా సమాగం



విశాఖపట్నం, ఆగస్టు 9, ప్రభాతవార్త

ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదర ణీయ 'బెహన్ మోహినీ అహుజా జీ' (ఏపీ అండ్ టీ ఎస్ జోనల్ ఇంచార్జి) వారి ఆధ్వర్యంలో కావేరి కన్నడ కళ్యాణ మండపం, గురుద్వార్‌లో సుందరమైన మహిళా సమాగం జరిగింది. భక్తులు వారి యొక్క గీతాలు, లఘునటికలు, ప్రవచనాలు, నృత్యం ద్వారా మిషన్ యొక్క సందేశాన్నీ ,మహిళా శక్తిని చాటి చెప్పారు. ఆదరణీయ బెహన్ మోహిని అహుజా జీ గారు భక్తులను ఉద్దేశించి ఇలా పలికారు. మహిళలు పరివారంలో, సమాజంలో ప్రత్యేకమయిన పాత్ర పోషిస్తారన్నారు."ఎక్కడ నారీమణులు గౌరవించబడతారో అక్కడ దేవతలు సంచరిస్తారు."అను వేద వాక్యం ఉందన్నారు. ఈ కార్యక్రమములో భక్తులు కాశింకోట, వొమ్మవరం, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుండి భక్తులు వచ్చి పాల్గొన్నారు . విశాఖ అధ్యక్షులు ప్రేమ్ మిర్పూరి (సశీయోజకులు),సేవాదళ్ అధికారి రవి గారు, హైదరాబాద్ సేవాదళ్ అధికారి రాకేష్ పాల్ అందరికి కృతజ్ఞతలు తెలియజేసారు.

## 8 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మళ్లీ ఉద్యోగాలు

**ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవతో లభించిన ఊరట**



గాజువాక, ఆగస్టు 9, ప్రభాతవార్త :

ఉక్కునగరం విమల విద్యాలయంలో మూతపడటంతో ఉపాధి కోల్పోయిన 8 మంది కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి తిరిగి ఉద్యోగాలు లభించాయి. గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో విద్యాశాఖ అధికారులు వీరిని పునరుద్ధరించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠశాలను ప్రభుత్వ స్కూలుగా పునఃప్రారంభించగా... కేవలం రెగ్యులర్ సిబ్బందినే తీసుకోవడంపై బాధితులు ఎమ్మెల్యే పల్లాను కలిసి విన్నవించారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన... జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఈఓ ప్రేమకుమార్‌లతో మాట్లాడి, 17 ఏళ్లుగా సేవలు అందిస్తున్న వీరిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సూచించారు. అధికారుల నిర్ణయంతో ఉద్యోగాలు రావడంతో బాధితులు ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజుతో కలిసి ఎమ్మెల్యే పల్లాను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీకృష్ణ, ఖాదర్ బాషా, కవిత, రోజా, విజయ్‌శేఖర్, అజయ్ రెడ్డి, రత్న పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ సిబ్బందికి పునర్వైభవం.. మొల్లి పేంటిరాజుకు ఘన సత్కారం



గాజువాక,ఆగష్టు 9 ప్రభాతవార్త :

ఉక్కునగరం విమల విద్యాలయంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది ఉపాధికి ఎదురైన ఆటంకాలు తొలగిపోయాయి. గత 17 ఏళ్లుగా పాఠశాలలో సేవలందిస్తున్న 8 మంది కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకుంటూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు ప్రత్యేక చొరవతోనే ఇది సాధ్యమైందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పేంటిరాజు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, డీఈఓ ప్రేమ్‌కుమార్‌లతో ఎమ్మెల్యే మాట్లాడి, బాధితుల విన్నపాన్ని వారి దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూల నిర్ణయం వెలువడిందన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేసిన మొల్లి పేంటిరాజును ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, స్థానికులు ఘనంగా సత్కరించారు. సుదీర్ఘకాలం పనిచేసిన తమను మళ్లీ విధుల్లోకి తీసుకోవడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.




## అనకాపల్లి జోనల్ కమిషనర్ను వెనక్కి పిలవాలి

**అనకాపల్లి, ఆగస్టు 9, (ప్రభాతవార్త) :**



జీవీఎంసీ అనకాపల్లి జోన్ కమిషనర్ చక్రవర్తిని వెంటనే వెనక్కి పిలవాలని ఆంధ్రప్రదేశ్ కాలేజీ ప్రొటెక్షన్ అండ్ స్టాఫ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని నెహ్రూ చౌక్ సమీపంలో ఉద్యోగుల పట్ల ఆయన చేస్తున్న వేధింపులకు నిరసనగా రిలేనిరాహార దీక్ష ప్రారంభమైంది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బాజీ పఠాన్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ నుండి మున్సిపల్ శాఖకు వచ్చిన జోనల్ కమిషనర్ కు ఇ క్కడ పని చేసే అర్హత లేదన్నారు.. ఆయన పనిచేస్తున్న ప్రతి జోన్ లోనూ ఒక ఉద్యోగి వేధింపులకు మరణిస్తున్నట్లు ఆరోపణలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ క నిశెట్టి సురేష్ బాబు, అడ్వకేట్ సాయి, జిల్లా అధ్యక్షులు జి రాజు, ప్రధాన కార్యదర్శి కృష్ణమోహన్, ఆర్థిక కార్యదర్శి రాజాన సన్యాసినాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, పెద్ద ఎత్తున స్వర్ణ వార్డు గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



## జాతీయ పతాకాన్ని పునరుద్ధరించాలి

**అనకాపల్లి, ఆగస్టు 9 (ప్రభాత వార్త):**

అనకాపల్లి ముఖద్వారం గా ఉన్న విశాఖ, విజయవాడ, అనంతపురం కూడలి జాతీయ రహదారి వద్ద జాతీయ పతాకాన్ని పునరుద్ధరించి ఆ ప్రాంతాన్ని జాతీయ పతాకం జెండా రూపకర్త పింగళి వెంకయ్య స్మృతి వనముగా నిర్మించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూక అప్పారావు డిమాండ్ చేశారు. ఆదివారం జాతీయ పతాకం ప్రదేశంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిరసన తెలియజేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లి పట్టణమునకు మార్గ సూచికగా ఉన్నచోట నాలుగేళ్ల క్రితం జిల్లా కలెక్టర్ ప్రభుత్వం ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో 4. లక్షల రూపాయలతో 72 అడుగుల ఎత్తు పోల్స్ నిర్మించి జాతీయ జెండా నిర్మించారని, ఆ జాతీయ జెండా ఇప్పుడు కనుమరుగవటం చాలా బాధాకరంగా ఉందన్నారు. కలెక్టర్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపి ఆ జాతీయ జెండా ఆవిష్కరించి పింగళి వెంకయ్య స్మృతి వనముగా చేసి అనకాపల్లి కి వెన్న తెస్తారని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో షేక్ రెహ్మాన్, రాపేటి భాస్కర్ రావు, నాగరాజు, రాంప్రసాద్, గొల్ల గాని సన్యాసిరావు, పిల్ల లక్ష్మీనారాయణ బ్లైండ్ అసోసియేషన్ భార్గవ, బుద్ధ ధనలక్ష్మి, ఆడారి అన్నపూర్ణ, చవితిన కృష్ణవేణి, వారాది దుర్గ, గూడుపు వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధ గయ విశిష్టతను కాపాడాలి

**అనకాపల్లి, ఆగస్టు 9, (ప్రభాత వార్త):**



బుద్ధ గయ విముక్తి రాష్ట్ర జె.ఎ.సి.ఆధ్వర్యములో బీహార్ లో గల అతి ప్రాచీన బౌద్ధసందర్శక ఆధ్యాత్మిక క్షేత్రము బుద్ధగయ పరిపాలనా బాధ్యతలను బౌద్ధులకే అప్పగించాలని డిమాండ్ చేస్తూ బొజ్జన్న కొండ వద్ద ప్లకార్డులతో ఆదివారం శాంతియుతంగా నిరశన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భముగా బోద్ గయ విముక్తి రాష్ట్ర జె.ఎ. సి.ఆర్గనైజేషన్, కోకన్వీనర్ బోర వేణుగోపాల్ గౌతమ్ మాట్లాడుతూ బి.ఆర్.టి.1949 యాక్ట్ నువెంటనే రద్దు చేయాలని ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక బౌద్ధ క్షేత్రం బీహార్ లోగల బుద్ధ గయ పరిపాలనా వ్యవస్థ పూర్తి స్థాయి బాధ్యతలను బౌద్ధులకే అప్పగించి బుద్ధ గయ పవిత్రత విశిష్టతలను దేశ విదేశీ బౌద్ధుల ఆకాంక్షలను కాపాడాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. బుద్ధ గయ విముక్తి రాష్ట్ర జె.ఎ.సి.ఆర్గనైజేషన్, సహాయ కార్యదర్శి మట్టా కృష్ణారెడ్డి, బుద్దిస్ట్ సొసైటీ సభ్యులు బోర సిద్దార్థ గౌతమ్, బోర అశోక్ గౌతమ్, సిద్దార్థ అసోసియేషన్, సభ్యులు ఊడా నాగేశ్వరరావు, కాసారపు సత్యనారాయణ,పిరాట్ల నరసింహమూర్తి, పర్యాటకులు పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మకంగా జార్జి క్లబ్ ఎన్నికలు




**అనకాపల్లి, ఆగస్టు 9,( ప్రభాత వార్త):**

జిల్లాలోనే ప్రఖ్యాత గాంచిన అనకాపల్లి జార్జి క్లబ్ ఎన్నికలు ఆదివారం అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగాయి. ప్రధానంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు త్రిముఖ పోటీ జరిగింది. అధ్యక్షులుగా దాడి బుజ్జి అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా కొణతాల మురళి కృష్ణ సమీప అభ్యర్థిపై స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. కోశాధికారిగా ఎస్ పి ఎం నాయుడు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఆరు డైరెక్టర్ పదవులకు ఎనిమిదిమంది పోటీ పడ్డారు. కొణతాల గంగాధర్, కర్రి ఆదినారాయణ, కొణతాల శ్రీనివాసరావు, బిల్లపాటి గంగాధర్, బీమరశెట్టి పైడయ్యనాయుడు, పావాడ సత్యారావు లు గెలుపొందారు. క్లబ్ లో మొత్తం 600 మంది ఓటర్లు ఉండగా480 మంది తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. నూతనం ఎన్నికైన క్లబ్ పాలకవర్గ సభ్యులను పలువురు ప్రముఖులు సత్కరించారు.

## పెద్దపల్లి రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ నిర్మించాలని ఎంపీకి వినతి

**ఎలమంచిలి, ఆగస్టు 9, ప్రభాతవార్త:**



మున్సిపాలిటీ పరిధిలోని పెద్దపల్లి రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపించాలని ఎంపీ సీఎం రమేష్ కు ఆ ప్రాంత ప్రజలు కోరారు. ఆదివారం ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ తో ఆ ప్రాంతానికి చెందిన కొటారు శ్రీనివాసరావు, బొద్దపు నాగేశ్వరరావు, లంక ఉదయ్, శ్రీమంతుల శ్రీను తదితరులు ఈ రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ నిర్మిస్తే సుమారు 7 గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సీఎం రమేష్ కు తెలిపారు. రైలు వెళ్లే సమయంలో గేటు వేసినప్పుడు సుమారు అరగంట వరకు గేటు తీయడం లేదని దీనివల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.దీనికి స్పందించిన ఎంపీ విధులు మంజూరు అయ్యాయని నెల రోజుల్లో టెండర్లు పిలుస్తారని తెలిపారు.

## మత్స్యకారుల జీవితాలు నాశనం చేయవద్దు



**(నక్కపల్లి,ప్రభాతవార్త):**

మండలంలోని దోనివానిలక్ష్మీపురంలో మత్స్యకారులు నివశిస్తున్న ప్రాంతం చుట్టూ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం సిమెంట్ స్తంభాలతో ఫెన్సింగ్ వేసి సముద్రం వేటకు వెళ్లే ఇబ్బందులకు గురి చేయడం మంచి పద్ధతి కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని ఆనుకుని పెద్ద పెద్ద యంత్రాలతో పనులు చేపడుతున్నారు దీని కారణంగా దుమ్ము ,ధూళి పెద్ద ఎత్తున ఎగిరి గ్రామం పడుతుందని, దీని కారణంగా గ్రామస్తులు ఉక్కిరిబిక్కి రి అవుతున్నారని ఆరోపించారు. 2025 ఏప్రిల్ మూడవ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ కు క్యాప్టివ్ పోర్టు ఏర్పాటు కు అనుమతి ఇచ్చారని. ఈ పోర్టు కొరకు 2.9 కిలోమీటర్లు సముద్ర తీరం దారాదత్తం చేయడం జరిగింది, దీని కారణంగా దోనివాని లక్ష్మీ పురంలో గల మత్స్యకారులతో పాటు బంగారయ్య పేట, అమలాపురం,బోయపాడు, రాజయ్య పేట మత్స్యకారుల కూడా సముద్రతీరంలోకి వేటకు వెళ్ళ నీయరు ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం లాభాలు కోసం వేలాది మంది మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మండల కార్యదర్శి ఎం. రాజేష్,కె.దేముడు, ఓ.చిట్టిబాబు, జీ.సింహాద్రి,జీ.కాసులు,ఏ. బాబ్జీ, డి.సత్తిబాబు పాల్గొన్నారు.

## కాపు నేత ముద్రగడకు ఘన నివాళులు

**( నక్కపల్లి, ప్రభాతవార్త)**



కాపు ఉద్యమ నేత, స్వర్గీయ ముద్రగడ పద్మనాభంకు రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఘనంగా నివాళులర్పించారు. విశాఖపట్నంలో జరిగిన స్వర్గీయ ముద్రగడ పద్మనాభం సంతాప సభ సందర్భంగా పలువురు ప్రముఖులతో పాల్గొన్న రామకృష్ణ స్వర్గీయ ముద్రగడ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం శాసన మండల ప్రతిపక్ష నేత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ కేంద్రమంత్రి కృపారాణి, రాష్ట్ర మాజీమంత్రులు గుడివాడ అమర్నాథ్, కురసాల కన్నబాబు, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీనుతోపాటు పలువురు ప్రముఖులను కలిశారు.

## శారదా నది గండి పూడ్చేందుకు రూ. 2 కోట్లు నిధులు



**రాంబిల్లి , ఆగస్టు 9, ప్రభాతవార్త :**

మండలంలో ప్రధాన నీటి వనరుగా ఉన్న శారదా నదికి గత ఏడాది తుఫాన్ ప్రభావంతో వై.లోవ గ్రామం వద్ద పడిన భారీ గండిని శాశ్వతంగా పూడ్చేందుకు ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. వై.లోవ వద్ద మేజర్ శారదా నది కుడి వరద గట్టుకు పడిన గండిని పటిష్టంగా పూడ్చి, భవిష్యత్తులో తుఫాన్లు, భారీ వర్షాలు, వరదల సమయంలో ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధులు (ఎస్డీఆర్ఎఫ్) నుంచి రూ.2 కోట్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. దీంతో ఆక్వా చెరువులతో పాటు పరిసర గ్రామాలకు వరద ముప్పు గణనీయంగా తగ్గుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రోడ్డు పక్కనే చెత్త డంపింగ్ - ఎవరికీ పట్టని ఇబ్బందులు

**రాంబిల్లి, ఆగస్టు 9, ప్రభాతవార్త:**



ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పరిశ్రమల్లో వ్యర్థాలపై ఏ ఒక్క అధికారి బాధ్యత వహించడం లేదు. దీంతో వ్యర్థాలను తరలించేందుకు సంబంధిత కంపెనీల నుంచి ఒప్పందం చేసుకున్న నిర్వాహకులు రహదారులపైనే వాటిని పడేస్తున్నారు. అచ్యుతాపురం, రాంబిల్లి ప్రత్యేక ఆర్థిక మండలి ఎస్ ఈ జెడ్, నాన్ ఎస్ ఈ జెడ్ లో సుమారు 240 కంపెనీల వరకు తయారు చేసిన సామాగ్రిని ఉత్పత్తులు చేసే ఫార్మా రసాయన ఇతర కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీల నుంచి భోజన వ్యర్థాలు, ఇతర వ్యర్థాలు డంపింగ్ చేసేందుకు నాన్ సెజ్ లో 10 ఎకరాలు, సేజ్ లో 3 ఎకరాలు ఏపీఐఐసీ అధికారులు కేటాయించారు. అయితే వ్యర్థాలను డంపింగ్ స్థలాలకు తరలించకుండా రహదారులపైనే వేస్తున్నారు. ఇకనైనా ఏపీఐఐసీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి వ్యర్థాలను కట్టడి చేయడంతో పాటు రసాయన వ్యర్థాలు చెరువుల్లోకి రాకుండా చూడాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## తీరప్రాంతంలో యథేచ్ఛగా ఇసుక దోపిడీ



**రాంబిల్లి, ఆగస్ట్ 9, ప్రభాతవార్త:**

సముద్ర తీరాన్ని ఇసుక దొంగలు తోడేస్తున్న ప్రభుత్వ యంత్రాంగం అడ్డుకోలేని దుస్థితి ఏర్పడింది. మండలంలో సీతపాలెం, వాడపాలెం, గోవిందపాలెం, వాడ నరసాపురం, కొత్తపట్నం సముద్ర తీరం నుంచి పట్టపగలే ఇసుకను దర్జాగా తరలిస్తున్నారు. వాణిజ్య, ఇంటి పునాదులు కప్పేందుకు ట్రాక్టర్ ఇసుకను రూ 1500కు విక్రయిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు సిబ్బందిని ప్రలోభ పెట్టి సముద్ర ఇసుకను తరలిస్తున్నారు. ప్రధాన రహదారిపై పట్టపగలే సముద్ర ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్లు ఎదురుపడిన సంబంధిత సిబ్బంది పట్టుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం అమలు చేస్తుండడంతో టన్ను ఇసుక రూ 900 కు లభిస్తుంది. అయితే కొందరు సామాన్య ప్రజలు ప్రభుత్వం ఇసుకను తెచ్చుకునేందుకు అవగాహన లేక ఇసుక దొంగలను ఆశ్రయిస్తున్నారు. కొందరు నిరుపేదలు సముద్ర ఇసుక తోనే నిర్మాణాలు చేస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో కొందరు గోదావరి నది నుంచి తెచ్చే ఉచిత ఇసుకను నిల్వచేసి అందులో సముద్రపు ఇసుకను కలిపి ట్రాక్టర్ లోడును రూ4వేలకు విక్రయిస్తున్నారు. విక్రయించకూడదని తెలిసిన సంబంధిత అధికారులతో ఒప్పందాలు కుదుర్చుకొని దర్జాగా ఇసుక వ్యాపారం చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక ఇంచార్జ్ తహసిల్దార్ పీవీ. రత్నం వద్ద ప్రస్తావించగా ఈ అంశం తన దృష్టికి రాలేదని చెప్పారు. సముద్ర ఇసుక తరలింపులపై నిఘా ఉంచుతామని అన్నారు. ప్రభుత్వ ఉచిత ఇసుకతో వ్యాపారం చేయకూడదని చెప్పారు. ఇసుక అక్రమ వ్యాపారాలను నిరోధించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## అధికారుల తప్పిదం .. కూటమి నాయకుల మధ్య విభేదాలు

**ఎలమంచిలి, ఆగస్టు 9, ప్రభాతవార్త:**



పట్టణంలోని ఆదివారం తాగు నీటి ప్రాజెక్టు శంకుస్థాపన ఫ్లెక్సీ కూటమి నాయకుల మధ్య విభేదాలు తాత్సారమైంది. ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అధికారులు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఎలమంచిలి టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఫోటోలు లేకపోవడంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని బహిష్కరించాయి. ప్రభుత్వ అధికారులే సాక్షాత్తు మున్సిపల్ శాఖ మంత్రి ఫోటోను మర్చిపోవడం ఎంతవరకు సమంజసం అంటూ పార్టీ శ్రేణులు తమ నిరసనను తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ వెనువెంటనే ఆ ఫ్లెక్సీని తొలగించి మంత్రి నారాయణ ఫోటో చేర్చి ఫ్లెక్సీ ని ఏర్పాటు చేశారు. అయినా తెలుగుదేశం పార్టీకి చెందిన ముఖ్య నాయకులు ఎవరు ఈ సభకు హాజరు కాలేదు. అధికారులు చేసిన తప్పిదం కూటమి శ్రేణుల్లోని విభేదాలు తావుతీసింది.

## డిగ్రీ విద్యార్థి వరహాల బాబు మృతిపై హోం మంత్రి దిగ్భ్రాంతి



**(నక్కపల్లి, ప్రభాతవార్త)ఆగస్టు 9:**

నక్కపల్లి డిగ్రీ కళాశాల విద్యార్థి దిరిసాల వరహాలబాబు మృతి పట్ల రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జూలై 29న కాకినాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వరహాల బాబు విశాఖపట్నంలోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ప్రమాదం అనంతరం వరహాల బాబును కాపాడేందుకు వైద్యులు అన్ని విధాలుగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడం పట్ల మంత్రి అనిత ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం డిగ్రీ విద్యార్థులు తోపాటు స్థానిక నాయకులు వరహాలు బాబు పరిస్థితిని హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి వరహాల బాబును పరామర్శించి వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న విషయం తెలిసిందే.! తోటి విద్యార్థులు ఇతడికోసం విరాళాలు సేకరించారు. తమ స్నేహితుడి ప్రాణాలను కాపాడేందుకు తోటి విద్యార్థులు, కొంతమంది దాతలు ముందుకు వచ్చి ఎంతో ప్రయత్నించారని మంత్రి అనిత పేర్కొన్నారు. విద్యార్థి మృతి పట్ల ఆమె తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, వరహాల బాబు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.వరహాల బాబు కుటుంబానికి అండగా ఉంటాం. కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాం అని హోం మంత్రి అనిత ఫోన్లో కుటుంబ సభ్యులకు పరామర్శిస్తూ భరోసా ఇచ్చారు.

## సప్పిపుట్టులో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**పాడేరు,ఆగస్టు9,ప్రభాతవార్త:**



ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వంతాడపల్లి పంచాయితీ సప్పిపుట్టు(ఆదివాసి పీవీటీజీ)లో ఆదివాసీ దినోత్సవ వేడుకలు గిరిజన సంప్రదాయ నృత్యాలతో డప్పువ్యాలతో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు టీడీపీ సీనియర్ నాయకులు బొర్రా నాగరాజు,పాడేరు మాజీ ఎం.పీ.పీ బొర్రా విజయరాణి ఆ గ్రామస్తులు ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు.అలాగే ఆదివాసీ అందరూ కలిసి గిరిజన సంప్రదాయం అయిన అడ్డాకులతో తయారు చేసిన గొడుగు(గిడుగు)తో సత్కరించి గిరిజనులు సంప్రదాయ ఆయుధమైన విల్లంబును బహుకరించారు.అనంతరం బొర్రాణాగరాజు,బొర్రా విజయరాణి దంపతులు దప్పిపుట్టు గ్రామంలో ఉన్న ఆదివాసీ మహిళలకు చీరలను పంపిణీ చేసి మోద కొండమ్మ వారి చిత్రపటాలను,అందజేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ నేపథ్యంలో ఆదివాసీలతో నాగరాజు,విజయరాణి దంపతులు థింసా నృత్యాలు చేసి ఆదివాసి దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.గ్రామశాఖ అధ్యక్షుడుమర్రి కొండబాబుగ్రామ పెద్దలు మర్రి భీమన్న, పాంగి రమేష్,పూర్వమునుసాబు,మహిళలు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్మవారి భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు



**పాడేరు,ఆగస్ట్9,ప్రభాతవార్త;**

గిరిజన ఆరాధ్య దైవం కోరికలు తీర్చే కొంగుబంగారం గా పేరుగాంచిన పాడేరు శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ వారి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్ గౌరవ శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు ఆదివారం పూర్వపు సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. దీనబందు వారి కుటుంబ సభ్యుల,గిడ్డి విశ్వేశ్వర కుమార్ నాయుడు వారి కుటుంబ సభ్యులు సహకారాలతో అన్న సమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.ఆదివారం కావడంతో దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు ఆలయ కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ కొట్టగుల్లికు ఏపీయూడబ్ల్యూజే సత్కారం

**పాడేరు,ఆగస్టు9,ప్రభాతవార్త:**



ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గిరి కైలాస క్షేత్రం ఆలయ ధర్మకర్త ఆధ్యాత్మిక సేవా కమిటీ చైర్మన్,ప్రిన్సిపాల్ కొట్టగుల్లి సింహాచలం నాయుడు రమాదేవి దంపతులను ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజే) ఘనంగా సత్కరించింది. స్థానిక ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి నాగరాజు, అక్రిడేషన్ కమిటీ మెంబర్ పీ. సత్యనారాయణ,జిల్లా అధ్యక్షులు కంఠం ప్రభుదాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి వి. జోషి, జిల్లా సంయుక్త కార్యదర్శి కే దుర్గారావు, తదితరులు దుశ్శాలువాతో సింహాచలం నాయుడు దంపతులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేష్. పాడేరు ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు జ్ఞాన ప్రకాష్, కొండలరావు పాత్రికేయులు మహేష్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### ఆదివాసీ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో

## ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**పాడేరు,ఆగస్టు9,ప్రభాతవార్త:**



ప్రపంచ ఆదివాసి దినోత్సవ సందర్భంగా ఆదివాసీ వికాస్ పరిషత్ రాష్ట్ర శాఖ కార్యాలయం వద్ద ఆదివాసి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఆదివాసి వికాస్ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు కీ.శేకార్తిక్ ఓరాన్ చిత్రపటానికి పూలమాలతో అలంకరించి జ్యోతి ప్రజ్వలన చేసారు.అలాగే. ఉదయం 10 గంటలకు ఆదివాసి వికాస్ పరిషత్తు జెండాను రాష్ట్ర ఉపాధ్యక్షులు అడపా నాగం నాయుడు అల్లూరి జిల్లా ప్రతినిధులు సంయుక్తంగా ఆవిష్కరించారు.ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు అడపా బొంజునాయుడు హాజరై ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకల ముఖ్య ఉద్దేశంను వివరించారు. ఈ సందర్భంగా సీనియర్లకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోడ సింహాద్రి, అల్లూరి జిల్లా అధ్యక్షులు, జనపరెడ్డి అప్పారావు,,పి. చందు,జిల్లా సెక్రటరీ, పోయిభ సతీష్ కుమార్, జి.లక్ష్మి కొండమ్మ,మాజీ ఎంపిటిసి ఎస్.సావిత్రి, ఆర్.ధారలమ్మ, ఆర్.రవణమ్మ, కూడా విశ్వనాథం, పోయిభ సంజు ,ఆర్.చిన్నయ్య, బి.సూర్యకళ ,శెట్టి బాలన్న, కే.పోతమ్మ పాల్గొన్నారు.

## కొట్టగుల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం



**పాడేరు,ఆగస్టు9,ప్రభాతవార్త:**

అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం పురస్కరించుకొని పాడేరు పట్టణం స్థానిక గ్రామంలో చలిపుట్టు సంకులమ్మ తల్లి ప్రత్యేక పూజలు, ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్ ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ,విశాఖ వెస్ట్ నియోజకవర్గం పరిశీలకులు కొట్టగుల్లి సుబ్బారావు. మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, గిరిజన సాంప్రదాయాలు, గిరిజన పండగలు, గ్రామదేవతలు భావితరాల వారికి అందించేలా మనమందరు కృషి చేసి మన హక్కులు మన పిల్లలు విద్య, సంక్షేమం, ఉపాధి అవకాశాలు కోసం కలిసి పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఏకలవ్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ , మాజీ ఉప సర్పంచ్ భూ రెడ్డి రామనాయుడు, బీసీ సెల్ ప్రశాంత్, ఫుడ్ కమిటీ పేరెంట్స్ చైర్మన్, ఉపాధ్యాయులు, గ్రామ మహిళలు చిన్నతల్లి, సుబ్బలక్ష్మి, పెద్దమ్మి, గంగా భవాని, భాగ్యలక్ష్మి సౌండ్ ఓనర్ రవి, తెలుగు యువత రంజిత్, కామరాజు, దిలీప్,నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అరకులోయలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**అరకులోయ, ఆగస్టు 9, ప్రభాతవార్త :**



అరకులోయ ప్రైవేటు అతిథి గృహంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1981-1986 సంవత్సరాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఎం శ్రీను, వి రామారావు, కూర్మారావు, శ్రీకాంత్, గోపాలకృష్ణ, రామకృష్ణ, పద్మ, రాధిక, ముద్దా, భాస్కర్ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు గెద్దం చంద్రాచారి, చింతల అచ్యుతరావు, పప్పు రఘుకుమార్ , దువ్వూరి అచ్యుత భాస్కర్ శర్మ ప్రత్యేకంగా పాల్గొని పూర్వ విద్యార్థులతో నాటి స్మృతులను పాలుపంచుకున్నారు . కార్యక్రమంలో సుమారు 60 మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టిన రోజు వేడుకలు

**పాడేరు,ఆగస్టు9,ప్రభాతవార్త:**



అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో స్థానిక శ్రీ గిరికైలాష్ క్షేత్రంలో సూపర్ స్టార్ కృష్ణ మహేశ్ బాబు జయకృష్ణ ఫ్యాన్స్ ,గిరికైలాష్ క్షేత్ర ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు.అభిమానులు కేక్ కేటింగ్ అనంతరం మహేష్బాబు చేస్తున్నచిన్న పిల్లల గుండె ఆపరేషన్కు సుమారు 7000 మందిచిన్నారులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న మంచి మనస్సుతో సినీ రంగంలో ఉండటం మన అందరి అదృష్టం గా భావించాలి. అలాగే సూపర్ స్టార్ కృష్ణ సినీ పరిశ్రమ కు టెక్నాలజీ అందుబాటులో తేవటానికి చాలా కృషీ చేశారు. కార్యక్రమంలో గిరికైలాష్ క్షేత్ర ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు,,అభిమాన సంఘం గౌరవఅధ్యక్షుడు కొట్టగుల్లి రామారావు, శివరాత్రి శ్రీనివాస్, వెంకట రమణ, వియ్యపు అప్పలరాజు, పచ్చ బుజ్జి, రమణ,దప్పొడి విశ్వనాథం,ప్రకాష్, గిరి కుమార్, నాని, సుమన్, సతీష్ ప్రభాకర్, అధిక సంఖ్యలో మహిళా అభిమానులు పాల్గొన్నారు.

## పాడేరు ఐ.టి.డి.ఏలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**పాడేరు,ఆగష్టు9,ప్రభాతవార్త:**



పాడేరులోని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ.) సమావేశ మందిరంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐ.టి.డి.ఏ. సమావేశ మందిరం పాడేరులో ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సాంప్రదాయాలు, వారి సంక్షేమాన్ని స్మరించుకుంటూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమళ పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి బి కె పరిమిళ, ఐటీడీఏ పరిపాలన అధికారి హేమలత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎం సి డి అధికారి డాక్టర్ ప్రతాప్, సమాచార శాఖ సహాయ ప్రాజెక్టు అధికారి, ప్రత్యేక ప్రచార విభాగం,పాడేరు వారు కె వెంకటరావు. డిప్యూటీ తహశీల్దార్ (ఆర్ ఓ ఎఫ్ ఆర్) ఈశ్వరరావు, సుబ్రహ్మణ్యం, ఐ.టి.డి.ఎ. అధికారులు, స్థానిక గిరిజన నాయకులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## దేవరాపల్లిలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



**గూడెంకొత్తవీధి, ఆగస్టు 9, ప్రభాతవార్త :**

దేవరాపల్లిలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ జెండాను ఆవిష్కరించి, ప్రపంచ ఆదివాసీ దినోత్సవం విశిష్టత, ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్ర మంలో భారత్ ఆదివాసీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు ఆదివాసీ హక్కులు, సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలన్నారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యక్రమంలో పాల్గొన్న , దేవరాపల్లి మాజీ సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు, యువ నాయకులు దేవరాజు ఉదయ భాస్కర్ రాజు, పాడి శ్రీనివాస్, యువకులు కుమ్మరి రవి, లకే భాస్కర్, రామకృష్ణ, మచ్చల బాబురావు, నాగరాజు పేర్కొన్నారు.

## దొడ్డికొండలో పిచ్చికుక్కల స్వైరవిహారం

**గూడెం కొత్తవీధి, ఆగస్టు 9, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని దొడ్డికొండ గ్రామంలో పిచ్చికుక్కల సంచారం ఆందోళన కలిగిస్తోంది.ఆదివారం గ్రామంలో స్వైరవిహారం చేసిన ఓ పిచ్చికుక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి వంతల చంటిబాబుపై ఒక్కసారిగా దాడి చేసింది. ఆయన తప్పించుకునేలోపే కాలిపై బలంగా కరవడంతో తీవ్రంగా గాయపడ్డారు. చంటిబాబు ఆర్తనాదాలు చేయడంతో చుట్టుపక్కల వారు కర్రలతో అక్కడికి చేరుకుని కుక్కను తరిమికొట్టారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వైసీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్, ముఖ్య నాయకులు కంకిపాటి నారాయణ, రీమేల బాలకృష్ణ, పాతుని లక్ష్మణ్ తదితరులు హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. రక్తస్రావంతో తీవ్రంగా గాయపడిన చంటిబాబును వెంటనే వాహనంలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు చికిత్స అందించడంతో పాటు యాంటీ రేబీస్ టీకాలు వేశారు.

## ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు




**గూడెం కొత్తవీధి, ఆగస్టు 9, ప్రభాతవార్త :**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం, సాంస్కృతిక కార్యక్రమాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. గిరిజన సంఘాలు, గిరిజన ఉద్యోగ సంఘాలు, జేఏసీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పార్టీలకతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులను పరిరక్షించాలని, ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో రాజ్యాంగం, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం అన్ని వర్గాలు ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం గిరిజనులు సాంప్రదాయ దుస్తులు ధరించి, నృత్యాలు, వాయిద్యాలతో మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, వివిధ గిరిజన సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, జేఏసీ నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

10-8Pg7exHMNWJQE.qxd:10-8Pg7exHMNWJQE.qxd 1/1/02 7:19 AM Page 1



# పునరావాసం కల్పించకుండా

## 'వెలిగొండ్ల నిర్వాసితులకు ఖాళీ చేయించొద్దు

● సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా గ్రామాల నుండి ఖాళీ చేయించే ప్రయత్నాలు మానుకోవాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేసారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పనులు 2026 ఆగస్టుకి పూర్తిచేసి సెప్టెంబర్ 1వ తేదీన ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేయబోతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందిదని ఇది హార్షణీయమే అయినప్పటికీ గతంలో ఇలాంటి గడువులు చాలా పెట్టి అమలు చేయకుండా ఆలస్యం చేశారు. ఇంకా చాలా పనులు అసంపూర్తిగా ఉన్నాయన్న వాస్తవాన్ని గుర్తించాలి. కృష్ణా జలాశయంలో నీళ్ళులేవు. వరదలొస్తే తప్ప నల్లమల సాగర్‌కు నీళ్ళివ్వలేరు. రిజర్వాయర్‌కు వదిలినా పంటకాల్వలు లేవు. ఈ పరిస్థితులను మరిచినీళ్ళు వదలాలనుకోవడం వివేకంకాదు. ఏదో సాధించామని గొప్పలు చెప్పుకోడానికి నిర్వాసితులను బలిచేయొద్దు. నిర్వాసితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. నిర్వాసితులందరికీ ఇళ్ళస్థలాలు కూడా ఇవ్వకుండా చెల్లించాల్సిన ప్యాకేజీ చెల్లించకుండానే ఆగస్టు నెలాఖరుకు గ్రామాలు ఖాళీ చేయాలన్న కలెక్టర్ మౌఖిక ఆదేశాలతో నిర్వాసితులు తీవ్రంగా ఆందోళన పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన ప్రకారం రూ.906 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు మూడోవంతు అంటే రూ.306కోట్లే చెల్లించారు. మిగతా పరిహారం ఇస్తామంటూ ఊరిస్తూ కాలయాపన చేస్తున్నారు. గ్రామనాయకులు, బాధిత ప్రజలు కలెక్టర్ గారిని కోరినా ముందు ఖాళీ చేయండి, సమయం లేదంటూ ఎక్కడైనా పరదాలు కట్టుకుని వెళ్ళాల్సిందే నంటూ గ్రామాలు ఖాళీ చేయాలని బలవంత పెడుతున్నారు. విద్యుత్ సైతం కట్ చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నది. అప్పటికి గ్రామాలు ఖాళీ చేయకపోతే క్రిమినల్ కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారు. ఇది చట్టవిరుద్ధమే కాదు అమానవీయం కూడా. భూసేకరణ చట్టాన్ని అనుసరించి అందరికీ పరిహారం చెల్లించిన అనంతరం కనీసంగా 6 నెలలు చట్ట ప్రకారం సమయం ఇవ్వాలి. బలవంతంగా ఖాళీ చేయించకూడదని సిపిఐ(యం) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నది.

# చైల్డ్ హోమ్ నుంచి బాలిక పరార్



**తిరుపతి(క్రైమ్), ఆగస్టు 9 ప్రభాతవార్త:** ప్రభుత్వ పరిరక్షణ బాలికల పాఠశాలలో చదువుకున్నటువంటి సాయి దుర్గ (15) హోమ్ నుండి ఆదివారం పరారైంది. ప్రభుత్వ బాలికల హోమ్ సూపరిండెంట్ సునీత కథనం మేరకు బాపట్ల జిల్లాకు చెందిన కూన సాయిదుర్గ(15) అనే బాలిక ఈ నెల ఒకటో తారీకు ఒంటరిగా ప్రయాణిస్తుండగా తిరుపతి శక్తి టీం గమనించి బాలికను అదుపులో తీసుకున్నారు. అనంతరం తిరుపతికి చెందిన ప్రభుత్వ పరిరక్షణ పాఠశాలలో చేర్పించారు. అయితే అక్కడ ఉండటం ఇష్టంలేని సాయిదుర్గ ఆదివారం ఉదయం హోమ్ నుండి పరారైంది. సమాచారం తెలుసుకున్న హోమ్ సూపర్డెంట్ వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి ఆ అమ్మాయి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.



# అమరావతిలో ఎఐ వర్సిటీ

● అత్యాధునిక క్వాంటమ్ కూడా.. ● ముందుకొచ్చిన 'నీలిట్ష్ - రూ.731.7 కోట్లతో ఏర్పాటు ● ఈ సెప్టెంబరు నుంచే విద్యార్థులకు శిక్షణ ప్రారంభం

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధానిని క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్ తీర్చిదిద్దాలనే ఏపి ప్రభుత్వం ఆలోచనకు అనుగుణంగా అమరావతి ప్రాంతంలో మరో విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నీలిట్) సంస్థ రూ.731.7 కోట్లతో దేశంలోనే తొలి, అత్యాధునిక క్వాంటమ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యూనివర్సిటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. నిడమర్రు వద్ద నీలిట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 10 ఎకరాల భూమిని కేటాయించింది. వాస్తవానికి ఆ సంస్థ మొదట 19 ఎకరాలు కావాలని కోరింది. అయితే మంత్రివర్గ ఉపసంఘం పరిశీలించి 10 ఎకరాలకు ఆమోదం తెలిపింది. ఈ భూమిని 30యేళ్ల పాటు లీజుకు ఇస్తూ నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో అవసరాన్ని బట్టి ఈ లీజును మరో 30యేళ్ళు పొడిగించే వెసులుబాటును కూడా కల్పించింది. అమరావతిలో నిర్మించే నీలిట్ క్యాంపస్ కోసం రూ.731.7 కోట్లను ఖర్చు చేయనున్నారు. సుమారు 5.1 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ భవనాలతో ఈ క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది ఆరంభంలో ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఈ ప్రాజెక్టుకు బీజం పడింది. ఆ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఏపి ప్రభుత్వం, నీలిట్ సంస్థల మధ్య కీలకమైన ఎంఓయు కుదిరింది. అనంతర క్రమంలో నిడమర్రులో నీలిట్ యూనివర్సిటీ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రధాన క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యే వరకు తరగతులు ఆగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఆరునెలలు కుడా తిరగకుండా నీలిట్‌ను అందుబాటులోకి తీసుకుని వస్తోంది. ఈ సెప్టెంబరు నెల నుంచే ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నీలిట్ తాత్కాలికంగా తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నీలిట్ అమరావతి క్యాంపస్‌ను ఒక 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'గా అభివృద్ధి చేయనున్నారు.

క్వాంటమ్, ఏఐ, సెమీ కండక్టర్ టెక్నాలజీల్లో ఇక్కడ అత్యుత్తమ శిక్షణ అందిస్తారు. ఈ క్యాంపస్‌లో పలు అత్యాధునిక కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్ అండ్ సెక్యూరిటీ, ఏఐ, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్ రంగాల్లో యుజి, పిజి, పిహెచ్‌డి, డిప్లొమా కోర్సులు ఆఫర్ చేస్తారు. సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ, ఎటిఎంపి, ఎంబెడెడ్ సిస్టమ్స్, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్‌లో ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తారు. విద్యార్థుల కోసం అత్యాధునిక పరిశోధనశాలలను నెలకొల్పుతారు. డీప్‌టెక్ రంగంలో స్టార్టప్‌లకు, ఇతర సంస్థలకు ఈ క్యాంపస్ అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తుంది. నీలిట్ పూర్తి స్వయంప్రతిపత్తి గల ప్రతిష్ఠాత్మక కేంద్ర శాస్త్ర సంస్థ. ఇది కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తుంది. దేశవ్యాప్తంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో నాణ్యమైన విద్య, నైపుణ్య శిక్షణ, పరీక్షల నిర్వహణ, సర్టిఫికేషన్ వంటి కార్యక్రమాలను ఇది ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుంది. నైపుణ్య శిక్షణలో దీనికి దేశవ్యాప్తంగా మంచి పేరుంది. ఇటీవల నీలిట్‌కు కేంద్ర విద్యాశాఖ 'డీమ్డ్ టు బి యూనివర్సిటీ' హోదా కూడా కల్పించింది.

# పారదర్శకంగా మెగా డిఎస్సీ నిర్వహణ

● రేయింబవళ్లు కష్టపడి చదివి టీచర్ ఉద్యోగాలు పొందిన నిరుద్యోగ యువత కష్టాన్ని తక్కువ చేసి చూపొద్దు: మంత్రి సవిత



**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** మెగా డిఎస్సీని పారదర్శకంగా, అక్రమాలకు తావు లేకుండా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పకడ్బందీగా నిర్వహించారని రాష్ట్ర బిసి, ఇడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేసారు. డిఎస్సీలో అక్రమాలు జరిగాయనడం సరికాదు అన్నారు. రేయింబవళ్లు కష్టపడి చదివి టీచర్ ఉద్యోగాలు పొందిన నిరుద్యోగ యువత కష్టాన్ని తక్కువ చేసి చూపొద్దు అన్నారు. కర్నూలు కొండారెడ్డి బురుజు ఎక్కిన వారికి నీ తాడేపల్లి ప్యాలెస్ ఎక్కడం ఒక లెక్క కాదు అన్నారు. 'మెగా డిఎస్సీపై రోజంతా చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం' అని మంత్రి ఎస్.సవిత సవాల్ అన్నారు. సిఎం చంద్రబాబునాయుడు 14కు పైగా డిఎస్సీలు నిర్వహించి, రెండు లక్షల వరకూ టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశారు. ఏనాడూ అవినీతి, అక్రమాలకు తావులేకుండా డిఎస్సీలు నిర్వహించారన్నారు. ఐదేళ్లలో ఒక్క డిఎస్సీ కూడా నిర్వహించన అసమర్థుడు జగన్ రెడ్డి అని విమర్శించారు.

ఈ మేరకు ఆదివారం ఆమె ఒక వీడియో ప్రకటన చేశారు. డిఎస్సీ అంటేనే జగన్‌కు మొదటి నుంచి విషం కక్కుతున్నారన్నారు. నోటిఫికేషన్ రాగానే కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవాలని చూశారన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆ అడ్డంకులన్నింటినీ అధిగమించి, మెగా డిఎస్సీని అవినీతికి, అక్రమాలకు తావులేకుండా నిర్వహించారన్నారు. మెగా డిఎస్సీ ద్వారా 16వేల కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపుతుంటే, వారందరినీ గొడ్డలి పార్టీ అవమానిస్తోందని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఉన్నా, పోయినా టీచర్లను అవమానించడమే పనిగా పెట్టుకోవడం మానుకోవాలని హితవు పలికారు.

ఐదేళ్ల పాలనలో ఉపాధ్యాయులను అన్ని విధాలా జగన్ వేధించారని మంత్రి సవిత మండిపడ్డారు. చంద్రబాబునాయుడు 14 డిఎస్సీలు నిర్వహించారని, వాటి ద్వారా రెండు లక్షలకు పైగా టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశారని మంత్రి సవిత గుర్తు చేశారు. ఏ డిఎస్సీలోనూ అక్రమాలకు తావులేకుండా, టీచర్ పోస్టులు భర్తీ చేశారన్నారు. 2025 మెగా డిస్సీపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని జగన్ కు హితవు పలికారు. డిఎస్సీ నిర్వహణపై ఎలాంటి అనుమానాలు ఉన్నా.. దమ్ము, ధైర్యం ఉంటే జగన్ అసెంబ్లీకి చర్చకు రావాలని అన్నారు. జగన్‌కు ఎంతసేపైనా మైక్ ఇచ్చి గౌరవంగా మాట్లాడిస్తామని, అవసరమైతే ఒక రోజంతా మెగా డిఎస్సీపై అసెంబ్లీ వేదికగా చర్చించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె స్పష్టం చేశారు. నీతి, నిజాయితీ, దమ్ము, ధైర్యం ఉంటే సభకు వచ్చి తేల్చుకోవాలని జగన్‌కు మంత్రి సవిత సవాల్ చేశారు. వైసిపి, జగన్ తప్పుడు ఆరోపణలపై రాయలసీమకు చెందిన ఉపాధ్యాయులంతా సమరశంఖం పూరించారన్నారు.

### 55 దేశాల్లో మాత్రమే దృశ్యమానం..

### రాత్రివేళ కావడంతో భారత్‌లో కనిపించదు

# 12న సంపూర్ణ సూర్యగ్రహణం

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ఈ నెల 12న బహుళ అమావాస్య రోజున సంపూర్ణ సూర్యగ్రహణం రూపంలో ఖగోళంలో మరో అద్భుతం ఆవిష్కృతం కానుంది. యూరప్, రష్యా, ఉత్తర అమెరికా సహా 55 దేశాల్లో ఎనిమిది గంటలకు పైగా కనువిందు చేయనున్న ఈ గ్రహణం ఒక్క స్పెయిన్, ఐస్‌లాండ్‌లో మాత్రమే సంపూర్ణంగా కనిపించనుంది. మిగతా దేశాల్లో పాక్షికంగానే కనిపించనుంది. భారత కాలమా నం ప్రకారం సాయంత్రం ఏడు గంటల సమయంలో గ్రహణం మొదలు కానుండగా సంపూర్ణ గ్రహణం రాత్రి 9.15 గంటల సమయంలో ఏ ర్పడనుంది. గరిష్ట కాలం రాత్రి 11.17 గంటలకు వుండనుంది. దీని తరువాత తెల్లవారుజామున 1.20 గంటలకు సంపూర్ణ దశ ముగింపు మొదలవనుంది. తెల్లవారుజామున 3.30 గంటలకు గ్రహణం ముగియ నుంది. రాత్రి వేళలో సూర్య గ్రహణం ఏర్పడనుండడంతో భారత్‌లో ఇది కనించదు. ఐస్‌లాండ్, స్పెయిన్ దేశాల్లో సంపూర్ణ సూర్య గ్రహణాన్ని పూర్తిగా వీక్షించే అవకాశం వుండడంతో సూర్యుడిపై పరిశోధనలకు ఖగోళ శాస్త్రవేత్తలు ఆ దేశాలకు ముందుగానే పయనమయ్యారు. ఇక ఈ గ్రహణం భారత్‌లో ఎక్కడ కనిపించ నందున ఇక్కడ ఎలాంటి సూతకం లేదని, ఆలయాల మూసివేత వుండదని ఆగమన పండితులు చెబుతున్నారు. ఈ గ్రహణం కర్కాటక రాశిలోని అశ్లేషా నక్షత్రంలో కేతుగ్రస్త సూర్య గ్రహణంగా సంభవి స్తోంది. కర్కాటక రాశి వారు శాంతి పూజలు చేయాలని పండితులు చెబుతున్నారు.

బహుళ అమావాస్య ను హిందువులు చుక్కల అమావాస్యగా పిలుస్తారు. పలు దేవాలయాల్లో ఇదే రోజున తాంత్రిక పూజలు చేయడం విశేషం. ఈ ఏడాది ఇది రెం డవ సూర్య గ్రహణం కావడం గమనార్హం. మొదటిది పాక్షిక సూర్య గ్రహణం ఈ ఏడాది ఫిబ్రవరి నెల 17న సంభవించగా ఇది కూడా భారత్‌లో కనిపించలేదు.

ఇదిలా ఉండగా ఈ నెల 12న సూర్యోదయానికి ముందు ఆకాశంలో ఆరు గ్రహాలు ఒకే ప్రాంతంలో వరుసగా కనువిందు చేయనున్నాయి. బృహస్పతి, బుధుడు, అంగారకుడు, శని, యురేనస్, నెప్ట్యూన్ తూర్పు నుంచి పడమన వైపు విస్తరించి వరుసగా కనిపిస్తాయి. వీటిలో అంగారకుడు, శని వంటి ప్రకాశ వంతమైన గ్రహాలను అందరు వీక్షించే వీలుంది. ఇతర గ్రహాల వీక్షణకు దూరదర్శిని అవసరం వుంటుంది. ఇదే సమయంలో ఆ రోజున రాత్రి ఉల్కా వర్షం కురవనుంది.

**28న పాక్షిక చంద్రగ్రహణం**

మరోవైపు ఆగస్టు 28వ తేదీన పాక్షిక చంద్ర గ్రహణం ఏర్పడనుంది. రక్షా బంధన్ పండగ రోజున భారత కాలమానం ప్రకారం ఈ గ్రహణం మధ్యాహ్నం 12.12 గంటల నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు వుండనుంది. పగటి వేళ అయినందున ఇది భారత్‌లో కనిపించ దు. దీంతో భారత్‌లో సూతకం వుండదని పండితులు చెబుతున్నారు.




# నాలుగు హైకోర్టులకు కొత్త సిజెలు

### మరో ఇద్దరు న్యాయమూర్తుల బదలీ

### సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** నాలుగు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తుల నియామకాన్ని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి. కామేశ్వరరావును పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా బదిలీ చేయాలని కూడా కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం బొంబాయి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ రవీంద్ర విఠల్‌రావు ఘుగేను కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సిఫార్సు చేసింది. ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ మహేష్ చంద్ర త్రిపాఠిని బొంబాయి హైకోర్టు ప్రధానన్యాయ మూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది. అంతేకాకుండా, ప్రస్తుతం పంజాబ్- హర్యానా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ అశ్వనీకుమార్ మిశ్రాను ఆ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం చేసిన ఈ సిఫార్సులను, ఇప్పుడు పరిశీలన కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సిఫార్సులను ఆమోదించి, అవసరమైన నోటిఫికేషన్లను జారీ చేసిన తర్వాత ఈ నియామకాలు అమల్లోకి వస్తాయి.

ప్రస్తుతం, దేశంలోని ఇరవై ఐదు హైకోర్టులలో ఏడింట శాశ్వత ప్రధాన న్యాయమూర్తులు లేకుండా పనిచేస్తున్నాయి. ఇటీవల పదవీ విరమణలు, సుప్రీంకోర్టుకు పదోన్నతుల కారణంగా బొంబాయి, కలకత్తా, జమ్మూకాశ్మీర్, లడఖ్, మధ్యప్రదేశ్, పాట్నా, పంజాబ్- హర్యానా, రాజ స్థాన్ హైకోర్టులకు ప్రస్తుతం తాత్కాలిక ప్రధానన్యాయమూర్తులు నాయ కత్వం వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తే, ఈ తాజా సిఫార్సుల ద్వారా ఈ ఖాళీలలో ఐదింటిని భర్తీ చేయవచ్చు.



### రష్యానుంచి నేరుగా

# హిందూ మహాసముద్రానికి రైల్వేలైన్

### రష్యా ఉపప్రధాని ఖుస్నుల్లిన్ వెల్లడి

**మాస్కో, ఆగస్టు 9:** రష్యా నుంచి నేరుకగా హిందూ మహాసముద్రం వరకు రైల్వే మార్గాన్ని నిర్మించడం ద్వారా ఇండియాతో భూమార్గ అనుసంధానాన్ని పెంచుకోవాలని భావిస్తోంది. ఈ విషయాన్ని రష్యా ఉప ప్రధాని మారత్ ఖుస్నుల్లిన్ ప్రభుత్వ వార్తా సంస్థ టాస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చర్చించారు. హిందూ మహాసముద్రానికి రైల్వే మార్గాన్ని నిర్మించడాన్ని రష్యా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి ప్రత్యామ్నాయ రైలు నెట్‌వర్క్, ప్రస్తుతం ఉన్న సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని రష్యా విశ్వసిస్తోంది. ప్రస్తుతం రష్యా, భారత్ మధ్య అత్యధిక వాణిజ్యం బోస్పరస్, హోర్ముజ్ జలసంధి వంటి కీలకమైన సముద్ర మార్గాల ద్వారానే జరుగుతోంది. హోర్ముజ్ జలసంధి ప్రపంచంలోని అత్యంత కీలకమైన చమురు, గ్యాస్ వాణిజ్య మార్గాలలో ఒకటి. అయితే ప్రపంచ చమురు రవాణాలో 25 శాతం, ఎల్ఎన్‌జీ రవాణాలో 20 శాతం ఈ సముద్ర మార్గం గుండానే జరుగుతాయి. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య యుద్ధం కారణంగా సముద్రం మార్గం ద్వారా వెళ్లే వాణిజ్య నౌకల భద్రతపై ఆందోళనలు పెరిగాయి. ఈ నేపథ్యంలో రష్యా తన వాణిజ్యం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఏఏ దేశాల గుండా ఈ రైలు మార్గం వెళ్తుంది ప్రతిపాదిత రైల్వే నెట్వర్క్ రష్యా నుంచి బయలుదేరి మధ్య ఆసియా, పశ్చిమాసియా దేశాలైన తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ దేశాల గుండా హిందూ మహాసముద్రాన్ని చేరుకునేలా ప్రణాళికలు రచిస్తున్నారు.

ఈ మార్గం అందుబాటులోకి వస్తే ఇండియాకు రవాణా అయ్యే సరుకుల సమయం, వ్యయం గణనీయంగా తగ్గుతాయి. భూమార్గం, సముద్రమార్గాల కలయికతో కూడిన ఈ నెట్వర్క్ దక్షిణాసియా, మధ్య ఆసియా దేశాలకు సరికొత్త ఆర్థిక, వాణిజ్య అవకాశాలను అందిస్తుంది. భారతదేశం రష్యాకు ఓ ముఖ్యమైన వాణిజ్య భాగస్వామి. ఇంధనం, రక్షణ, ఇతర రంగాలలో ఇరు దేశాల మధ్య దీర్ఘకాలంగా వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. ఇండియాకు ప్రత్యక్ష, సురక్షితమైన భూమార్గ అనుసంధానాన్ని అభివృద్ధి చేయడం ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని మరింతగా పెంచగలదు. ఈ ప్రతిపాదన రష్యా, ఇండియాకు ముఖ్యమైనది మాత్రమే కాకుండా, మధ్య ఆసియా, ఇరాన్ వంటి దేశాలకు కూడా కొత్త వాణిజ్య అవకాశాలను అందించగలదు. భయంకపితులను చేసిన ఆ ఎయిర్ ఇండియా ఫ్లైట్ ఘటనలో అసలు విషయాలు వెలుగులోకి ఈ ప్రాజెక్టుకు భారీగా నిధులు అవసరం. అటువంటి రైల్వే నెట్‌వర్క్‌ను నిర్మించడం సులభం కాదు. అనేక దేశాల గుండా వెళ్లే ఈ మార్గానికి గణనీయమైన పెట్టుబడి, భద్రతా చర్యలు, వివిధ దేశాల మధ్య దీర్ఘకాలిక సహకారం అవసరం.

# కామన్వెల్త్ క్రీడాకారులతో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్ 2026లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి తిరిగి వచ్చిన భారత బృం దానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం తన ఢిల్లీ నివాసంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ దేశ పతక విజేతలతో సుదీర్ఘంగా సంభాషించి వారి అనుభ వాలను తెలుసుకున్నా రు. వారి అద్భుతమైన ప్రదర్శనను ప్రశంసిస్తూ, యావత్ దేశం తరపున అభినందనలు తెలిపారు. సోషల్ మీడియాలో ఓ వీడియోను కూడా పంచుకున్నారు, అది వేగంగా వైరల్ అవుతోంది. ప్రధాన మంత్రి తన సోషల్ మీడియాలో ఓ వీడియోను పంచుకోవడం ద్వారా కామన్వెల్త్ గేమ్స్ అథ్లెట్లతో జరిగిన ఈ ప్రత్యేక సమావేశం గురించి తెలియజేశారు. ఆ వీడియోలో ఆయన స్వర్ణ పతక విజేత బాక్సర్ సాక్షి చౌదరి, పలువురు ఇతర ఛాంపియన్‌లతో సంభాషిస్తూ కనిపించారు. ఆ వీడియోలో సాక్షిచౌదరి ప్రధాని మోదీ నిరాడం బరతను ప్రశంసిస్తూ ప్రధానమంత్రిని కలవడం మాకు చాలా సంతోషంగా ఉంది. ఆయన చాలా వినయశీలి అని అన్నారు. సంభాషణ సందర్భంగా ఆటగాళ్ల ప్రధానమంత్రిని ఏదైనా మాట్లాడమని కోరగా దేశంలో క్రీడా సంస్కృతిని ప్రోత్సహించే తన ప్రసిద్ధ సందేశాన్ని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు, జో ఖేలేగా, వో ఖిలేగా! ఆల్వేస్ చీర్4భారత్. అంటూ చివరకు భారత్ మాతా కీ జై అని నినాదాలు చేస్తూ ఆటగాళ్లలో ఉత్సాహాన్ని నింపారు. గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత అథ్లెట్లు అద్భుతంగా రాణించి, మొత్తం 39 పతకాలను గెలుచుకోవడం గమనార్హం. వీటిలో 13స్వర్ణాలు, 17రజతాలు, 9కాంస్య పతకా లున్నాయి. ఈ విజయం భారత జట్టు ఆత్మవి శ్వాసాన్ని పెంచగా ప్రధానమంత్రితో ఈ సమావేశం అథ్లెట్ల ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది.

# ఈగల్‌కు చిక్కిన అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్

### హాష్‌ఆయిల్ స్వాధీనం



**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ఒడిశా నుంచి హాష్ ఆయిల్‌ను హైదరాబాద్‌కు స్మగ్లింగ్ చేస్తున్న అంతరాష్ట్ర స్మగ్లర్‌ను ఈగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అతని వద్ద నుంచి 200 మిల్లీ లీటర్ల హాష్ ఆయిల్‌ను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఎపిలోని ప్రకాశం జిల్లాకు చెందిన బర్సె నరేంద్ర శ్రీనివాస్ (30) చాలా కాల ంగా హైదరాబాద్‌లో వుంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు అలవాటుపడ్డ ఇతను ఐదేళ్ల క్రితం డ్రగ్ స్మగ్లర్‌గా మారాడు. ఈ క్రమంలో ఇతనిపై సరూర్‌నగర్, మీర్‌పేట్ పోలీసు స్టేషన్లలో ఐదు కేసులు నమోదయ్యాయి.

గత ఏడాది మే నెలలో మీర్‌పేట్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో అరెస్టయి నవంబర్ నెలలో బెయిల్‌పై విడుదలయ్యాడు. అనంతరం మళ్లీ కొద్దిరోజులు డ్రైవర్‌గా పనిచేసినా ఆదాయం సరిపోక పోవడంతో మళ్లీ డ్రగ్స్ దందా చేయసాగాడు. స్నాప్ చాట్‌లో ఒడిషాలోని కోరాపూర్‌కు చెందిన హారీ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి అక్కడి నుంచి తక్కువ ధరకు హాష్ ఆయిల్ కొన సాగా డు. దీనిని జంట నగరా లలో ఎక్కువ ధరకు విక్ర యిస్తూ దండిగా సంపా దించ సాగాడు. అయితే ఇతని కదలికలపై ఈగల్ పోలీసులు నిఘా వుం చారు. తాజాగా ఇతను ఈ నెల రెండవ తేదీన వైజాగ్ మీదుగా ఒడిశాలోని కోరాపూర్ జిల్లాకు వెళ్లి హాష్ ఆయిల్ స్మగ్లర్ హారితో భేటీ అయ్యాడు. అక్కడ నాలుగు రోజులు వున్న తరువాత తొమ్మిది వేల రూపాయలు చెల్లించి 200 మిల్లీలీటర్ల హాష్ ఆయిల్‌ను తీసుకుని వైజాగ్ మీదుగా హైదరాబాద్‌కు బస్సులో వచ్చాడు.

నరేంద్ర శ్రీనివాస్ గురించి పక్కా సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో ఆదివారం ఉదయం అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద ఓఆర్ఆర్ వద్ద కాపుకాశారు. విజయవాడ నుంచి వస్తున్న బస్సులో ఇతను వచ్చి అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద దిగాడు. అనంతరం ఆటో కోసం ఎదురు చూస్తుండగా ఈగల్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. నిందితుడి బ్యాగుల్లో 200 మిల్లీలీటర్ల హాష్ ఆయిల్ పట్టుబడింది. దీని విలువ రెండున్నర లక్షల రూపాయలుగా తేలింది. ఒడిషాలో కొన్న హాష్ ఆయిల్‌ను జంట నగరాలలో పది మిల్లీ లీటర్‌గా చిన్న బాటిల్‌లో వుంచి 1200 రూపా యలకు ఇతను అమ్ముతున్నట్లు తేలింది. నింది తుడిని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు తదుపరి విచారణ నిమిత్తం అప్పగించారు. ఈ కేసులో ఒడిషా స్మ గ్లర్ హారి కోసం గాలిస్తున్నారు. కాగా నరేంద్ర శ్రీనివాస్ నుంచి పది మంది హాష్ ఆయిల్ కొన్నట్లు తేలగా వారి కోసం కూడా గాలిస్తున్నారు.



జూరాల గేట్లు మూసివేసిన దృశ్యం

# జూరాల గేట్లు మూసివేత

**మహబూబ్‌నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త బ్యూరో:** జూరాలకు ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుతం 8.415 టీఎంసీలుగా నమోదు అయింది. జూరాల ప్రాజెక్టుకు 63,000క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు అయింది. దీంతో డ్యాం గేట్లు మూసివేశారు. పవర్ హౌస్ ద్వారా 43,686 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. మొత్తంగా జూరాల నుంచి 47,060 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదు అయింది. 878టీఎంసీ లకు శ్రీశైలం జూరాల నుంచి వరద వస్తుండడంతో శ్రీశైలం జలాశ యానికి జలకళ సంతరించుకున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు 215.8070 టీఎంసీలకు గాను ప్రస్తుతం 878.10 అడుగులకు చేరి 178.7400టీఎంసీలుగా నమోదు అయింది. జూరాల పవర్ హౌస్ నుంచి 36,233 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు అయింది. శ్రీశైలంలోని రెండు ఎడమ కుడి జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. కుడి జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా 31,306 క్యూసెక్కులు, ఎడమ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 7063 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

10-8Pg8.qxd:10-8Pg8.qxd 1/1/02 7:15 AM Page 1



# 'సైబర్' మాయలో సీనియర్ సిటిజన్లు!



### వయో వృద్ధులను మోసం చేస్తూ అందినంత దోచుకొంటున్న నేరగాళ్లు

### యేడాదిన్నరలో రూ.102 కోట్ల లూటీ

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్వాల్ సజ్జన్నార్ హెచ్చరిక

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** సీనియర్ సిటిజన్లను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేసుకోవడం పెరిగి పోతోంది. జంట నగరాలతో పాటు దే శ వ్యాప్తంగా వయో వృద్ధులను సైబర్ నేరగాళ్లు మోసం చేస్తూ అందినంత దోచుకోవడం సాధా రణంగా మారింది. గడచిన 19 నెలల్లో గ్రేటర్ పరిధిలో 102.02 కోట్ల రూపాయలను వయో వృద్ధుల నుంచి సైబర్ నేరగాళ్లు కాజేశారంటే ఈ తరహా నేరాల పెరుగుదలను ఊహించుకోవచ్చు. ఇటువంటి నేరాలపట్ల వయో వృద్ధులు అప్ర మత్తంగా వుండాలని సిటీ కొత్వాల్ సజ్జన్నర్ హెచ్చ రించారు. నగర పరిధిలో 19 నెలల్లో సీని యర్ సిటిజన్లు మోసపోయిన ఘటనలకు సంబంధించి 403 కేసులు నమోదుకాగా వీటిపై పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ చేబట్టా రు. సీనియర్ సిటిజన్లను డిజిటల్ అరెస్టు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లు, అధిక వడ్డీ, బీమా వసతుల పేరిట మోసం చేస్తున్న ఘటనలు పెరిగాయి. ఒంటరి వృద్ధులను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తు న్నారు. ఈ విషయంలో సైబర్ క్రైం పోలీసులు చర్యలు తీసుకుంటున్నా వయో వృద్ధులు నిరం తరం అప్రమత్తంగా వుండాలని, గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్‌లకు స్పందించవద్దని సిటీ కొత్వాల్ సజ్జన్నర్ కోరారు. సీనియర్ సిటిజన్లను మో సం చేస్తున్న ఘటనలతో పాటు ట్రేడింగ్ ఫ్రాడ్ కేసులు కూడా పెరగడం గమనార్హం. 2025 జనవరి నుంచి 2026 జులై నెలాఖరు వరకు 113 కేసులు నమోదు కాగా సైబర్ నేరగాళ్లు 55.88 కోట్ల రూపాయలను కాజేశారు. వాట్సాప్, టెలిగ్రాంలను వాడుతున్న నేరగాళ్లఇటువంటి మోసాలకు పాల్పడుతున్నారు. ఇందుకోసం నకిలీ యాప్‌లను వాడుతూ మీకు దండిగా లాభాలు వచ్చాయని, బ్యాంకు ఖాతాల్లో ఇవి వున్నట్లు చూపుతారు. అయితే వాస్తవంలో నయాపైసా కూడా వుండదు. ఇక డిజిటల్ అరెస్టులకు సంబంధించి 69 కేసులు నమోదు కాగా 31.93 కోట్ల రూపాయలను బాధితులు పోగొట్టుకున్నారు. ఈ తరహా ఘటనల్లో వయో వృద్ధులతో పాటు సెలబ్రిటీలు కూడా మోసపోవడం గమనార్హం. ఓటిపి కేసులకు సంబంధించి 115 కేసులు నమోదు కాగా నాలుగు కోట్ల 94 లక్షల రూపాయలను బాధితులు పోగొట్టుకున్నారు. ఇందులోనూ వయో వృద్ధులే ఎక్కువ మంది వున్నారు. దీంతో పాటు అధిక వడ్డీ ఇస్తామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఘటనలు 22 వెలుగు చూ డగా రెండు కోట్ల 79 లక్షల రూపాయలు బాధితులు పోగొట్టుకు న్నారు. సోషల్ మీడియా కేసులు ఏడు వెలుగుచూడగా 70 లక్షల 11 వేల రూపా యలు బాధితులు పోగొ ట్టుకున్నారు. మొత్తం మీద 2025లో వయోవృద్ధులు మోసపోయిన ఘటనలపై 285 కేసులు నమోదు కాగా 71.81 కోట్ల రూపాయలు పోగొట్టుకున్నారు. ఈ ఏడాది జులై వరకు 118 కేసుల్లో 30.20 కోట్ల రూపా యలు వృద్ధులు పోగొట్టుకున్నారు.

## సెల్‌ఫోన్ల చోరీల వెనుక వ్యవస్థీకృత అంతర్జాతీయ నేరగాళ్ల ముఠా

### ఢిల్లీ పోలీసుల విచారణలో వెల్లడయిన విస్తుపోయే వాస్తవాలు

### భారత్ నుంచి నేపాల్ మీదుగా విదేశాలకు విక్రయాలు

### సెల్‌ఫోన్లకు బదులు, విడిభాగాలుగా మార్చి అమ్మకాలు

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** సెల్‌ఫోన్ల చోరీ ముఠాల గురించి అందరికి తెలిసిందే. ప్రపం చంలోని అన్ని దేశాలలో సెల్‌ఫోన్లను దొం గిలించే నేరగాళ్లు వున్నారు. పోలీసులకు దొరక్కుండా వుండేందుకు ఒక చోట దొంగిలించే ఫోన్లను మరోచోట అమ్మడం గతంలో జరిగేది. అయి తే ఐఎంఎఐ ద్వారా ఫోన్లను గుర్తించడం మొదయ ల్యాక నేరగాళ్లు రూటుమార్చినట్లు తేలింది. ఢిల్లీలో పట్టుబడ్డ ఓ నేరగాళ్ల ముఠాను అక్కడి పో లీసులు విచారించిన సమయంలో విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. 140 కోట్ల జనాభా కలిగిన భారత్‌లో సెల్‌ఫోన్ల విక్రయాలు భారీ గా వుండడంతో చోరీలు కూడా ఎక్కువగానే వుంటు న్నాయి. అయితే ఇంతకాలం సెల్‌ఫోన్లను దొంగి లించే ముఠాలు వాటిని సమీపంలోని మరో నేరగాళ్ల ముఠాలకు అమ్మేసేవి. వీటిని ఆ ము ఠాలు టోకుగా అమ్మేసేవి. కానీ కొన్ని నెలలుగా సెల్‌ఫోన్లను చోరిచేసే ముఠాలు ఇలా చేయడం లే దని ఢిల్లీపోలీసుల విచారణలో తేలింది. భారత్‌లో దొంగిలిస్తున్న ఫోన్లలో మెజారిటీ ఫోన్లను నేపాల్, బంగ్లాదేశ్ మీదుగా విదేశాలకు ముఖ్యం గా ఆఫ్రికా దేశాలకు తరలిస్తున్నట్లు తేలింది. ఇక విదేశాలకు తరలిపోతున్న ఫోన్లలో మెజారిటీ ఫోన్లను విడిభాగాలుగా మారుస్తున్నట్లు ఢిల్లీ పో లీసులు తేల్చారు. ఇందులో డిస్ ప్లేలకు వెయ్యి నుంచి 15 వేల రూపాయలు, మదర్ బోర్డులకు వెయ్యి రూపాయల నుంచి 25 వేల రూపా యలు కెమెరాలకు వెయ్యి నుంచి ఆరువేల రూపాయలు, బ్యాటరీలకువెయ్యి నుంచి ఆరువేల రూపాయలకు అమ్ముతున్నారు. ఇలా చేయడం వ ల్ల చోరీలకు గురయ్యే ఫోన్లు ఎప్పటికీ పట్టుబడే సమస్యే వుండదని దొంగలు భావిస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. అయితే ఖరీదైన, విలు వైన ఫోన్లను మాత్రం యధాతథంగా చోర్‌బజార్ లో పరిస్థితులను బట్టి మంచి ధరలకు అమ్ముతు న్నారు. భారత్‌లో చోరీ అయ్యేఫోన్లను ఇక్కడ అమ్మితే ఏదో ఒకరోజు పట్టుబడడం ఖాయంగా వుండడంతో ఆఫ్రికా దేశాలలో అమ్ముతున్నారని ఢిల్లీ పోలీసులు తేల్చారు. భారత్‌లో ఢిల్లీలో సె ల్‌ఫోన్లచోరీలుఎక్కువగా జరుగుతున్నాయని తేలింది. ఢిల్లీలో 2023లో మూడులక్షల 90 వేలు, 2024లో మూడు లక్షల 30 వేలు, 2025 లోరెండున్నర లక్షలవరకు ఫోన్లు చోరీ అయ్యా యి. కొంతకాలంగా పోలీసు నిఘా వుండడంతో చోరీలు తగ్గాయి. ఫోన్ల రికవరీ కూడా భారీ గానే పెరిగిందని ఢిల్లీ పోలీసులు చెబుతున్నారు.

## సిటీ సైబర్ క్రైం విభాగం పనితీరుపై అదనపు సిపి సమీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** హైదరాబాద్ సైబర్ క్రైం విభాగం పనితీరును నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) ఎం. శ్రీని వాస్ సమీక్షించారు. బషీర్‌బాగ్‌లోని ఈ విభాగం డిసిపి అరవింద్ బాబు ఆకస్మికంగా బదిలీ అయిన తరువాత అదనపు పోలీసు కమిషనర్ ఈ విభాగం బాధ్యతలను స్వయంగా చూస్తున్నారు. ఈ సందర్భంగా ఎసిపి శివమారుతి అదనపు సిపి శ్రీనివాస్‌కు స్వాగతం పలికారు. అనం తరం ఈ విభాగంలో పనిచేస్తున్న అధికారులతో ఆయన భేటీ అయ్యారు. అనంతరం సైబర్ క్రైం హెల్ప్ లైన్ 1930 పనితీరు ఎలా వుందనే దానిపై ఆరా తీశారు. బాధితులకు ఇక్కడి సిబ్బంది స్పందన ఎలా వుందనే దానిపైనా ఆరా తీశారు. సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల విచారణను వేగ వంతం చేయాలని, నేరగాళ్లను వీలైనంత త్వరలోనే పట్టుకోవాలని అదనపు సిపి శ్రీనివాస్ ఆదేశిం చారు. బాధితుల్లో భారీగా నష్టపోయిన కేసుల విచారణ మరింత వేగంగా పూర్తి చేయా లని, బాధితులకు వీలైనంత ఎక్కువ మొత్తం లభించేలా చూడాలని ఆయన ఆదేశించా రు. సైబర్ నేరగాళ్ల అరెస్టు, తదనంతరం వారిపై సాక్షా లు, ఆధారాల సేకరణ పక్కాగావుండాలని, నిందితులకు కోర్టుల్లో శిక్షలు పడేలా చూ డాలని ఆయన ఆదేశిం చారు. సైబర్ నేరాల్లో బాధితులు పోగొట్టుకున్న నగదును జప్తు చేసే విషయంలో బ్యాంకులతో సమన్వయం చేసుకోవాలని ఆయన తెలిపారు. బ్యాంకులతో పాటు ఆర్థికసంస్థలతోనూ సమన్వయం చేసు కోవాలని ఆయన కోరారు. సైబర్ నేరగాళ్ల కొత్త మోసాలపై ప్రజలను అప్రమత్తం చేస్తుండాలని అదనపు సిపి శ్రీనివాస్ కోరారు. పెండింగ్ కేసులను త్వరగా విచారించి కోర్టుల్లో దోషులకు శిక్షలు పడేలా చేయాలని ఆయన ఆదేశించారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో 421 మంది పట్టివేత

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** జంట నగరాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రి వేళలో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 421 మంది మందు బాబులు ప ట్టుబడ్డారు. వీరిలో 344 మంది ద్విచక్ర వాహనదారులు, 37 మంది ఆటో డ్రైవర్లు, 40 మంది కార్లతో పాటు ఇతర వాహనాల డ్రైవర్లు వు న్నారు. పట్టుబడ్డ వారిలో 87 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 173 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 82 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 41 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 18 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, 12 మంది 251 నుంచి 300 పాయింట్ల వరకు, ఎనిమిది 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సే వించినట్లు తేలింది. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డే విస్ మీడియాకు తెలిపారు. జంటనగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడు లు నిరంతరం కొనసాగుతాయని, వీటిని పూర్తి స్థాయిలో అరికడతామని ఆయ న వెల్లడించారు.

### సైబరాబాద్‌లో 311 మంది పట్టివేత

ఇదిలావుండగా సైబరాబాద్ పరిధిలో 311 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 238 మంది ద్విచక్ర వాహనదారులు. 16మంది ఆటో డ్రై వర్లు, 56 మంది కార్ల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిని నిబంధనల మేరకు కోర్టులో హాజరు పరుస్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అదనపు డిసిపి నరేందర్ తెలిపారు.

## 14రోజుల్లో 40లక్షల గడపలకు టిడిపి

### జోరుగా సాగుతున్న ఇంటింటికీ టిడిపి

### మంత్రులకు లోకేశ్ కీలక ఆదేశాలు

**విజయవాడ.ఆగస్టు9,ప్రభాతవార్తప్రతినిధి:** టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఇంటింటికీ తెలుగుదేశం – రెండేళ్ల నమ్మకం "కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని, సంక్షేమ ఫలాలను ప్రజలకు నేరుగా వివరించే ఈ కార్యక్రమం ఆది వారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. గడిచిన 14 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు 40.74 లక్షలకు పైగా కుటుంబాలను నేరుగా కలుసుకుని రికార్డు సృష్టించాయి. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనతో ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3.53 లక్షల ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. ఎన్నికల మేనిఫె స్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల అమలు తీరును, ఇతర సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందుతున్న ప్రయోజనాలను ప్రతి కుటుంబానికి వివరిస్తున్నారు. ఈ కార్యక్రమ పురోగతిపై టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించారు. కార్యక్రమాన్ని మరింత సమర్థవం తంగా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ఆయన పార్టీ శ్రేణులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో తప్పనిసరిగా పర్యటిం చాలని, ప్రజలతో మమేకమై ప్రభుత్వ విజయాలను వివరించాలని స్పష్టం చేశారు. క్లస్టర్, మండల స్థాయి నాయకులను ఫోకస్ బూత్‌లకు అనుసంధానించి, సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి గ్రామ స్థాయి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో సమష్టిగా పాల్గొంటున్నారని, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పటిష్ఠం చేయాలని టీడీపీ భావిస్తోంది.

## అమెరికాలో భాగస్వామి హత్య కేసు

### జర్మనీలో భారతీయుడి అరెస్ట్

**ఆరిజోనా, ఆగస్టు 9:** అమెరికాలోని అరిజోనా రాష్ట్రంలో తన భాగస్వామిని హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ భారతీయుడిని జర్మనీ పోలీసులు అరెస్ట్ చేశారు. భారత్‌కు పారిపోయేందుకు యూరప్ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో వరుణ్ బచిగారిను జర్మన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అరిజోనా స్టేట్ యూనివర్సిటీ సమీపంలో నివసించే 19 ఏళ్ల విద్యార్థిని జులిస్సా రూబీ కుటుంబ సభ్యులకు ఆమె నుంచి ఫోన్ స్పందనలు నిలిచిపోవడంతో పోలీసులను ఆశ్ర యించారు. దీంతో పోలీసులు ఆమె అపార్ట్ మెంట్‌కు వెళ్లి చూడగా అనుమానాస్పద పరిస్థి తుల్లో మృతదేహం కనిపించింది. రూబీ ఫోన్, క్రెడిట్ కార్డులను వరుణ్ తీసుకెళ్లాడని ఆమె కు టుంబ సభ్యులు ఆరోపించారు. అంతేకాకుండా ఆమె ఫోన్ నుంచే తల్లికి సందేశాలు పంపినట్లు కూడా వారు పోలీసులకు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు వరుణ్ టక్సన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హ్యూస్టన్‌కు పారిపోయినట్లు గుర్తిం చారు. అక్కడి నుంచి బెర్లిన్‌కు విమానంలో వెళ్లిన అతడు భారత్‌కు చేరుకునేందుకు ప్రయ త్నించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. అమెరికా ఫెడరల్ అధికారుల సహకారంతో జర్మనీ పోలీసులు వరుణ్ ఆచూకీని గుర్తించి అరెస్ట్ చేశారు. భారత్‌కు బయలుదేరే లోపే ఆతడిని పట్టుకోగలిగామని ఆరిజోనా పోలీసులు తెలిపారు. ప్రస్తుతం దర్యాప్తును వేగవంతం చేసినట్లు పోలీసులు తెలిపారు.

## రూ.15వేల కోట్లకు ఎఫ్‌డిఐ పరిమితి పెంపు

### దేశంలోకి విదేశీ పెట్టుబడులు రూ.1.16 లక్షలకోట్ల డాలర్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వాతావరణాన్ని మరింత మెరుగుపరిచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ప్రతిపాదనను పరిశీలిస్తోంది. కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదం అవసరమయ్యే ఎఫ్‌డీఐ ప్రతిపాదనల పరిమితిని ప్రస్తుత రూ.5,000 కోట్ల నుంచి రూ.15,000 కోట్లకు పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని సీసీఈఏలో కేంద్ర హోంమంత్రి, ఆర్థిక మంత్రి సహా పలువురు కీలక కేబినెట్ మంత్రులు సభ్యులుగా ఉంటారు. ప్రస్తుత ఎఫ్‌డీఐ విధానం ప్రకారం రూ.5,000 కోట్లకు మించిన విదేశీ ఈక్విటీ పెట్టుబడులు వచ్చే ప్రతిపాదనలను సీసీఈఏ పరిశీలనకు పంపాల్సి ఉంటుంది. ఈ పరిమితిలోపు ఉన్న ప్రతిపా దనలపై సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలు నిర్ణయం తీసుకుంటాయి. సీసీఈఏ ఆమోదానికి సంబంధించిన ప్రస్తుత రూ.5,000 కోట్ల పరిమితి 2015 నవంబర్ నుంచి మారలేదు. గత కొన్నేళ్లలో పెట్టుబడుల పరిమాణం పెరగడం, ద్రవ్యోల్బణం, మారుతున్న ఆర్థిక పరిస్థితులు, వ్యాపార నిర్వహణను సులభతరం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాల నేపథ్యంలో ఈ పరిమితిని పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని అధికారి పేర్కొన్నారు. ఎఫ్‌డీఐకి సంబంధించి ప్రభుత్వ అనుమతి అవసరమయ్యే ప్రతిపాదనలకు సీసీఈఏ ఆమోద పరిమితిని పెంచాలని కార్య దర్శుల కమిటీ సమావేశంలోనూ సూచించినట్లు తెలిపారు. అయితే ఈ ప్రతిపాదన ప్రస్తుతం చర్చల దశలోనే ఉందని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడులను మరింత ఆకర్షించేందుకు డౌన్‌స్ట్రీమ్ లేదా పరోక్ష విదేశీ పెట్టుబడుల నిబంధనలను కూడా సడలించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోంది. దేశీయ సంస్థకు విదేశీ పెట్టుబడుల కోసం ఇప్పటికే ప్రభుత్వ అనుమతి లభించి ఉంటే ఆ సంస్థ ద్వారా మరో భారతీయ కంపెనీలోకి వచ్చే పరోక్ష విదేశీ పెట్టుబడికి తాజాగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేకుండా మినహాయింపు ఇవ్వాలని ప్రతిపాదన ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రభుత్వ అనుమతి మార్గం లో ఉన్న రంగాల్లో ఎఫ్‌డీఐలు, అలాగే భారత్‌తో భూ సరిహద్దును పంచుకునే దేశాల నుంచి వచ్చే పెట్టుబడులకు డౌన్‌స్ట్రీమ్ లేదా పరోక్ష విదేశీ పెట్టుబడుల విషయంలో ముందస్తు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. దేశంలోకి విదేశీ పెట్టుబ డులను ఆకర్షించేందుకు కేంద్రం ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. 2000 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు భారత్‌లోకి వచ్చిన మొత్తం విదేశీ పెట్టుబడులు 1.16 లక్షల కోట్ల డాలర్లను దాటా యి. మారిషస్, సింగపూర్, అమెరికా, నెదర్లాండ్స్, జపాన్, బ్రిటన్, యూఏఈ తదితర దేశాలు భారత్‌లోకి పెట్టుబడులు పెట్టే ప్రధాన దేశాలుగా నిలిచాయి.

## హార్ముజ్ జలసంధి తెరిస్తే.. ఇరాన్‌తో అణు ఒప్పందంపై ట్రంప్ వెనక్కి..

**వాషింగ్టన్, ఆగస్టు 9:** ఇరాన్ హార్ముజ్ జలసంధిని పూర్తిగా తిరిగి తెరిస్తే, ఆ దేశంతో కొత్తగా అధి కారిక అణు ఒప్పందం కుదుర్చుకోవాలన్న ప్రయ త్నాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విర మించుకునే అవకాశముందని చూచాయగా సం కేతాలిస్తోంది. పూర్తిస్థాయి, తుది అణు ఒప్పందం కోసం పట్టుబట్టడం కంటే ప్రపంచంలోని కీలక చమురు రవాణా మార్గాల్లో ఒకటైన హార్ముజ్ జలసంధిలో నౌకాయానాన్ని పునరుద్ధరించడానికే అమెరికా ప్రాధాన్యం ఇవ్వవచ్చని అమెరికా మీడియా కూడా పేర్కొంది. దీనిని ప్రాతిపదికగా చేసుకుని ఈ ప్రాంతంలో కొనసాగుతున్న సైనిక చర్యలను ముగించడం, ప్రస్తుత కాల్పుల విరమణను పొడిగించడం వంటి చర్యలకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధపడవచ్చని తెలిపింది. అమెరికా అధి కారులను ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ తెలిపిన వివరాల ప్రకారం ఈ తరహా పరిణామానికి ట్రంప్ గత కొన్ని వారాలుగా రంగం సిద్ధం చేస్తున్నారు. ఇరాన్‌తో కొత్త అణు ఒప్పందం సాధించకుండానే చర్చల నుంచి తప్పుకోవచ్చని ఆయన తన సన్ని హిత ఉన్నతాధికారులకు వ్యక్తిగతంగా చెప్పినట్లు సమాచారం. హార్ముజ్ జలసంధిని తిరిగి తెర వాలంటే ఇరాన్ భారీగా షరతులు విధించినట్లు స మాచారం. ఇందులో బిలియన్ల డాలర్ల చెల్లింపులు, అమెరికా నౌకాదళ దిగ్బంధనానికి ముగింపు, ప్రాం తం నుంచి అమెరికా బలగాల ఉపసంహరణ, ఆంక్షల ఎత్తివేత, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల విడుదల వంటి డిమాండ్లు ఉన్నాయి. ఈ డి మాండ్లతో వాషింగ్టన్‌కు దౌత్యపరమైన అవకాశాలు మరింత పరిమితమయ్యాయని తెలుస్తోంది. తక్షణ ఒప్పందం కంటే సుదీర్ఘకాలిక ఘర్షణకు ఇరాన్ సిద్ధమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని తెలిపింది. కీలక అస్త్రంగా హార్ముజ్‌ఇరాన్, ఒమన్ మధ్య ఉన్న ఇరుకైన సముద్ర మార్గమే హార్ముజ్ జలసంధి. ప్రపంచ చమురు రవాణాలో ఇది అత్యంత కీలకమైన మార్గం. క్షిపణులు, డ్రోన్ల దాడులతో వాణిజ్య నౌకల రాకపోకలను ఇరాన్ అడ్డుకోవడంతో సరకు రవాణాలో జాప్యం ఏర్ప డింది. దీని ప్రభావం అంతర్జాతీయ మార్కెట్లపైనా



పడింది. ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇరాన్ ఈ జలమార్గాన్ని మూసివేసింది. అమెరికా యుద్ధనౌకలు, మిత్రదేశాల నౌకలు ఈ మార్గంలో ప్రయాణించేందుకు అనుమతించ బోమని స్పష్టం చేసింది. అదే సమయంలో ఈ మార్గాన్ని ఉపయోగించే వాణిజ్య నౌకల నుంచి రుసుములు వసూలు చేసేందుకు కూడా ప్రయ త్నించింది.



## సలహాదారులతో మొజ్తబా ఖమేనీ సమావేశం

### విడియో విడుదలచేసిన ఇరాన్ న్యూస్ ఏజెన్సీ

**టెహ్రాన్, ఆగస్టు 9:** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఆచూకీ, ఆరోగ్య పరిస్థితిపై కొనసాగుతున్న ఉత్కంఠ మధ్య ఇరాన్ మీడియా ఓ చిన్న వీడియోను విడుదల చేసింది. ఇరాన్‌కు చెందిన మెహర్ న్యూస్ ఏజెన్సీ విడుదల చేసిన ఈ 12 సెకన్ల వీడియోలో మొజ్తబా ఖమేనీ తన సలహాదారులు, అధికారులతో సమావేశంలో ఉన్నట్లు కనిపిస్తున్నారు. అయితే ఈ వీడియో ఎప్పుడు చిత్రీకరించారనే వివరాలు వెల్లడిం చలేదు. వీడియోలో ఖమేనీ ఆరోగ్యంగా కనిపిం చడం గమనార్హం. అమెరికా, ఇరాన్ మధ్య కొన సాగుతున్న ఘర్షణ నేపథ్యంలో దేశ వ్యూహంపై అధికారులతో ఆయన చర్చిస్తున్నట్లు వీడియోను ఇరాన్ మీడియా వివరించింది. మొజ్తబా ఖమేనీ ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఇటీవల కొన్ని ఇజ్రాయెలీ మీడియా సంస్థలు కథ నాలు ప్రచురించాయి. కొన్ని నివేదికలు ఆయన పరిస్థితి మరింత విషమిస్తే కొద్ది రోజుల్లోనే మర ణించే అవకాశం ఉందని కూడా పేర్కొన్నాయి. అయితే ఈ వాదన లకు స్వతంత్రంగా ధృవీకరణ లభించలేదు. మరోవైపు ఇరాన్ మీడియా విడుదల చేసిన తాజా వీడియో ద్వారా ఖమేనీ ఆరోగ్యంపై వస్తున్న ఊహాగానాలను ఖండించే ప్రయత్నం చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. 56 ఏళ్ల మొజ్తబా ఖమేనీ చాలా కాలంగా బహి రంగంగా కనిపించకపోవడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. ఇరాన్‌లో నాయకత్వ మార్పు అనంతరం కూడా ఆయన బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉండటం, ముఖ్యమైన సందర్భాల్లో ప్రజల ముందుకు రాకపోవడం కారణంగా ఆయన ఆరోగ్యంపై అనేక ప్రశ్నలు తలెత్తాయి. అయితే భద్రతా కారణాల వల్ల ఆయన బహిరంగంగా కనిపించడం లేదనే వాద నలు కూడా ఉన్నాయి. ఇరాన్ అధ్యక్షుడు మ సూద్ పెజెష్కియాన్ ఇటీవల మొజ్తబా ఖమేనీతో కమ్యూనికేట్ చేయడం ప్రస్తుతం చాలా కష్టంగా ఉందని వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఆయన నాయకత్వం దేశానికి బలాన్నిస్తోందని పెజెష్కియాన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో ఇరాన్ ప్రభుత్వ వర్గాలు ఖమేనీ దేశ పరిపాలన, కీలక నిర్ణయాల్లో పాల్గొంటున్నారని గతంలో పేర్కొన్నాయి. ఇరాన్ ఇంటర్నేషనల్ నివేదిక ప్రకారం పెజెష్కియాన్, ఖమేనీని ఒక రహస్య ప్రదేశంలో కలిసినట్లు పేర్కొన్నారు. ఆ సమావేశం టెహ్రాన్‌లో జరిగినట్లు నివేదిక తెలిపింది. పెజెష్కియాన్‌ను కారు వెనుక సీటు లో ఉన్న వ్యక్తి వద్దకు తీసుకెళ్లారని, కారు అద్దాలు నల్లగా ఉండటంతో ఆయనను స్పష్టంగా చూడలేకపోయారని పేర్కొంది. ఆ వ్యక్తి తానే మొజ్తబా ఖమేనీ అని చెప్పుకున్నప్పటికీ, పెజెష్కియాన్‌కు పూర్తిగా నమ్మకం కలగలేదని నివేదిక పేర్కొంది. అయితే ఈ వివరాలు స్వతంత్రంగా ధృవీకరించలేదు.

## లైంగిక దాడి కేసులో దర్శకుడు షకీల్ నూరానీ అరెస్ట్



**ముంబయి, ఆగస్టు 9:** జోరూకా గులామ్ బడే దిల్‌వాలా వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన బాలీవుడ్ దర్శకుడు షకీల్ నూరానీని మాల్వాణి పోలీసులు అరెస్ట్ చేశారు. 33 ఏళ్ల మహిళా నటిపై అత్యాచారం, లైంగిక దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై కేసు నమోదైంది. అరెస్టు అనం తరం ఆయనను బోరివలి హాలిడే కోర్టులో హాజ రుపరచగాఈనెల 12 వరకు పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించింది. సినిమా ప్రాజెక్టు పేరుతో ఇంటికి పిలిపించి సినిమా ప్రాజెక్టు గురించి చర్చించాలంటూ 33 ఏళ్ల నటిని మాల్వాణిలోని తన నివాసానికి నూరానీ పిలిపించినట్లు పోలీ సులు తెలిపారు. అక్కడ ఆమెకు మత్తు కలిగించే పదార్థం ఇచ్చి లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఫిర్యాదులో ఆరోపించింది. అనంతరం తాను చిత్రీకరించినట్లు చెబుతున్న ఓ వీడియోను చూపించి బెదిరించారని పేర్కొంది. ఈ ఘటనపై మాల్వాణి పోలీసులు భారతీయ న్యాయ సంహిత లోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం 2016లో లోఖండ్వాలాలో జరిగిన ఓ అవార్డు కార్యక్రమంలో తొలిసారి నూరానీని కలిసింది. అప్పట్లో ఓ సినిమా ప్రాజెక్టులో పని విషయంలో తనను సంప్రదించాలని ఆయన సూచించినట్లు తెలిపింది. ఆ తర్వాత స్క్రిప్ట్ చదవడానికి మాల్వాణిలోని నూరానీ నివాసానికి వెళ్లిన సమయంలో ఆయన తనకు ఓ డ్రింక్ ఇచ్చారని, అది తాగిన తర్వాత స్పృహ కోల్పోయానని ఆమె ఆరోపించింది. తాను స్పృహలో లేని సమయం లో లైంగిక దాడికి పాల్పడ్డారని పేర్కొంది. తాను పోలీసులను ఆశ్రయించినా, కుటుంబ సభ్యులకు విషయం చెప్పినా వీడియోను బయటపెడ తానంటూ నూరానీ బెదిరించారని బాధితురాలు ఆరోపించింది. ఆ వీడియోను అడ్డుపెట్టుకుని పలుమార్లు తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొంది. లైంగిక సంబంధాల అనంతరం నూరానీ తనకు పలుమార్లు గర్భని రోధక మాత్రలు ఇచ్చేవారని కూడా ఆరోపిం చింది. వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం కోరు తూ 2026లో ముంబైకి తిరిగి వచ్చిన అనం తరం ఆమె పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.

## మక్కా ఒప్పందంలోకి ఈజిప్ట్ ప్రవేశం

### ఇరాన్ లేదా మరే దేశానికి వ్యతిరేకం కాదు : తుర్కియే



**రియాద్, ఆగస్టు 9:** సౌదీ అరేబియా, పాకిస్థాన్‌లతో చేసుకున్న మక్కా సమష్టి రక్షణ ఒప్పందం ఇరాన్ లేదా మరే ఇతర దేశానికి వ్యతిరేకం కాదని తుర్కియే స్పష్టం చేసింది. ఈ మేరకు తుర్కియే విదేశాంగ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. తాము ఏ ఒక్క దేశాన్ని లక్ష్యంగా చేసుకోలేదని తమను తాము బలోపేతం చేసుకోవాలనే ఉద్దేశం తోనే ఒప్పందంపై సంతకం చేసినట్లు పేర్కొంది. ఇది ప్రాంతీయ స్థిరత్వం దిశగా వేసిన ఒక ముఖ్యమైన అడుగు అని వెల్లడించింది. సౌదీ అరేబియాలో నాటో తరహా భద్రతను ఏర్పాటు చేసుకోవాలన్న ఆలోచనతో పాక్, సౌదీ అరే బియా, తుర్కియే మక్కా సమష్టి రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఏ ఒక్క దేశంపై దాడి జరిగినా, అది మూడు దేశాలపై జరిగిన దాడిగానే పరిగణిస్తామని ఈ ఒప్పందం స్పష్టం చేస్తుంది. అటు మక్కా ఒప్పందంలో తాజాగా ఈజిప్ట్ కూడా చేరనున్నట్లు తుర్కియే విదేశాంగ మంత్రి ప్రకటించారు. అంతేకాకుండా ఈ కూటమి మరిం త విస్తరించే అవకాశం ఉందని భవిష్య త్తులో మరిన్ని దేశాలు తమతో చేతులు కలుపుతాయని భావిస్తున్నట్లు విశ్వాసం వ్యక్తం చేసింది. సౌదీ అరేబియాలోని పవిత్రనగరమైన మక్కాలో శుక్ర వారం జరిగింది. దీనిపై సౌదీ యువరాజు మహ మ్మద్ బిన్ సల్మాన్, తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సంతకాలు చేశారు.

**ఏ దేశాన్ని ప్రత్యర్థిగా భావించం:**

'మక్కా సమష్టి రక్షణ ఒప్పందం' చమురు సం పన్న దేశమైన సౌదీ అరేబియా, అణుశక్తి కలిగిన పాకిస్థాన్, నాటోలో రెండు అతిపెద్ద సైన్యం, అలాగే వేగంగా అభివృద్ధి చెందుతున్న రక్షణ పరిశ్రమను కలిగి ఉన్న తుర్కియేలను ఒకచోట చేర్చింది. ప్రాంతీయ అనిశ్చితి, యుద్ధం వల్ల తలెత్తే ముప్పు లు వంటి కీలక విషయాల్లో ఈ ఒప్పందం ఆయా దేశాల మధ్య సహకారాన్ని, రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేయనుంది' అని తుర్కియే విదేశాంగ మంత్రి హకాన్ ఫిడాన్ స్పష్టం చేశారు. అలాగే 'సమష్టి ముప్పును నిర్వచించేలా మేము ఏదీ లిఖితపూర్వకంగా లేదా ఒప్పంద రూపంలో నమోదు చేయలేదు. మాపై దాడి చేయని ఏ దేశమూ మాకు లక్ష్యం కాదు' అని ఫిడాన్ తెలిపారు.

మరికొన్ని దేశాలు కూడా ఈ ఒప్పందంలో చేరడానికి ఆసక్తి చూపాయని చెప్పారు. ఈ ఒప్పందం ప్రకారం.. మూడు దేశాల విదేశాంగ, రక్షణ మంత్రుల, అలాగే ఆయా దేశాల సైనిక అధిపతులు క్రమం తప్పకుండా కమిటీ సమా వేశాలు నిర్వహిస్తారు. అలాగే, సౌదీఅరేబియా కేంద్రంగా ఒక సచివాలయాన్ని కూడా ఏర్పాటు చేస్తాయని ఫిడాన్ వెల్లడించారు.

## బాలికపై అత్యాచారంచేసిన నిందితుడి ఎన్‌కౌంటర్



**బులంద్‌షహార్, ఆగస్టు 9:** పన్నెండేళ్ల బాలికను అత్యా చారం చేసి హత్య చేసిన కేసు లో నిందితుడు పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమ య్యాడు. ఉత్తర్‌ప్రదేశ్ లోని బులంద్‌షహార్ లో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడు చోలా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫతేపూర్ జదౌన్‌కు చెం దిన మోనుగా పోలీసులు గుర్తించారు. అధికారుల వివరాల ప్రకారం స్థానిక గులాథీ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చారు. వారిని ఆపేందుకు ప్రయత్నించగా విచక్షణార హితంగా కాల్పులు జరిపారు. ఈ క్రమంలో పోలీసులు ఎదురుకాల్పులు జరపడంతో మోను తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్రవాహనంపై ఉన్న రెండో వ్యక్తి అప్రమత్తమై అక్కడి నుంచి పరా రయ్యాడు. గాయాలతో ఉన్న మోనును వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాల్పుల్లో ఎస్‌ఐ సందీప్‌కుమార్, కానిస్టేబుల్ నరేంద్రకుమార్ గాయపడ్డారు. ఆగస్టు 1న జరిగిన బాలిక అత్యాచారం, హత్య కేసులో మోను ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఇటీవలే అతడి ఆచూకీ కోసం డీఐజీ రూ.50 వేల రివార్డు ప్రకటించారు. పరారైన నిందితుడి కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు.

10skl13:10skl13.qxd 09-08-2026 22:59 Page 1



## ఆకాశమే హద్దుగా...
# బంగారం మాఫియా!

- రణస్థలంలో టాక్స్ కట్టని బంగారం భారీగా దిగుమతి
-తూకాల్లో తేడా... మోసపోతున్న కొనుగోలుదారులు
-మామూళ్ల మత్తులో ఇన్‌కమ్ టాక్స్, సంబంధిత అధికారులు
-కోట్ల రూపాయల్లో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి




**రణస్థలం, ఆగస్టు 9, ప్రభాతవార్త :**

భారతీయ సంస్కృతిలో బంగారానికి ఉన్న ప్రాధాన్యత ప్రత్యేకమైనది. అలంకరణతో పాటు ఆపద్బాంధవుడిగా ఆదుకునే ఆస్తిగా భావించి ప్రతి ఒక్కరూ తమ స్తోమతను బట్టి బంగారంపై పెట్టుబడులు పెడుతుంటారు. రోజురోజుకీ దేశంలో బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నా కొనుగోళ్లు మాత్రం తగ్గడం లేదు. దీన్నే ఆసరాగా చేసుకుని కొందరు బంగారం దుకాణాదారులు, వ్యాపారులు కాసుల వర్షం కురిపించుకుంటున్నారు. ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా బంగారాన్ని దిగుమతి చేసుకుని కోట్ల రూపాయలను తమ జేబులు నింపుకుంటున్నారు.

**అనుమతులు లేని బంగారం షాపులెన్నో...**

రణస్థలం మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేని బంగారం దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలిసాయి. ప్రభుత్వ పన్నులు ఎగవేసేలా పన్నాగం పన్ని మండపేట, విజయవాడ ప్రాంతాల నుంచి ట్రావెల్ బస్సుల్లో రహస్యంగా ముడి బంగారాన్ని భారీగా రవాణా చేస్తున్నారు. రోజూ అక్రమ బంగారం సరఫరా జరుగుతున్నట్లు సమాచారం.

**కల్తీ ఆభరణాలు...తక్కువ ధర ఆశ**

పన్నులు లేని తక్కువ ధరకు ఇస్తామని ఆశ చూపిస్తూ, వాయిదాల పద్ధతిలో వ్యాపారం చేస్తూ కస్టమర్లను బురిడీ కొట్టిస్తున్నారు. రాగి శాతం విపరీతంగా పెంచి 22 క్యారెట్లు, 24 క్యారెట్లు అంటూ నకిలీ హాల్ మార్క్ ముద్రలతో కస్టమర్ల నెత్తిన రుద్దుతున్నారు. పెద్ద పెద్ద షాపుల్లో బంగారం కొనుగులు చేస్తే జీఎస్టీ రూపంలో ఎక్కువ మొత్తం చెల్లించాల్సి ఉంటుందని మధ్యతరగతి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేసి భారీ మోసాలకు తెర తీస్తున్నారు.

**తూకంలో అంతా మోసం...**

బంగారం కొనుగోలుపై గ్రామీణ ప్రాంతాల్లో అంతగా అవగాహన లేకపోవడం వల్లే బంగారం వ్యాపారుల మాయలో పడి వారంతా మోసపోతున్నారు. బంగారం తూకంలో దుకాణదారులు మోసాలకు పాల్పడుతూ కొనుగోలుదారులను నమ్మించి సొమ్ము చేసుకుంటున్నారు.




అంతేకాకుండా ఇంత లక్షల విలువైన బంగారం కొనుగోలు వివరాలు చిత్తు కాగితాలపై నమోదు చేసి ఇస్తుండం వెనుక బంగారం వ్యాపారుల ఏవిధంగా ఉంటుందో అద్దం పడుతుంది. రణస్థలంలో కొనుగులు చేసిన బంగారాన్ని జీఎస్టీ పరిధిలో విక్రయాలు సాగించే పెద్ద పెద్ద బంగారం షాపుల్లో విక్రంయిస్తే చాలా బంగారం నాణ్యత, తూకంలో చాలా అధికంగా తేడాలు ఉండటం వలన వాటిని స్వల్ప ధరకు వెల కట్టడంతో కొనుగోలుదారుల కళ్లు బైర్లు కమ్మే పరిస్థితి.

**మామూళ్ల మత్తులో ఇన్‌కమ్ టాక్స్, సంబంధిత అధికారులు**

రణస్థలంలో బంగారం షాపుల యజమానులు భారీ మోసాలకు పాల్పడుతున్నప్పటికీ వారిపై దృష్టి సారించకపోవడం వెనుక సంబధిత అధికారులకు నెలవారి మామూళ్లు భారీగా ముడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందు వలనే బంగారం వ్యాపారుల ఈ భారీ అక్రమ దందాతో ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల్లో గండి పడుతున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో తనిఖీలు చేపట్టి సామాన్య వినియోగదారులను మోసాల బారిన పడకుండా కాపాడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సుంకిలి, గంగాసాగరం ప్రాజెక్టులకు నిధులు సమకూర్చండి
### చంద్రబాబును కోరిన విప్ అశోక్



**కవిటి, ఆగస్టు 9, ప్రభాతవార్త**

కంచిలి మండలంలో గల సుంకిలి సాగరం, గంగాసాగరం ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలంటూ ఇచ్చాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం అందించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఇచ్చాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అశోక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కంచిలి మండలంలోని సుంకిలి సాగరం గంగాసాగరం ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆయా ప్రాజెక్టుల ప్రాధాన్యతను స్థానిక రైతుల అవసరాలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చించారు. గంగాసాగరంకు త్వరలోనే నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని సీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## నాటక అకాడమీ డైరెక్టర్‌గా దక్కత కామేశ్వరరావు ప్రమాణ స్వీకారం



**ఇచ్ఛాపురం, ఆగస్టు 9, ప్రభాతవార్త :**

రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన దక్కత కామేశ్వరరావు విజయవాడలోని ఘంటసాల వెంకటేశ్వరరావు నాటక అకాడమీ కళా వేదికలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ఘనంగా సన్మానించి అభినంద నలు తెలిపారు. కార్యక్రమంలో నాటక అకాడమీ డైరెక్టర్లు గణపతి, ప్రతిభ, గంగాదేవి, స్వప్న, దుర్గారావు, అంబికాదేవి, అన్నపూర్ణ, శివపార్వతి, లక్ష్మీ, ఐటీడీపీ మండల అధ్యక్షుడు నరేంద్ర రెడ్డి, కళాకారులు, సామాజిక సేవకులు పాల్గొని కామేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. నాటక రంగ అభివృద్ధికి ఆయన సేవలు మరింత ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

## ఆరకభద్ర వంతెనకి రక్షణ కవచం నిర్మించండి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 9, ప్రభాతవార్త :**



అరకభద్ర గ్రామానికి సమీపంలో బహుదా నదిపై గత వైస్సార్సీపీ ప్రభుత్వంలో 14 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణం పూర్తి చేసి సార్వత్రిక ఎన్నికలు ముందు కోడ్ అమలు వల్ల వంతెనకు ఇరువైపులా టోయ్ వాక్ నిర్మాణం పనులు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే నిర్మించాలని నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి కోరారు. తదుపరి ప్రభుత్వం మారి నిర్మాణం పనులు చేయకుండా సదరు కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడని, 2024 సంవత్సరం చివరిలో బహుదా నదికి వచ్చిన వరదలో వంతెనకు ఇరువైపు లా అప్రోచ్ మార్గంలో పెద్ద గండి పడింది. ఆ సమయంలో తాత్కాలికంగా మట్టితో పూడ్చిన పనులు నేటికి అదే స్థితిలో వదిలేసారన్నారు. భవిష్యత్తులో ఏ కొద్దిపాటి వరద వచ్చినా సరే వంతెనకు ఇరువైపులా మట్టితో ఏర్పాటు చేసిన అప్రోచ్ మార్గం కొట్టుకొనిపోయే ప్రమాదం ఉందని, సంబంధిత అధికారులు కాంట్రాక్టు టర్మ్ ప్రకారం ఇరువైపులా మొత్తం 200 మీటర్ల రక్షణ కవచం నిర్మాణం పనులపై దృష్టిసారించి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.

## పాముకాటుకు గురైన చిన్నారికి రూ.10వేలు ఆర్థిక సహాయం



**సంతబొమ్మాళి, ఆగస్టు 9, ప్రభాతవార్త :**

కవిటి మండలం, మడియారిపుట్టుగ గ్రామానికి చెందిన చిన్ని అనే చిన్నారి ఇటీవల పాముకాటుకు గురై తీవ్ర అస్వస్థతకు గురైంది. ప్రస్తుతం చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలతో పోరాడుతున్న విషయం తెలుసుకున్న శ్రీ రేయమ్మ తల్లి యూత్ హెల్పింగ్ హార్ట్స్ సేవా సొసైటీ సభ్యులు స్పందించారు. చిన్నారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిని గుర్తించిన సేవా సొసైటీ సభ్యులు తమ వంతు మానవతా సహాయంగా 10,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సేవా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ 'ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, అవసరమైన సమయంలో చేయూతనివ్వడం మన బాధ్యత. చిన్నారి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని కోరుకుంటున్నాం. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు తోచినంత సహాయం అందించి ఇలాంటి కుటుంబాలకు అండగా నిలవాలి' అని తెలిపారు. చిన్నారి కుటుంబ సభ్యులు సేవా సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మానవత్వమే మనిషి నిజమైన ఆస్తి, ఆపదలో చేసే చిన్న సహాయం కూడా ఒక ప్రాణానికి గొప్ప ఆశగా నిలుస్తుంది అనే సందేశాన్ని సేవా సొసైటీ చాటి చెప్పింది.

## క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**ఆమదాలవలస, ఆగస్టు 9 ప్రభాతవార్త :**



క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కలుగుతుందని టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మైదానంలో స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఎస్‌వీఎస్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆదివారం ముగింపు కార్యక్రమంలో విద్యాసాగర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో విద్యార్థుల్లో చురుగ్గా పాల్గొంటున్నారని వాళ్లలో ఉన్న క్రీడా ప్రతిభను వెలిగి తీసేందుకు ఈ క్రీడలో ఎంతగానో దోహదపడతాయని అన్నారు. పోటీల్లో గెలుపు ఓటమిలో సమానంగా భావించి అందరూ ఐక్యమత్యంతో ఉండాలని విద్యార్థులకు సూచించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆగస్టు 15వ తేదీన బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. క్రీడలతో విద్యార్థులకు ఆరోగ్యంతో పాటు ఉద్యోగ అవకాశాలు సాధించేందుకు ఆస్కారం కలుగుతుందన్నారు. విద్యార్థి క్రీడా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చూపాలన్నారు. ఎస్ వి ఎస్ స్కూల్ కరస్పాండెంట్ పేడాడ ప్రతాప్ కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జగనన్న పాటలకు మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య నృత్యం

**రాజాం, ఆగస్టు 9, ప్రభాతవార్త :**

మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్సీపి పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పాటలకు మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ న్యాయవాది రాజాం నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త డాక్టర్ తలే రాజేష్ తండ్రి తలే భద్రయ్య నృత్యం చేస్తూ అందరిని నవ్విస్తూ ఉత్తేజపరిచారు. రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరలో రాజేష్ తలపెట్టిన నిరాహార దీక్ష కార్యక్రమంలో పాల్గొని ఈ నృత్యాలు చేశారు. ఈ విధంగా నృత్యాలు చేయడంతో శిబిరంలో ఉన్న వైసిపి కార్యకర్తలు, నాయకులు చప్పట్లతో కేరింతలు కొడుతూ ఉత్తేజపరిచారు.

## సాగర నౌగాం స్మశానానికి విద్యుత్ ఏర్పాటు

**కంచిలి, ఆగస్టు 9, ప్రభాతవార్త :**



ముండ్ల పంచాయతీ సాగర నౌగాంలో గల స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. స్మశానవాటికక" విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో దహన సంస్కారాలకు ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని స్థానికంగా ఉంటున్న తెలుగుదేశం పార్టీ నాయకులు మండల పార్టీ అధ్యక్షుల మాదిన రామారావుకు తెలియజేయడంతో ఆయన స్పందించి అధికారులకు, నాయకులకు తెలియజేసి విద్యుత్ సౌకర్యం కల్పించారు. తెలుగుదేశం నాయకులు రామ్ చంద్ర మహంతి, గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఛలో బైక్ ర్యాలీ విజయవంతం చేయండి : ఎమ్మెల్సీ

**కవిటి, ఆగస్టు 9, ప్రభాతవార్త :**



ఛలో బైక్ ర్యాలీని విజయవంతం చేయాలంటూ ఎమ్మెల్సీ ఎన్.రామారావు ప్రకటనలో ఆదివారం తెలిపారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన బైక్ ర్యాలీకి తరలి రావాలంటూ కోరారు. డీఎస్సీ 2025లో జరిగిన అక్రమాలపై సిబిఐ విచారణ చేపట్టాలని బాధ్యులు తక్షణమే రాజీనామా చేయాలని, నిరుద్యోగ భృతి అమలు చేయాలని, ఫీజు రియంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న బైక్ ర్యాలీకి సంఘీభావం తెలపాలని ప్రకటనలో కోరారు. ఇచ్చాపురం నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, యువత, నిరుద్యోగులు, అభిమానులు పెద్ద సంఖ్యలో బైకులతో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు అన్నారు.

## తెదేపా సీనియర్ నేత గౌరీశంకర్ మాస్టర్ మృతి బాధాకరం : ఎమ్మెల్యే

**రాజాం, ఆగస్టు 9, ప్రభాతవార్త :**



టీడీపీ సీనియర్ నాయకులు, ప్రకృతి వ్యవసాయ ప్రేమికుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పెంకి గౌరీశ్వరరావు (64) మృతి చెందడం పట్ల, మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. 17వ వార్డు అమ్మవారి కాలనీలో ఆయన నివాసానికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. నిబద్ధత కలిగిన నేతని కోల్పోవడం బాధాకరమన్నారు. అన్నివేళలా తన వార్డులో అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించేవారని తెలిపారు. ఎంత చిన్న పదవి అయినా సరే నిజాయితీతో పని చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. గౌరీశ్వర రావు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, వారికి ఎమ్మెల్యే కోండ్రు ధైర్యం నింపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీతానగరంలో బాధితులకు సీఎం చెక్కులు పంపిణీ



**సంతబొమ్మాళి, ఆగస్టు 9, ప్రభాతవార్త :**

సీతానగరం గ్రామానికి చెందిన కేత వరలక్ష్మి, నీలాపు పురుషోత్తం, వాడరేవు నాగమ్మ వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితులకు సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ బాధితుల విషయాన్ని అదే గ్రామానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త, మత్స్య సహకార సొసైటీ అధ్యక్షులు తెదేపా సీనియర్ నాయకులు వాడరేవు కృష్ణారావు, తెదేపా మండల అధ్యక్షులు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో రాష్ట్ర మంత్రి అచ్చెన్ననాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకోవాలని కృషి చేశారు. దీంతో కేత వరలక్ష్మి (1,01,635), నీలాపు పురుషోత్తం (76,000), వాడరేవు నాగమ్మ (38,700)లకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదగా ఆదివారం అందజేశారు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు సహకారంతో చొరవ తీసుకున్న తెదేపా సీనియర్ నాయకులు వాడరేవు కృష్ణారావుకు ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకుల బచ్చల గోపాలరావు, బచ్చల బ్రహ్మానందం, పొన్నాడ రామారావు, బచ్చల పాండురాజు పాల్గొన్నారు.

## ధర్మవరంలో దోబీ ఘాట్ మంజూరు చేయండి
### -ఎంపీ కలిశెట్టికి వినతిపత్రం అందజేసిన రజక కార్పొరేషన్ డైరెక్టర్ రాము

**రణస్థలం, ఆగస్టు 9, ప్రభాతవార్త :**



నియోజకవర్గంలో ఎచ్చెర్ల మండలం ధర్మవరంలో రజకుల సంక్షేమానికి దోబీఘాట్ మంజూరు చేయాలని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడును రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము కోరారు. ఆదివారం రణస్థలం మండల కేంద్రంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ నిర్వహించిన 'ప్రజా దర్బార' కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము ఎంపీని కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ధర్మవరం గ్రామంలో సుమారు 210 రజక కుటుంబాలు సాంప్రదాయ రజక వృత్తిపైనే ఆధారపడి జీవనోపాధి సాగిస్తున్నాయని తెలిపారు. సరైన సదుపాయాలు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాగా, గురజాపు రాము అందజేసిన వినతిపై విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సానుకూలంగా స్పందించారు. ధర్మవరం గ్రామంలో రజకుల అవసరాలను గుర్తిస్తూ, దోబీఘాట్ మంజూరు కోసం తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రజక కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పలువురు రజక సంఘ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తిరుపతి వెంకన్నను దర్శించుకున్న రాజాం గాయత్రి బ్రాహ్మణ సంఘం



**రాజాం, ఆగస్టు 9, ప్రభాతవార్త :**

రాజాం గాయత్రి బ్రాహ్మణ సంఘ శాంపురం అగ్రహారం తిరుపతి వెంకటేశ్వర స్వామి వారి దర్శనం కోసం 80 మంది గాయత్రి బ్రాహ్మణ కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనానికి వెళ్లి స్వామివారి దివ్యదర్శనం ప్రాప్తి జరిగిందని సంఘం సభ్యులు తెలిపారు. శివ సంతోషి మాత జ్యోతిష్యాలయం బ్రహ్మశ్రీ ఎం.రవి ప్రసాద్ శర్మ గురుజి ఆధ్వర్యంలో ఈ బహు కార్యక్రమం జరిగినందుకు గాను బ్రాహ్మణ కుటుంబ సభ్యులు ఎంతగానో చాలా సంతోషించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ భక్తులు అలాగే మహిళలు పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకుని అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# శ్రీకాకుళం వార్త



## విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అభ్యాస వర్గ సమ్మేళనం

**ఇచ్ఛాపురం, ఆగస్టు 9, ప్రభాతవార్త :**



విశ్వ హిందూ పరిషత్ ప్రఖండ అభ్యాస వర్గ స్థానిక త్రినాధ స్వామి ఆలయం శివానందగిరి కొండపైన నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రావి రాంప్రసాద్ మాస్టర్, ప్రఖండ అధ్యక్షులు పాక తులసీదాసు, ప్రఖండ ప్రధాన కార్యదర్శి సదాశివుని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు లోకనాధం ఆనందరావు, ప్రాంత సేవ ప్రముఖ్ గుంటుకు సాయిరాం, రెండు జిల్లాలకు విభాగ్ కార్యదర్శి నాగభూషణం, ముఖ్యఅతిథిగా ఎన్.విశ్వనాధ్ హాజరయ్యారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఉల్లాశి శ్యామ్ కుమార్, లోపింటి సత్యం, గోపి, ఆశి జగన్ మోహన్ రెడ్డి, రావి విజయలక్ష్మి, రావి జయకృష్ణ, తడక కాళిదాసు, మురళి గోపాలకృష్ణ, మాటూరి సూర్యం, ఉప్పాడ రాజా, ధనపాన మోహన్, కణిదల దుర్యోధన, కాదా వెంకటరమణ, గణేష్ స్వామి, నందిక వెంకట్రావు మరియు చిన్నాల వెంకటరమణ, ఢిల్లీరావు మాస్టారు, శ్రీహరి సత్యానంద్, ఇచ్చాపురం కమిటీ మండల గ్రామ పెద్దలు హిందూ మహిళలు అనేక సంఘాల ప్రతినిధుల హిందువులు అనేకమంది పాల్గొన్నారు.

## శాకాంబరి దేవిగా నీలమణి దుర్గ అమ్మవారు



**మెళియాపుట్టి, ఆగస్టు 9, ప్రభాతవార్త :**

శ్రీశ్రీశ్రీ నీలమణి దుర్గ అమ్మవారు శాకాంబరి దేవి అవతారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చి తరింపజేశారు. ఈ సందర్భంగా సోమవారం దేవస్థానం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ జరుగును. పై కార్యక్రమానికి డాక్టర్ సలాన శరత్ కుమార్ తన వంతుగా 20 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. వారికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అభినందించారు. భక్తులు యావన్మంది రేపు ఉదయం 11:30 గంటలకు అమ్మవారి ఆవరణలో జరుగు శాకంబరీ దేవి ప్రసాదాన్ని అన్నప్రసాదంగా స్వీకరించి తరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అక్కంద్ర సన్యాసిరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సైలాడ సతీష్, ఏపీ స్టేట్ కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ శాసనపురి మధు బాబు, అలాగే యూనిట్ సభ్యులు బోడ చందు ప్రశాంత్ కుమార్, పాడి ఆలయ అధికారులు సుదర్శన, ఇతర సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీపై వైఎస్సార్‌సీపీ రాజకీయాలు మానుకోవాలి
### జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కాళ్ళ జైదేవ్

**ఇచ్ఛాపురం, ఆగస్టు 9, ప్రభాతవార్త :**



మెగా డీఎస్సీ నియామకాలను రాజకీయ వేదికగా మార్చి నిరుద్యోగ యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం బాధాకరమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కాళ్ళ జైదేవ్ పేర్కొన్నారు. డీఎస్సీ ప్రక్రియను అడ్డుకునేందుకు అనేక న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యాయని, వాటిని ప్రభుత్వం కోర్టుల్లో ఎదుర్కొని నియామక ప్రక్రియను కొనసాగించిందని ఆయన అన్నారు. ఇప్పుడు అదే అంశంపై రిలే నిరాహార దీక్షలు చేపట్టడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నంగా కనిపిస్తోందని విమర్శించారు.స్పోర్ట్స్ కోటా నియామకాల విషయంలో దాఖలైన పిటిషన్లపై కోర్టు చేసిన వ్యాఖ్యలు అందరికీ తెలుసని పేర్కొంటూ, రాజకీయ ప్రయోజనాల కోసం కోర్టులను ఆశ్రయించడం సరికాదనే సందేశం వెలువడిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవేళ నిజంగా ఏవైనా అవకతవకలు జరిగాయని ఎవరైనా భావిస్తే, చట్టబద్ధమైన ఆధారాలతో బాధితులు న్యాయపరంగా ముందుకు రావాలని సూచించారు.డీఎస్సీపై సీబీఐ విచారణ కోరుతున్న నాయకులు, ఇతర అంశాల్లో కూడా అదే ప్రమాణాన్ని పాటిస్తున్నారా అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని జైదేవ్ అన్నారు. అసలు వైస్సార్సీపీ కి సీబీఐ అంటే గౌరవం ఉందా? వేల కోట్ల అవినీతి కేసులో పార్టీ అధినేత ఉంటే ఎందుకు సిబిఐ విచారణకి హాజరు కావడం లేదు? ఎందుకు వాయిదాల మీద వాయిదాలు వేస్తూ సిబిఐ ఎంక్వైరీకి సహకరించడం లేదు అనే సమాధానం చెప్పాలని అన్నారు. నిజంగా సిబిఐ మీద గౌరవం ఉంటే బాబాయి హత్య కేసును సిబీఐ ఎంక్వయిరీకి ఎందుకు ఇవ్వలేదని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులు, ఉపాధి కల్పనపై దృష్టి సారించిన సమయంలో, యువత భవిష్యత్తుకు సంబంధించిన డీఎస్సీ అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చడం మంచిది కాదన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావడం ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని, వారి భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా నిర్మాణాత్మక సూచనలు చేయాలని వైస్సార్సీపీ నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నామని కాళ్ళ జైదేవ్ తెలిపారు.

## సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ అమలు చేయాలి

**కవిటి, ఆగస్టు 9, ప్రభాతవార్త :**



కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) రద్దుచేసి పాత పెన్షన్ విధానం (ఓ పి ఎస్) ను అమలు చేయాలంటూ డిమాండ్ చేస్తూ ఏపీ సిపి ఎస్పిఏ డిమాండ్ చేసింది. ఇచ్చాపురం నియోజకవర్గం సమావేశంలో జిల్లా అధ్యక్షులు చల్లా సింహాచలం అధ్యక్షతన జరి గింది. సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం.. గుంటూరులో సమర శంఖం.. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం పలువురు సంఘ ప్రతినిధులు మాట్లాడారు. ఉద్యోగుల జీవిత భద్రతకు పెన్షన్ అత్యంత కీలకమని ఎన్నో సంవత్సరాలు ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగికి పదవీ విరమణ అనంతరం నిశ్చితమైన పెన్షన్ అందడం ఉద్యోగ హక్కు అని స్పష్టం చేశారు. జిల్లా కోశాధికారి ఎల్.శ్యామసుందర్, జిల్లా అధ్యక్షులు బి.శోభన్ బాబు, ఎన్.సోమేశు, శ్రీరామ్ బిసాయి, జానకిరామ్, శంకర్, ఎం.గోపి, ప్రసాద్, అప్పారావు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి మారుపేరు ఎమ్మెల్యే రవికుమార్
### టీడీపీ పట్టణ అధ్యక్షులు సంపదరావు మురళి

**ఆమదాలవలస, ఆగస్టు 9, ప్రభాతవార్త :**

మున్సిపాలిటీలోని ఒకటో వార్డు తిమ్మాపురానికి అధిక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్న ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్, కూన రవికుమార్‌కు వార్డు ప్రజల తరపున అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షులు, ఒకటో వార్డు ఇన్‌చార్జి సంపదరావు మురళి అన్నారు. ఆదివారం తిమ్మాపురంలోని తన స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 27 నెలల కాలంలో తిమ్మాపురం వార్డుకు సుమారు రూ.3 కోట్ల నిధులను ఎమ్మెల్యే కూన రవికుమార్ మంజూరు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. బొబ్బిలిపేట నుంచి తిమ్మాపురానికి 40 అడుగుల వెడల్పుతో రింగ్‌రోడ్డు నిర్మాణానికి రూ.1.40 కోట్ల నిధులు కేటాయించడంతో రవాణా రాకపోకలు సులభతరమయ్యాయని పేర్కొన్నారు. గత వైకాపా హయాంలో తిమ్మాపురం మున్సిపాలిటీలో భాగంగా ఉన్నప్పటికీ అభివృద్ధి జరగక ఇబ్బందులు పడేవారమని, ప్రస్తుతం అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతుండటంతో సంతోషంగా ఉంద న్నారు. తిమ్మాపురం స్మశానవాటికకు రూ.14 లక్షలతో సీసీ రహదారి, రూ.40 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. సంపదరావు భాస్కర రావు, శ్రీకాంత్, ధర్మారావు, అరుణ్ కుమార్, చింతాడ నారాయణరావు, మామిడి రామారావు, పెంకి షణ్ముఖరావు, పాల్గొన్నారు.





**Government of Andhra Pradesh**
**ENDOWMENTS DEPARTMENT**
**E-PROCUREMENT TENDER NOTICE**
**2nd CALL**
Reconstruction of Temple to SRI GRAMADEVATHA TEMPLE, DHARMA LAKSHMIPURAM(V), Saravakota(M), Srikakulam District. NIT No.P/COE/505/2026, Dt:06.03.2026. For further details log onto website https://tender.apeprocurement.gov.in.
For further details contact Ph.7660853661.
EXECUTIVE AUTHORITY
Sri Gramadevatha Temple, Dharma Lakshmipuram(V), Saravakota (M), Srikakulam Dist.

# పిల్లలతో స్నేహం



పిల్లల చలాకీగా ఉంటూసం! అలా కాకుంటే వారిని చలాకీగా ఉంటేటట్లు చేసి పని అమ్మలదే. వారిలో హుషారు కల్పించేటట్లు వ్యవహరిస్తే సరి. బయటి ప్రపంచాన్ని తప్పక పరిచయం చేయాల్సిందే. లేదంటే సామాజిక నైపుణ్యాలు కొరవడతాయి. కాబట్టి.. వీటిని అలవాటు చేయండి. తోటివారితో, తోబుట్టువులతో మాట కలిపేలా ప్రోత్సహించండి. అప్పుడే చిన్న బుర్రలకి బయటి ప్రపంచం పరిచయం అవు తుంది. ఇతరులతో ఎలా మెలగాలి, ఏం మాట్లాడా లన్నదీ వారికి తెలుస్తుంది. క్రీడల్లో వారిని భాగస్వాములను చేయాలి. అందుకోసం స్పోర్ట్స్ అకాడెమీలో వారిని చేర్పించండి. క్రీడలు మానసిక ఎదుగుదలకి దోహదపడతాయి. కొత్త స్నేహితులు పరిచయం అవు తుంటారు. దాంతో కొత్తవారితో మాట్లాడాలంటే బిడియం పోతుంది. తల్లితో తప్ప ఎవ్వరితోనూ పెద్దగా మాట్లాడని చిన్నారులు ఒకేసారి బయట ప్రపంచంలో కలవడం కాస్త కష్టం. ఆ ఇబ్బందిని మీతో పంచుకున్నప్పుడు మీరు దానికి సాను కూలంగా స్పందిం చాలి. లేదంటే ఆత్మన్యూనతకు లోనయ్యే అవకాశం ఉంది. వారు చెప్పే కారణాలకి మీ అనుభవాలను జోడించి స్నేహాన్ని ప్రయతిననంచమని చెప్పాలి. చిన్నపిల్లలకు ఇప్పుడు మనం ఏం చెబితే అదే వారి మనసులో బలంగా నాటుకుపోతుంది. అందువల్ల స్నేహాల్లో ఎటువంటి తారతమ్యం ఉండకూడదని వివరించండి. అప్పుడే భిన్న సంస్కృతులు, సంప్రదాయాల పట్ల వారికి అవగాహన ఏర్పడుతుంది. ▫

# ఉపవాసమే !

డైటింగ్ కోసమో, భక్తి పేరుతోనో అప్పుడప్పుడూ ఓ పూట అయినా ఉపవాసం చేస్తుంటాం. అలానే మన మానసిక ఆరోగ్యం కోసం వారంలో ఓ రోజు ఈ-ఉపవాసమూ చేయమంటున్నారు నిపుణులు. అసలేమిటిది? ఎందుకో తెలుసుకుందాం. ఆ మధ్య మధ్యప్రదేశ్ బేగంగంజ్ ప్రాంతంలో కొందరు జైనులు.. పర్యూషణ్ పర్వ్ సందర్భాన్ని పురస్కరించుకుని ఆ రోజు డిజిటల్ ఫాస్టింగ్ చేశారు. ఆధ్యాత్మిక భావనలో గడిపేశారు. ఆత్మశుద్ధి చేసుకోగల గడం, ఆత్మ పరిశీలనకు అవకాశం కలగడంతోపాటు ఆధ్యాత్మికంగా తమను తాము మెరుగుపర్చుకోవడానికి అవకాశముంటుందని ఈ ప్రయోగం చేశారట.



**అసలేంటిది:** కొన్ని గంటలు లేదా ఓరోజు పూర్తిగా ఎలక్ట్రానిక్ వస్తువులు, గ్యాడ్జెట్లకు దూరంగా ఉండటమే ఈ-ఫాస్టింగ్! దీనివల్ల ఒత్తిడి అదుపులో ఉంటుంది. అశాంతి ఆమడ దూరం పారిపోతుంది. అందుకే, నెలలో కనీసం రెండు రోజులైనా దీన్నిపాటించాలి.

**ఏం చేద్దాం ...** ఈ ఫాస్టింగ్‌కు అలవాటు పడటం అంత సులువేం కాదు. ముందు మీ రోజువారీ అవసరాలేంటి? ఎలక్ట్రానిక్ వస్తువులైన ఫోన్, ల్యాప్ టాప్, స్మార్ట్ వాచ్.. ఇలా ఏదీ లేకుండా ఉండగలమా లేదా? అన్నది గమనించుకోండి. దానికి కొన్ని రోజుల ముందు నుంచే చిన్నగా ఒక్కో అలవాటునీ తప్పించుకోండి. ఉదయం నిద్ర లేవడానికి గడియారంలోనే అలారం పెట్టండి. ఫోన్‌లో కాలక్షేపానికి వినియోగించే అనవసరమైన యాప్స్‌ను తొలగించండి.సామాజిక మాధ్యమ ఖాతాలను సైన్‌అవుట్ చేసేయండి.

**ప్రయోజనాలెన్నో..** నిద్రలేచిన వెంటనే ఫోన్ లేకుండా.. ఆరుబయట అందాలను ఆస్వాదించొచ్చు. నులివెచ్చని సూర్యోదయాన్ని చూస్తూ కాఫీ తాగుతూ ఉల్లాసంగా గడిపేయొచ్చు. చిన్న చిన్న స్ట్రెచ్‌లు, నడక, యోగాసనాలు ప్రయత్నిస్తూ శరీరాన్ని దృఢంగా ఉంచుకోవచ్చు. ◦ ఆపై రోజువారీ ప్రణాళిక చేసుకోవడం, సకాలంలో పనులు పూర్తిచేయడం వంటివన్నీ చకచకా పూర్తయిపోతాయి. ◦ పత్రికలు, మ్యాగజీన్‌లు చదవండి. చుట్టుపక్కల వారితో మాట్లాడండి. ఇవన్నీ మీకో కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తాయి. అదీ లేదంటే ఆసక్తి ఉన్న మరో అంశంపై దృష్టిపెట్టండి. ◦ విరామమో, విశ్రాంతో అంటూ.. గ్యాడ్జెట్స్‌తో గడిపేసిన మీరు కుటుంబానికి తగిన సమయం కేటాయించి ఉండకపోవచ్చు. ఇందుకు ఈ టైమ్‌ని వాడండి. కలిసి భోజనం చేయండి. అంతా కలిసి ఆటలాడండి. ఇవన్నీ మీలో ఆందోళనల్ని దూరం చేస్తాయి. ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి. ▫

# కేశ పాశాల రికార్డు !



'గిన్నిస్ బుక్'లో కెక్కడానికి ఏదీ అనర్హమైనది కాదు. ఏదైనా అదో అద్భుతంగానో, విభిన్నంగానో ఆకర్షణీయంగానో ఉంటే చాలు. అలాంటి ఓ ప్రత్యేకతతో 'గిన్నిస్'లో రికార్డ్స్ తానున్నానంటూ ఓ అమ్మడు పలకరిస్తోంటుంది. మగవలకు కేశాలంకరణ, కురుల సంరక్షణ గూర్చి చిట్కాలు అందించే ఓ యూట్యూబర్ రేణ'ధరియాల్ తానే పొడవాటి కేశాలను పెంచి రికార్డుల్లోకెక్కింది. భారతీయ సంస్కృతిలో కేశాలకు ఎంతో ప్రాధాన్యముంది. కేశ సంరక్షణ లేని ముఖఛాయకు పెద్ద విలువుంటుందని చెప్పడం కష్టం 'జుట్టు అందానికి ప్రతిరూపం' 2015 నుంచి ఒక్కసారి కూడా కత్తిరించకుండా జుట్టును పెంచుతూ, నిగనిగలాడే తైలసాధనాలతో సంరక్షించడంతో తాను 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సు'లో పేరు సంపాదించానని ధరియాల్ చెబుతుంటారు. జుట్టును శుభ్రం చేయటంలోనూ చిక్కులు తీయడంతోనే తనకు రోజంతా సరిపోతుందని అయినా తాను అనుకుననది సాధించానని రేణు ఎగిరి గంతేస్తుంది. అలా ఏ కుర్చీ మీదనో, బల్లమీదనో నిలబడితే తప్ప ఆ కేశాల పొడుగు తెలియడం కష్టం. నేలపై పడకుండా కురులను జాగ్రత్తగా ఎత్తి పట్టుకుంటే తప్ప ఒకచోటి నుంచి మరో చోటుకి వెళ్లాడమూ కష్టమేనంటోంది. భారత్‌కు చెందిన రేణు ధరియాల్ ప్రపంచంలోనే అత్యంత పొడవైన జుట్టు కలిగిన మహిళగా గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించింది. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఆమె జుట్టు పొడవును అధికారికంగా కొలవగా, అది 271.50 సెంటీమీటర్లు (8 అడుగుల 10 అంగుళాలు) ఉన్నట్టు నిర్ధారించారు. దీంతో ఆమె పేరు గిన్నిస్ బుక్‌లో నమోదైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ రికార్డును అధికారులు ధ్రువీకరించారు. అంతకు ముందు, ఉక్రెయిన్‌కు చెందిన అలియా నసిరోవా (257.33 సెం.మీ.) పేరిట ఉన్న పాత రికార్డు బద్దలైంది. ▫

# ప్రీతికరమైన పుష్పాలు

పరమశివుడు భక్తులపట్ల చూపించే వాత్సల్యం అంతా ఇంతా కాదు. ప్రేమతో పూజిస్తే చాలు స్వామి పొంగిపోతాడు. అంకిత భావంతో అభిషేకిస్తే చాలు ఆనందంతో అనుగ్రహిస్తాడు. సదా శివుడికి కొన్ని రకాల పూవులంటే ప్రీతి ఎక్కువ. ఆ పూలతో పూజిస్తే ఆయన సంతోషంతో తన భక్తుల కోరికలను నెరవేరుస్తాడు. మల్లెలు .. విరజాజులు .. గులాబీలు . సంపెంగలు .. పున్నాగలు .. నాగకేసరాలు .. గరికపూలు మొదలైన పూవులతో అర్చిస్తే ఆయన ప్రీతి చెందుతాడు. ఎవరు తమ మనసులో ఏది కోరుకుని పూజించారో వెంటనే ఆ కోరిక నెరవేరేలా చూస్తాడు. అయితే అది ధర్మబద్ధమైన కోరిక అయ్యుండాలి. ఈ పూలతో స్వామిని పూజించడం వలన సమస్త పాపాలు దోషాలు తొలగి పోవడమే కాకుండా, తలపెట్టిన కార్యాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తవు తాయి. ఆయు రారోగ్యాలతో కూడిన ఆనందకర మైన జీవితం లభిస్తుంది. అందువలన పరమ శివుడికి ఇష్టమైన పూలతోనే ఆయన్ని పూజించాలి .. అనునిత్యం ఆయనని సేవిస్తూనే తరించాలి. ▫



# మక్కల ఉప్మా



చిటపట చినుకులు పడుతుంటే.. వేడి వేడిగా, కారం కారంగా ఏదైనా తినాలపిస్తుంది కదూ! మొక్కజొన్న కండెలు కాల్చుకుని, కాస్త ఉప్పు, నిమ్మరసం అద్ది తినాలనిపించ డం కూడా సహజమే! అనేక పోషకాలున్న మొక్కజొన్నను ఏదో రూపంలో తినమని నిపుణులు కూడా చెబుతున్నారు. కాబట్టి కొంచెం ఉప్మా చేసుకుందామా... వీటితో ఉప్మా ఏమిటని ఆశ్చర్యపోతు న్నారా? చాలా రుచిగా ఉంటుంది... ఎలా చేయాలో చూడండి.

**కావలసినవి.** లేత మొక్కజొన్న కండెలు 4 ఉల్లిపాయ 1, పచ్చిమిరపకాయలు రెండు, నూనె 3 చెంచాలు, ఆవాలు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర అరచెంచా చొప్పున, ఎండుమిర్చి 1. కరివేపాకు రెండు రెబ్బలు, కొత్తిమీర గుప్పెడు, ఉప్పు రుచికి సరిపోతుంది

**తయారీ:** ఉల్లి, పచ్చిమిర్చిలను తరిగి ఉం చాలి. మొక్కజొన్న కండెలను కార్న్ కట్టర్తో లేదా చేత్తో గింజలు ఒలుచుకోండి. అవి సుమారుగా రెండు కప్పులు అవుతాయి వాటిని మిక్సీజార్లో వేసి నీళ్లు పోయకుండా పల్స్ బటన్ ప్రెస్ చేసి రెండుసార్లు తిప్పుకోవాలి. ఎక్కువగా తిప్పితే పిండిలా అయిపోతుంది. కొంచెం గింజలు నలిగితే చాలు అప్పుడు రవ్వలా ఉంటుంది. గింజలు మరీ లేతగా ఉంటే కొంచెం ముద్దగా అవుతుంది. మరేమీ పర్వాలేదు కడాయిలో నూనె వేడిచేసి ఆవాలు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, కరివేపాకు, ఎండు మిర్చిలతో తాలింపు వేయాలి. అవి వేగాక.. నిలువుగా కోసిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిరపకాయ ముక్కలు వేయాలి. అవి కాస్త రంగు మారాక మొక్కజొన్న రవ్వ, ఉప్పు వేసి కలిపి, మూత పెట్టేసి సన్నని సెగ మీద కాసేపు మగ్గనివ్వాలి. ఐదు నిమిషాల తర్వాత ఒకసారి మొత్తం కలిపి కొత్తిమీర వేసి మళ్ళీ మూత పెట్టాలి. మెత్తగా ఉడిందను కున్నాక దంచితే.. పోషకాల మొక్క జొన్న ఉప్మా రెడీ! ఇదెంతో ప్రత్యేకంగా ఉంటుంది. ఒకసారి చేసి చూడండి. ▫

# హాయిగా నవ్వేద్దాం !

నవ్వు నాలుగు విధాల చేటు అంటూ ఆడపిల్లల నవ్వులపైనా ఆంక్షలు విధించే **ఆనాటి రోజులు కావివి. నవ్వడమే యోగం, భోగం అంటూ వైద్యులు సూచిస్తోన్న సందర్భాలే ఇప్పుడన్నీ.** ఇదే విషయాన్ని జర్నల్ ఆఫ్ క్లినికల్ సైకాలజీలో ప్రచురితమైన అధ్యయనంతో పాటు మేరీ ల్యాండ్, ఇల్లినాయిస్ విశ్వవిద్యాలయాలు చేసిన పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఈ వివరాల ప్రకారం నవ్వు మవ్వు మహిళల్లో కార్టిసాల్ (ఒత్తిడి హార్మోన్), ఎపినెఫ్రైన్ (ఆందోళన హార్మోన్) స్థాయిలను తగ్గిస్తుంది. హృదయ నాళాల పనితీరునీ మెరుగుపరుస్తుంది. ఒంట్లో ఇమ్యునోగ్లోబులిన్ ఎ(ఐజిఎ) స్థాయిలను పెంచి అంటువ్యాధులతో పోరాడే శక్తినిస్తుంది. డిప్రెషన్‌తో బాధపడుతున్న మహిళల్లో ఆ లక్షణాలనూ తగ్గించ గలదట. నిద్రలేమితో బాధపడుతున్న స్త్రీలతో గాఢనిద్రకు సాయపడుతుందట. అంతేకాదు,



నవ్వు థెరపీలా పనిచేసిమెనోపాజ్ లక్షణాలనూ తగ్గిస్తుందట. మరి ఇన్ని ప్రయోజనాలున్నాయని తెలిశాక నవ్వకపోతే ఎలా? ▫



# 'కపాలి' నుంచి హన్సిక ఫస్ట్ లుక్ రిలీజ్

హీరో రోహిత్ నారా ప్రస్తుతం పోలీస్ నేపథ్యంలో సాగే సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ 'కపాలి'లో నటిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు రామ్ గన్ని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని సప్త అశ్వ మీడియా వర్క్స్ బ్యానర్‌పై కళ్యాణ చక్రవర్తి మంథినా, భాను కిరణ్ ప్రతాప నిర్మించగా, విజయ్ కృష్ణ లింగమనేని సమర్పిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా హన్సిక మోత్వానీ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. హన్సిక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఈ లుక్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇంటెన్స్ లుక్‌లో హన్సిక కనిపిస్తున్న ఈ పోస్టర్.. 'కపాలి' కథలో ఆమె పాత్రకు ఉన్న ప్రాధాన్యతను సూచిస్తోంది. ఆమె చుట్టూ ఉన్న మిస్టీరియస్ ఎలిమెంట్స్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి.

# 12న 'ఇరుముడి' ట్రైలర్



మాస్ మహారాజా రవితేజ మచ్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 21న భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది. సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్‌తోనూ ప్రేక్షకుల్లో ఉత్సాహం పెరుగుతోంది. ఇప్పటికే విడుదలైన 'గ్లింప్స్', పాటలతో ఆసక్తిని రేకెత్తించిన చిత్ర బృందం, ఇప్పుడు థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయడానికి సిద్ధమవుతోంది. ఆగస్టు 12న భీమవరంలో జరిగే భారీ కార్యక్రమంలో 'ఇరుముడి' ట్రైలర్ విడుదల కానుంది. ఈ కార్యక్రమానికి రవితేజ స్వయంగా హాజరుకానుం డటంతో, ఇది సినిమా ప్రచారంలో ఒక కీలక ఘట్టం కానుంది. ట్రైలర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రవితేజ రెండు విభిన్న అవతారాల్లో కనిపిస్తున్నారు. ఒకవైపు నోటిలో గొడ్డలితో మాస్ లుక్‌లో కనిపిస్తుండగా, మరోవైపు అయ్యప్ప మాల ధరించిన ఆధ్యాత్మిక అవతార్‌లో కనిపిస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌లో సినిమా కథలోని భావోద్వేగ, ఆధ్యాత్మిక అంశాలనే ఎక్కువగా ప్రజెంట్ చేశారు. ఇప్పుడు ట్రైలర్ ద్వారా రవితేజ పాత్ర ఏమిటి? ఇతర కీలక పాత్రలతో ఆయన సంబంధం ఎలా ఉంటుంది? అసలు కథను నడిపించే పరిస్థితులు ఏమిటి? అనే విషయాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# 'టాక్సిక్' ట్రైలర్ లాంచ్



ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్' ట్రైలర్ విడుదలైంది. రాకింగ్ స్టార్ యశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ ట్రైలర్.. అధికారం, ప్రేమ, ద్రోహం, ప్రతీకారం చుట్టూ తిరిగే ఓ భారీ గ్యాంగ్‌స్టర్ ప్రపంచాన్ని పరిచయం చేసింది. ఈ కథలో రాయా, అతని కుమారుడు మధ్య ఉండే సంక్లిష్టమైన సంబంధం ప్రధాన భావోద్వేగంగా కనిపిస్తోంది. తండ్రి, కొడుకుల మధ్యే సంఘర్షణకు దారితీసే పరిస్థితులు ఆసక్తిని పెంచుతున్నాయి. మరోవైపు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి పాత్రలు కూడా కథలో కీలకంగా కనిపిస్తున్నాయి. అవార్డు విన్నింగ్ దర్శకురాలు గీతు మోహన్‌దాస్ తనదైన టేకింగ్, విజువల్ స్టైల్‌తో 'టాక్సిక్' ప్రపంచాన్ని పూర్తిగా డిఫరెంట్‌గా రూపొందించినట్లు ట్రైలర్ చెబుతోంది. భారీ యాక్షన్ సీక్వెన్సులు, థ్రిల్లింగ్ మూమెంట్స్, అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్, డార్క్ అండ్ టెక్చర్డ్ విజువల్స్‌తో 'టాక్సిక్' ప్రపంచాన్ని ట్రైలర్ చాలా గ్రాండ్‌గా చూపించింది.

ఇంగ్లీష్, కన్నడ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిన ఈ చిత్రం హిందీ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో డబ్బింగ్ వెర్షన్స్‌లో విడుదల కానుంది. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించిన 'టాక్సిక్' ఆగస్టు 26, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. బెంగళూరులో గ్రాండ్‌గా జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ మాట్లాడుతూ..'ట్రైలర్ అద్భుతంగా ఉంది. యశ్ ప్రతి సినిమాతో ఎదుగుతుండటం నాకు చాలా ఆనందంగా ఉంది. తను అద్భుతంగా ముందుకు వెళ్తున్నాడు. తనకు మరెన్నో విజయాలు రావాలని కోరుకుంటున్నాను' అన్నారు. రాకింగ్ స్టార్ యశ్ మాట్లాడుతూ.. ' ఇది నా సినిమా కాదు.. ఇది ఇండియన్ సినిమా. ఎంతోమంది ప్రతిభావంతులు కలిసి ఈ సినిమాను రూపొందించారు. ఇండియన్ సినిమాను గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పై నిలబెట్టాలనే సంకల్పంతో ఈ సినిమా చేశాం. ఇది చాలా ప్రత్యేకమైన సినిమా. ఈ సినిమా కోసం ఎంతోమంది హార్డ్ వర్క్ చేశారు' అన్నారు. నిర్మాత కెవిఎన్ మాట్లాడుతూ..'కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ ఈ వేడుకకు రావడం మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. చాలా ప్రతిష్టాత్మకమైన సినిమా ఇది. చాలా బోల్డ్ విజన్‌తో తెరకెక్కించిన ఈ సినిమాను దర్శకురాలు గీతు మోహన్‌దాస్ విజన్‌తోనే ఇంత అద్భుతంగా రూపొందించగలిగాం. నయనతార, రుక్మిణి వసంత్, తారా సుతారియా అద్భుతంగా నటించారు. రాకింగ్ స్టార్ యశ్ లేకపోతే ఈ సినిమా సాధ్యపడేది కాదు. ఆయన చాలా ప్యాషన్‌తో, హార్డ్ వర్క్‌తో పనిచేశారు' అన్నారు. హుమా ఖురేషి మాట్లాడుతూ 'నేను ఎక్కడికి వెళ్ళినా ఈ సినిమా గురించే అడుగుతున్నారు. ఈ సినిమాలో భాగం కావడం నాకు చాలా ఆనందంగా ఉంది' అన్నారు. కియారా అద్వానీ మాట్లాడుతూ.. 'ట్రైలర్ చూసిన తర్వాత అద్భుతంగా అనిపించింది. ఈ సినిమాలో నన్ను భాగం చేసిన గీతుకి, యశ్‌కి థాంక్యూ' అన్నారు. రుక్మిణి వసంత్ మాట్లాడుతూ..'చాలా అద్భుతమైన నటీనటులతో కలిసి ఈ సినిమాలో పనిచేసే అవకాశం దొరకడం చాలా ఆనందంగా ఉంది' అన్నారు. నయనతార మాట్లాడుతూ..'టాక్సిక్' నాకు చాలా స్పెషల్ ఫిలిం. నన్ను ఈ సినిమాలో భాగం చేసిన నిర్మాత కేవీఎన్‌కి థాంక్యూ. ఆయనతో కలిసి మరెన్నో సినిమాలు చేయాలని ఉంది. రుక్మిణి, తారా, హుమా, కియారా అందరికీ థాంక్యూ. వారితో కలిసి నటించడం చాలా ఆనందంగా అనిపించింది' అన్నారు. దర్శకురాలు గీతు మోహన్‌దాస్ మాట్లాడుతూ 'కేవీఎన్‌కి థాంక్యూ. ఆయన వల్లే ఈ సినిమా సాధ్యమైంది. మా కోసం ఎక్కడా రాజీ పడకుండా అన్ని సమకూర్చారు. మాపై పెట్టుకున్న నమ్మకానికి ధన్యవాదాలు. మా ప్రొడక్షన్ టీమ్‌కి, డైరెక్షన్ టీమ్‌కి, నటీనటులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు' అన్నారు.

# 'వారణాసి' నుంచి రెండు స్పెషల్ స్టిల్స్



సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'వారణాసి' చిత్రం నుండి రెండు ప్రత్యేక స్టిల్స్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ స్టిల్స్‌తో రుద్ర తన నేచురల్ లుక్‌లో ప్రపంచానికి తొలిసారిగా కనిపించాడు. మొదటి స్టిల్‌లో దట్టమైన అడవి మధ్యలో ఒక వెదురు తెప్పపై విశ్రాంతి తీసుకుంటున్నట్టుగా రుద్ర కనిపిస్తున్నాడు. ఇక ఆ స్టిల్‌ను చూస్తే పాల సంద్రంలో ఆదిశేషుపై సేదతీరే శ్రీ మహా విష్ణువులా కనిపిస్తున్నారు. ఇంకోస్టిల్‌లో కెన్యాలోని మసాయి మారా విశాలమైన మైదానాలకు చెందింది. అక్కడ రుద్ర జిరాఫీలు, వైల్డ్‌బీస్ట్‌ల మధ్య నిలబడి, వెనక్కి తిరిగి చూస్తున్నాడు. ఈ రెండు స్టిల్స్‌ను గమనిస్తే 'వారణాసి' సినిమాలోని సోల్, రుద్ర పాత్ర తీరు గురించి అందరికీ అర్థమయ్యేలా ఉంది. శతాబ్దాలను దాటి ప్రపంచాన్ని చుట్టివచ్చే ఓ వ్యక్తి ప్రయాణంగా సాగే ఇతిహాసం ఇది. ఇందులో ఒక వ్యక్తి అసాధారణ ప్రయాణం అతడిని భారతదేశంలోని పవిత్ర జలాల నుండి భూమి మారుమూల ప్రాంతాలకు తీసుకువెళుతుంది. దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఈ మేరకు పోస్ట్ వేస్తూ.. 'రుద్ర తనకంటే ఎంతో గొప్పదైన, పెద్దదైన ఒక ఉద్దేశాన్ని నెరవేర్చడానికి జన్మించాడు. అతను కోరుకోని విధిని మోస్తున్నాడు. అతను చమత్కారి, సున్నితమైనవాడు, ఉగ్రరూపం దాల్చగలడు. మహేష్ అతనికి తీసుకువచ్చింది అదే. ఉగ్రంగా కనిపించే పాత్రను ఎవరైనా పోషించగలరు. కానీ ఒకేసారి ఉగ్రంగా, సున్నితంగా నటించగలవారు చాలా తక్కువ మంది ఉంటారు. ఈ ఫ్రేమ్‌లు మా ఆఫ్రికా షెడ్యూల్ నుండి తీసుకోబడ్డాయి. ఏ సెట్ ఇవ్వలేని అనుభూతిని ఆ నేల మాకు ఇచ్చింది. కిలిమంజారో చుట్టూ మసాయి మారాలో షూటింగ్ చేస్తున్నప్పుడు నేను నివ్వెరపోయాను. కొన్ని ఉదయాన్నే, మా కళ్ల ముందు ఉన్నదాన్ని 1.43:1 ఐమాక్స్ ఫ్రేమ్ కూడా ఇమడ్చలేదని నాకు అనిపించింది' అని అన్నారు.



# ఘనంగా 'శివ గాడి జిందగీ' మూవీ టైటిల్, సాంగ్

ఐశ్వర్య సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై సింధుసూర్య నిర్మిస్తున్న నూతన చిత్రం 'శివ గాడి జిందగీ'. సచిన్ రామ్ ప్రతాప్, హాసిని దేవరకొండ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి వినయ్ రెడ్డి చందుపట్ల దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను నిర్మాత సురేష్‌బాబు లాంచ్ చేశారు. సాంగ్‌ను అతిథులుగా పాల్గొన్న రీల్‌ఆన్ సీఈఓ దాశరథం బిట్ల, రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్ ప్రిన్సిపల్ పూల సందీప్ కుమార్ నాయుడు, ప్రముఖ జర్నలిస్టు శివ మల్లాల విడుదల చేశారు. చిత్ర యూనిట్‌కు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

కామెడీ, ఎమోషన్, డ్రామా, ఫ్రెండ్‌షిప్, లవ్ వంటి అన్ని రకాల వినోద అంశాలతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఒక సామాన్య మనిషి తన జీవితంలో ఎదుర్కొన్న రకరకాల పరిస్థితులు, సంఘటనలు, భావోద్వేగాల సమాహారంగా ఈ చిత్రం సాగనుంది. ప్రతీ సన్నివేశానికి ఒక బలమైన కారణం, ప్రతీ పాత్రకు ఒక ప్రాధాన్యత, ప్రతీ ఎమోషన్‌కు ఒక అనుబంధం ఉండేలా దర్శకుడు ఈ కథను మలచడం విశేషం.

లాంచ్ కార్యక్రమంలో దర్శకుడు వినయ్ రెడ్డి చందుపట్ల మాట్లాడుతూ "శివ గాడి జిందగీ' అనేది కేవలం ఒక వ్యక్తి కథ మాత్రమే కాదు... ఇది మన సమాజంలోని ప్రతి సగటు మనిషి జీవితానికి ఒక చక్కటి ప్రతిరూపం. జీవితంలో వచ్చే ఎత్తుపల్లాలు, స్నేహం, ప్రేమ, భావోద్వేగాలను చాలా సహజంగా చూపే ప్రయత్నం చేశాం. ప్రతి ఒక్కరినీ ఈ కథ ఆకట్టుకుంటుంది. అలాగే నేను రాసిన పాటను భావయుక్తంగా పాడిన పావని వాసకి, అద్భుతమైన సంగీతాన్ని అందించిన సాయికి నా ప్రత్యేక ధన్యవాదాలు. మా సినిమా టైటిల్, సాంగ్ లాంచ్ కార్యక్రమానికి విచ్చేసి మమ్మల్ని ఆశీర్వదించిన ముఖ్య అతిథులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు" అన్నారు.



నిర్మాత సింధు సూర్య మాట్లాడుతూ "ఐశ్వర్య సినీ క్రియేషన్స్ బ్యానర్‌లో రూపొందుతున్న ఈ సినిమా చాలా ప్రత్యేకమైనది. దర్శకుడు వినయ్ రెడ్డి గారు అనుకున్న కథను చాలా అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. హీరో సచిన్ రామ్ ప్రతాప్, హీరోయిన్ హాసిని దేవరకొండలతో పాటు ప్రతీ నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎంతో కష్టపడి పనిచేస్తున్నారు. జేపీ రెడ్డి గారి ఛాయాగ్రహణం, సాయి గారి సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ప్రేక్షకులందరికీ నచ్చేలా రూపొందుతున్న ఈ చిత్రాన్ని త్వరలోనే మీ ముందుకు తీసుకువస్తాం" అని అన్నారు.

## గో మాఫీయా చీకటి సామ్రాజ్యాన్ని కూలగొట్టేదెవరూ ..!

- ఒడిశా టూ ఆంధ్ర గోవులు తరలింపు
- కాలినడకన వందల్లో మూగజీవాల మల్లింపు
- నిద్రమత్తులో చెక్ పోస్ట్ పోలీసుల క్యాంపు
- పొలిటికల్ లీడర్ల అండతో అధికారులకు లాలింపు



సాలూరు , ప్రభాతవార్త :

గోహత్య మహాపాపం అంటారు కానీ దాన్నే బిజినెస్ గా మార్చుకొని గో మాఫియా ముఠా ఆటలు కట్టించే వారు లేకపోవడంతో ఒడిశా సరిహద్దులు దాటి ఆంధ్ర మీదుగా ఇతర జిల్లాలకు ఇంకా రాష్ట్రాలకు గోవులను అక్రమంగా తరలిస్తున్న గ్యాంగ్ లక్షలు ఇంకా కోట్లల్లో ఆర్జిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే ఈ చికటి వ్యాపార సామ్రాజ్యం వెనుక రాజకీయ పలుకుబడితో అధికారుల కనుసన్నల్లో జరుగుతోందనేది ఓపెన్ సీక్రెట్.అంతేకాకుండా ఎప్పుడైనా సమాచారం మేరకు రవాణాశాఖ ఇంకా పోలీసుశాఖ అక్రమంగా రవాణా చేస్తున్న మూగజీవాలను స్వాధీనం చేసుకొని వాహనాలు సీజ్ చేద్దాం అనుకునే లోపు పైస్థాయి పెద్దల నుంచి"వదిలేయండి" అని బిగ్గర వాయిస్ ఫోన్ కాల్ రావడం తో ఆఫీసర్స్ ఏం చేయలేక కేసుబుక్ చేయని అనేక ఘటణలపై విమర్శలు వినిపిస్తున్నాయి. అందువలన డోంట్ కేర్ గా గోమాఫియా రెచ్చిపోయి యాపారం కోరలుచాస్తుందని చెప్పుకోవచ్చు.ఇది ఇలాఉంచితే గత ఎన్నోఏళ్లుగా ఒడిశా రాష్ట్రంలోని జయపూర్ ఇంకా కొరపుట్ అలాగే సిమిలిగూడ పరిసర ప్రాంతాల నుండి దళారుల పక్కాప్లాన్ తో కూలీలకు రైతులు ముసుగు వేసి ఘట్ రోడ్ లో సుమారు మూడు నుంచి నాల్గు వందలకిలోమీటర్లు పశువులు నడిపించి ఆంధ్రలోకి చొరబడుతున్నారు.ఆ తర్వాత చెక్ పోస్ట్ దాటుకొని ఇప్పుడు జీగిరం వై జంక్షన్ బైపాస్ రోడ్డు వీళ్లకు బాగాకలిసి రావడంతో పబ్లిక్ గా రాంభద్రపురం మీదుగా మూగజీవాలను మానపురం సంతకు అక్రమంగా తరలించడం హైలెట్.అంతే కాకుండా కంటైనర్లు ఇంకా ట్రక్కులు అలాగే మినీ వ్యాన్ లో మూగజీవాలు అక్రమంగా తరలిస్తున్న పేరుకే చెక్ పోస్ట్ తనిఖీలు నిర్వహించి ఏమాత్రం జంకు బొంకు లేకుండా సునాయిసంగా సంతకు తరలించడం గో మాఫియా అక్రమదారులకు ఎంత పెద్ద నెట్వర్క్ ఉందో ఉహించుకొంటే ఒళ్లుగగూర్చు పొడిచేవిషయాలు బయటకు వినిపిస్తున్నాయి.

## అమ్మ సేవా ఫౌండేషన్ వితరణ



మెరకముడిదాం, ఆగస్టు 9, ప్రభాతవార్త:

మెరకముడిదాం మండలం గర్భాం గ్రామం లో కాలు సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న సోమాదుల దుర్గమ్మ కి అమ్మ సేవా ఫౌండేషన్ అండగా నిలిచింది. దుర్గమ్మ పరిస్థితి గురించి తెలుసుకున్న వెంటనే ఫౌండేషన్ సభ్యులు గ్రామానికి వెళ్లి, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు రూ.2,500 ఆర్థిక సహాయం అందించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు విరాళాల సేకరణ చేపట్టింది. ఫౌండేషన్ సభ్యులు మరియు దాతల సహకారంతో మొత్తం రూ.42,075 విరాళాలు సేకరించి ఆదివారం దుర్గమ్మ కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా అమ్మ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు దేవరపు సురేష్ మాట్లాడుతూ, దుర్గమ్మకు మెరుగైన వైద్యం అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. మరో రెండు రోజుల్లో దుర్గమ్మను ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించి, అవసరమైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. దుర్గమ్మకు సహాయం అందించిన ప్రతి దాతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు దేవరపు సురేష్, సభ్యులతో పాటు గ్రామానికి చెందిన పలువురు యువకులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు నైపుణ్య శిక్షణ

శృంగవరపుకోట,ఆగస్టు9,ప్రభాతవార్త..



భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు మెరుగైన భవిష్యత్తు,నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఉచిత ఆన్లైన్ స్కిల్ అప్గ్రేడేషన్ శిక్షణ కార్యక్రమం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు డీసీఎంఎస్ చైర్మన్ గొంప క్రిష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.శిక్షణా కార్యక్రమం ద్వారా ఏఐ,డేటా ఇంట్రీ,ఎలక్ట్రీషన్,ఫిట్టర్, వెల్డర్,కంప్యూటర్ ఆపరేటర్,తదితర విభిన్న రంగాల్లో ఉచిత శిక్షణ పొందే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో నమోదైన కార్మికుల పిల్లలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అభ్యసించాలని గొంప క్రిష్ణ సూచించారు. నైపుణ్య శిక్షణ ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు వారి కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి కూడా దోహదపడుతుందని ఆయన తెలిపారు.శిక్షణ లేదా నమోదు ప్రక్రియకు సంబంధించి లేబర్ కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినప్పుడు అధికారులు కోరిన ఆధార్ కార్డు ఫోటో, సంతకం,అవసరమైన ఇతర పత్రాలను సూచించిన విధంగా అందించి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని గొంపక్రిష్ణ తెలిపారు.

## జడ్పీ చైర్మన్ పదవిని ఆశిస్తున్న జనసేన ఇంచార్జ్ వబ్బిన?



శృంగవరపుకోట,ఆగస్టు9,ప్రభాతవార్త..

రానున్న స్థానిక ఎన్నికల్లో జడ్పీ చైర్మన్‌పదవిని ఎస్.కోట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ ఆశిస్తున్నట్లు సమాచారం.ఈమేరకు వబ్బిన పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలుస్తుంది.జనసేన పార్టీఆవిర్భావంలో వబ్బిన క్రియాశీలక సభ్యులుగా చేరారు.తరువాత అంచెలంచెలుగా ఎదుగుతూ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించిన అధినేతపవన్ కళ్యాణ్ వబ్బినకు ఎస్.కోట నియోజకవర్గ ఇంచార్జ్ గా అవకాశంకల్పించారు.గతంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లోవబ్బినకు ఎటువంటి అవకాశం కల్పించలేదు.అయితే జిల్లాకు చెందిన పాలవలస యశస్వి(జనసేన పార్టీ)నుంచి మాత్రమే రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ గా నామినేటెడ్ పదవి దక్కింది.ఇక వబ్బినకు జిల్లాలోనే జనసేన పార్టీ సీనియర్ నాయకులుగామంచి గుర్తింపు ఉన్నట్లు తెలుస్తోంది.మరి ఈసారైనా స్థానిక ఎన్నికల్లో జిల్లాజనసేన పార్టీ సీనియర్ నాయకులు, ఎస్.కోట నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్‌వబ్బినకు జిల్లా స్థాయిలో జడ్పీ చైర్మన్ గా అవకాశం కల్పిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

## మండలంలో జిల్లా వ్యవసాయ అధికారి పర్యటన

పాచిపెంట, ఆగస్టు 9, ప్రభాతవార్త :



పార్వతిపురం మన్యం జిల్లా వ్యవసాయ అధికారి టి. భవాని శంకర్ పాచిపెంట మండలంలో ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు వ్యవసాయ శాఖ అమలపరుస్తున్న పథకాలు మరియు ఈ పంట నమోదు మరియు కౌలు రైతు కార్డు మరియు ఫార్మర్ ఐడి గురించి గ్రామ వ్యవసాయ సహాయకులకు మండల వ్యవసాయ కార్యాలయంలో సూచనలు అందించారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ గ్రామసహాయకులు విధిగా వ్యవసాయ శాఖ నిర్దేశించిన పనులను కాలపరిమితుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వాటితో పాటుగా ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ లో రైతుల రిజిస్ట్రేషన్ ను చేయాలని ఆదేశించారు. తదుపరి మండలంలో గల ఎరువుల దుకాణాలను సందర్శించి దుకాణాల్లో సక్రమంగా ఎరువులు నిబంధనలు మేరకు అమ్మకాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఎరువుల దుకాణాల్లో లైసెన్స్ లు మరియు స్టాక్ రిజిస్టర్ మరియు స్టాక్ బోర్డును తనిఖీ చేశారు .బలవంతంగా ఏ ఒక్క రైతుకు కూడా లింకు ప్రొడక్ట్స్ అనేది ఇవ్వరాదని డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. తర్వాత గ్రామ వ్యవసాయ సహాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో ఈ పంట నమోదు మరియు ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్లో క్రాప్ మానిటరింగ్ అండ్ ఎవల్యూషన్ తనిఖీ చేశారు. అలాగే ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టా రైతులకు ఫార్మర్ ఐడి (ప్రత్యేక రైతు నెంబర్) అనేది త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ సిబ్బందికి తెలియచేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బందిమరియు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## గ్రీన్ బెల్ట్ ఆధ్వర్యంలో సెంట్రల్ మొక్కలు నాటే కార్యక్రమం

బొబ్బిలి, ఆగస్టు 9, ప్రభాతవార్త:



బ్యాంకు ఫౌండేషన్ డే సందర్భంగా సాహితీ నగర్ లో మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది ఈ కార్యక్రమానికి వైజాగ్ సెంట్రల్ బ్యాంక్ సీనియర్ మేనేజర్, ద్వారకానగర్ బ్రాంచ్ జి భవాని , బొబ్బిలి సెంట్రల్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ చంద్రమౌళి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి బొబ్బిలి డిప్యూటీ తాసిల్దార్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మొక్కలు నాటడం అనేది చాలా ముఖ్యమైన విషయం అని పర్యావరణ పరిరక్షణ విషయంలో గ్రీన్ బెల్ట్ సేవలో అమోఘమని కొనియాడారు స్టేట్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ జి భవాని మాట్లాడుతూ రేపటి తరానికి మొక్కలు పెంచడం అనేది ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని నొక్కి వక్కాణించారు కార్యక్రమంలో గ్రీన్ బెల్ట్ అధ్యక్షులు ఎస్ వి రమణ మూర్తి గ్రీన్ బెల్ట్ సభ్యులు బాలభాస్కరరావు లక్ష్మణరావు,చప్ప అప్పల నాయుడు,మారడాన వెంకట్ నాయుడు, మల్లీశ్వరరావు గంట్యాడ మహేష్, సాహితి నగర్ వాసులు సత్యనారాయణ, శశి భూషణ్,చింతాడ రవి, శ్రీను, అప్పారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీలో అక్రమాలు ఒక్కటైనా చూపించగలిగారా?

కొమరాల, ఆగస్టు 9, ప్రభాతవార్త :



కూటమి ప్రభుత్వం లో విద్యాశాఖామంత్రి నారా లోకేష్ నేతృత్వం లో అత్యంత పారదర్శకంగా, రికార్డు స్థాయిలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డీఎస్సీపై ప్రతిపక్ష నాయకులు చేస్తున్న నిరసనలు అర్ధ రహితమని కొమరాడ మండల తెదేపా కన్వీనర్ రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ ఉదయ శేఖర్ పాత్రుడు అన్నారు. వైకాపా నాయకులు చేస్తున్న ఆరోపణల్లో ఒక్కటంటే ఒక్క బలమైన చట్టబద్ధమైన ఆధారాన్ని కూడా బయటపెట్టలేకపోయిందన్నారు. సాంకేతిక అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఎన్ని కథనాలు అల్లినా, నిరుద్యోగులు గానీ, పరీక్ష రాసిన వేలాది మంది అభ్యర్థులు గానీ వాటిని నమ్మే పరిస్థితులులేవన్నారు.అన్నింటికంటే ముఖ్యంగా,రాజకీయ ఉనికి కోసం చేస్తున్న వివాదం వల్ల వైఎస్సార్సీపీ,ప్రజలు లో ఉపాధ్యాయులు లో తీవ్ర ప్రతికూలతను మూటగట్టుకుంటోందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన దాదాపు 16,347 మంది ఉపాధ్యాయులు, వారి వెనుకున్న వేలాది కుటుంబాలు ఇప్పుడు ప్రతిపక్ష వైఖరిపై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నాయన్నారు. దశాబ్దాల కష్టంతో, పారదర్శకమైన పోటీలో తమ ప్రతిభతో ఉద్యోగాలు సాధిస్తే, తమ అర్హతలను, ఆత్మగౌరవాన్ని పదేపదే శంకిస్తూ పొలిటికల్ మైలేజ్ కోసం వాడుకోవడాన్ని ఉపాధ్యాయ లోకం సహించదన్నారు. రాయలసీమ నుంచి మొదలై కోస్తాంధ్ర వరకు ఈ ఉద్యోగ విజేతలు ఉపాధ్యాయ ఆత్మగౌరవ ర్యాలీలు నిర్వహిస్తా ఉందన్నారు. ప్రజా ఆమోదం లేని ఇలాంటి వ్యర్థ పోరాటాలు ఇకనైనా మానుకోవాలని అని వైయస్ఆర్సిపి నాయకులకు హితవు పలికారు. ఆ పార్టీ చేస్తున్నది ప్రజాపోరాటం కాదని, కేవలం ఒక కుట్రపూరిత తప్పుడు రాజకీయమన్నారు.

## నత్తనడక ఆఖరి సాధారణ సర్వసభ్య సమావేశం



గరుగుబిల్లి ,ఆగస్టు 9, ప్రభాతవార్త :

మండలంలో ఐదేళ్ల పాలన ముగింపు సమయంలో ఆఖరిసారి సాధారణ సర్వసభ్య సమావేశం నత్తనడకన సాగింది. ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అన్ని శాఖల అధికారులు శాఖా పరంగా అభివృద్ధి సంక్షేమం గూర్చి అన్ని విషయాలు తెలియ పర్చితిరి. మండలంలో శివం పంచాయతీ సీమలవాని వలస, కారివలస శిథిలావస్థలో ఉన్న పాఠశాలల గురించి సభ్యులు నిలదీశారు. పదవీకాలం ముగిసిన పనులు జరగలేదని ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నడిమింటి సూర్యనారాయణ, ఈవోపీఆర్డీఎల్ గోపాలరావు, ఉప తహసిల్దార్ టీవీ రమణ, అధికారులతో పాటు ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు.

## కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు

- 57.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం

విజయనగరం(గజపతినగరం), ఆగస్టు 9, ప్రభాతవార్త:



కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం గజపతినగరం నియోజకవర్గం గజపతినగరం మండలంలోని మధుపాడ గ్రామంలో 57 లక్షల 30 వేల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డును మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన రోడ్లు డ్రైనేజీలు నిర్మాణంతో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళులా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారన్నారు. మధుపాడ గ్రామ ప్రజలు పలికిన స్వాగతం, ఆదరణ, ఆత్మీయత బ్రహ్మరథంలా ఉందన్నారు. నిరంతరం గ్రామ అభివృద్ధి కోసం పనిచేసే వారిలో లేంక బంగారు నాయుడు ముందు వరుసలో ఉంటారన్నారు. గత వైకాపా ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టకుండానే లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేయటం జరిగిందని, జగన్ రెడ్డి చేసిన తప్పులకు ఆంధ్ర రాష్ట్రం 30 సంవత్సరాల వెనకబడిపోయిందన్నారు. నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యువ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగానే గజపతినగరంలో వంద పడకల ఆసుపత్రిని తీసుకురావడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ వైద్య సిబ్బంది సైతం ప్రజల మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు.. యువ మంత్రి లోకేష్ యువగళంలో ఇచ్చిన మాట మేరకు 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం దేశ విదేశాలలో అనేక సంస్థలతో, పారిశ్రామికవేత్తలతో మాట్లాడి అనేక పరిశ్రమలను, పెట్టుబడులను తీసుకురావడం జరుగుతుందన్నారు. ప్రస్తుత తరుణంలో ఉన్నతమైన విలువలతో రాజకీయాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జనసేన నాయకులు మరాపు సురేష్ మాట్లాడుతూ ఒక చిన్న గ్రామంలో ఇంత విశాలమైన రోడ్డు వేయటం నాయకుల చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. విబిజి రాంజీ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామాన్ని కూడా సుందరంగా తీర్చిదిద్దుకునే అవకాశం ఉందని ఆ దిశగా ప్రతి ఒక్కరు కూడా కృషి చేయాలి అన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండటం ద్వారా ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన రెడ్ శ్రీనుకి 1 లక్ష 5వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెప్పిన అందజేశారు. కార్యక్రమానికి ముందు ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని, దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మక్కువ శ్రీధర్ , తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై సిబిఐతో దర్యాప్తు చేపట్టాలి : శంబంగి



రామభద్రపురం, ఆగస్టు 9,ప్రభాత వార్త :

ఉపాధ్యాయ నియామక పరీక్ష నిర్వహణలో తీవ్రమైన అక్రమాలు చోటుచేసుకున్నాయని, దీనికి సంబంధించి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ ఎమ్ ఎల్ ఏ సంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు అన్నారు ఈయన వైసిపీ కార్యాలయంలో సభ్యులు రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన నిరసనలు, రిలే నిరాహార దీక్షలు ముగిశాయి. ఈ సందర్భంగా రామభద్రపురం మెయిన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన్న అప్పలనాయుడు మాట్లాడుతూ డీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీ, మెరిట్ జాబితాల్లో అక్రమ మార్పులు, నియామక ప్రక్రియలో జరిగిన తీవ్ర లోపాలపై సమగ్ర విచారణ జరిపించాలని, దీని వెనుక ఉన్న అసలు దోషులను తేల్చేందుకు సీబీఐ సిబిఐతో దర్యాప్తు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్లు, నిరుద్యోగ భృతి తదితర పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు తిరక్కముందే ప్రజల వ్యతిరేకతను మూటగట్టుకుందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేసే వరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మండల అధ్యక్షులు చొక్కాపు లక్ష్మణరావు, జడ్పిటిసి అప్పికొండ సరస్వతమ్మ వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సంబంగి వేణుగోపాలరావు మండల జేఏసీ కన్వీనర్ చింతలసింహాచలం నాయుడు మండల యూత్ అధ్యక్షులు పత్తిగుల్లా ఏకనాథ్, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ డబ్బ్యూ రాయులు. నాయుడు వలస సర్పంచ్ ఎక్స్ ప్రతినిధి నడిమింటి సత్యం.డి. పైడిరాజు మండలంలో ఎక్స్ సర్పంచ్లు ఎంపీటీసీలు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనసేన నేత గురానను పరామర్శించిన ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, ఆగస్టు 9, ప్రభాతవార్త:



విజయనగరం పట్టణంలో శుక్రవారం నాడ గురాన అయ్యలు ఇంటిపైకి చొరబడి కొందరు దుండగులు వారిపై దాడికి పాల్పడ్డారు.. ఓ ఆలయ వివాదం నెపంతో వైసీపీ నాయకులు ప్రోద్భలంతోనే ఈ దాడికి వారు తెగబడ్డారని ఆరోపణ.. గౌరవ శాసనసభ్యులు ఆర్. వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) గురాన అయ్యలు ని వారి స్వగృహమందు పరామర్శించడం జరిగింది.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా 14న

నెల్లిమర్ల, ఆగస్టు 9, ప్రభాతవార్త

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రెడ్ ఆక్స్ లేబరేటరీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 14వ తేదీ ఉదయం 10 గంటల నుండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. కె. రేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మా రంగానికి చెందిన దిగ్గజ కంపెనీలైన డాక్టర్ రెడ్డీస్, అరబిందో, హెటోరో, భారత్ బయోటెక్, వంటి 20 సంస్థల హెచ్. ఆర్.లు వచ్చి ఫార్మా యొక్క ప్రాముఖ్యతను, ఉద్యోగ అవకాశాలను, ఉద్యోగంలో స్థిరపడడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించి, వ్రాత పరీక్షను నిర్వహించి, అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఎంపిక ప్రక్రియ అనంతరం మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి, తదుపరి వివిధ సంస్థల్లో నియమిస్తారన్నారు . శిక్షణా కాలమందు ఉచిత నివాసము, భోజన వసతి పూర్తిగా రెడ్ ఆక్స్ లాబరేటరీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్. పి.దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తారని తెలిపారు అభ్యర్థులు 21-24 సంవత్సరంల మధ్య వయసు కలిగిన వారు, ఐటిఐ, ఇంటర్మీడియట్,డిగ్రీ, ఇంజనీరింగ్ అర్హతలు కలిగిన వారు హాజరుకావాలని ఆమె సూచించారు. ఇటువంటి జాబు మేళా కార్యక్రమం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించడం ఆనందంగా ఉందని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని తెలియజేశారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త 25

## చెరువుల అక్రమాలపై జిల్లా అధికారులు చర్యలెక్కడా ..!

సాలూరు ,ఆగస్టు 9, ప్రభాతవార్త :



బావితరాలకు నీరు సమకూర్చే తటాకాలు(చెరువులు) అక్రమ దారులు కబ్జా చేస్తూ బహుళ అంతస్తులు నిర్మిస్తుంటే జిల్లా కలెక్టర్ అలాగే సబ్ కలెక్టర్ చోద్యం చూసుకున్నారని జనసేన నాయకుడు అడ్వకేట్ రేగు మహేష్ విమర్శించారు.ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతు సాలూరు పరిసర ప్రాంతాలలో 42 చెరువులు ఉండగా ఐదు చెరువులను ఆక్రమదారులు పూర్తిగా ఆక్రమించుకొని పక్క భవనాలు నిర్మించుకున్నా రన్నారు.దీనిపై ఉన్నతాధికారులు నోటీసులు ఇచ్చిన కబ్జాదారులు బేకాతరు చేయడంతో రేగు మహేష్ సోమవారం 3వతేదీ గ్రీవెన్స్ లో కంప్లైంట్ చేశారు. అలాగే రాణీగారి చెరువు,పేరసాగరం,వడ్డాదికోనేరు, డబ్బివీధిచెరువు ఇంకా వేద సమాజం దగ్గర ఉన్న చెరువు ఎకరా 80 సెంట్లు కబ్జాకి గురైన ఆక్రమదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం దీనిపై అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంపై జిల్లా అధికారులు దృష్టికి తీసుకువెళ్లట్టుగా స్పష్టం చేశారు.అదేవిధంగా కబ్జా కి గురి అయిన చెరువుల స్థలాల్లో భవనాలు ఇల్లు నిర్మించుకున్నందుకు కరెంట్ సప్లై ఇచ్చిన ఎలక్ట్రిసిటీ అధికారులపైన ఇంకా రెవెన్యూ డిపార్ట్మెంట్ అలాగే నోటీసులిచ్చిన మున్సిపల్ అధికారులు ఇంకా ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారుల పైన తక్షణమే సబ్ కలెక్టర్ ఎంక్వయిరీ జరిపించి ఆక్రమదారుల ఆటలు కట్టించాలని కోరారు.అంతేకాకుండా కబ్జాదారులపై ఎటువంటి యాక్షన్ తీసుకొని లేని ఎడల చెరువుల ఆక్రమనపై హైకోర్టులో రిట్ పిటిషన్ వేస్తానని అడ్వకేట్ రేగు. మహేశ్వరరావు స్పష్టం చేశారు.

## భట్రాజుల సంఘం జిల్లా కమిటీల ఏర్పాటుకు చర్యలు

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రాజు వెల్లడి

విజయనగరం, ఆగస్టు 9, ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ భట్రాజుల సంఘం జిల్లా కమిటీలు ఏర్పాటు చురుగ్గా సాగుతోందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రాజు వెల్లడించారు. కోనసీమ జిల్లా కొత్తపేట మండలం శ్రీ ధనమ్మ తల్లి మర్రి దగ్గిర ఆదివారం జరిగిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర భట్రాజు సంగం ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా విశిష్ట సేవా రత్న అవార్డు గ్రహీత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఫకీర్ రాజు తో కలిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్రాజుల సంక్షేమ సంఘాన్ని అన్ని జిల్లాలలో పటిష్ట పరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కోనసీమ జిల్లా అధ్యక్షులు గా చింతా నాగరాజు , తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు గా చుక్కన సుబ్బరాజు (తాతాజీ) , కాకినాడ జిల్లా అధ్యక్షులు గా పెంటపాటి రామకృష్ణ రాజు (రాంబాబు) లతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.మిగతా జిల్లాల కార్యవర్గం త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు సతీష్ రాజు వెల్లడించారు.

## తలారిలో రూ. 10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం

లక్కవరపుకోట, ఆగస్టు 9, ప్రభాత వార్త :



ఎల్.కోట మండలం తలారి గ్రామంలో ఎన్ ఆర్ ఈ జీ ఎస్ నిధులు రూ. 10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్థులు, నాయకులు, మహిళలు పీ ఏ సి ఎస్ చైర్మన్ మారోతు రామారావు గుమ్మడి ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి సీసీ రోడ్డును ప్రారంచారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రతీ గ్రామంలోనూ మౌలిక వసతుల కల్పనకు, రవాణా సౌకర్యాల మెరుగుదలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, ఎదురవుతున్న సమస్యలను విడతలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండల స్థాయి ప్రజాప్రతినిధులు కరెడ్ల ఈశ్వరరావు , వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## టీడీపీ పాలనలోనే పేదల బతుకుల్లో వెలుగు



గరివిడి, ఆగస్టు 9, ప్రభాత వార్త:

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వంమే పేదల బతుకుల్లో వెలుగు నింపిందని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట రావు అన్నారు. టిడిపి రెండేళ్ల పాలన లో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు వివరించడం లో బాగంగా నిర్వహించే ఇంటి ఇంటి కి టిడిపి కార్యక్రమం ఆదివారం వెదుళ్ళవలస లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కిమిడి ప్రజల తో మమేకమయ్యారు.కరపత్రాలు పంచి వారికి పథకాలు వివరించారు. ప్రజా సంక్షేమమే చంద్రబాబు నాయుడు ద్యేయమని ఆయన అన్నారు.ప్రభుత్వ ఫలాలు ప్రజలకు చేరువ చేసేది టిడిపి ఒక్కటే నని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి పైల బలరాం,మండల టిడిపి అధ్యక్షుడు ఎస్.సురేష్, మండల నాయకులు బలగం వెంకట రావు, మన్నెపురి సూర్యనారాయణ, వెంపడాపు రమణ మూర్తి, శీరపు శ్రీను,గొట్టిముక్కల సత్తిరాజు,మహంతి రమణ మూర్తి , తదితరులు పాల్గొన్నారు.

## క్రెడిట్ చోరీ పనులు ఆపండి : మాజీ డీసీఎం పుష్ప శ్రీవాణి

కురుపాం ,ఆగస్టు 9,ప్రభాతవార్త :



తమ ప్రభుత్వములో చేపట్టి పూర్తి చేసిన పనులను తాము చేశామని చెప్పుకుంటు ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నా కూటమి ప్రభుత్వం పనులకు సిగ్గుచేటు అనిపిస్తుందని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణి అన్నారు . ఆదివారం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా నిర్మించిన భవనాల వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ. గిరిజన ప్రజలకు ఎంతో ముఖ్యమైన కురుపాం, భద్రగిరి ఆసుపత్రులు కు వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో తాను డిప్యూటీ సీఎం గా ఉన్న సమయంలో 50 పడకలగారూపొందించి ఆసుపత్రిలకు నూతన భవనాలు సుమారు 12 కోట్ల రూపాయలు మంజూరు చేసి శంకుస్థాపన చేశాన ని ఆమె అన్నారు. భవనాలు పూర్తయి ప్రారంభోత్సవ సమయానికి ఎన్నికలు కోడ్ రావడంతో ప్రారంభోత్సవం చేయలేకపోయామని ఆమె అన్నారు.

## పోలీసుల అదుపులో బ్యాటరీల దొంగతనం నిందితులు

వేపాడ, ఆగస్టు9, ప్రభాతవార్త:

మండల పరిధిలోని బొద్దాం, పాటూరు, జాకేరులో దొంగలించబడిన ఐదు ట్రాక్టర్ల బ్యాటరీలను నిందితుల నుంచి రికవరీ చేసి అదుపులోకి తీసుకున్నట్టు వల్లంపూడి ఎస్సై ఎస్. సుదర్శన్ ఆదివారం విలేకరులకు తెలిపారు. పాటూరు గ్రామానికి చెందిన పల్లి వేణుగోపాల్ ఇటుక బట్టి వద్ద పార్క్ చేసిన ట్రాక్టర్ బ్యాటరీను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినారని ఈనెల ఆరవ తేదీన ఫిర్యాదు చేశారని తెలిపారు . అలాగే బొద్దాం , జాకేరు గ్రామాల్లో కూడా నాలుగు ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ జరిగినట్టు ఫిర్యాదు చేశారని తెలిపారు ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ఆదివారం తన సిబ్బందితో కలిసి పాటూరు జంక్షన్ వద్ద బొద్దాం గ్రామానికి చెందిన సయ్యద్ అబ్దుల్లా, గుడిస తిరుపతిరావు , జనపరెడ్డి మోహన్ అనువారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి ఐదు ట్రాక్టర్ బ్యాటరీలను రికవరీ చేసినట్టు ఎస్సై తెలిపారు.

## వైసిపి నిరసన ర్యాలీకి తరలిరావాలి



నెల్లిమర్ల, ఆగస్టు 9, ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా ఈనెల 10వ తేదీ సోమవారం నాడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన శాంతి ర్యాలీ ని విజయవంతం చేయాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు కోరారు. నెల్లిమర్లలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.కూటమిప్రభుత్వంలో డీఎస్సీలో జరిగిన అక్రమ ఉద్యోగాలను. సిబిఐతో విచారణ జరిపించాలని. మంత్రి లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని. అర్హులైన వారిని ఉద్యోగాల్లో నియమించాలని కోరుతూ ఈ శాంతి ర్యాలీ తలపెట్టినట్లు తెలిపారు. మాజీ శాసనసభ్యులు, సమన్వయకర్త బడ్డు కొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జర జాపుపేట శ్రీ రాజభంగారమ్మ గుడి వద్ద నుండి మొయిద జంక్షన్ వరకు జరుగు శాంతి ర్యాలీలో నెల్లిమర్ల నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వివిధ హెదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని శ్రీనివాసరావు కోరారు.

10-8 Pg10.qxdO/P:10-8 Pg10.qxd 1/1/02 7:12 AM Page 1



# 13 మంది స్టార్లు ఔట్

## టీమిండియాకు ఊహించని షాక్

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ రేసులో భారత్‌కు అత్యంత కీలకమైన శ్రీలంక పర్యటన ప్రారంభానికి ముందే గాయాల సమస్య రూపుదిద్దుకుంది. శ్రీలంకతో జరగబోయే కీలకమైన టెస్టు సిరీస్ ముందు ఒకరు కాదు, ఇద్దరు కాదు ఏకంగా 13 మంది భారత ఆటగాళ్ళు గాయాల బారిన పడ్డారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో సహా జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా లాంటి స్టార్ ప్లేయర్లు దూరం కావడంతో భారత్ క్రికెటన కంట్రోల్ బోర్డు తీవ్ర ఒత్తిడిలో పడిపోయింది. ఈ నెల 15 నుంచి రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుండగా, భారత క్యాంప్‌లో తీవ్ర ఆందోళన నెలకొంది. లంక ఎలెవన్‌తో జరుగుతున్న ప్రాక్టీస్ మ్యాచ్‌కూ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వేలి గాయం వల్ల దూరమయ్యాడు. అతని స్థానంలో కేఎల్ రాహుల్ జట్టు బాధ్యతలను భుజాన వేసుకున్నారు. టీమిండియా మేనేజ్‌మెంట్‌ను ఇది కోలుకోలేని దెబ్బగా మారింది. గాయపడిన 13 మంది ఆటగాళ్ళు ప్రస్తుతం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్‌సిఎ)లో పునరావాసం పొందుతున్నారు. వీరిలో స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా మోకాలి గాయంతో బాధపడుతుండగా, హార్దిక్ పాండ్యా తొడ కండరాల గాయంతో మైదానానికి దూరమయ్యారు. ఆకాష్ దీప్ వెన్నుముకలో స్ట్రెస్ ఫ్రాక్చర్, రియాన్ పరాగ్ కుడి చేతి మణికట్టు గాయంతో కోలుకుంటున్నారు. నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా హ్యామ్‌స్ట్రింగ్ సమస్యలతో ఇబ్బంది పడుతుండటంతో మ్యాచ్ ఎంపికలకు దూరమయ్యారు. వరుణ్ చక్రవర్తి, సుయాష్ శర్మ, అశోక్ శర్మ, యుధ్‌వీర్ సింగ్, హిమాంశు సింగ్ సైతం వేర్వేరు గాయాలతో చికిత్స పొందుతున్నారు. శ్రీలంక టెస్టు సిరీస్‌కు ఎంపికైన యువ బ్యాటర్ సాయి సుదర్శన్ కాలి వేలి ఫ్రాక్చర్ నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. దీంతో అతడు ఈ సిరీస్ మొత్తానికి దూరం కానున్నట్లు సమాచారం వస్తోంది. అయితే దీనిపై బిసిసిఐ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వాషింగ్టన్ సుందర్ అందుబాటుపై కూడా ఇంకా అనుమానాలు తొలగిపోలేదు. ఇంతమంది ముఖ్యమైన ఆటగాళ్ళు ఒకేసారి గాయాల బారిన పడటం జట్టు ఎంపికను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ముఖ్యమైన టెస్టు సిరీస్ ముంగిట ప్రధాన ఆటగాళ్ళు మైదానానికి దూరం కావడం భారత జట్టుకు పెద్ద ఎదురుదెబ్బే. ఎన్సిఏలో చికిత్స పొందుతున్న ఆటగాళ్ళు ఎంత త్వరగా కోలుకుంటారో వేచి చూడాల్సి ఉంది.



### లెక్సింగ్టన్ ఓపెన్‌లో ఛాంపియన్స్‌గా

# నికి, ఎస్కోబార్ జోడీ

**న్యూఢిల్లీ:** ఏటీపీ ఛాలెంజర్ 75 టోర్నమెంట్ అయిన లెక్సింగ్టన్ ఓపెన్ 2026లో, భారత్‌కు చెందిననికి కలియంద పూనాచా- ఈక్వెడార్‌కు చెందిన గొంజలో ఎస్కోబార్ జోడీ అద్భుతమైన పునరాగమనం చేసి, అమెరికన్ జోడీ ఆండ్రీ ఇలగన్-కార్ల్ పోలింగ్‌లను ఓడించి పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఆదివారం కెంటకీలోని లెక్సింగ్టన్‌లో ఒక గంట 42 నిమిషాల పాటు జరిగిన ఫైనల్‌లో, మూడవ సీడ్ జంట పూనాచా ఎస్కోబార్ 6-7 (1), 6-3, 11-9 తేడాతో విజయం సాధించింది. పూనాచా-ఎస్కోబార్ భాగస్వామ్యంగా గెలిచి ఛాంపియన్‌గా నిలిచిన మొట్టమొదటి ఛాలెంజర్ టైటిల్ కూడా ఇదే. తొలి సెట్‌లో పూనాచా-ఎస్కోబార్ నాలుగో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి బలమైన ఆరంభాన్ని ఇచ్చారు. అయితే, ఏడో గేమ్‌లో తిరిగి బ్రేక్ చేసి ఇలాగన్ మరియు పోలింగ్ సెట్‌ను సమం చేశారు. ఆ తర్వాత అమెరికన్లు టైబ్రేక్‌లో ఆధిపత్యం చెలాయించి, దానిని 7-1 తేడాతో గెలుచుకున్నారు. భారత ఈక్వెడార్ ద్వయం రెండవ సెట్‌లో బలంగా పుంజుకుని, మూడవ గేమ్‌లోనే తొలి బ్రేక్ సాధించి ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. తొమ్మిదవ గేమ్‌లో మళ్లీ విజృంభించి మ్యాచ్‌ను సూపర్ టైబ్రేక్‌కు తీసుకువెళ్లారు. నిర్ణయాత్మక మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఏ జట్టు కూడా రెండు పాయింట్లకు మించి ఆధిక్యాన్ని సాధించలేకపోయింది. పూనాచా-ఎస్కోబార్ 7-9తో వెనుకబడి ఓటమి అంచున నిలిచినా చివరి నిమిషాల్లో నిర్ణయాత్మకమైన పుంజుకోవడంతో వరుసగా నాలుగు పాయింట్లు గెలుచుకుని, ఆ క్రమంలో రెండు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు.



## ఆట





### వరల్డ్ ఛాంపియన్‌షిప్..

# హైజంప్‌లో బసంత్ రజతం

### లాంగ్‌జంప్‌లో షానవాజ్ కాంస్యం

**న్యూఢిల్లీ:** ప్రపంచ అండర్20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత జంపర్లు మరో రెండు పతకాలను జోడించారు. అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రం, యూజీన్‌లో జరుగుతున్న ఈ ఛాంపియన్‌షిప్‌లో బసంత్ హైజంప్‌లో రజత పతకం సాధించి భారతదేశానికి మొట్టమొదటి పతకాన్ని అందించగా, షానవాజ్ ఖాన్ కాంస్య పతకం గెలుచుకొని ఈ పోటీలో పతకం సాధించిన తొలి పురుష లాంగ్ జంపర్‌గా నిలిచాడు. బసంత్ తన రెండవ ప్రయత్నంలో తన వ్యక్తిగత అత్యుత్తమమైన 2.21 మీటర్లను సమం చేసి, కౌంట్‌బ్యాక్ ఆధారంగా అల్జీరియాకు చెందిన యూనెస్ అయాచి (2.21 మీటర్లు) వెనుక ఫైనల్‌లో రెండవ స్థానాన్ని పొందాడు. ఈలోగా, షహనవాజ్ తన అత్యుత్తమ ఫామ్‌ను కనుగొనలేకపోయినప్పటికీ, తన మూడవ ప్రయత్నంలో 7.84 మీటర్లు దూకి, యూజీన్‌లో డేనియల్ ఇంజోలి (ఇటలీ) మరియు మేసన్ మెక్‌గ్రోడర్ (ఆస్ట్రేలియా)ల వెనుక టాప్ 3 స్థానాన్ని ఖరారు చేసుకున్నాడు. అంతకుముందు జరిగిన క్వాలిఫైయింగ్ రౌండ్‌లోని హీట్ 1లో మూడో స్థానంలో నిలిచిన భారత మహిళల 4x400 మీటర్ల రిలే జట్టు ఫైనల్‌కు చేరుకుంది. భూమికా నేహాతే, తహురా ఖతున్, తనూ చౌదరి, థియా ఆరుముగమ్‌ల క్వార్టెట్ 3:39.53 సెకన్లతో స్లోవేకియాను ఓడించి హీట్ 1లో 3వ స్థానంలో నిలిచింది.

# కొరియా మాస్టర్స్‌లో అష్మితకు టైటిల్

**న్యూఢిల్లీ:** కొరియా మాస్టర్స్ సూపర్ 300 ఈవెంట్‌లో అష్మిత చలిహా మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుని, బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సర్క్యూట్‌లో తన తొలి టైటిల్‌ను గెలుచుకుంది. ఆదివారం నాడు 53 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో, 26 ఏళ్ల క్రీడాకారిణి వెనుకబడి ఉన్నప్పటికీ పుంజుకుని నాలుగో సీడ్ చైనీస్ షట్లర్ హాన్ కియాన్ క్సీని 14-21, 21-14, 21-14 తేడాతో ఓడించింది. చాలిహా మ్యాచ్‌ను బాగా ప్రారంభించి, తొలి గేమ్‌లో 9-5 ఆధిక్యం సాధించింది. కానీ మిడ్‌గేమ్ తర్వాత ఆమె నియంత్రణ కోల్పోవడంతో, హాన్ ఆ గేమ్‌ను 21-14 తేడాతో గెలుచుకుంది. ఆమె రెండవ గేమ్‌ను మరింత మెరుగ్గా ఆడింది. ఈసారి తన ఆధిక్యాన్ని చేజార్చుకోకుండా, గేమ్‌ను 21 -14తో ముగించి, నిర్ణయాత్మక గేమ్‌కు దారితీయడం ద్వారా తన తొలి టైటిల్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. హోరాహోరీగా సాగిన నిర్ణయాత్మక గేమ్‌లో, చివరి మధ్యంతర విరామ సమయానికి హాన్ 11-9 స్వల్ప ఆధిక్యంలో ఉంది, కానీ ఆ తర్వాత అష్మిత వరుసగా ఆరు పాయింట్లు గెలుచుకుని, చివరికి 21-14 తేడాతో గేమ్‌ను కైవసం చేసుకుంది. భారత మహిళల సింగిల్స్ ఈ ఏడాది అత్యుత్తమ సంవత్సరాలలో ఒకటిగా నిలుస్తోంది. దేవికా సిహాగ్, తన్వి శర్మ, అష్మిత, పివి సింధు వంటి విభిన్న క్రీడాకారిణులతో ఇప్పటికే నాలుగు టైటిళ్లను గెలుచుకుంది. మొత్తంగా, ఈ ఏడాది ఈ సర్క్యూట్‌లో భారతదేశానికి ఇది ఐదవ టైటిల్.



### శ్రీలంక వామప్ మ్యాచ్‌లో..

# భారత్ ఘన విజయం

**న్యూఢిల్లీ:** శ్రీలంక పర్యటన భారత్ ఘనంగా ప్రారంభించింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సన్నాహకంగా శ్రీలంక ఎలెవన్‌తో జరిగిన మూడు రోజుల వామప్ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆదివారం నాడు జరిగిన మూడో రోజు ఆటలో ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో 207 పరుగుల లక్ష్య ఛేదనలో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్ నిర్ణీత 45 ఓవర్లలో 4 వికెట్లకు 214 పరుగులు చేసి గెలుపొందింది. యశస్వి జైస్వాల్(61) హాఫ్ సెంచరీతో రాణించగా, శుభ్‌మన్ గిల్(44), మహమ్మద్ సిరాజ్(32 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో కేశర నువాంత(2/57)రెండు వికె ట్లుతీయగా, విశ్వ ఫెర్నాం డో, రమేష్ మెండిస్ తలో వికెట్ తీసారు. భారత్ విజ యానికి ఆఖరి 6 బంతుల్లో 16 పరుగులు అవసరమ య్యాయి. క్రీజులో టెయిలెం డర్ సిరాజ్‌తో పాటు, సరాన్ష్ జైన్ ఉండటంతో విజయం కష్టమేనని అంతా అనుకున్నారు. కానీ సిరాజ్ అనూహ్యంగా హ్యాట్రిక్ సిక్స్‌లు బాది విజయాన్ని అందించాడు. లంక జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు నష్టానికి 200 పరుగులు చేసి టీమిండియా ముందు 207 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. నిషాన్ మధుష్క (63) అర్ధ సెంచరీతో రాణించగా, అంజల బండార (35), నిపున్ ధనంజయ్ (46)తో రాణించారు. భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 357 వద్ద డిక్లేర్ చేసింది. పడిక్కల్ (142 నాటౌట్), రవీంద్ర జడేజా (63), రాహుల్ (40), మానవ్‌సుతార్ (41), గుర్నూర్ బ్రార్ (36 నాటౌట్), సరాన్ష్ జైన్ (22) స్కోరు చేశారు. దీని ముందు లంక తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు నష్టానికి 363 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. నిషాన్ మధుష్క (66), రవిందు రాషాంత (71), సోనల్ దినుష (52) రాణించారు.



### కృత్రిమ మేధతో భారత్‌లో

# ఉద్యోగ సృష్టి ఎక్కువే




**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తరణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా టెక్ కంపెనీల్లో వేలాది ఉద్యోగాల కోతలు జరిగాయి. వరుసగా లేఆఫ్స్ ప్రకటిస్తున్నా భారతీయ ఉద్యోగ మార్కెట్ పై దీని ప్రభావం భిన్నంగా ఉందని గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ నోమురా వెల్లడించింది. భారత్‌లో ఎఐ కారణంగా కోల్పోయిన ఉద్యోగాలకంటే ఎఐ ఆధారిత టెక్నాలజీల వల్ల కొత్తగా సృష్టిస్తున్న ఉద్యోగాల సంఖ్యే ఎక్కువగా ఉందని నోమురా తన నివేదికలో స్పష్టం చేసింది. లేఆఫ్స్‌తో పోలిస్తే భారత్‌లో ఎఐ నియామకాలు దాదాపు 3 రెట్లు ఉన్నట్లు నోమురా నివేదిక పేర్కొంది. 2022 నుంచి 2026 ఆగస్టు వరకు చూసుకుంటే భారతీయ కంపెనీలు ఎఐ కారణంగా 31,921 మందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి. ఇదే సమయంలో 83,100 ఎఐ ఆధారిత కొత్త నియామకాలు చేపట్టినట్లు నివేదిక తెలిపింది. ఎఐ చాట్‌బాట్లను వినియోగించడంతో చాలా కంపెనీలు తమ సపోర్ట్ టీమ్స్‌లో కోతలు చేపట్టినట్లు తెలిపింది. ఎఐ ఆధారిత డిమాండ్‌ను భర్తీ చేసేందుకు ఐటీ సేవల గ్రాడ్యుయేట్ల నియామకాలు పెరిగినట్లు తెలిపింది. ఎఐ విధానాలతో ఇండియా, సౌత్ కోరియా వంటి దేశాల్లో రెండంచెల కార్మిక మార్కెట్ సృష్టి జరిగిందని నోమురా అంచనావేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఎంట్రీ లెవెల్ ఉద్యోగాలకు డిమాండ్ తగ్గినావ్యాపార కార్యకలాపాల్లో అనుభవజ్ఞులైన ఉద్యోగులకు అవకాశాలు మెరుగుపడు తున్నాయని తెలిపింది. గడిచిన నాలుగు సంవత్సరాల్లో ఆసియా వ్యాప్తంగా 1.3 లక్షలకు పైగా ఎఐ ఆధారిత నియామకాలు జరిగాయని తెలిపింది. ఇందులో 90 శాతం టెక్నాలజీ రంగంలోనే ఉన్నాయని పేర్కొంది. ఆసియా కంపెనీలు గత నాలుగేళ్లలో 60,654 ఉద్యోగులను తొలగించాయని, అందులో 60 శాతం ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగంలోనే ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

# 4.5 బిలియన్ డాలర్ల షేర్ బైబాక్

## బెర్క్‌షైర్ వ్యూహాల్లో మార్పులు




**న్యూయార్కు, ఆగస్టు 9:** వారెన్ బఫెట్ నుంచి గ్రెగ్ అబెల్ చేతుల్లోకి వచ్చిన తర్వాత బర్క్‌షైర్ హాత్‌వే వ్యూహంలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఈ యేడాది రెండో త్రైమాసికంలో సుమారు 4.5 బిలియన్ డాలర్ల విలువైన సొంత షేర్లను తిరిగి కొనుగోలు చేసింది. 2021 తర్వాత ఒక త్రైమాసికంలో బర్క్‌షైర్ చేపట్టిన అతిపెద్ద షేర్ బైబ్యాక్ ఇదే. జూన్‌తో ముగిసిన మూడు నెలల్లో కంపెనీ నిర్వహణ కార్యకలాపాల ద్వారా వచ్చే లాభం 16 శాతం పెరిగి దాదాపు 13 బిలియన్ డాలర్లకు చేరింది. తయారీ, సేవలు, రిటైల్ విభాగాల్లో మెరుగైన పనితీరు కంపెనీ లాభాల వృద్ధికి దోహదపడింది. వివిధ రంగాల్లో విస్తృత వ్యాపారాలు, పెట్టుబడులు కలిగి ఉన్న బర్క్‌షైర్ ఫలితాలను అమెరికా ఆర్థిక వ్యవస్థ పరిస్థితులకు ఒక ముఖ్యమైన సూచికగా ఇన్వెస్టర్లు పరిగణిస్తారు. భారీ నగదు నిల్వలకు కదలిబర్క్‌షైర్ భారీ నగదు నిల్వలను పెట్టుబడుల వైపు మళ్లించడంతో త్రైమాసికం చివరికి నగదు, నగదుకు సమానమైన ఆస్తులు 365.5 బిలియన్ డాలర్లకు తగ్గాయి. ఇదే సమయంలో కంపెనీ దాదాపు 20 బిలియన్ డాలర్ల నికర ఈక్విటీ కొనుగోళ్లు చేపట్టింది. వారెన్ బఫెట్ నాయకత్వంలో గత కొన్నేళ్లుగా బర్క్‌షైర్ కొత్త కొనుగోళ్లు, పెట్టుబడుల విషయంలో ఆచితూచి వ్యవహరించింది. ముఖ్యంగా అమెరికా మార్కెట్లలో కంపెనీల విలువలు భారీగా పెరగడంతో, బర్క్‌షైర్ అనుసరించే విలువ ఆధారిత పెట్టుబడి విధానానికి సరిపడే అవకాశాలు పరిమితమయ్యాయి. సిఇఒగా బాధ్యతలు చేపట్టిన గ్రెగ్ అబెల్ మార్పు తెస్తున్నారు. కంపెనీ వద్ద ఉన్న అపారమైన మూలధనాన్ని సరైన అవకాశాల్లో పెట్టుబడి పెట్టేందుకు ఆయన మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. బైబ్యాక్‌లకు మళ్లీ ప్రాధాన్యంఏడాదికి పైగా సొంత షేర్ల కొనుగోళ్లకు దూరంగా ఉన్న బర్క్‌షైర్ ఈ యేడాది తొలి త్రైమాసికంలో బైబ్యాక్‌లను పునఃప్రారంభించింది. రెండో త్రైమాసికంలో 4.5 బిలియన్ డాలర్ల బైబ్యాక్ చేయడం ద్వారా కంపెనీ తన సొంత షేర్ల విలువపై యాజమాన్యానికి ఉన్న విశ్వాసాన్ని మరోసారి చాటింది. 6.8 బిలియన్ డాలర్లకు టేలర్ మారిసన్ హోమ్ కార్పొరేషన్‌ను కొనుగోలు చేసింది.

# ద్రవ్యోల్బణం, త్రైమాసిక ఫలితాలే కీలకం

## వాణిజ్యం



### ఈ వారం మార్కెట్లకు లాభం కానున్న పశ్చిమాసియా వార్

**ముంబయి, ఆగస్టు 9:** రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు, ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, హర్ముజ్ జలసంధిపై అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధరలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల (ఎఫ్ఐఐ) ప్రవాహాలు వచ్చే వారం దేశీయ స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేయనున్నాయి. వరుసగా రెండో వారంలోనూ బెంచ్‌మార్క్ సూచీలు లాభాలతో ముగియడంతో మార్కెట్లలో సానుకూల ధోరణి కొనసాగుతోంది. గత వారంలో భారత ఈక్విటీ మార్కెట్లు వరుసగా రెండో వారం లాభాల్లో ముగిశాయి. ముడి చమురు ధరలు భారీగా తగ్గడం, రూపాయి కొంత బలపడటం, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొనసాగడం మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. జూన్ త్రైమాసిక రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ 12న విడుదల చేయనుంది. అధికారిక గణాంకాల ప్రకారం జూన్‌లో హెడ్‌లైన్ సిపిఐ ద్రవ్యోల్బణం 4.38 శాతంగా నమోదైంది. ఇది ఆర్బీఐ నిర్దేశించిన 4 శాతం లక్ష్యంకంటే అధికంగా ఉన్నప్పటికీ, నిర్దేశిత సహన పరిమితిలోనే ఉంది. ఆహారం, ఇంధన ధరలు ద్రవ్యోల్బణంపై ప్రధాన ప్రభావం చూపాయి. ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ వచ్చే వారంలోనూ కొనసాగనుంది. ఆగస్టు 10న లాయిడ్స్ మెటల్స్ అండ్ ఎనర్జీ, బాష్, భారత్ ఫోర్జ్, లిండే ఇండియా, ఇన్ఫోఎడ్జ్, వొడాఫోన్ ఐడియా తదితర కంపెనీలు తమ ఫలితాలను ప్రకటించనున్నాయి. 11న సీమెన్స్, జైడస్ లైఫ సైన్సెస్ తదితర కంపెనీలు ఫలితాలను వెల్లడించనున్నాయి. మొత్తంమీద వచ్చే వారంలో 250కి పైగా కంపెనీలు తమ త్రైమాసిక ఫలితాలను ప్రకటించనున్నట్లు కార్పొరేట్ ఎర్నింగ్స్ క్యాలెండర్లు సూచిస్తున్నాయి. ఎఫ్ఐఐల పెట్టుబడులపై దృష్టి ఇటీవలి సెషన్లలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు మిశ్రమంగా కొనసాగాయి. ఈనెల7న నగదు విభాగంలో ఎఫ్ఐఐలు రూ.480.20 కోట్ల విలువైన షేర్లను నికరంగా కొనుగోలు చేశారు. గతవారంలో కొంతమేర విక్రయాలు జరిపిన నేపథ్యంలో ఈ కొనుగోళ్లు మార్కెట్ సెంటిమెంట్‌కు ఊతమిచ్చాయి. ముడి చమురుధరల పతనం కీలక మద్దతుముడి చమురు ధరలు గణనీయంగా తగ్గడం దేశీయ మార్కెట్లకు ప్రధాన సానుకూల అంశంగా మారింది. జూలైలో బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా ఉన్న బ్రెంట్ క్రూడ్‌ధర ప్రస్తుతం సుమారు 79-83 డాలర్ల స్థాయికిపడిపోయింది. దీనితోపాటు రూపాయి విలువకూడా డాలర్‌తోపోలిస్తే 95.3-95.4 స్థాయిలో కొంతస్థిరంగా ఉండటం మార్కెట్ సెంటిమెంట్‌కు మద్దతు అందిస్తోంది. మొత్తంగా వచ్చే వారం దేశీయ స్టాక్ మార్కెట్ల దిశను రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు, కంపెనీల క్యూ1 ఫలితాలు, ముడిచమురు ధరలు, రూపాయి కదలికలు, ఎఫ్ఐఐల పెట్టుబడులు, హోర్ముజ్ జలసంధిపై అమెరికా-ఇరాన్ నిర్ణయాలు కీలకం కానున్నాయి.

# ఈ వారంలో 10 కొత్త ఫండ్స్




**ముంబయి, ఆగస్టు 9:** స్టాక్ మార్కెట్లో హెచ్చుతగ్గులున్న క్రమంలోమ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్టర్లు కోట్లాది రూపాయలు కుమ్మరిస్తున్నారు. సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ సిప్ లేదా లంప్‌సమ్ విధానంలో పెట్టుబడులు పెట్టాలనుకునే ఇన్వెస్టర్ల కోసం ఇటి మ్యూచువల్ ఫండ్స్ టాప్ 10 ప్రధాన మ్యూచువల్ ఫండ్ల జాబితాను ప్రకటించాయి. పరాగ్ పరీఖ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ లార్జ్‌క్యాప్ కేటగిరీలో టాప్‌లోఉంది. విదేశీ, దేశీయ ఈక్విటీల్లో సమతుల్య పెట్టుబడులతో స్థిరమైన రాబడులను అందిస్తోంది. కెనరా రోబెకో బ్లూచిప్ ఈక్వీటీ ఫండ్ లార్జ్ క్యాప్ విభాగంలో తక్కువ రిస్క్‌తో స్థిరత్వం అందించే ఫండ్, ఐసిఐసిఐ ప్రూడెన్షియల్ బ్లూచిప్ ఫండ్ పెద్ద తరహా కంపెనీల్లో పెట్టుబడి పెట్టడానికి నమ్మకమైన లార్జ్ క్యాప్ ఫండ్. మిరాయ్ అసెట్ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ పెరుగుతున్న మిడ్ క్యాప్ కంపెనీలు, స్థిరమైన లార్జ్ క్యాప్ కాంబినేషన్‌తో మంచి గ్రోత్ పొటెన్షియల్ ఉన్న ఫండ్ ఇదే. హెచ్‌డీఎఫ్‌సీ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఫండ్ మేనేజర్ అసెట్ కేటాయింపులు మార్చే సామర్థం ఉన్న ఫండ్ కోటక్ ఎమర్జింగ్ ఈక్వీటీ ఫండ్ మిడ్ క్యాప్ విభాగంలో అత్యంత స్థిరమైన పనితీరును కనబరుస్తోంది. నిప్పాన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ స్మాల్ క్యాప్ విభాగంలో పెద్ద పరిమాణంలో నిధులను సేకరించి మంచి రాబడులను అందించిన ఫండ్. ఎస్‌బీఐ స్మాల్‌క్యాప్ ఫండ్ దీర్ఘకాలికంగా పెట్టుబడిపెట్టే అగ్రెసివ్ ధోరణి ఉన్న ఇన్వెస్టర్లకు ఈఫండ్ అనుకూలం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ ఈక్విటీ, డెట్ అసెట్లలో డైనమిక్ కేటాయింపులు జరుపుతూ మార్కెట్ నష్టాల నుంచి రక్షణ కల్పిస్తుంది. యూటీఐ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్ తక్కువ ఖర్చుతో నిఫ్టీ 50 సూచీలో ఇన్వెస్ట్ చేసే ఇండెక్స్ ఫండ్.




### తొమ్మిది కంపెనీల ఐపిఒలు..

# రూ.7681 కోట్లు సమీకరణ

**ముంబయి, ఆగస్టు 9:** స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు పండగే. భారతీయ ప్రాథమిక మార్కెట్ ఈవారం పబ్లిక్ ఇష్యూలతో బిజీ అవుతోంది. ఇకామర్స్ ఎనేబుల్మెంట్ ప్లాట్ ఫామ్ షిప్‌రాకెట్, డెయిరీ బ్రాండ్ మిల్కీ మిస్ట్ వంటి దిగ్గ కంపెనీలతో సహా మొత్తం 9 కంపెనీలు ఐపీఓకు వస్తున్నాయి. ఈ కంపెనీలు అన్నీ కలిసి రూ.7,681 కోట్లు సమీకరించేందుకు మార్కెట్లోకి వస్తున్నాయి. మోల్బియో డయోగ్నిస్టిక్, ధూత్ ట్రాన్స్‌మిషన్, మిల్కీ మిస్ట్ డైరీ ఫుడ్, ఫాస్కినేట్ టెక్స్‌టైల్స్, షిప్‌రాకెట్, బెహారీ లాల్ ఇంజినీరింగ్, ప్రమోదిని మెడికేర్, క్యూ అండ్ టీ ఫుడ్స్, షామ్ ఫామ్ వంటివి ఉన్నాయి. ఈ కంపెనీల పబ్లిక్ ఇష్యూలు ఈనెల 10 నుంచి 12వ తేదీల మధ్య సబ్‌స్క్రిప్షన్ ప్రారంభిస్తున్నాయి. ఆగస్టు 14 వరకు సబ్‌స్క్రిప్షన్ కొనసాగనుంది. వీటితో పాటు ఈ వారం ఏకంగా 8 కంపెనీలు మార్కెట్ల లిస్టింగ్ కానున్నాయి. ఈ వారం వస్తున్న పబ్లిక్ ఇష్యూల్లో ధూత్ ట్రాన్స్‌మిషన్ అతిపెద్ద ఐపీఓగా నిలిచింది. ఈ పబ్లిక్ ఇష్యూ 10వ తేదీన మొదలై 12వ తేదీతో ముగుస్తుంది. ఈ మెయిన్‌బోర్డ్ ఐపీఓ షేరు ధరలు రూ.829-871గా నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద రూ.3066.89 కోట్లు సమీకరించనుంది. మిల్కి మిస్ట్ డైరీ ఫుడ్ ఐపీఓ మిల్కి మిస్ట్ డైరీ ఫుడ్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 11వ తేదీన మొదలై 13వ తేదీతో ముగుస్తుంది. రూ.1553 కోట్లు సమీకరించే లక్ష్యంతో మెయిన్‌బోర్డు విభాగంలో వస్తోంది. షేర్ల ప్రైస్ బ్యాండ్ రూ.133-140 గా నిర్ణయించారు. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ. 1428 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.125 కోట్లు సమీకరించనుంది. ఈ ఐపీఓ జీఎంపీ 19 శాతంగా ఉంది. షిప్ రాకెట్ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ ధరలు రూ.92-97గా నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద రూ.1617.48 కోట్లు సమీకరించనుంది. ఇందులో ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.885.50 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.731.98 కోట్లుగా సమీకరించనున్నారు. మొల్బియో డయాగ్నోస్టిక్స్ లిమిటెడ్ ఐపీఓ మెయిన్‌బోర్డు విభాగం నుంచి వస్తోంది. రూ.939.70 కోట్లు సమీకరించనుంది. షేరు ధరలు రూ.768807 గా నిర్ణయించారు. బెహారీ లాల్ ఇంజినీరింగ్ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 12న ప్రారంభమయి రూ.301.62 కోట్లు సమీకరించనుంది. షేరు ధరలు రూ.271-285 గా నిర్ణయించారు. ఇక ఎస్ఎంఈ విభాగం నుంచి ప్రమోదిని మెడికేర్ రూ.69.04 కోట్లు సమీకరించనుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.